సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 314

మంగళవారం 4-2-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'

పసిడి..ఆల్‌టైమ్ హై



సోమవారం ఢిల్లీ మార్కెట్‌లో పెరిగిన 10 గ్రాముల బంగారం ధర ₹400

99.9 శాతం స్వచ్ఛత గల బంగారం (10 గ్రా..) ₹85,300

99.5 శాతం స్వచ్ఛత గల బంగారం (10 గ్రా..) ₹84,900

15 లో

రూపాయి ఆల్‌టైమ్ లో..

డాలర్‌తో రూపాయి మారకం విలువ డిసెంబర్ 31న 85.61

ప్రస్తుతం రూపాయి మారకం విలువ 87.11

ఈ ఏడాది క్షీణత 1.8%

సోమవారం క్షీణత 49 పైసలు

టారిఫ్ వార్.. బొమ్మా-బొరుసు!



చైనా, మెక్సికో, కెనడాలపై ఇప్పటికే ట్రంప్ సుంకాల మోత

మనపైనా వేలాడుతున్న టారిఫ్ కత్తి...

కొన్ని రంగాల్లో ఎగుమతులకు అనుకోని వరం...

రూపాయి పతనమే మనకు ఇప్పుడు అతిపెద్ద దెబ్బ...

దిగుమతులు భారమై.. ఉత్పత్తుల రేట్లు పెరిగే అవకాశం

విదేశీ ఇన్వెస్టర్ల తిరోగమనంతో స్టాక్ మార్కెట్లకూ ప్రతికూలమే..



ట్రంప్ సుంకాల సెగ ప్రపంచ దేశాలకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. మళ్లీ అధ్యక్ష పీఠమెక్కితే అమెరికాపై భారీ దిగుమతి సుంకాలు విధిస్తున్న దేశాలపై ప్రతికారం తీర్చుకుంటానన్న హెచ్చరికలను ట్రంప్ తు.చ. తప్పకుండా అమలు చేశారు. వచ్చీ రాగానే మెక్సికో, కెనడాతో పాటు చైనాపైనా సుంకాల మోత మోగించి.. టారిఫ్ వార్ 2.0కు తెరతీశారు. భారత్‌తో పాటు మరిన్ని దేశాలకూ వార్నింగ్ సిగ్నల్స్ పంపారు. అయితే, ప్రస్తుతానికి మనపై విధించకపోయినా... టారిఫ్‌ల కత్తి మాత్రం వేలాడుతోంది. ట్రంప్ టారిఫ్ వార్.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మరోపక్క, తాజా పరిణామాలతో భారత్‌లో కొన్ని రంగాలపై సానుకూల ప్రభావం ఉన్నప్పటికీ... ప్రతికూలతలు కూడా తీవ్రంగానే ఉంటాయనేది విశ్లేషకుల మాట! 2 లో

అనుకూలం

- **ఫార్మా:** చైనాపై టారిఫ్‌ల నేపథ్యంలో మన జెనరిక్ కంపెనీలకు అవకాశాలు పెరుగుతాయి.
- **టెలికం పరికరాలు:** ఇతర దేశాలతో పోలిస్తే మన ఎగుమతులు జోరందుకుంటాయి.
- **ఎలక్ట్రానిక్స్:** దేశీ తయారీ కంపెనీలకు అమెరికా మార్కెట్ మరింత అందుబాటులోకి వస్తుంది.
- **టెక్స్‌టైల్స్:** భారతీయ కంపెనీలకు సమీప భవిష్యత్తులో ఆర్డర్లు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.
- **ఫుడ్:** అగ్రి ప్రోడక్ట్స్ – ఆహార, వ్యవసాయ రంగాలకు తక్షణ ప్రయోజనం.
- **ఆటోమొబైల్ విడిభాగాలు:** యూఎస్‌లో మన కంపెనీల ఎగుమతుల వాటా పెంచుకోవడానికి సదవకాశం.
- **పెట్రోలియం ఉత్పత్తులు:** ఎగుమతులు పుంజుకోవడానికి చాన్స్.
- **ఐటీ సేవలు:** రూపాయి పతనంతో మరింత ఆదాయం సమకూరుతుంది.

ప్రతికూలం

- **రూపాయి:** డాలర్ భారీగా బలపడటంతో దేశీ కరెన్సీ విలువ మరింత పడిపోవచ్చు.
- **స్టాక్ మార్కెట్:** విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలతో పెట్టుబడులు తరలిపోయి.. మార్కెట్ ఇంకా పడిపోవచ్చు.
- **ముడిచమురు:** దిగుమతులు మరింత భారమై.. విదేశీ మారక నిల్వలు తగ్గిపోతాయి.
- **బంగారం:** రూపాయి పతనంతో విదేశీ మార్కెట్‌తో పోలిస్తే ధరలు కొండెక్కవచ్చు.
- **యంత్రపరికరాలు:** దేశీ కంపెనీలు దిగుమతి చేసుకునే పరికరాలు, సామగ్రి ధరలు మరింత పెరుగుతాయి.
- **వంటనూనెలు:** భారత్ ఎక్కువగా దిగుమతులపై ఆధారపడటం వల్ల నూనె ధర మరింత హీటెక్కవచ్చు.
- **ఎరువులు:** వ్యవసాయానికి అవసరమైన ఎరువుల దిగుమతి భారమవుతుంది.

న్యూస్‌రీల్

ప్రతి అభ్యంతరానికి రూ.500



ఈఏపీ సెట్‌కు సంబంధించి ఓ కీలక మార్పు చేశారు. ఇందులో ప్రశ్నలకు వారు ఇచ్చిన జవాబులపై విద్యార్థులు అభ్యంతరాలు లేవనెత్తేందుకు అవకాశం ఉంది. కానీ ఈసారి ప్రతి అభ్యంతరానికి రూ.500 చొప్పున చెల్లించాలనే నిబంధన తెచ్చారు. 16 లో

గ్రూప్-1 నియామకాలకు లైన్ క్లియర్



రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ విభాగాల్లో గ్రూప్-1 ఉద్యోగాల భర్తీకి సంబంధించిన అడ్డంకులన్నీ తొలగిపోయాయి. వీటికి సంబంధించిన రెండు కేసులపై సుదీర్ఘంగా వాదనలు విన్న సుప్రీంకోర్టు.. తాజాగా వాటిని డిస్మిస్ చేసింది. 16 లో

1,382 మందికి త్వరలో టీచర్ పోస్టింగ్!

డీఎస్సీ 2008 అభ్యర్థులకు హైకోర్టులో ఊరట లభించింది. 1,382 మందిని వెంటనే కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా నియమించాలని ఉన్నత న్యాయస్థానం ప్రభుత్వాన్ని ఆదేశించింది. 16 లో

ముందు పరిషత్.. తర్వాత పంచాయతీ!

కొన్ని రోజుల అంతరంతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సర్కారు యోచన

- ముందు ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు ఎన్నికలు.. తర్వాత గ్రామ పంచాయతీలకు..
- ఈ దిశగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు, రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు
- ఎంపీటీసీ స్థానాల పునర్విభజన కోసం జిల్లాల నుంచి నివేదికలు తెప్పించిన అధికారులు
- నేడు అసెంబ్లీ భేటీ తర్వాత స్పష్టత వచ్చే అవకాశం.. ఈ నెల 15లోగా ఎన్నికల షెడ్యూల్ వెలువడే సూచనలు
- కసరత్తు ముమ్మరం చేసిన ఎస్ఈసీ.. మూడు విడతల్లో నిర్వహణ, బ్యాలెట్ పత్రాలతో పోలింగ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. రాజకీయ పార్టీల గుర్తులపై జరిగే మండల పరిషత్ (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ (జెడ్పీటీసీ) ఎన్నికలను తొలుత నిర్వహించాలని.. అనంతరం పార్టీల గుర్తులు లేకుండా జరిగే గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్టుగా తెలిసింది. మరోవైపు ఈ రెండింటినీ కొన్నిరోజుల అంతరంతో జరపాలనే ప్రతిపాదనతోపాటు.. వీలైతే సమాంతరంగా ఒకేసారి నిర్వహించాలనే ఆలోచన కూడా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. దీనిపై స్పష్టత రాకున్నా.. తొలుత పరిషత్‌లకు, తర్వాత పంచాయతీలకు ఎన్నికలు మిగతా 2వ పేజీలో ▶



ఎస్సీ వర్గీకరణపై సిఫారసులు రెడీ

క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసిన జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్

- కుల, ప్రజాసంఘాలతో సమావేశాలు, వినతుల స్వీకరణ
- ఎస్సీ వర్గీకరణకు అవసరమైన సిఫారసులతో కేబినెట్ సబ్ కమిటీకి నివేదిక
- నేడు మంత్రివర్గ భేటీలో తుది నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ కోసం క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసేందుకు జస్టిస్ షమీమ్ అక్తర్ అధ్యక్షతన ఏర్పాటైన ఏకసభ్య కమిషన్ ఆ ప్రక్రియ పూర్తి చేసింది. సోమవారం సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్, రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉపసంఘం కో చైర్మన్, మంత్రి దామోదర రాజనర్సింహ, సభ్యుడు మంత్రి పొన్నం ప్రభాకర్‌తో భేటీ అయ్యింది. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేసేందుకు అవసరమైన సిఫారసులతో కూడిన నివేదికను జస్టిస్ షమీమ్ అక్తర్ కేబినెట్ సబ్ కమిటీకి సమర్పించారు. ఈ నివేదికను పరిశీలించిన అనంతరం మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు.. రాష్ట్ర మంత్రివర్గానికి సిఫారసులు మిగతా 2వ పేజీలో ▶

నేడు అసెంబ్లీ ప్రత్యేక భేటీ

- అంతకుముందు మంత్రివర్గ సమావేశం
- కులగణన సర్వే, ఎస్సీ వర్గీకరణ నివేదికలను ఆమోదించనున్న కేబినెట్... అనంతరం అసెంబ్లీలో రెండు అంశాలపై చర్చ, తీర్మానాలు

2 లో



కుంభమేళా విషాదంపై దద్దరిల్లిన పార్లమెంట్

➤ మహా కుంభమేళాలో తొక్కిసలాట ఘటనపై ప్రతిపక్షాల నినాదాలతో పార్లమెంట్ దద్దరిల్లింది. మహా కుంభమేళాలో తొక్కిసలాటలో 30 మంది మృతి చెందిన అంశంపై చర్చించాలంటూ విపక్షాలు పట్టుబట్టాయి. విపక్షాల డిమాండ్‌కు సభాధిపతులు అంగీకరించకపోవడంతో నినాదాల నడుమనే ప్రశ్నోత్తరాలు సాగాయి. అనంతరం కొద్దిసేపు కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, ఎస్పీ సభ్యులు వాకౌట్ చేశారు.

- వివరాలు 6లో



వసంత పంచమి వేళ పోటెత్తిన భక్తకోటి

సోమవారం వసంత పంచమి పర్వదినం సందర్భంగా ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లోని మహా కుంభమేళాకు భారీగా తరలివచ్చిన సాధువులు 6 లో

'ఎమ్మెల్యేల అనర్హత'పై 10న తదుపరి విచారణ

కేటీఆర్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు నిర్ణయం



- కౌశిక్‌రెడ్డి, వివేకానంద్‌ల పిటిషన్‌కు జత చేసిన జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం
- వీరి పిటిషన్ విచారణ సందర్భంగా ఇటీవల ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు
- అసెంబ్లీ ముగిసేలోగా నిర్ణయం తీసుకుంటారా? అని ప్రశ్న

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో బీఆర్ఎస్ తరఫున గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటిస్తూ చర్యలు తీసుకునేలా శాసనసభ స్పీకర్‌ను ఆదేశించాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై.. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, గూడెం మహీపాల్‌రెడ్డి, అరికెపూడి గాంధీలపై కేటీఆర్‌తో పాటు ఎమ్మెల్యే హరీశ్‌రావు తదితరులు రిట్ పిటిషన్ దాఖలు చేశారు. కేటీఆర్ తరఫున సీనియర్ న్యాయవాది ఆర్య రామసుందరం వాదనలు వినిపించగా.. ఏడుగురు ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలన్న ఈ పిటిషన్ ప్రతిని, ప్రతివాది అయిన తెలంగాణ స్పీకర్ తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గీకి అందజేయాలని ధర్మాసనం ఆదేశించింది. బీఆర్ఎస్‌ను వీడిన మరో ముగ్గురు ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి గతంలో దాఖలైన పిటిషన్‌తో కేటీఆర్ పిటిషన్‌ను జత చేసింది. తదుపరి విచారణను ఈ నెల 10కి వాయిదా వేసింది. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌ను ఆదేశించాలని కోరుతూ గతంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద్ పిటిషన్ వేశారు. దీనిపై గత శుక్రవారం విచారణ జరిపిన జస్టిస్ గవాయి, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసి ధర్మాసనం.. తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గీపై అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోకుండా ఆలస్యం చేయడాన్ని తప్పుబట్టిన సుప్రీంకోర్టు.. 'తగిన సమయంలో నిర్ణయం తీసుకుంటామంటే ఎంత కాలం? అసెంబ్లీ గడువు ముగిసే దశలో నిర్ణయం తీసుకుంటారా?'అంటూ ఘాటుగా వ్యాఖ్యానించింది.



NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Venkobb CHICKEN

Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

12 Eggs Retail Rate ₹ 66	Ex Farm Live Bird	103 kg	Dressed with Skin	181 kg
	Retail Live Bird	125 kg	Skin Less	206 kg

Conditions Apply

Issued in the interest of consumers

క్యాన్సర్ బయోమ్ 'ట్యూమర'మ్మతు



➤ క్యాన్సర్ గడ్డ (ట్యూమర్) పెరుగుదలనూ, చికిత్స సమయంలో ట్యూమర్ ప్రతిస్పందించే తీరునూ 'ట్యూమర్ బయోమ్' ప్రభావితం చేస్తుంది. నేడు 'వరల్డ్ క్యాన్సర్ డే' సందర్భంగా ప్రత్యేక కథనం...

- వివరాలు 13లో

'టాస్క్'ల పేరుతో టోపీ!



- పంథా మార్చుకున్న జాబ్‌ఫ్రాడ్ నేరగాళ్లు
- పార్ట్‌టైం జాబ్స్‌కు సెక్యూరిటీ డిపాజిట్ల పేరిట గతంలో అమాయకులను దోచుకున్న కేటుగాళ్లు
- తాజాగా ఆన్‌లైన్ 'టాస్క్'ల పేరిట పనులు చేయించుకొని వారి ప్రతిఫలాన్ని కాజేస్తున్న వైనం
- టెలిగ్రామ్ గ్రూపుల కేంద్రంగా సాగుతున్న వ్యవహారం
- అప్రమత్తంగా ఉండాలంటున్న ఎన్సీఎస్సార్బీ డైరెక్టర్

- వివరాలు 2లో

ఇవాంజా(?)



ఓవర్ హెడ్‌ట్యాంక్ ఎక్కి పురుగుమందు డబ్బా, పెట్రోల్ బాటిళ్లతో ఆందోళన చేస్తున్న రైతులు



పట్టాదార్ పాస్ పుస్తకాల కోసం.. ట్యాంక్ ఎక్కిన రైతులు

పురుగుమందు డబ్బా, పెట్రోల్ బాటిళ్లతో నారాయణపురం గ్రామస్తుల ఆందోళన 5 లో

కూటమి కాలకేయుల సాక్షిగా.. ప్రజాస్వామ్యం ఖూనీ

మున్సిపల్ ఉప ఎన్నికల్లో అధికార మదంతో అరాచక పర్వం

బలం లేకపోయినా బరిలోకి దిగి కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో పాగాకు కుయుక్తులు

- తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నికలో తాలిబన్ల తరహాలో కూటమి గూండాల విధ్వంస కాండ
- ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు స్వైర విహారం.. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల బస్సును అడ్డుకున్న రౌడీ మూకలు
- అద్దాలు ధ్వంసం చేసి.. బస్సులోకి చొరబడి నలుగురు కార్పొరేటర్ల కిడ్నాప్.. అడ్డుకున్న వారిపై దాడి
- ఘటనను చిత్రీకరిస్తున్న సాక్షి ప్రతినిధి, కెమెరామెన్‌పై దాడి.. కెమెరా ధ్వంసం

12 లో

నాటుకోళ్లూ మృత్యువాత!

- పౌల్ట్రీ పరిశ్రమ నుంచి గ్రామాలకు వైరస్ వ్యాప్తి
- బర్డ్‌ఫ్లూను వ్యాప్తి చేసే హెచ్5ఎన్1 వైరస్సే కారణం
- బలం మందు వేయడమే తప్ప మరో మార్గం లేదంటున్న పశుసంవర్ధక శాఖ

16 లో

అదనపు కలెక్టర్ ఎదుటే కస్సు..బుస్సు!

మంచు కుటుంబ ఆస్తి వివాదంపై విచారణ... హాజరైన మోహన్‌బాబు, మనోజ్ 3లో



హైదరాబాద్‌కు బుల్లెట్ బండి!

హైదరాబాద్-ముంబై మధ్య హైస్పీడ్ రైల్ కారిడార్

- ఈ కారిడార్ బెంగళూరు వరకు విస్తరణ
- అలాగే హైదరాబాద్-చెన్నై మధ్య మరో కారిడార్ నిర్మాణం
- ఫైనల్ లోకేషన్ సర్వే కోసం టెండర్లు పిలిచిన రైల్వే శాఖ..
- ఫిబ్రవరి 24 వరకు బిడ్ల దాఖలుకు గడువు

16 లో

క్లుప్తంగా...

రేవంత్‌రెడ్డిపై కేసులో మీ వైఖరేంటి?

- నార్సింగి పోలీసులకు, ఫిర్యాదుదారుకు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి (నాడు ఎంపీ)పై 2020లో దాఖలు చేసిన కేసుపై వైఖరిని తెలియజేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. పోలీసులతోపాటు ఫిర్యాదుదారుకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈనెల 20కి వాయిదా వేసింది. 2020లో హైదరాబాద్ శివారులోని కేటీఆర్ ఫామ్‌హౌస్‌పైన డ్రోన్ ఎగరేసి చిత్రీకరించిన ఆరోపణలపై నాటి ఎంపీ రేవంత్‌రెడ్డి అరెస్టయ్యారు. ఎలాంటి అనుమతులు లేకుండా డ్రోన్లు ఎగరేసి కెమెరాతో చిత్రీకరించడం నేరమని నార్సింగి పోలీసులు అరెస్టు చేశారు. అయితే జీవో నెం.111ను ఉల్లంఘించి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫామ్‌హౌస్‌ను నిర్మించుకున్నారన్నది రేవంత్ ఆరోపణ. ఆ విషయాన్ని నిరూపించేందుకు తాను డ్రోన్ ఎగరేసినట్లు చెప్పారు. ఇదిలా ఉండగా, ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో, రాజకీయ ప్రేరేపితంగా తనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, దాన్ని కొట్టివేయాలని కోరుతూ రేవంత్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ మరోసారి విచారణ చేపట్టారు. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేశారు. అలాగే తనపై అట్రాసిటీ కేసున కొట్టివేయాలని రేవంత్ మరో పిటిషన్ వేయగా, అందులో విచారణ కూడా ఈనెల 20కి వాయిదాపడింది.

కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై కేసులో వివరణివ్వండి

- చౌటుప్పల్ పోలీసులకు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై నమోదు చేసిన కేసుపై వివరణ ఇవ్వాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణ ఈ నెల 20కి వాయిదా వేసింది. 2021లో ఆహార భద్రత కార్డుల పంపిణీ సందర్భంగా మంత్రి ప్రసంగిస్తుండగా రాజగోపాల్‌రెడ్డి మైక్ లాక్కోవడంతోపాటు ప్రసంగాన్ని అడ్డుకున్నారని తహసీల్దార్ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యేపై కేసు నమోదైంది. ఈ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ గత వారం రాజగోపాల్‌రెడ్డి తరఫున న్యాయవాది మహేశ్ మామిండ్ల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సోమవారం జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ప్రతివాదులైన పోలీసులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేశారు.

సెలవు రోజే ప్రదర్శనలు చేయాలని ఏ చట్టం చెబుతుంది?

- ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



సాక్షి, హైదరాబాద్: సెలవు దినం రోజే ప్రదర్శనలు చేయాలని ఏ చట్టం చెబుతుందని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ప్రశ్నించారు. ఈనెల 7న తలపెట్టిన ‘లక్ష డప్పులు.. వేలాది గొంతుకలు’ కార్యక్రమాన్ని అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరు అంశాలను చూపుతూ ప్రదర్శన అనుమతి నిరాకరించడం అన్యాయమన్నారు. వెంటనే ప్రదర్శనకు పర్మిషన్ ఇవ్వాలని సీఎం రేవంత్, డీజీపీ, కమిషనర్‌కు మంద కృష్ణ విజ్ఞప్తి చేశారు. సోనియా, రాహుల్ బేగంపేట వస్తే.. వాళ్లను కూడా సెలవు దినం రోజే రావాలని చెబుతారా? రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక ప్రదర్శన ఎలా చేశారని ప్రశ్నించారు.

‘టాస్క్’ల పేరుతో టోపీ!

పంథా మార్చుకున్న జాబ్‌ఫ్రాడ్ నేరగాళ్లు



పార్ట్‌టైం జాబ్స్‌కు సెక్యూరిటీ డిపాజిట్ల పేరిట గతంలో అమాయకులను దోచుకున్న కేటుగాళ్లు	తాజాగా ఆన్‌లైన్ ‘టాస్క్’ల పేరిట పనులు చేయించుకొని వారి ప్రతిఫలాన్ని కాజేస్తున్న వైనం	టెలిగ్రామ్ గ్రూపుల కేంద్రంగా సాగుతున్న వ్యవహారం	అప్రమత్తంగా ఉండాలంటున్న ఎన్సీఎస్సార్సీ డైరెక్టర్

సాక్షి, హైదరాబాద్

పార్ట్‌టైం, ఫుల్‌టైం, వర్క్ ఫ్రం హోం ఉద్యోగాల పేరిట అమాయకులకు సోషల్ మీడియా ద్వారా ఎర వేసి సెక్యూరిటీ డిపాజిట్, ఇతర ఖర్చుల పేరుతో అందినకాడికి దండుకుంటూ వచ్చిన జాబ్‌ఫ్రాడ్ నేరగాళ్లు ఇటీవల పంథా మార్చారు. బాధితులతో ‘టాస్క్’ల పేరిట ఆన్‌లైన్‌లో పనులు చేయించుకొని అందుకు ప్రతిఫలంగా చెల్లించాల్సిన మొత్తాన్ని కాజేస్తున్నారు.

విద్యార్థులు, మహిళలు, మధ్యతరగతి ప్రజలే టార్గెట్...

పార్ట్‌టైం, వర్క్ ఫ్రం హోం ఉద్యోగాలకు విద్యార్థులు, మహిళలు, మధ్యతరగతి ప్రజలు ఆసక్తి చూపిస్తారని గ్రహించిన జాబ్‌ఫ్రాడ్ నేరగాళ్లు ప్రధానంగా వారినే తమ మోసాలకు ఎంచుకుంటున్నారు. ఉద్యోగార్థుల వివరాలను జాబ్ పోర్టల్స్‌తోపాటు లక్కీ డిప్‌ల పేరిట ప్రజల వివరాలు సేకరించే ఏజెన్సీల నుంచి కొంటున్నారు. ఈ డేటా ఆధారంగా ఆయా ఫోన్ నంబర్లకు వాట్సాప్ ద్వారా బల్క్ మెసేజీలు పంపుతున్నారు. తమ సందేశాలకు స్పందించే వారిని మోసగించే స్కెచ్‌ను కేటుగాళ్లు పక్కాగా అమలు చేస్తున్నారు.

రివ్యూలు, రేటింగ్స్ ఇస్తే డబ్బిస్తామని ఆశజూపి..

వినియోగదారుల ప్రమేయం లేకుండా హోటళ్లు, రెస్టారెంట్లు, ఆన్‌లైన్ షాపింగ్ సంస్థలకు కమీషన్‌పై భారీ రేటింగ్స్, పాజిటివ్ రివ్యూలు ఇచ్చే ఏజెన్సీలతో జాబ్‌ఫ్రాడ్ నేరగాళ్లు లింకులు పెట్టుకుంటున్నారు. తమ సందేశాలకు స్పందించిన అమాయకులతో ఆయా షాపింగ్, రెస్టారెంట్ సంస్థల యాప్స్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్నారు. వాటికి రేటింగ్, రివ్యూలు (టాస్క్‌లు) ఇచ్చి ఆ స్క్రీన్ షాట్స్‌ను పంపాలని కోరుతున్నారు. అలా తొలి ‘టాస్క్’పూర్తి చేసిన బాధితులకు రూ. 240 వెంటనే వారికి బదిలీ చేస్తున్నారు. అనంతరం వారిని మరింతగా ఉచ్చులోకి లాగేందుకు వీలుగా తమ అనుచరులతో కూడిన ‘టెలిగ్రామ్’గ్రూపుల్లో చేర్చి ఇతరుల సక్సెస్ స్టోరీస్ పేరిట పోస్టింగ్స్ పెట్టిస్తున్నారు.

ప్రత్యేక యాప్స్ డౌన్‌లోడ్ చేయించి...

ఆ తర్వాత అసలు కథ మొదలుపెట్టే నేరగాళ్లు బాధితులతో ప్రత్యేకంగా డిజైన్ చేసిన వర్చువల్ యాప్స్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్నారు. ఎప్పటికప్పుడు నగదు బదిలీ చేస్తే రిజర్వ్ బ్యాంక్ నుంచి ఇబ్బందులు వస్తున్నాయని.. అందువల్ల ఆ మొత్తాన్ని ఈ యాప్స్‌లో జమ చేస్తామని నమ్మిస్తున్నారు. నిర్ణీత సమయం తర్వాత సొమ్ము డ్రా చేసుకోవచ్చని చెప్పి రకరకాల ‘టాస్క్’లు చేయించుకుంటున్నారు. కానీ ఆయా ‘టాస్క్’లకు సంబంధించిన నగదును ఎప్పటికప్పుడు ఏజెన్సీల నుంచి తీసేసుకుంటూ... యాప్స్‌లోని బాధితుల ఖాతాల్లో మాత్రం డబ్బు జమ అయినట్లు వర్చువల్‌గా చూపిస్తున్నారు. మొత్తం రూ. 2 లక్షలు దాటాకే డ్రా చేసుకోవడానికి వీలవుతుందని నమ్మబలకడంతోపాటు మరికొంత బోనస్ సొమ్మును కూడా బాధితులకు వర్చువల్‌గా చూపిస్తున్నారు.

వెంటనే డబ్బు కావాలంటే కొంత కట్టమంటూ

వర్చువల్ యాప్స్‌లోని సొమ్ము రూ. 10 లక్షలు దాటాకే విత్‌డ్రాకు వీలవుతుందంటూ కొత్త కథ అల్లుతున్న కేటుగాళ్లు.. ఆ మొత్తాన్ని తక్షణమే తీసుకోవాలంటే కొంత డబ్బు డిపాజిట్ చేయాలని కోరుతున్నారు. వర్చువల్ యాప్స్‌లో భారీ మొత్తం కనిపిస్తుండటంతో నేరగాళ్లు కోరిన సొమ్మును అమాయకులు చెల్లిస్తున్నారు. అలా వందలు, వేలాది మంది బాధితుల నుంచి భారీ మొత్తం కొల్లగొట్టాక నేరగాళ్లు ఆయా సోషల్ మీడియా గ్రూపులతోపాటు వర్చువల్ యాప్స్‌ను కనుమరుగు చేస్తున్నారు.

> చిన్న మొత్తాలను ఇచ్చి, భారీ మొత్తాలను కాజేసే సైబర్ నేరగాళ్లను నమ్మొద్దు. జాబ్స్, టాస్క్‌లంటూ ప్రకటనలు ఇచ్చే వాళ్లు అందుకు నగదు చెల్లించకుండా ఎదురు డబ్బు అడుగుతున్నారంటూ అది మోసమని గ్రహించాలి. ఇలాంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.
>
> – డాక్టర్ ఇ.కాళీరాజ్ నాయుడు (నేషనల్ సైబర్ సెక్యూరిటీ అండ్ రీసెర్చ్ కౌన్సిల్ డైరెక్టర్)



ముందు పరిషత్.. తర్వాత పంచాయతీ!

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వహించే అవకాశమే ఎక్కువని అధికార వర్గాలు చెబుతున్నాయి. మంగళవారం ఉదయం జరిగే రాష్ట్ర కేబినెట్ భేటీ, తర్వాత నిర్వహించే శాసనసభ ప్రత్యేక సమావేశంలో స్థానిక ఎన్నికలకు సంబంధించి స్పష్టత వస్తుందని వివరిస్తున్నాయి.

రిజర్వేషన్ల పెంపుపై తీర్మానం చేసి..

సమగ్ర కుటుంబ సర్వే, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు (ప్రస్తుతమున్న 28 శాతం నుంచి 42 శాతానికి), ఎస్సీ వర్గీకరణ నివేదిక తదితర అంశాలపై మంగళవారం కేబినెట్‌లో భేటీలో చర్చించి, నిర్ణయాలు తీసుకోనున్నారు. అనంతరం బీసీ రిజర్వేషన్ల పెంపు, ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో చర్చించి తీర్మానం చేస్తారు. అయితే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం చూస్తే.. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కలుపుకొని 50శాతానికి మించకూడదు. కానీ రాష్ట్రంలోని ప్రత్యేక పరిస్థితులు, కులగణన, బీసీ డెడికేటెడ్ కమిషన్ నివేదికల ఆధారంగా బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేసి, ఆమోదం కోసం పార్లమెంటుకు పంపే అవకాశం ఉంది. అందులోనూ న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా పంచాయతీలు, మండలాలు, జిల్లాల్లో స్థానికంగా ఎస్సీ, ఎస్టీ, బీసీల జనాభాకు తగ్గట్టుగా రిజర్వేషన్లు కల్పించే అవకాశం కూడా ఉందనే ప్రచారం జరుగుతోంది.

ఈ నెల 15లోగా షెడ్యూల్!

స్థానిక సంస్థల ఎన్నికలకు ఈ నెల 15వ తేదీలోగా షెడ్యూల్ విడుదల కానున్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. రెండు వారాల్లో మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు.. తర్వాత వారం గడువిచ్చి గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తిచేయవచ్చని అంటున్నాయి. వచ్చే నెల మొదట్లో ఇంటర్ పరీక్షలు, 21 నుంచి టెన్త్ పరీక్షలు ఉన్నందున.. టెన్త్ పరీక్షలు మొదలయ్యేలోగా స్థానిక ఎన్నికల ప్రక్రియ ముగించాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం. రాజకీయ పార్టీల గుర్తులపై ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరుగుతాయి కాబట్టి, వాటిని ఒక విడతలో ముగించాలని భావిస్తున్నట్టు తెలిసింది. గ్రామ పంచాయతీ ఎన్నికలు పార్టీ రహితంగా, అభ్యర్థులంతా స్వతంత్రులుగానే పోటీ చేసే విధానంలో జరుగుతాయి కాబట్టి.. వాటిని విడిగా నిర్వహించనున్నట్టు సమాచారం. పంచాయతీ ఎన్నికలను గతంలో మాదిరిగా మూడు విడతల్లో నిర్వహించి.. ఏ విడతకు ఆ విడతలో పోలింగ్ ముగిశాక సాయంత్రమే ఫలితాలను ప్రకటించే అవకాశం ఉంది. 2018లో నిర్వహించిన విధంగానే ఈసారి కూడా బ్యాలెట్ పేపర్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్నారు. తొలుత పార్టీ గుర్తులపై జరిగే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహిస్తే రాజకీయంగా ప్రయోజనకరంగా ఉంటుందని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు పేర్కొన్న నేపథ్యంలో.. దీనివైపు మొగ్గుచూపుతున్నట్టు తెలిసింది.

ఎంపీటీసీ స్థానాల పునర్విభజనపై సమీక్ష

రాష్ట్రంలో మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ (ఎంపీటీసీ) స్థానాల పునర్విభజనకు సంబంధించి పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ (పీఆర్ ఆర్‌డీ) అధికారులు చర్యలు చేపట్టారు. ఒక్కో మండలంలో కనీసం ఐదు ఎంపీటీసీ స్థానాలు ఉండేలా చూడటం, రాష్ట్రవ్యాప్తంగా కొన్ని గ్రామాలను సమీపంలోని మున్సిపాలిటీల్లో విలీనం చేసిన నేపథ్యంలో మార్పులు చేర్పులు, కొత్తగా ఏర్పడిన 34 మండలాల్లో ఎంపీటీసీ సీట్ల పునర్వ్యవస్థీకరణ తదితర అంశాలపై సోమవారం కసరత్తు పూర్తి చేశారు. జిల్లాల వారీగా పునర్విభజన (కార్వింగ్) చేసిన ఎంపీటీసీ స్థానాల వివరాలతో మండల పరిషత్ కార్యాలయాల్లో తుది జాబితాలను ప్రచురించారు.

ఎన్నికల సంఘం కసరత్తు ముమ్మరం

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న తీరుపై అన్ని జిల్లాల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు (ఏసీఎల్‌బీ), ఇతర అధికారులతో రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ టెలీకాన్ఫరెన్స్, గూగుల్ మీట్‌లు నిర్వహించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటర్ల జాబితాలు సిద్ధం చేయడం, గ్రామ పంచాయతీల మ్యాపింగ్, ఎంపీటీసీ స్థానాలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓటర్ల లెక్కలు, పోలింగ్ స్టేషన్ల గుర్తింపు, ఎన్నికలు జరిపేందుకు అందుబాటులో ఉన్న సిబ్బంది, బ్యాలెట్ బాక్స్‌లు, ఇతర రవాణా ఏర్పాట్లు, రిటర్నింగ్ అధికారుల (ఆర్వోల) నియామకం, ఆర్వోలు, సిబ్బందికి శిక్షణ, బ్యాలెట్ పేపర్ల ముద్రణ తదితర అంశాలపై సమీక్షించారు.


ఎస్సీ వర్గీకరణపై సిఫారసులు రెడీ

▶ మొదటి పేజీ తరువాయి

చేయనున్నారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు సంబంధించి తుది నిర్ణయం తీసుకునేందుకు మంగళవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. ఆ తర్వాత అసెంబ్లీలో కూడా చర్చించిన తర్వాత ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

2011 జనగణన ఆధారంగా..

రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణపై అధ్యయనం కోసం గతేడాది అక్టోబర్‌లో ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసింది. 2011 జనగణన ఆధారంగా పరిశీలన చేపట్టాని, అరవై రోజుల్లోగా అధ్యయనం పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించింది. బూర్గుల రామకృష్ణారావు భవన్ మొదటి అంతస్తు బి బ్లాక్‌లో కార్యాలయాన్ని కేటాయించింది. కమిషన్‌కు సహకరించేందుకు రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి శాఖ అదనపు సంచాలకులు ఉమాదేవి, శ్రీధర్‌లను ప్రభుత్వ నియమించింది. నవంబర్ 11న కమిషన్ బాధ్యతలు స్వీకరించింది. అనంతరం క్షేత్రస్థాయిలో అధ్యయనం మొదలుపెట్టింది. రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో బహిరంగ విచారణ కార్యక్రమాలు చేపట్టింది. క్షేత్రస్థాయి పరిశీలన, కులసంఘాలు, ప్రజా సంఘాలతో సమావేశాలు, వినతులు, విజ్ఞాపనల స్వీకరణ తదితరాలు కొనసాగించింది. దీంతోపాటు ఆన్‌లైన్ పద్ధతిలో వినతులు, సలహాలు, సూచనలు, అభ్యంతరాలను కూడా స్వీకరించింది. అన్ని కోణాల్లో పరిశీలన, సమాచార సేకరణతో పాటు ఆన్‌లైన్‌లో వచ్చిన వినతులు, ప్రభుత్వ విభాగాల నుంచి సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించి నివేదిక తయారు చేసింది.



వర్గీకరణ నివేదికతో మంత్రులు దామోదర, ఉత్తమ్, పొన్నం. చిత్రంలో శ్రీధర్, జస్టిస్ షమీమ్ అక్తర్

నేడు అసెంబ్లీ ప్రత్యేక భేటీ

- అంతకుముందు మంత్రివర్గ సమావేశం
- కులగణన సర్వే, ఎస్సీ వర్గీకరణ నివేదికలను ఆమోదించనున్న కేబినెట్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ, శాసనమండలి నేడు ప్రత్యేకంగా సమావేశం కానున్నాయి. మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశాల్లో కులగణన, ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన తీర్మానాలపై చర్చించి సభ్యులు ఆమోదం తెలపనున్నారు. అంతకంటే ముందు ఉదయం 10 గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్‌లో రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. కులగణన సర్వే నివేదిక, ఎస్సీల వర్గీకరణపై జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదికలకు కేబినెట్ ఆమోదం తెలపనుంది. అనంతరం ఈ నివేదికలను అసెంబ్లీ, మండలిలో ప్రవేశపెట్టి వాటిపై చర్చించి తీర్మానాలను ఆమోదించనున్నారు. ఈ తీర్మానాల ఆధారంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ల పెంపు ఖరారు కానుంది. అసెంబ్లీలో చేసే తీర్మానాలను కేంద్ర ప్రభుత్వానికి పంపించి.. అనుమతి కోరనున్నట్లు సమాచారం.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై జగదీప్ ధన్‌ఖడ్ ప్రశంసలు

శాఖలో సమర్థతతోపాటు పారదర్శకత తీసుకొస్తున్నారని కితాబు



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిపై ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ రాజ్యసభలో ప్రశంసలు కురిపించారు. బొగ్గు, గనుల రంగంలో సమర్థత, పారదర్శకత తీసుకొచ్చేందుకు మంత్రి కిషన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. అనుమతుల ఆమోదం సులువుగా జరిగేందుకు బొగ్గు, గనుల శాఖ తీసుకొచ్చిన సింగిల్ విండో వ్యవస్థను ప్రశంసించారు. సోమవారం పార్లమెంట్‌లో గనుల ప్రారంభానికి అనుమతుల మాడ్యూల్‌పై రాజ్యసభసభ్యుడు దినేశ్ శర్మ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా బొగ్గు, గనుల శాఖలో జరుగుతున్న డిజిటల్ మార్పుల గురించి సభకు కిషన్‌రెడ్డి వివరించారు. ఈ వ్యవస్థను కేంద్ర పర్యావరణ, అటవీశాఖకు చెందిన పరివేశ్ 1.0 పోర్టల్‌తో అనుసంధానం చేశామని చెప్పారు. సమీప భవిష్యత్‌లో రాబోయే పరివేశ్ 2.0 పోర్టల్‌తో కూడా అనుసంధానం చేసి, పూర్తిగా అమలు చేస్తామని వివరించారు. 2015లో అమల్లోకి వచ్చిన వేలం వ్యవస్థలో మరింత పారదర్శకత కోసం ఈ సింగిల్ విండో క్లియరెన్స్ వ్యవస్థ తీసుకురావడం మరో ముందడుగు అని చెప్పారు. గనులు పొందినవారు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆపరేషన్స్ నిర్వహించుకునేందుకు కేంద్రం శాయశక్తులా కృషి చేస్తోందని పేర్కొన్నారు. దేశ బొగ్గు రంగాన్ని మరింత పటిష్టపరిచేందుకు ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్రం ఎన్నో సంస్కరణలు చేపట్టిందని తెలిపారు. 2014కు ముందు బొగ్గు గనులను ఇష్టారాజ్యంగా కేటాయించేవారని, దీంతో బొగ్గు కుంభకోణం జరిగిందని గుర్తు చేశారు. తాము వేలం వ్యవస్థను తీసుకొచ్చినప్పటి నుంచి పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు వేలం లేకుండా ఒక్క గని కూడా ఎవరికీ కేటాయించలేదన్నారు. కిషన్‌రెడ్డి ప్రసంగం అనంతరం... మంత్రి ప్రసంగం సంతృప్తికరంగా ఉందా అని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ప్రశ్నించగా..‘ఈ అంశాన్ని నేను చాలా దగ్గరగా గమనిస్తున్నాను. బొగ్గు, గనుల శాఖ చాలా అద్భుతమైన పనిచేసినట్టు అర్థం అవుతోంది’అని రాజ్యసభ సభ్యుడు దినేశ్ శర్మ పేర్కొన్నారు. ఆ వెంటనే ‘సింగిల్ విండో కోల్ వ్యవస్థ చాలా అద్భుతం. గనులు మన సహజ సంపద. ఈ విషయంలో మంత్రిని అభినందించొచ్చు’అని రాజ్యసభ చైర్మన్ కొనియాడారు.

తెలంగాణలో బొగ్గు గ్యాసిఫికేషన్‌కు ప్రతిపాదన రాలేదు : కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రక్రియను ప్రారంభించేందుకు సింగరేణి కాలరీస్ నుంచి ఎలాంటి ప్రతిపాదన రాలేదని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. దేశంలో బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రక్రియను ప్రోత్సహించేందుకు ఆయా ప్రాజెక్టులకు గతేడాది జనవరి 24న రూ.8,500 కోట్ల ఆర్థిక ప్రోత్సాహకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌కు పూర్తయిన ప్రీ ఫీజిబిలిటీ స్టడీ

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థన మేరకు, భద్రాద్రి కొత్తగూడెంలోని ప్రతిపాదిత స్థలంలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం అభివృద్ధికి ముందస్తు సాధ్యాసాధ్యాలను ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా గత నెలలో అధ్యయనం చేసిందని కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయమంత్రి మురళీధర్ మొహోల్ తెలిపారు. సోమవారం రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌ల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం లేదా ఏదైనా ఎయిర్‌పోర్ట్ డెవలపర్ నుంచి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ పాలసీ కింద ‘సైట్ క్లియరెన్స్’కోసం కేంద్ర ప్రభుత్వానికి ఎటువంటి ప్రతిపాదన అందలేదని స్పష్టత ఇచ్చారు. అంతేగాక గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ పాలసీ ప్రకారం, భూసేకరణ, ఆర్అండ్ఆర్, నిధులు మొదలైన వాటితో సహా గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ ప్రాజెక్టుల అమలు బాధ్యత సంబంధిత విమానాశ్రయ డెవలపర్ లేదా రాష్ట్ర ప్రభుత్వంపై ఉంటుందని కేంద్రమంత్రి తెలిపారు. కాగా విమానాశ్రయ ప్రాజెక్టుల పూర్తి అనేది భూసేకరణ, పర్యావరణ అనుమతులు సహా ఇతర తప్పనిసరి అనుమతుల లభ్యత వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు.

పీఎం ఇంటర్న్‌షిప్‌లో 4,439 మందికి అవకాశం

లోక్‌సభలో కేంద్రమంత్రి హర్ష్ మల్హోత్రా వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం పైలట్ ప్రాజెక్ట్ మొదటి విడతలో భాగంగా 4,439 మంది అభ్యర్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశం లభించినట్లు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాలశాఖ సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా తెలిపారు. వీరికి రూ.6 వేల చొప్పున రూ.14.52 లక్షలను వన్ టైం గ్రాంట్ కింద విడుదల చేశామన్నారు. కాగా తెలంగాణలోని వివిధ కంపెనీల్లో 7,913 ఇంటర్న్‌షిప్ అవకాశాలున్నాయని బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణలతో పాటు కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి సోమవారం లోక్‌సభలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు. దేశంలో పీఎం ఇంటర్న్‌షిప్ పథకం పైలట్ ప్రాజెక్ట్ కోసం కంపెనీలు అందించిన అవకాశాల కంటే దరఖాస్తుల సంఖ్య ఎక్కువగా ఉందని చెప్పారు. ఈ పథకం ద్వారా ఐదేళ్లలో టాప్ 500 కంపెనీల్లో కోటి మంది యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలను కల్పించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఆయన తెలిపారు. కాగా గత ఏడాది అక్టోబర్ 3న ప్రారంభమైన పైలట్ ప్రాజెక్ట్ మొదటి రౌండ్‌లో ఇప్పటి వరకు సుమారు 6.21 లక్షల దరఖాస్తులు రాగా.. దేశవ్యాప్తంగా భాగస్వామ్య కంపెనీలు 1.27 లక్షల కంటే ఎక్కువ ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించాయన్నారు. కాగా, పీఎం ఇంటర్న్‌షిప్ పథకం పైలట్ ప్రాజెక్ట్ రెండో రౌండ్ గత జనవరి 9న ప్రారంభమైందని వివరించారు.

టారిఫ్ వార్.. బొమ్మా-బొరుసు!

చైనా, మెక్సికో, కెనడాలపై ఇప్పటికే ట్రంప్ సుంకాల మోత | మనపైనా వేలాడుతున్న టారిఫ్ కత్తి...

సాక్షి, బిజినెస్ డెస్క్: ట్రంప్ దూకుడు చూస్తుంటే.. ఇతర దేశాలను కాళ్లబేరానికి తెచ్చుకునే వ్యూహంతో వెళ్తున్నట్లు కనిపిస్తోంది. రేపోమాపో మనకూ సుంక‘దండన’తప్పకపోవచ్చు. ఇప్పటికే పలుమార్లు భారత్‌ను ‘అమెరికాకు అతిపెద్ద టారిఫ్ ముప్పు’గా అభివర్ణించారు కూడా. డీ–డాలరైజేషన్ చర్యల నుంచి వెనక్కితగ్గకపోతే బ్రిక్స్ దేశాలపై 100 శాతం సుంకాలు విధిస్తానని కూడా హెచ్చరించారు. కాగా, మెక్సికోపై తాత్కాలికంగా టారిఫ్‌ల విధింపునకు ఒక నెల రోజులపాటు విరామం ఇచ్చారు. అయితే, అమెరికా టారిఫ్‌లు రెండు వైపులా పదునున్న కత్తిలాంటివని స్వయంగా ఆ దేశ ఆర్థిక వేత్తలు, నిపుణులే హెచ్చరిస్తున్నారు. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా సరఫరా వ్యవస్థలు కకావికలం అవుతాయని, దీంతో ఉత్పత్తుల రేట్లు పెరిగిపోయి.. ద్రవ్యోల్బణం ఎగబాకేందుకు దారితీస్తుందని చెబుతున్నారు. సుంకాల విధింపుతో ఎగుమతిదారులు ఆమేరకు రేట్లు పెంచుతారు. అమెరికా ప్రజలు కూడా ఆయా దేశాల ఉత్పత్తులను అధిక ధరలకు కొనుక్కోవాల్సిందేనని తేల్చి చెబుతున్నారు.

మన ఎగుమతులకు లాభమేనా?

ట్రంప్ టారిఫ్ వార్‌తో ప్రస్తుతానికి కొన్ని రంగాల్లో ఎగుమతిదారులకు కొంత లాభమేనని పరిశ్రమవర్గాలు ఆశాభావంతో ఉన్నాయి. ప్రస్తుతానికి మనపై సుంకాలు విధించకపోవడంతో చైనా ఉత్పత్తులతో పోలిస్తే మన ఎగుమతులకు పోటీతత్వం పెరుగుతుందని భారతీయ ఎగుమతిదారుల సంఘం (ఫియో) డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ పేర్కొన్నారు. అయితే, భారత్‌లోకి చైనా సహా పలు దేశాల నుంచి చౌక దిగుమతులు పోటెత్తే అవకాశం ఉందని, ఇది మన పరిశ్రమలకు ముప్పుగా మారొచ్చని మరికొందరు నిపుణులు హెచ్చరిస్తున్నారు. సుంకాల విషయంలో తీవ్ర విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు భారత్ సిద్ధంగా ఉండాలని కౌన్సిల్ ఫర్ సోషల్ డెవలప్‌మెంట్ ప్రొఫెసర్ బిశ్వజిత్ ధార్ సూచించారు.



ఆటోమొబైల్: భారత వాహన విడిభాగాల సంస్థలకు అమెరికా అతిపెద్ద ఎగుమతి మార్కెట్‌గా ఉంది. పరిశ్రమ అసోసియేషన్ (ఏసీఎంఏ) ప్రకారం 2024–25లో భారత్ 11.1 బిలియన్ డాలర్ల విలువైన విడిభాగాలను ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతి చేసింది. ఇందులో 3.67 బిలియన్ డాలర్లు, అంటే 28 శాతం అమెరికాకే వెళ్లాయి. తాజాగా ఇతర దేశాలపై టారిఫ్‌ల పెంపుతో యూఎస్‌లో మన వాటా పెంచుకోవడానికి సదవకాశమని కొంతమంది పరిశ్రమవర్గాలు చెబుతున్నారు. ‘ఆహార, వ్యవసాయ రంగాలతో పాటు వాహన విడిభాగాల రంగాలు తక్షణం ప్రయోజనం పొందుతాయి. దాదాపు 20 బిలియన్ డాలర్ల విలువైన మార్కెట్ అవకాశాలకు ద్వారాలు తెరుచుకుంటాయి’అని వాణిజ్య విధాన విశ్లేషకుడు ఎస్.చంద్రశేఖరన్ పేర్కొన్నారు.

టెక్స్‌టైల్స్: ట్రంప్ తాజా టారిఫ్‌లు భారత టెక్స్‌టైల్ రంగానికి బూస్ట్ ఇస్తాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ‘భారతీయ కంపెనీలకు సమీప భవిష్యత్తులో ఆర్డర్లు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది’అని తిరుపూర్ ఎగుమతిదారుల సంఘం (టీఈఏ) అధ్యక్షుడు కె.ఎం. చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు.

ఫార్మా: భారత ఫార్మా రంగం అప్రమత్తతతో పాటు ఆశావహ ధోరణితో వేచిచూస్తోంది. ‘జెనరిక్స్‌లో చైనా చాలా పటిష్టంగానే ఉన్నప్పటికీ, అమెరికాకు పెద్దగా ఎగుమతి చేయడం లేదు. ప్రధానంగా యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రీడియెంట్స్ (ఏపీఐ), కెమికల్స్ వంటివి ఎగుమతి చేస్తోంది. ఇప్పుడు మనకు వీటిని కూడా అమెరికాకు ఎగుమతి చేసే అవకాశం లభిస్తుంది. అయితే, మనం వాటి కోసం చైనాపైనే ఆధారపడాల్సిన పరిస్థితి’అని ఫార్మా ఎగుమతుల ప్రోత్సాహక మండలి (ఫార్మెక్సిల్) మాజీ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్ అభిప్రాయపడ్డారు.

స్టీల్: ట్రేడ్ వార్ మరింత ముదిరితే సరఫరా వ్యవస్థల్లో తీవ్ర కుదుపులకు ఆస్కారం ఉంది. వివిధ దేశాల నుంచి భారత్‌కు దిగుమతులు పోటెత్తే అవకాశం ఉందని, పరిస్థితులను నిశితంగా గమనించి చర్యలు చేపట్టాలని జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సీఈఓ జయంత్ ఆచార్య పేర్కొన్నారు. చైనా స్టీల్ ఉత్పత్తి భారీగానే కొనసాగనున్న నేపథ్యంలో యూఎస్ దెబ్బకు ఇతరత్రా అందుబాటులో ఉన్న దేశాలకు ఎగుమతులను మళ్లించవచ్చని ఆర్సెలర్ మిట్టల్ వైస్–ప్రెసిడెంట్ రంజన్ ధార్ తెలిపారు.

ఎలక్ట్రానిక్స్: చైనా ఉత్పత్తులపై అదనపు సుంకాలతో తక్షణం ప్రయోజనం పొందే రంగాల్లో ఇదొకటి. అయితే, తక్షణం దీని ప్రయోజనం పొందేలా పాలసీ రూపకర్తలు, పరిశ్రమ వర్గాలు చర్యలు తీసుకోవాలని భారతీయ సెల్యులర్, ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) చైర్మన్ పంకజ్ మొహింద్రూ వ్యాఖ్యానించారు. భారత్‌ను ఎగుమతి హబ్‌గా చేసుకుంటున్న యాపిల్‌తో పాటు మోటరోలా వంటి చైనా బ్రాండ్‌లు మన దగ్గరున్న టాటా ఎలక్ట్రానిక్స్, ఫాక్స్‌కాన్, డిక్సన్ వంటి తయారీదారుల నుంచి అమెరికాకు ఎగుమతులను మరింత పెంచే అవకాశం ఉంది. యాపిల్, శాంసంగ్ దన్నుతో 2024లో భారత్ నుంచి మొబైల్ ఫోన్ ఎగుమతులు రికార్డు స్థాయిలో 20.4 బిలియన్ డాలర్లకు దూసుకెళ్లాయి. ఇందులో యాపిల్ వాటా 65 శాతం కాగా (12.8 బిలియన్ డాలర్లు), శాంసంగ్ వాటా 20 శాతంగా (4 బిలియన్ డాలర్లు) ఉంది.

దిగుమతులు, రూపాయి, స్టాక్ మార్కెట్‌కు దెబ్బ...

ట్రేడ్ వార్ 2.0... ప్రపంచ దేశాల కరెన్సీ మార్కెట్లను సైతం కుదిపేస్తోంది. అనేక దేశాల కరెన్సీలతో డాలర్ విలువ మరింత బలపడుతోంది. డాలర్ ఇండెక్స్ ఇప్పటికే 110 స్థాయికి చేరింది. దీంతో మన రూపాయి విలువ కూడా అంతకంతకూ బక్కచిక్కిపోతోంది. తాజాగా డాలరు మారకంలో 87 కిందికి పడిపోయింది. ఒకపక్క, ఎగుమతిదారులకు కాస్త ఊరట లభించినప్పటికీ.. మన వాణిజ్యం ఇప్పటికీ లోటులోనే ఉన్న నేపథ్యంలో దిగుమతులు గుదిబండగా మారుతున్నాయి. ఇక అమెరికా టారిఫ్‌ల ప్రభావంతో ద్రవ్యోల్బణం పెంపు భయాలు పెరిగాయి. యూఎస్‌లోని సెంట్రల్ బ్యాంక్ వడ్డీ రేట్ల కోతకు బ్రేక్ ఇవ్వడంతో డాలర్ జోరుకు ఆజ్యం పోసినట్లయింది. ఈ ప్రభావంతో విదేశీ ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) మన స్టాక్ మార్కెట్ నుండి పాలోమంటూ నిధులను వెనక్కి తీసేసుకుంటున్నారు. అక్టోబర్ నుంచి రివర్స్ గేర్‌లో ఉన్న ఎఫ్‌పీఐలు ట్రంప్ విజయం తర్వాత ఇంకాస్త జోరు పెంచారు. ఈ ఏడాది జనవరిలోనే రూ.87,000 కోట్ల విలువైన షేర్లను భారత్ మార్కెట్లలో విక్రయించడం విశేషం. దీంతో స్టాక్ సూచీలు ఇటీవలి గరిష్ఠ స్థాయిల నుంచి 10 శాతం పైగానే కుప్పకూలాయి. వెరసి టారిఫ్ వార్ దేశీ స్టాక్ మార్కెట్లకూ అతిపెద్ద ముప్పుగా మారుతోంది.

భారత్–అమెరికా వాణిజ్య బంధం ఇలా..

2023–24 ఆర్థిక సంవత్సరంలో భారతదేశానికి అమెరికా అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. గతేడాది అమెరికాకు భారత ఎగుమతులు 77.51 బిలియన్ డాలర్లుగా ఉండగా, దిగుమతులు 42.2 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. 35.31 బిలియన్ డాలర్ల వాణిజ్య మిగులు ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) ఏప్రిల్–అక్టోబర్ కాలంలో అమెరికాకు మన ఎగుమతులు 6.31 శాతం పెరిగి 47.24 బిలియన్ డాలర్లకు చేరుకోగా, దిగుమతులు 2.46 శాతం పెరిగి 26 బిలియన్ డాలర్లకు ఎగశాయి.

కులగణనతోనే ఆ వర్గాలకు న్యాయం

- రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మాన చర్చలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ
- తెలంగాణ కులగణనలో విస్మయపరిచే అంశాలు వెలుగులోకి వచ్చాయి
- సుమారు 90 శాతం దళితులు, ఆదివాసీ, ఓబీసీ, మైనార్టీ వర్గాల వారే..
- దేశవ్యాప్తంగా కులగణనను చేపడితేనే అభివృద్ధి నమూనా సాధ్యమని వ్యాఖ్య
- కులగణనలో కృత్రిమ మేధను వినియోగించాలని సూచన



ఆ హల్వా ఎవరికి తినిపించారో!

ఇటీవలి బడ్జెట్ సెషన్ సందర్భంగా హల్వా తయారీకి సంబంధించిన ఫొటో అంశాన్ని రాహుల్ గుర్తు చేశారు. ''గత సెషన్‌లో హల్వా తయారు చేసే ఫొటో గుర్తుండే ఉంటుంది. ఈసారి ఆ ఫొటోనే బయటికి రాలేదు. హల్వా తినిపించారు. కానీ ఎవరికి తినిపించారో చూపించలేదు''అని రాహుల్ ఎద్దేవా చేశారు.

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో నిర్వహించిన కులగణనలో విస్మయపరిచే అంశాలు వెలుగులోకి వచ్చాయని.. జనాభాలో 90శాతం మంది దళితులు, ఆదివాసీలు, మైనార్టీలు, ఓబీసీ వర్గాలకు చెందినవారే ఉన్నారని లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దేశమంతటా ఇదే తరహా ధోరణి ఉందని, కులగణనతోనే ఆ వర్గాలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. సోమవారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణలో నిర్వహించిన కులగణన అంశాన్ని ప్రస్తావించారు. ''తెలంగాణలో మేం కుల గణన నిర్వహించాం. అందులో విస్మయపరిచే అంశాలు గుర్తించాం. తెలంగాణలో సుమారు 90శాతం మంది దళితులు, ఆదివాసీలు, మైనార్టీలు, ఓబీసీ వర్గాలకు చెందినవారే ఉన్నారు. దేశం మొత్తంలోనూ ఇదే తరహా పరిస్థితి ఉందని నేను నమ్ముతున్నా. దేశంలో ఓబీసీల జనాభా 50శాతానికిపైగా ఉంది. ఇంకా గమనిస్తే అది 55% వరకు ఉండొచ్చు. 16% దళితులు, 9% ఆదివాసీలు, 15% మైనార్టీలు ఉన్నారు..''అని రాహుల్ పేర్కొన్నారు.

అందరికీ భాగస్వామ్యం అందాలి..

దేశంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమం చేపట్టినా అందులో అందరికీ భాగస్వామ్యం కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని రాహుల్ పేర్కొన్నారు. ''దళితులు, ఆదివాసీ, ఓబీసీ, మైనార్టీలు ఈ దేశానికి ఆస్తుల వంటివారు. కానీ దేశంలోని ఎలాంటి పెద్ద కార్పొరేట్ సంస్థలను పరిశీలించినా.. అవి దళితులు, ఓబీసీలు, ఆదివాసీలు, మైనార్టీల యాజమాన్యంలో లేవు. పెద్దపెద్ద మీడియా సంస్థలు ప్రధాని మోదీకి మద్దతిస్తాయి. ప్రతిరోజూ నవ్వు ముఖాన్ని ప్రదర్శిస్తాయి. అలాంటి మీడియా ఎన్నడూ ఈ వర్గాల వారిని పట్టించుకోవడం లేదు. కేంద్రం ఎలాంటి కొత్త అభివృద్ధి నమూనాను ఆవిష్కరించాలని భావించినా.. అది కేవలం కులగణనను ఈ సభలో టేబుల్‌పై ఉంచితేనే సాధ్యమవుతుంది. ఒక్కసారి కులగణన చేస్తేనే దేశంలోని 90శాతం జనాభా సంపద, శక్తి ఉందో తెలుస్తుంది''అని చెప్పారు.

బీజేపీ ఎంపీలకు అధికారం లేదన్న రాహుల్.. మండిపడ్డ బీజేపీ..

రాహుల్ ప్రసంగిస్తున్న సమయంలో లోక్‌సభలో అధికార పార్టీ సీట్లను చూపిస్తూ.. ''బీజేపీలో ఓబీసీ, దళిత, ఆదివాసీ ఎంపీలు ఉన్నారు. జనాభాలో వారు 50 శాతంగా ఉన్నా వారికి కచ్చితంగా అధికారం మాత్రం లేదు. మీరు అధికార పక్షంలో కూర్చున్నా.. నోరు మెదపలేరు. అదే దేశంలో వాస్తవం''అని వ్యాఖ్యానించారు. దీనిపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, ఇతర ఎంపీలు లేచి.. ప్రధాని మోదీ స్వయంగా ఓబీసీ వర్గానికి చెందిన వారని.. మీకు కళ్లు కనిపించడం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ప్రసంగాన్ని కొనసాగించిన రాహుల్.. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టినప్పుడే ఆయా వర్గాలకు న్యాయం జరుగుతుందని, వెంటనే కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ప్రక్రియలో కృత్రిమ మేధ (ఏఐ)ను ఉపయోగించాలని కోరారు. ''కులగణనకు ఏఐని వర్తింపజేసినప్పుడు ఆ శక్తిని ఊహించండి. కులగణన నుంచి మనకు లభించే డేటాను ఏఐతో విశ్లేషించినప్పుడు.. ఏఐతో మనం ఏం చేయగలమో, ఈ దేశంలో సామాజిక విప్లవంతో ఏం చేస్తామో ఊహించండి''అని రాహుల్ పేర్కొన్నారు.

విభజన సమస్యలపై వివాదాలకు తావివ్వొద్దు

కోర్టులను ఆశ్రయిస్తే సమస్యలు మరింత జఠిలం.. తెలంగాణ, ఏపీలకు కేంద్రం సూచన

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ, ఏపీల మధ్య అపరిష్కృతంగా ఉన్న విభజన సమస్యలపై వివాదాలకు వెళ్లకుండా సామరస్యంగా పరిష్కరించుకోవాలని కేంద్రం సూచించింది. ఆయా అంశాలపై న్యాయస్థానాలను ఆశ్రయిస్తే సమస్యలు మరింత జఠిలమై, పరిష్కారం ఆలస్యం అయ్యే ప్రమాదం ఉందని పేర్కొంది. పెండింగ్‌లో ఉన్న అంశాలపై సోమవారం కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ అధ్యక్షతన కీలక భేటీ జరిగింది. ఇరు రాష్ట్రాల సీఎస్‌లు, ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. విభజన చట్టం 9, 10 షెడ్యూళ్లలోని అంశాలపై భేటీలో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిసింది. ప్రధానంగా అప్పులు, ఆస్తులపై చర్చించారు. ఈ రెండు షెడ్యూళ్లకు సంబంధించిన 20 సంస్థల నిధుల పంపకాలను సామరస్యంగా జరుపుకోవాలని కేంద్రం సూచించింది. అవసరమైతే సీఎంల స్థాయిలో సమస్యలు పరిష్కరించుకోవాలని చెప్పింది. విదేశీ అప్పుల పంపకంపై రెండు రాష్ట్రాల సీఎస్‌లకు పలు సూచనలు చేసింది. ఈ అప్పులపై న్యాయ సలహాతో ముందుకెళ్లాలంటూ దిశా నిర్దేశం చేసింది. కేంద్రం సూచనలకు ఇరు రాష్ట్రాలు అంగీకారం తెలియజేస్తూనే.. తమ తమ ఏజీ (అడ్వొకేట్ జనరల్)లతో చర్చించి, నిర్ణయం తీసుకుంటామని చెప్పినట్లు తెలిసింది.

అదనపు కలెక్టర్ ఎదుటే కస్సు.. బుస్సు!



- మంచు కుటుంబ ఆస్తి వివాదంపై విచారణ... హాజరైన మోహన్‌బాబు, మనోజ్
- రెండు గంటలపాటు సుదీర్ఘ విచారణ.. తీవ్ర వాగ్వాదం
- అది నా స్వార్జితం.. నా ఇంటిని ఖాళీ చేయాల్సిందే: మోహన్‌బాబు
- ఆయనకు ఆ ఇల్లు ఒక్కటే కాదు చాలా ఆస్తులున్నాయి: మంచు మనోజ్



సాక్షి, రంగారెడ్డిజిల్లా: మంచు కుటుంబ వివాదం మరింత క్లిష్టంగా మారుతోంది. తన ఇల్లు ఖాళీ చేయించండి అంటూ సినీనటుడు మంచు మోహన్‌బాబు వయో వృద్ధుల చట్టం కింద నెలన్నర రోజుల క్రితమే జిల్లా మేజిస్ట్రేట్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో కలెక్టర్ నారాయణరెడ్డి మంచు మనోజ్‌కు 15 రోజుల క్రితం నోటీసులు జారీ చేశారు. మంచు మనోజ్ తన అడ్వకేట్‌తో కలిసి జనవరి 18న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఎదుట హాజరై వివరణ ఇచ్చేందుకు మరికొంత సమయం కావాలని అడిగారు. తాజాగా సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు రెండో హియరింగ్ జరిగింది. తండ్రీ కొడుకులిద్దరూ వేర్వేరు వాహనాల్లో తమ న్యాయవాదులతో కలిసి కలెక్టరేట్‌కు చేరుకున్నారు.

ముందు వేర్వేరుగా లోపలకు పిలిచి..

వారు నేరుగా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ చాంబర్‌కు చేరుకున్నారు. తొలుత ఇద్దరిని వేర్వేరుగా లోపలకు పిలిచి మాట్లాడారు. సుమారు రెండుగంటల పాటు విచారణ కొనసాగింది. చివరి నిమిషంలో ఇద్దరూ అదనపు కలెక్టర్ ఎదుటే వాగ్వాదానికి దిగినట్లు విశ్వసనీయంగా తెలిసింది. తీవ్ర వాగ్వాదంతోపాటు ఒకరినొకరు దూషించుకోవడమే కాకుండా ఒకానొక దశలో తోపులాడుకునే స్థాయికి వెళ్లినట్లు సమాచారం. ప్రతిమాసింగ్ వారిని సముదాయించే ప్రయత్నం చేసినా..వినిపించుకోకపోవడంతో రక్షణ కోసం పోలీసులను లోపలకు పిలిపించారు. 'ఇల్లు, ఇతర ఆస్తులన్నీ నా స్వార్జితం, వాటి నుంచి ఖాళీ చేయించాల్సిందే'అంటూ తండ్రి మోహన్‌బాబు విచారణ అధికారి ముందు పట్టుబట్టగా, కొడుకు మనోజ్ అందుకు నిరాకరించినట్లు తెలిసింది.

ముందు నుంచి ఒకరు.. వెనుక నుంచి మరొకరు

నాన్నకు ఇల్లు ఒక్కటే కాదని, చాలా ఆస్తులు ఉన్నాయని, వారసత్వంగా నాకు ఆస్తిలో వాటా ఉందని, విద్యాసంస్థల్లో జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నించినందుకే తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, తాను ఏనాడు కూడా నాన్నపై చేయి చేసుకోలేదని మనోజ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. 'అతను నా కొడుకే కాదు..అతని నుంచి నాకు ప్రాణహాని ఉంది. నాకు రక్షణ కల్పించండి'అంటూ మోహన్‌బాబు అదనపు కలెక్టర్‌కు విన్నవించినట్టు తెలిసింది. ఇదిలా ఉంటే పలు ఆస్తులకు సంబంధించిన దస్తావేజులను మనోజ్ విచారణాధికారి ముందు ఉంచారు. అనంతరం మోహన్‌బాబు వెనుక వైపు నుంచి వెళ్లిపోగా, మనోజ్ ముందు వైపు నుంచి ఆవేశంగా బయటకు వెళ్లిపోవడం, విచారణ జరుగుతున్న సమయంలో మీడియా సహా ఇతర వ్యక్తులను అటు వైపు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడం గమనార్హం. మరో పదిరోజుల్లో మూడో విచారణకు హాజరు కావాలని ప్రతిమాసింగ్ వారికి సూచించినట్లు సమాచారం.

తొలిరోజు ఒక్కటే నామినేషన్

వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల

నల్లగొండ: వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ఉదయం 10.30 గంటలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆ తర్వాత 11 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. మొదటి రోజు ప్రజావాణి పార్టీ అభ్యర్థి లింగిడి వెంకటేశ్వర్లు నామినేషన్ దాఖలు చేశారు. కాగా, అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి సూచించారు. నామినేషన్ల ప్రక్రియ 10 వరకు కొనసాగుతుందని, 8, 9 తేదీల్లో సెలవులు ఉన్నందున ఆ రెండు రోజులు నామినేషన్లు స్వీకరించబోమని తెలిపారు.

సీపీఎస్ అభ్యర్థికి పండితులు, పాలిటెక్నిక్ లెక్చరర్ల మద్దతు

సాక్షి, హైదరాబాద్: ఈనెల 27న జరగనున్న కరీంనగర్–మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (సీపీఎస్‌ఈయూ) అభ్యర్థిగా పోటీ చేస్తున్న తిరుమలరెడ్డి ఇన్నారెడ్డికి రెండు సంఘాలు మద్దతు ప్రకటించాయి. రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్, తెలంగాణ పాలిటెక్నిక్ లెక్చరర్ల అసోసియేషన్‌లు ఈ మేరకు తమ మద్దతును తెలియజేశాయి. సోమవారం సీపీఎస్ యూనియన్ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్‌లను కలిసి మద్దతు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పండిత పరిషత్ అధ్యక్షుడు జగదీశ్, ప్రధాన కార్యదర్శి నర్సింహులు, పాలిటెక్నిక్ లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షుడు అంజయ్య, ప్రధాన కార్యదర్శి ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ అసెంబ్లీకి రావాలి

- బీసీలపై ఆయన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి: పొన్నం
- కల్వకుంట్ల కుటుంబంలో కవిత తప్ప ఎవరూ సర్వేలో వివరాలివ్వలేదు
- కులగణన వివరాలు ఇవ్వని వారు ఇప్పుడైనా ఇవ్వొచ్చు



సాక్షి, హైదరాబాద్: బీసీలపై నిజంగా కేసీఆర్‌కు ప్రేమ, వారి సమగ్ర అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే మంగళవారం జరిగే అసెంబ్లీ సమావేశానికి హాజరు కావాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ఈ సమావేశానికి రావాలని కేసీఆర్‌కు ప్రత్యేకంగా ఆహ్వానం పంపబోమని, అందరు ఎమ్మెల్యేలకు పంపినట్టే అసెంబ్లీ కార్యదర్శి ద్వారా అధికారికంగా సమాచారం వెళుతుందని చెప్పారు. సోమవారం గాంధీభవన్‌లో పొన్నం విలేకరులతో మాట్లాడుతూ కులగణన కోసం పోరాటం చేసిన వారందరికీ అభినందనలు తెలుపుతున్నానని, ఈ ప్రక్రియలో భాగస్వామి అయినందుకు గర్వంగా ఉందని వ్యాఖ్యానించారు. కులగణన రిపోర్టును మంత్రివర్గం ఆమోదించి అసెంబ్లీలో ప్రవేశపెడుతున్నందుకుగాను బీసీలందరూ ఉత్సవాలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

కుక్కలు వదిలారు

సర్వే కోసం వెళ్లిన వారిపై కుక్కలు వదిలిన వారు కూడా ఉన్నారని, కొందరు కావాలని సహాయ నిరాకరణ చేసి వివరాలు ఇవ్వలేదని పొన్నం ఆరోపించారు. కల్వకుంట్ల కుటుంబంలో కవిత మినహా ఎవరూ ఇవ్వలేదన్నారు. కులగణనపై రాజకీయ పార్టీలు తమ స్టాండ్ ఏంటో స్పష్టం చేయాలని, అసెంబ్లీలో అన్ని పార్టీలు తమ వాదనలు వినిపించాలని కోరారు. కులగణన సందర్భంగా వివరాలు ఇవ్వని వారు ఇప్పుడైనా వెల్లడించవచ్చని అన్నారు.

గాంధీభవన్‌లో సంబురాలు

కులగణన సర్వేను కేబినెట్‌లో ఆమోదించి అసెంబ్లీలో ప్రవేశపెడుతున్నందుకు గాను టీపీసీసీ ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటంతో నినాదాలు చేస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానించారు.

19 జిల్లాలకు బీజేపీ అధ్యక్షుల నియామకం

- మిగతా జిల్లాలపై కుదరని ఏకాభిప్రాయం!
- 8 జిల్లాలకు వారంలో ప్రకటించే అవకాశం
- రాష్ట్ర అధ్యక్షుడు ఖరారయ్యాక మిగతా 11 జిల్లాలకు నియామకం



సాక్షి, హైదరాబాద్: బీజేపీ సంస్థాగత ఎన్నికలు ఇంకా ఓ కొలిక్కి రాలేదు. సంస్థాగతంగా పార్టీని 38 జిల్లాలుగా విభజించగా, సోమవారం 19 జిల్లాలకు మాత్రమే అధ్యక్షులను ప్రకటించారు. ఈ జిల్లాల్లో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల పేర్లను కూడా ప్రకటించారు. అయితే కొన్ని జిల్లాల్లో అధ్యక్షుల పేర్లపై ఏకాభిప్రాయం కుదరలేదని, సామాజిక వర్గాల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించేలా కూర్పు ఇంకా పూర్తిస్థాయిలో సాధ్యం కాలేదని తెలుస్తోంది. ఏకాభిప్రాయం కుదరని కొన్ని జిల్లాల్లో రాష్ట్ర, జిల్లా నాయకత్వాలు ప్రతిపాదించిన పేర్లపై స్థానిక నాయకులు, కార్యకర్తల్లో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నట్టు పార్టీవర్గాలు చెబుతున్నాయి. కొన్నిచోట్ల స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు సైతం జిల్లా అధ్యక్షులుగా ప్రతిపాదించిన వారి విషయంలో అసంతృప్తి వ్యక్తం చేయడంతో నియామకాలు ఆగినట్టుగా తెలిసింది. ఇప్పటివరకు ప్రకటించిన 19 జిల్లాల్లో ఒక్క మహిళకు కూడా అవకాశం దక్కలేదు.

8 జిల్లాల్లో ఏకాభిప్రాయం దిశగా..

8 జిల్లాలకు సంబంధించి ఏకాభిప్రాయం కుదిరే దిశగా కసరత్తు జరుగుతోంది. మొత్తం 38 జిల్లాలకు గాను యాభై శాతానికి పైగా అంటే 20కు పైగా జిల్లాలకు అధ్యక్షులను ఎన్నుకుంటేనే రాష్ట్ర అధ్యక్ష పదవికి ఎన్నిక లేదా నియామకానికి అవకాశం ఉంటుంది. అందువల్ల వారం, పది రోజుల్లో 8 జిల్లాలకు కూడా అధ్యక్షులను ప్రకటిస్తే మొత్తం 27 జిల్లాలకు అధ్యక్షులను నియమించినట్టు అవుతుందని చెబుతున్నారు. రాష్ట్ర పార్టీకి కొత్త అధ్యక్షుడు నియమితులయ్యాక మిగిలిన 11 జిల్లాలకు అధ్యక్షులను ఖరారు చేసే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ఇప్పటివరకు ప్రకటించిన 19 జిల్లాలను చూస్తే...రెడ్డి-6, ఎస్సీ-1, వైశ్య-2, బీసీలు-10 మంది ఉన్నట్టుగా తేలింది. ఇక త్వరలో ప్రకటించే 8 జిల్లాల్లో ఒకటి మహిళకు, ఆ తర్వాత ఖరారు చేసే 11 జిల్లా ల్లో కూడా మరో రెండు లేదా మూడు జిల్లాలకు మహిళలకు అవకాశం లభించవచ్చునని అంచనా వేస్తున్నారు.

19 జిల్లాల అధ్యక్షులు వీరే..

పతంగి బ్రహ్మానంద్ (ఆదిలాబాద్ జిల్లా), వెంకటేశ్వర్‌గౌడ్ (మంచిర్యాల), శ్రీశైలం ముదిరాజ్ (ఆసిఫాబాద్), దినేష్ కులాచారి (నిజామాబాద్), నీలం చిన్నరాజులు (కామారెడ్డి), రాచకొండ యాదగిరిబాబు (జగిత్యాల), కర్రే సంజీవ్ రెడ్డి (పెద్దపల్లి), వి.రాధామల్లేష్ గౌడ్ (మెదక్), బుద్ధి శ్రీనివాస్ (మేడ్చల్–మల్కాజిగిరి), నాగం వర్షిత్‌రెడ్డి (నల్లగొండ), పి.శ్రీనివాసరెడ్డి (మహబూబ్‌నగర్), దుప్పలి నారాయణ (వనపర్తి), కొలను సంతోష్‌రెడ్డి (హనుమకొండ), గంట రవికుమార్ (వరంగల్), నిశిధర్‌రెడ్డి (భూపాలపల్లి), సోడ రమేష్ (జనగామ), సిరికొండ బలరాం (ములుగు), గుండగోని భరత్‌గౌడ్ (మహంకాళి సికింద్రాబాద్), లంకాల దీపక్‌రెడ్డి (హైదరాబాద్ సెంట్రల్ జిల్లా) లను అధ్యక్షులుగా బీజేపీ ప్రకటించింది.

క్లుప్తంగా...

ఎన్నికల కోసం తప్పుడు నివేదికలు: శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన 'సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే'గణాంకాల నివేదిక తప్పుల తడక అని, ఎన్నికల కోసం తప్పుడు నివేదికలను ప్రకటించారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీల జనాభా 60 శాతానికి పైగా ఉండాలని, నివేదికల పేరుతో తక్కువ చూపుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీలను మోసం చేసిందన్నారు. అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపి చేతులు దులుపుకోవాలని ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. తెలంగాణలో కులాల మధ్య కొట్లాటలు పెడుతున్నారని, ప్రభుత్వం చిల్లర వ్యవహారాలతో ఉద్యమాలు పుట్టుకు వస్తున్నాయని హెచ్చరించారు. మాకు ట్యాబ్‌లు ఇస్తే సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు.

అసెంబ్లీ భేటీతో బీసీలను మోసం చేస్తున్నారు

బీజేఎల్పీ ఉపనేత పాయల్ శంకర్



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ప్రత్యేక సమావేశం పేరుతో మంగళవారం సభ నిర్వహించి బీసీలను మోసం చేయాలని చూస్తున్నారని బీజేఎల్పీ ఉపనేత పాయల్ శంకర్ ఆరోపించారు. 'కాంగ్రెస్ పాలన పూర్తిగా గాడి తప్పింది. కులగణన సర్వేలో బీసీల సంఖ్యను తగ్గించి చూపించి మోసం చేస్తున్నారు. గతంలో బీసీలను కాంగ్రెస్ మోసం చేసింది. మళ్లీ దాన్ని రిపీట్ చేయాలని చూస్తోంది. ఒక్కరోజు సమావేశం పెట్టి తూతూమంత్రంగా తీర్మానం చేసి ఆ నెపాన్ని ఇతరులపై నెట్టేయాలని చూస్తోంది'అని మండిపడ్డారు. సోమవారం శంకర్ మీడియాతో మాట్లాడుతూ అసలు అసెంబ్లీ సమావేశాల్లో ఏం చేయదలుచుకున్నారో ముందుగానే అందరికీ చెప్పాలని డిమాండ్‌చేశారు. కాంగ్రెస్ సర్కార్‌కు దమ్ముంటే ఈ అసెంబ్లీ సమావేశాల్లో కేంద్ర బడ్జెట్‌పై చర్చ జరపాలని సవాల్ విసిరారు.

మా ఊరికి రా... రుణమాఫీపై తేలుద్దాం!

కేటీఆర్‌కు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సవాల్



సాక్షి, హైదరాబాద్: రైతు రుణమాఫీ గురించి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యల్లో నిజం లేదని పరిగి కాంగ్రెస్ ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి చెప్పారు. కేటీఆర్‌కు నిజంగా దమ్ముంటే తన స్వగ్రామమైన శివారెడ్డిపల్లికి రావాలని, ఆ గ్రామంలోని రైతులకు బీఆర్‌ఎస్ హయాంలో ఎంత మాఫీ అయిందో, కాంగ్రెస్ హయాంలో ఎంత మాఫీ అయిందో తేలుద్దామని సవాల్ చేశారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ హయాంలో శివారెడ్డిపల్లి రైతులకు రూ.25 లక్షల రుణమాఫీ అయితే, కాంగ్రెస్ హయాంలో రూ.2 కోట్లు చేశామని చెప్పారు. అదే విధంగా వికారాబాద్ జిల్లాలో మొత్తం రూ.1,000 కోట్లు రుణమాఫీ అయిందన్నారు. ఈ విషయాల్లో కేటీఆర్‌కు ఎక్కడ, ఎలాంటి అనుమానం ఉన్నా సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకుంటే వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి సమాచారం ఇస్తారని చెప్పారు. బీఆర్‌ఎస్ హయాంలో అయిన రుణమాఫీ రైతులకు వడ్డీలకు సరిపోలేదని ఎద్దేవా చేశారు. అంబేడ్కర్ పేరుతో జిల్లాకు వచ్చిన కేటీఆర్ ఆయన గురించి చెప్పకుండా తన గురించి, సీఎం రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కేటీఆర్ అబద్ధాలు చెబుతున్నారని టీఆర్‌ఆర్ విమర్శించారు.

సమాజాన్ని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు

కేటీఆర్, హరీశ్‌రావుపై భువనగిరి కాంగ్రెస్ ఎమ్మెల్యే కుంభం ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: ప్రతి విషయంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ మాయమాటలు చెప్పి తెలంగాణ సమాజాన్ని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, తెలంగాణలో రియల్ ఎస్టేట్ పడిపోయిందని అపోహలు సృష్టిస్తున్నారని భువనగిరి కాంగ్రెస్ ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం ఆయన సీఎల్పీ మీడియా సెంటర్‌లో విలేకరులతో మాట్లాడారు. గత రెండు, మూడు నెలలుగా రియల్ ఎస్టేట్ బాగా కోలుకుందని, రిజిస్ట్రేషన్లు పెరిగాయని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డిపైన అక్కసుతోనే బద్నాం చేస్తున్నారని, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కోకాపేటలో ఎకరం రూ. 100 కోట్లతో కొనుగోలు చేయించి హైప్ క్రియేట్ చేసిందని ఆయన ఆరోపించారు. బీఆర్‌ఎస్ హయాంలో హైదరాబాద్‌లోని సగం చెరువులు మాయమయ్యాయని, అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రాను తీసుకొచ్చిందని అనిల్‌కుమార్ తెలిపారు.

ఎమ్మెల్యేలు కలవడం సహజమే..

ఎమ్మెల్యేలు కలవడం సహజమేనని, గతంలో కూడా అనేకసార్లు మేం కలిశామని అనిల్‌కుమార్ తెలిపారు. తాము ముఖ్యమంత్రి ఇస్తున్న నిధులతో సంతోషంగా ఉన్నామన్నారు.

ఉపముఖ్యమంత్రితో రాష్ట్ర బీసీ కమిషన్ బృందం భేటీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ బృందం సోమవారం సచివాలయంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతో భేటీ అయింది. రాష్ట్రవ్యాప్తంగా పది ఉమ్మడి జిల్లాల కేంద్రంగా పర్యటనలు పూర్తి చేసి క్షేత్రస్థాయి నుంచి వివిధ అంశాల్లో వినతులు స్వీకరించిన అంశాన్ని డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లింది. కొన్ని కులాలకు సంబంధించి పేర్ల మార్పు కోరుతూ పలు వినతులు వచ్చాయని, వాటిని పరిశీలించిన అనంతరం నోటిఫికేషన్ జారీ చేసిన విషయాన్ని కూడా వివరించింది. అంతేకాకుండా బీసీ కమిషన్‌కు మరిన్ని అధికారాలు కల్పిస్తూ చట్టసవరణ చేయాల్సిన అంశాన్ని కూడా ప్రస్తావించింది. ఈ అంశంపై పూర్తిస్థాయిలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు డిప్యూటీ సీఎం వారికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి తదితరులున్నారు.

కులగణనపై కాకిలెక్కలు

రిజర్వేషన్ ప్రక్రియ తేలాకే ఎన్నికలు నిర్వహించాలి: ఎమ్మెల్సీ కవిత



పెద్దపల్లిలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

కరీంనగర్/పెద్దపల్లిరూరల్: కులగణన, జనాభా లెక్కలపై కాంగ్రెస్ ప్రభుత్వం కాకి లెక్కలు చెబుతోందని, కామారెడ్డి డిక్లరేషన్‌కు కట్టుబడి ప్రస్తుత జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు కల్పించి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. కులగణన, జనాభా లెక్కలు పొంతన లేకుండా ఉన్నాయన్నారు. ఓసీల జనాభా పెరిగినట్టు చూపుతున్న ప్రభుత్వం.. బీసీల జనాభా తగ్గించి చూపడం ఏమిటని ప్రశ్నించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణలో 83 లక్షల ఇళ్లు, జనా భా 3 కోట్ల 50 లక్షలు ఉన్నట్టు గతంలో తేలిందని గుర్తు చేశారు. 2014లో తెలంగాణ ఏర్పడ్డాక కేసీఆర్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సర్వేలో కోటి 3 లక్షల ఇళ్లు, 3 కోట్ల 68 లక్షల జనాభా ఉన్నట్టు తేలాయన్నారు. 2014 నుంచి 2024 వరకు పదేళ్లలో ఎన్ని ఇళ్లు, ఎంత జనాభా ఉండాలో లెక్కలేస్తే అర్థమవుతుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కులగణనతో కోటి 15 లక్షలు ఇళ్లు ఉన్నాయని, జనాభా 3 కోట్ల 70 లక్షలు ఉన్నాయని నివేదికలో పొందుపర్చారన్నారు.

సింగరేణి సొమ్ముతో సీఎం నియోజకవర్గ అభివృద్ధి

సింగరేణి సంస్థ సొమ్ముతో సీఎం రేవంత్‌రెడ్డి తన కొడంగల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుంటున్నారని కవిత ఆరోపించారు. రాఘవాపూర్‌లోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ కేంద్రం నుంచి నిధులు రాబట్టుకోవడం కూడా సీఎంకు చేతకావడం లేదని ఎద్దేవా చేశారు. మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో దుర్మార్గపు పాలన సాగుతోందన్నారు. జెడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధుకర్, మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కులగణన పేరుతో ద్రోహం

రాష్ట్ర ప్రభుత్వంపై బీసీ మేధావుల ఆగ్రహం



అభివాదం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

పంజగుట్ట(హైదరాబాద్): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనలో బీసీల జనాభా తగ్గడం, ఓసీల జనాభా పెరగడం దారుణమని బీసీ మేధావులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కులగణన పేరుతో రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు ద్రోహం చేసిందని, చెప్పిన లెక్కలన్నీ కాకి లెక్కలని, రెడ్ల పాలనలో బీసీలను సామాజికంగా, రాజకీయంగా అణచివేసేందుకు చేస్తున్న కుట్రలని ఆరోపించారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ మేధావుల ఫోరం, బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయా సంఘాల అధ్యక్షులు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు, జాజుల శ్రీనివాస్‌గౌడ్‌లు మాట్లాడారు. 2014లో 51 శాతమున్న బీసీలు.. 2024లో 46 శాతానికి ఎలా తగ్గారని ప్రశ్నించారు. అదే సమయంలో అగ్రకులాల జనాభాను సుమారు 16 లక్షలకు పెంచుకున్నారని ఇది కేవలం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కాపాడుకోవడంలో భాగంగా జరిగిన కుట్రే అన్నా రు. బీసీ సబ్‌కమిటీ ఇన్‌చార్జ్‌గా భట్టి విక్రమార్క లేదా బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉండాలి కాని ఉత్తమ్ ఎలా ఉంటారని ప్రశ్నించారు. కులగణన పేరుతో జరిగిన కుట్రలపై మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా అంబేడ్కర్, పూలే విగ్రహాల వద్ద నిరసన వ్యక్తం చేస్తామని, 5వ తేదీన హైదరాబాద్‌లో బీసీ మేధావులతో సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు.

కులగణన వివరాలన్నీ వెబ్‌సైట్‌లో పెడతాం

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



సాక్షి, హైదరాబాద్: కులగణనకు సంబంధించిన అన్ని అంశాలను వెబ్‌సైట్‌లో పెడతామని, అనుమానం ఉన్న వారెవరైనా ఆ వివరాలను చూసుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ చెప్పారు. గతంలో ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా సామాజిక వర్గాల వారీ లెక్కలను వెల్లడించే ధైర్యం చేయలేదని, కులగణనను విజయవంతంగా పూర్తి చేసినందుకు మైనార్టీ, ఎస్సీ, ఎస్టీల సలహాదారుడిగా సీఎం, మంత్రులకు అభినందనలు చెప్తున్నానని తెలిపారు. సోమవారం గాంధీభవన్‌లో షబ్బీర్ అలీ విలేకరులతో మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలనేది రాహుల్‌గాంధీ ఆలోచన అని, ఆ ఆలోచన మేరకు రాష్ట్రంలో సర్వేను పూర్తి చేసి ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకున్నామని చెప్పారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

PRATHIBHA DEGREE & P.G.COLLEGE
(Co-Ed.) College Code : 11161 (Affiliated to O.U)
Opp.BJP Office, Metro Pillar No.814, KUKATPALLY, HYD-72.
WANTED PRINCIPAL / LECTURERS
• COMPUTER SCIENCE • SANSKRIT • ENGLISH • HINDI
• STATASTICS • ELECTRONICS • PHYSICS • HISTORY
• COMMERCE • TELUGU • MATHS • POLITICAL SCIENCE
Contact : 9618254567 Eligibility : 5 Yrs.Exp. & P.G.55%
Send your resume with in one week
Email: prathibhadegreecolleges@gmail.com





మనకు ఏమున్నదో అరుదుగా ఆలోచిస్తాం,
కానీ మనకు ఏం లేదో నిరంతరం మథనపడతాం.
– ఆర్థర్ షోపెన్‌హావర్

సాక్షి

మంగళవారం, 4 ఫిబ్రవరి 2025

అగ్రరాజ్యపు వాణిజ్య యుద్ధం

అగ్రరాజ్యం కొత్త యుద్ధానికి తెర తీసింది. అయితే, ఇది ఆయుధాలతో కూడిన యుద్ధం కాదు... ఆర్థికపరమైన యుద్ధం. అధ్యక్షుడు ట్రంప్ తన అత్యవసర అధికారాలను ఉపయోగిస్తూ... కెనడా, మెక్సికోల నుంచి దిగుమతులపై 25 శాతం మేర, అలాగే చైనా నుంచి దిగుమతులపై ఇప్పటికే ఉన్న భారానికి అదనంగా మరో 10 శాతం మేర సుంకాలు విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. కెనడా నుంచి దిగుమతి చేసుకొనే చమురు, సహజ వాయువుపై మాత్రం 10 శాతం వడ్డింపుతో సరి పెట్టారు. ఇది అమెరికాకూ, దాని అతి పెద్ద వాణిజ్య భాగస్వామ్య దేశాలు మూడింటికీ మధ్య వాణిజ్య యుద్ధాల శకానికి శ్రీకారం చుట్టింది. చైనాను పక్కనబెట్టినా, సాక్షాత్తూ పొరుగుదేశాలపైనే ట్రంప్ ఇలా ఆర్థికంగా కత్తి దూయడం విడ్డూరమే. అదేమంటే... పెరుగుతున్న నేరాలనూ, డ్రగ్స్ సరఫరానూ అడ్డుకోవడానికే ఈ చర్య అంటూ సమర్థించుకోవడం మరీ విచిత్రం. ఈ సంచలనాత్మక చర్యకు ప్రతిచర్యగా మెక్సికో సైతం ఎదురు సుంకాలు వేయగా, త్వరలో జాతీయ ఎన్నికలున్న కెనడా కూడా అమెరికాకు దీటుగా 25 శాతం సుంకాల వడ్డింపుతో ఎదురుదాడికి దిగింది. అమెరికా తప్పుడు విధానాలపై ప్రపంచ వాణిజ్య సంస్థలో కేసు వేయనున్నట్టు చైనా ప్రకటించింది. కడపటి వార్తలు అందుతున్న సమయానికి అమెరికా – మెక్సికోల మధ్య మాత్రం సయోధ్య కుదురుతోందనీ, ఆ దేశంపై సుంకాలను అమెరికా నెల రోజులు వాయిదా వేసిందనీ సమాచారం. ఆ మాట ఏమైనా, విశ్వవేదికపై ట్రంప్ ఆరంభించిన వాణిజ్య పోరు రసకందాయంలో పడింది.

ఇప్పటికే పరాయి దేశాలకు 36 లక్షల కోట్ల డాలర్ల మేర అప్పులున్న అగ్రరాజ్యం వాటి నుంచి బయటపడేందుకు సుంకాలు పెంచినట్టనిపిస్తున్నా, ఇది ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు స్వయంకృత గాయమే. పెరిగిన సుంకాలతో అమెరికాకు సరఫరా తగ్గి, సరుకుల ధరలు పెరిగి, సామాన్యులపై భారం పడుతుంది. ఈ సుంకాల వల్ల ఈ ఏడాది అమెరికాలో ద్రవ్యోల్బణం ఇప్పు డున్న 2.9 శాతం నుంచి మరో అర శాతం దాకా పెరుగుతుందట. ఇక, స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) 1.5 శాతం మేర పడిపోతుందని విశ్లేషణ. సగటు అమెరికన్ కుటుంబంపై ఏటా వెయ్యి నుంచి 1200 డాలర్ల మేర భారం పడుతుందని లెక్క. మొత్తం మీద అక్రమ వలసలు, ఫెంటానిల్ తరహా మందుల లాంటి ప్రధాన సమస్యలపై ట్రంప్ దృష్టి పెట్టడం బానే ఉన్నా, దిగుమతి సుంకాలు పెంచడమనే తప్పుడు విధానం వల్ల అమెరికన్లకే నష్టమనే భావన ఉంది. సరుకుల ధరలు తగ్గిస్తానని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన ట్రంప్ తీరా అందుకు వ్యతిరిక్తంగా వ్యవహరిస్తున్నా రని ప్రతిపక్ష డెమోక్రాట్లు ధ్వజమెత్తుతున్నారు. గత ట్రంప్ హయాంలోని చైనాతో వాణిజ్య యుద్ధాన్నే తమ పాలనలో కొనసాగించిన డెమోక్రాట్లు ఇప్పుడు భిన్న వైఖరి తీసుకుంటారేమో చూడాలి.

ప్రధాన ఆర్థిక వ్యవస్థలపై ఇంతగా సుంకాల విధింపు ఆలోచనను దశాబ్దం క్రితం చేస్తే దాన్ని వెర్రిమొర్రి ఆలోచనగా చూసేవారు. కానీ, ప్రపంచంలోని అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు ఆ పనే చేసింది. మెక్సికో, కెనడా, చైనాలతో ఇది ఆగుతుందా, లేక రానున్న రోజుల్లో యూరోపియన్ యూనియన్, భారత్ సహా ఇతర దేశాలపైనా ట్రంప్ ఈ అస్త్రం ప్రయోగిస్తారేమో చూడాలి. నిజానికి, వలసలను ఆపి, అధిక దిగుమతులకు ముకుతాడు వేయాలంటే, తగినంత సమయం వెచ్చించి, విధానపరమైన అంశాలపై లోతుగా దృష్టి పెట్టాలి. వలసజీవుల్ని పెద్దయెత్తున వెనక్కి పంపడంతో అమెరికాలో చౌకగా దొరికే శ్రామికులు తగ్గి, వేతనాలు పెరిగి, ద్రవ్యోల్బణం హెచ్చుతుంది. కానీ, ఎవరు చెప్పినా ఒక పట్టాన వినే ఘటం కాని ట్రంప్ సమస్త వాణిజ్య, ఆర్థికేతర సమస్యలకూ ఈ సుంకాల విధింపే సర్వరోగ నివారిణి అని భావిస్తున్నారు. చమురు మొదలు సరుకుల దాకా ఏవీ పొరుగుదేశాల నుంచి అమెరికాకు అక్కర్లేదని హుంకరిస్తున్నారు కానీ, దిగుమతులేవీ చేసుకోకుండా, సమస్తం స్వదేశంలోనే సిద్ధం చేసుకొని, ఎవరితోనూ ఏ వాణిజ్య సంబంధాలూ అవసరం లేని బంధిత ఆర్థిక వ్యవస్థగా అమెరికాను తీర్చిదిద్దడం సాధ్యమేనా? దేశాల ద్వారాలన్నీ తెరుచుకొని, ప్రపంచమొక కుగ్రామంగా మారిన వర్తమాన కాలంలో ఈ రకమైన విధానంతో మనగలగడం అగ్రరాజ్యానికైనా సరే కుదురుతుందా?

ట్రంప్ తాజా చర్యతో ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితి, గందరగోళం నెలకొన్నాయి. ప్రపంచ మంతటా దీని ప్రకంపనలూ తప్పవు. భారత్ అనేక విడిభాగాల కోసం దిగుమతులపై ఆధారపడి నందున మన వస్తూత్పత్తి రంగం పైన, అలాగే డాలర్ బలపడి, విదేశీ మదుపరులు విక్రయాల్ని కొనసాగించడంతో మార్కెట్ పైన ప్రభావం కనిపించనుంది. అలాగే, అమెరికా భారీ సుంకాల బారిన పడ్డ ఆర్థిక వ్యవస్థలు ఇక తమ వస్తువుల్ని ఇతర దేశాల్లో కుమ్మరించాలి గనక భారత పరిశ్రమలకు బెత్తం చూపే ప్రమాదం ఉంది. కాబట్టి, ఇప్పటికైతే సుంకాల విధింపు జాబితాలో మన పేరు లేకున్నా భారత్ తగిన జాగరూకతతో వ్యవహరించాలి. ఈ నెలలోనే అమెరికాలో పర్యటించ నున్న భారత ప్రధాని ఇరుదేశాల బలమైన బంధాన్ని మనకు సానుకూలంగా మలుచుకోవాలి. అయితే, ఒకటి మాత్రం నిజం. కోర్టులు బరిలోకి దిగి, ఇవన్నీ రాజ్యాంగ విరుద్ధమని తీర్మానిస్తే తప్ప... ప్రజాభిమతంతో గద్దెనెక్కిన ట్రంప్ ఆలోచనలకూ, అనుసరించే విధానాలకూ అడ్డులేదు. కనుక ట్రంప్ మార్కు వ్యవహారశైలికి ఇవాళ్టికి ఇవాళ బ్రేకులు పడవు. అదేసమయంలో దిగుమతి సుంకాల వల్ల అమెరికా సంపద్వంతమై, బలోపేతమవుతుందన్న ఆయన ఆలోచన మాత్రం ఆచరణలో వాస్తవరూపు దాల్చడమూ కష్టమే!

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** శు.షష్ఠి ఉ.7.54 వరకు, తదుపరి సప్తమి తె.5.30 వరకు (తెల్లవారితే బుధవారం), **నక్షత్రం:** అశ్విని రా.12.58 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** రా.9.16 నుండి 10.44 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.52 నుండి 9.40 వరకు, తదుపరి రా.11.01 నుండి 11.49 వరకు, **అమృత ఘడియలు:** సా.6.15 నుండి 7.56 వరకు, రథసప్తమి.

సూర్యోదయం : 6.36
సూర్యాస్తమయం: 5.53
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచే మద్యం

సందర్భం



దినేశ్ సి. శర్మ

ఒక నూతన ఆరోగ్య హెచ్చరికతో ఈ నూతన సంవత్సరం మొదలైంది. మద్యం సేవించడం, క్యాన్సర్ ప్రమాదం పెరగడం మధ్య ప్రత్యక్ష సంబంధం ఉందంటూ అమెరికా సర్జన్ జనరల్ వివేక్ మూర్తి ఒక ప్రకటనను విడుదల చేశారు. అమెరికాలో క్యాన్సర్‌ను ప్రేరేపించగల మూడో ప్రధాన కారణం ఆల్కహాల్ వినియోగం. ఏ రకమైన ఆల్కహాల్ తీసుకున్నా, అది కనీసం ఏడు రకాల క్యాన్సర్ల (రొమ్ము, పెద్దపేగు, అన్నవాహిక, కాలేయం, నోటి కుహరం, గొంతు, స్వరపేటిక) వచ్చే ప్రమాదాన్ని పెంచుతుందని ఆ ప్రకటన తెలిపింది. అమెరికాలో 16.4 శాతం రొమ్ము క్యాన్సర్ కేసులు ఆల్కహాల్ వినియోగం వల్లే సంభవిస్తున్నాయి. రొమ్ము, నోరు, గొంతు వంటి కొన్ని క్యాన్సర్ల విషయంలో, 'రోజుకు ఒకటి లేదా అంతకంటే తక్కువసార్లు మద్యం సేవించడం వల్ల కూడా క్యాన్సర్ వచ్చే ప్రమాదం పెరగవచ్చు' అని సలహాదారు హెచ్చరిస్తున్నారు. తక్కువ మొత్తంలో మద్యం సేవించడం కూడా కాలేయ మచ్చలు (లివర్ సిర్రోసిస్) వంటి దీర్ఘకాలిక వ్యాధులకు దోహదం చేస్తుంది. అయితే, మద్యం సేవించడం వల్ల ఒక వ్యక్తికి క్యాన్సర్ వచ్చే ప్రమాదం అనేక జీవ, పర్యావరణ, సామాజిక అంశాలపై ఆధారపడి ఉంటుంది.

ఎంత తక్కువైనా రిస్కే!


శాస్త్రీయ ఆధారాలకు సంబంధించిన క్రమబద్ధమైన మూల్యాంకనం ఆధారంగా, మద్యం సేవించడం వల్ల కలిగే ప్రమాదాలు, హానిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) 2023 ప్రకటనను అనుసరించి ఈ సలహా ఇవ్వడమైంది. మద్యం నేరుగా ప్రమాదకరమైన వ్యాధిని కలిగిస్తుంది. మద్యం గణనీయంగా రోడ్డు ప్రమాదాలకు కారణమవుతుంది. 'ద లాన్సెట్ పబ్లిక్ హెల్త్'లో ప్రచురితమైన ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటన, 'మద్యం వినియోగం విషయానికి వస్తే, ఆరోగ్యాన్ని ప్రభావితం చేయనంతటి తక్కువ మోతాదు అనేది లేనే లేదు' అని పేర్కొంది.

'ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ క్యాన్సర్' సంస్థ, ఆల్కహాల్‌ను 'గ్రూప్ 1 కార్సినోజెన్'గా 1980లలో వర్గీకరించింది. ఇది పొగాకు, రేడియేషన్, ఆస్బెస్టాస్ వంటి క్యాన్సర్ కలిగించే పదార్థాలలో అత్యంత ప్రమాదకరమైన కేటగిరీ. ఇథనాల్ శరీరంలో ఇంకిపోవడం వల్ల జీవసంబంధమైన విధానాలు క్యాన్సర్‌కు కారణమవుతాయి. అందువల్ల, ఆల్కహాల్ కలిగిన ఏ పానీయం... అది బీర్, వైన్ లేదా విస్కీ ఏదయినా ఆరోగ్యానికి హాని చేస్తుంది.

ఏ రకమైనా హానికరమే!

కొన్ని ఆల్కహాల్ పానీయాలను, ముఖ్యంగా రెడ్ వైన్‌ను మితంగా తీసుకుంటే ఆరోగ్యానికి మేలు జరుగుతుందనే అపోహను ఈ ఆధారాలు బద్దలు కొడుతున్నాయి. దశాబ్దాలుగా, మద్య పరిశ్రమ కార్డియాలజిస్టులను ప్రోత్సహించి, మితంగా వైన్ తీసుకోవడం గుండె ఆరోగ్యానికి మంచిదనే భావనను ప్రచారం చేస్తోంది. అలాంటి వాదనలకు ఎటువంటి విశ్వసనీయ శాస్త్రీయ అధ్యయనమూ లేదని గ్రహించాలి.

మరోవైపు, డబ్ల్యూహెచ్‌ఓ యూరోపియన్ ప్రాంతం నుండి వచ్చిన డేటా ప్రకారం, ఆల్కహాల్ వల్ల వచ్చే క్యాన్సర్లలో సగం వరకు, సాధారణంగా వారానికి ఒక బాటిల్ వైన్ లేదా రెండు బాటిళ్ల బీర్ వంటి 'తేలికపాటి', 'మితమైన' వినియోగం వల్ల సంభవిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, గుండె జబ్బులు లేదా మధుమేహంపై తేలికపాటి, మితమైన మద్యపానం వల్ల కలిగే ప్రయోజనకరమైన ప్రభావాలను గురించి తెలిపే అధ్యయనాలు లేవు. 'మీరు ఎంత ఎక్కువ తాగితే అంత హానికరం అని మేము కచ్చితంగా చెప్పగలం. మరో మాటలో చెప్పాలంటే, మీరు ఎంత తక్కువ తాగితే అంత సురక్షితం' అని ప్రపంచ ఆరోగ్య సంస్థలోని ఆల్కహాల్, అక్రమ మాదకద్రవ్యాల నిపుణురాలు కరీనా ఫెర్రీరా –బోర్జెస్ అన్నారు.



నేడు ప్రపంచ క్యాన్సర్ డే

బడ్జెట్‌లో క్యాన్సర్

- ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన కేంద్ర వార్షిక బడ్జెట్‌లో, దేశంలోని ప్రతి జిల్లాలోనూ క్యాన్సర్ కేర్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్టు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. పేషెంట్లు దూర ప్రయాణాలు చేయనక్కరలేకుండా, ఆరోగ్య సేవల అందుబాటులోని అంతరాన్ని ఇవి పూడ్చనున్నాయి.
- క్యాన్సర్, అరుదైన వ్యాధులు, ఇతర దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారికి ఉపశమనం కలిగించేందుకుగానూ వారు వాడే ఔషధాలపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీకి పూర్తిగా మినహాయింపు నిచ్చారు. 36 రకాల ప్రాణావసర ఔషధాలకు ఈ మినహాయింపు వర్తిస్తుందని బడ్జెట్‌లో ప్రతిపాదించారు.
- 'ఐసీఎంఆర్ – నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ ఇన్ఫోమేటిక్స్ అండ్ రీసెర్చ్' ప్రకారం, పురుషుల్లో పెదవి, నోటి క్యాన్సర్లు ఎక్కువగా ఉన్నట్టు తేలుతున్నాయి. మహిళల్లో రొమ్ము క్యాన్సర్ అధికంగా ఉంటోంది.

హెచ్చరికలు మేలు చేస్తాయా?

ఒక వస్తువు వల్ల ప్రభుత్వాలకు గణనీయమైన ఆదాయం వస్తుందని శాస్త్రీయ ఆధారాలు ఉన్నప్పుడు, ఆ వస్తువు ద్వారా కలిగే హానిని తగ్గించడానికి ఉన్న ఎంపికలు ఏమిటి? డబ్ల్యూహెచ్‌ఓ చేసిన ఆల్కహాల్ ప్రకటన అందుబాటులో ఉన్న శాస్త్రీయ ఆధారాలను ఎత్తిపడుతోంది. అలాగే అందుబాటులో ఉన్న విధాన ఎంపికలను కూడా ప్రభుత్వాలకు అందిస్తోంది. ప్రభుత్వాలు వాటిపై చర్య తీసుకోవలసి ఉంటుంది. మద్యం వినియోగాన్ని తగ్గించడానికి అత్యంత స్పష్టమైన మార్గాలలో ఒకటి ఏమిటంటే, మద్యం సీసాలపై హెచ్చరిక లేబుళ్ల ద్వారా, కలగనున్న హాని గురించి జనానికి అవగాహన కల్పించడం. అమెరికా, కొన్ని యూరోపియన్ దేశాలు ఏమి చేయాలని వివేక్ మూర్తి సూచించిన చర్యలలో ఇది ఒకటి. క్యాన్సర్ ప్రమాదాన్ని లెక్కించడానికి మద్యం వినియోగంపై మార్గ దర్శకాల పరిమితులను తిరిగి నిర్వచించాలని కూడా మూర్తి పిలుపునిచ్చారు.

వివిధ దేశాలు పరిశీలిస్తున్న హెచ్చరిక లేబుల్స్ అనేక రకాలుగా ఉన్నాయి. ఆరోగ్యానికి సాధారణ హాని; అధిక వినియోగం, దుర్వినియోగం వల్ల కలిగే హాని; నిర్దిష్ట సమూహాలకు అంటే తక్కువ వయస్సు గలవారు, గర్భిణులు మొదలైన వారికి వ్యతిరేకంగా సందేశాలు వీటిలో కొన్ని. ఉదాహరణకు, 2026లో ఐర్లాండ్ ప్రవేశపెట్టాలని భావిస్తున్న హెచ్చరికలో, 'మద్యం తాగడం వల్ల కాలేయ క్యాన్సర్ వస్తుంది' అని ఉంది. 2019లో, భారతదేశం హార్డ్ లిక్కర్‌కు 'మద్యం సేవించడం ఆరోగ్యానికి హానికరం' అనీ, తక్కువ ఆల్కహాల్ పానీయాలకు 'సురక్షితంగా ఉండండి, తాగి వాహనం నడపవద్దు' అని చెప్పే సాధారణ హెచ్చరికలను తప్పనిసరి చేసింది.

- 'మద్యం వినియోగంలో ఆరోగ్యాన్ని ప్రభావితం చేయనంతటి తక్కువ మోతాదు అనేది లేనే లేదు' అని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది.
- ఏ రకమైన మద్యం తీసుకున్నా, అది కనీసం ఏడు రకాల క్యాన్సర్ల (రొమ్ము, పెద్దపేగు, అన్నవాహిక, కాలేయం, నోరు, గొంతు, స్వరపేటిక) ప్రమాదాన్ని పెంచుతుంది.
- మద్యం ఉత్పత్తులపై హెచ్చరిక లేబుళ్లు అనేక విధాలుగా ఉపయోగకరంగా ఉన్నాయని 'ద లాన్సెట్' సమీక్ష తెలియజేస్తోంది.

ఇండియా ఇంకా చేయాల్సిందేమిటి?

భారతదేశంలో హెచ్చరిక లేబుళ్లతో పాటు, ఆల్కహాల్ మార్కెటింగ్‌పై పరిమితులు కూడా అమలులో ఉన్నాయి. వార్తా పత్రికలు, రేడియో, టీవీల్లో ఆల్కహాల్ ప్రకటనలను నిషేధించారు. అయితే ప్రకటనల నిబంధనలలోని లొసుగులను వాడుకుంటూ వాటిపై ప్రకటనలు మరో రూపంలో కొనసాగుతున్నాయి. ఇటీవలి సంవత్సరాలలో, సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా రహస్య ప్రకటనలు కొత్త సవాళ్లను కలిగిస్తున్నాయి.

పొగాకు లేబుళ్లపై హెచ్చరికల మాదిరిగానే, మద్య పరిశ్రమ, పరిశ్రమ అనుకూల సమూహాలు ఆరోగ్య హెచ్చరిక లేబుళ్లు మద్య వినియోగాన్ని తగ్గించడంలో పెద్దగా ఉపయోగపడవని వాదిస్తున్నాయి. కానీ, 'ద లాన్సెట్'లో ప్రచురితమైన ఇటీవలి సమీక్షలో నివేదించినట్లుగా, మద్య ఉత్పత్తులపై హెచ్చరిక లేబుళ్లు అనేక విధాలుగా ఉపయోగకరంగా ఉన్నాయని ఆధారాలు ఎత్తి చూపుతున్నాయి. అవి మద్య సంబంధిత హానిపై అవగాహన పెంచుతాయి, మద్యం వాడకాన్ని సాధారణీకరించకుండా దోహదం చేస్తాయి. పైగా ప్రజలు సరైన నిర్ణయాలు తీసుకోవడంలో సహాయపడతాయి. తద్వారా ప్రజారోగ్యాన్ని ప్రోత్సహిస్తాయి. హెల్త్ లేబుల్స్ ప్రభావం వాటి రూపకల్పనపై, కంటెంట్‌పై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతానికైతే, ఆరోగ్య హెచ్చరిక లేబుల్స్‌కు ప్రామాణీకరణ లేదు. అంతేకాకుండా వాటి కంటెంట్ చాలా సాధారణమైనది. ఇది వినియోగదారులు ఒక అవగాహనకు రావడానికి ఉపయోగపడకపోవచ్చు.

దాదాపు ఐదేళ్లుగా భారతదేశం మద్యం ఉత్పత్తులకు సంబంధించిన హెచ్చరిక లేబుళ్లపై నిబంధనలను అమలు చేస్తోంది. ఇది ఎంత ప్రభావవంతంగా ఉందో మనకు ఇంకా తెలియదు. హెచ్చరిక సందేశాల రూపకల్పన, కంటెంట్, వాటిపై వినియోగదారుల అభిప్రాయానికి సంబంధించి మనకు నిరంతర పరిశోధన అవసరం. పొగాకు ఉత్పత్తుల్లో ఆరోగ్య హెచ్చరికలు ప్యాకేజింగ్‌లో మంచి జాగాతో వివరణాత్మకంగా ఉంటాయి. దీనికి భిన్నంగా మద్యం సీసాలపై హెచ్చరికలు చిన్న స్థలాన్ని ఆక్రమిస్తాయి, అస్పష్టంగా ఉంటాయి. ఆరోగ్య హెచ్చరికలతో పాటు, హైవేలపై మద్యం అమ్మకాల నియంత్రణ, తక్కువ వయస్సు గల వినియోగదారులకు అమ్మకాలను అరికట్టడం, తాగి వాహనం నడపడం వంటి అదనపు చర్యలను మరింత కఠినంగా అమలు చేయాలి.

భారతదేశంలో ఆరోగ్య సంబంధమైన, ఇతర నిబంధనలను నిలిపివేయడానికి నిరంతరం ప్రయత్నిస్తున్న పరిశ్రమ లాబీల నుండి జాగ్రత్త వహించడం చాలా ముఖ్యం. మద్యం వల్ల కలిగే ఆరోగ్య సంరక్షణ పెను భారాన్ని తగ్గించడానికి వివేక్ మూర్తి వంటి మరింత మంది ప్రజారోగ్య ఛాంపియన్లు అవసరం. క్యాన్సర్‌కీ పొగాకుకీ ఉన్న సంబంధంపై మొదటి హెచ్చరిక కూడా 1964లో ఒక సర్జన్ జనరల్ నుండే వచ్చిందని గుర్తుంచుకోండి.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

వీళ్లా వక్తలు?



సాంకేతిక పరిజ్ఞానంలో మనం ఎప్పటికీ అమెరికా, చైనాలను ఢీకొట్టలేమని నాకు అర్థమైపోయింది. ఆసియాలోనే అతి పెద్ద కృత్రిమ మేధ ఈవెంట్ ఏదో ముంబయిలో ఈ నెలాఖరున జరగనుంది. ఇందులో వక్తలు బాలీవుడ్ సెలబ్రిటీలు, క్రికెటర్లు, యూట్యూబ్ ఇన్‌ఫ్లుయెన్సర్లు. వీళ్లంతా తమ జీవితంలో ఒక్క లైన్ కోడ్ రాయనివాళ్లు. నిజమైన ఏఐ సృజన అనేది పరిశోధకులు, ఇంజినీర్లు, ఫౌండర్ల ద్వారా జరుగుతుంది. టెక్నాలజీ అనేది వినోద క్రీడ కాదు.
– దిలీప్ కుమార్, ఇన్వెస్టర్

గౌరవనీయుడు



కశ్మీరీ శైవంగా కూడా పిలిచే త్రిక, తంత్ర మార్గాలకు దారిచూపిన ఇంగ్లీష్ ఇండాలజిస్ట్ డాక్టర్ మార్క్ ఎస్.జి. డిజ్‌కౌస్కీ వెళ్లిపోయారు (ఫిబ్రవరి 3న). 1988 అక్టోబర్‌లో ఆయన ఇదే అంశం మీద బెనారస్ హిందూ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన సదస్సుకు నేను ఇండియా వచ్చినప్పుడు ఆయన్ని కలిశాను. ఆయనకు నివాళి.
– కోయెన్రాడ్ ఎల్స్ట్, ఫ్లెమిష్ (బెల్జియం) రచయిత

మన స్థాయి



ఒక రోజులో ఎన్నిసార్లు ఐఆర్‌సీటీసీ, జీఎస్టీ సర్వర్లు డౌన్ అవుతాయో ఎవరైనా లెక్కించారా? కృత్రిమ మేధ సంగతి తర్వాత, ముందయితే ఈ ప్రాథమిక విషయాలు సరి చేసుకుందాం.
– శ్రుతీ చతుర్వేది, ఆంట్రప్రెన్యూర్

గ్రీన్‌ల్యాండ్ స్వాధీనం?



నా అంచనా: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పనామా కాలువ నియంత్రణను తమ అధీనంలోకి తెచ్చుకుంటారు. గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకుంటారు. మొదటిది, బలవంతంగా; రెండోది, బహుశా ఒప్పందం ద్వారా.
– స్టాన్లీ జానీ, జర్నలిస్ట్

ధర తగ్గదా?



ఇథనాల్ అనేది పెట్రోల్ కన్నా 50 శాతం చౌక. పెట్రోల్‌తో ఇథనాల్‌ను కలిపినప్పుడు, దాని ధర ఎందుకు తగ్గడం లేదు?
– మనోజ్ అరోరా, పర్యావరణవేత్త

ఇన్ బాక్స్

దైవకణాల పరిశోధకుడు

ప్రఖ్యాత భారతీయ భౌతిక శాస్త్రవేత్తల్లో పద్మవిభూషణ్ సత్యేంద్రనాథ్ బోస్ ఒకరు. కలకత్తాలో 1894 జనవరి 1న జన్మించి ప్రపంచ ప్రఖ్యాతి గాంచారు. విశ్వ సృష్టికి సంబంధించిన దైవ కణాల పరిశోధన వెనక సత్యేంద్ర నాథ్ బోస్ కృషి చాలా ఉంది. ప్రాథమిక కణాల (దైవకణాల)పై ఐన్‌స్టీన్‌తో కలిసి సమర్పించిన అధ్యయన ఫలితాలను ప్రస్తుతం 'బోస్–ఐన్‌స్టీన్ స్టాటిస్టిక్స్'గా పరిగణిస్తున్నారు.

బోస్ సంప్రదాయ భౌతికశాస్త్రం గురించి ప్రస్తావించకుండా, ఒకేలా ఉండే కణాలతో గణన స్థితుల అద్భుతమైన మార్గం ద్వారా ప్లాంక్ యొక్క క్వాంటం వికిరణాల నియమాన్ని ఉత్పాదించి ఒక పరిశోధనా పత్రాన్ని రాశారు. దానిని నేరుగా జర్మనీలోని ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌కు పంపారు. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ ఆ పరిశోధనా పత్రం ప్రాముఖ్యాన్ని గుర్తించి, దానిని జర్మన్ భాషలోకి అనువదించారు. దానిని బోస్ తరఫున ప్రతిష్ఠాత్మక 'జీట్స్‌క్రిఫ్ట్ ఫర్ ఫిజిక్'కు సమర్పించారు. ఈ గుర్తింపు ఫలితంగా, బోస్ యూరోపియన్ ఎక్స్–రే, క్రిస్టల్లాగ్రఫీ ప్రయోగశాలల్లో రెండు సంవత్సరాలు పని చేయగలిగారు. ఈ సమయంలో అతను లూయిస్ డి బ్రోగ్లీ, మేరీ క్యూరీ, ఐన్‌స్టీన్‌లతో కలిసి పనిచేశారు. వీరు ప్రతిపాదించిన కణాల ఆధారంగానే తర్వాతి కాలంలో దైవకణానికి సంబంధించిన సిద్ధాంతాలు పుట్టుకొచ్చాయి. విజ్ఞాన శాస్త్రానికి ఆయన చేసిన సేవల జ్ఞాపకార్థం, కణ భౌతిక శాస్త్రంలో ప్రాథమిక ఉప పరమాణు కణాలలోని ఒక కణానికి 'బోసాన్స్' అని ఆయన పేరు పెట్టి అరుదైన గౌరవాన్ని అందించారు.



సత్యేంద్రనాథ్ బోస్

బోస్–ఐన్‌స్టీన్ కండెన్సేట్ (బీఈసీ) అనేది చాలా తక్కువ ఉష్ణోగ్రతల వద్ద సంభవించే పదార్థ స్థితి. ఆయన పరిశోధనలు అనేక ఆవిష్కరణలకు దారితీశాయి. మెరుగైన కచ్చితత్వం, స్థిరత్వంతో అత్యంత పొందికైన లేజర్‌లను సృష్టించడానికి బీఈసీలను ఉపయోగించవచ్చు. సూపర్ కండక్టివిటీని అధ్యయనం చేయడంలో సహాయపడతాయి. క్వాంటం కంప్యూటర్ల ప్రాథమిక యూనిట్లు అయిన క్వాంటం బిట్‌లను సృష్టించడానికి ఉపయోగించవచ్చు. గురుత్వాకర్షణ, భ్రమణం, ఇతర భౌతిక పరిమాణాలను కొలవడానికి అత్యంత సున్నితమైన సెన్సార్‌లను సృష్టించడానికి ఉపయోగించవచ్చు. అపూర్వమైన కచ్చితత్వంతో అణు గడియారాలను సృష్టించడానికి ఉపయోగించవచ్చు. ఇది జీపీ, ఇతర నావిగేషన్ వ్యవస్థలను మెరుగుపరుస్తుంది. డీఎన్ఏ వంటి జీవసంబంధమైన అణువుల నిర్మాణాన్ని అర్థం చేసుకోవడం లక్ష్యంగా ఉన్న మందులు, చికిత్సల అభివృద్ధికి దారితీశాయి. ఆయన రూపొందించిన బోస్– ఐన్‌స్టీన్ స్టాటిస్టిక్స్ , బోస్–ఐన్‌స్టీన్ కండెన్సేట్ విషయాలపై పరిశోధనలు చేసినవారికి ఏడు నోబెల్ బహుమతులు రావడం విశేషం.

– మడక మధు; ఉపాధ్యాయుడు, మహదేవపూర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా
(నేడు సత్యేంద్రనాథ్ బోస్ వర్ధంతి)

కాలుష్యంపై కానరాని హామీలు

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు అటు ఆప్, ఇటు బీజేపీలకు ప్రతిష్ఠాత్మకంగా పరిణమించాయి. రెండు పార్టీలూ ఉచిత పథకాలను వాగ్దానం చేయడంలో పోటీపడుతున్నాయి. కాని, కాలుష్యంతో కునారిల్లుతున్న రాజధాని ఢిల్లీ పరిస్థితిని బాగు చెయ్యడంపై ఎటువంటి హామీలూ ఇవ్వకపోవడం గమనార్హం. ప్రధాని నరేంద్ర మోదీ చెబుతున్నట్లు మరో మూడేళ్లలో భారత్ ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగినా, 2047 నాటికి 'వికసిత్ భారత్'గా అభివృద్ధి చెందినా ఇటువంటి రాజధాని నగరంతో అంతర్జాతీయ యవనికపై భారత్ సగర్వంగా నిలబడలేదు. ఒక వంక మురికి కాలువగా మారిపోయిన యమునా నది, ఇంకోవైపు ఎటుచూసినా కనిపించే వ్యర్థపదార్థాలు వంటి ఎన్నో కారణాల వల్ల ఢిల్లీ కాలుష్యం రోజు రోజుకూ పెరిగిపోతూనే ఉంది. రాష్ట్ర ప్రభుత్వం అసమర్థత, వైఫల్యాలను ఈ స్థితి తెలుపుతోంది.



అవినీతి వ్యతిరేక ఉద్యమం నుండి ప్రజాజీవనం ప్రారంభించిన కేజ్రీవాల్ స్వయంగా అవినీతి కేసులో జైలుకు వెళ్లిరావడం, ఆయన సహచరులూ అనేకమంది జైలుపాలు కావడం వల్ల ఆప్ ఆత్మరక్షణలో పడింది. తమ నాయకులపై పెట్టిన కేసులన్నీ రాజకీయ కక్షసాధింపుతో నమోదు చేసినవి అని చెబుతున్నా, ఆ కేసులు న్యాయస్థానాల ముందు నిలబడే అవకాశాలు ఉన్నా, లేకున్నా జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అందుకనే తన రాజకీయ జీవనంలో పెనుసవాల్‌ను కేజ్రీవాల్ ఎదుర్కొంటున్నారు.

2014 నుండి వరుసగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మొత్తం 7 లోక్ సభ సీట్లనూ గెల్చుకుంటున్నప్పటికీ అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీకి పరాజయం తప్పడం లేదు. మీడియాలో సంచలనాలు సృష్టించే నాయకులపై ఆధారపడుతోంది కానీ ఇతర పార్టీల మాదిరిగా క్షేత్రస్థాయిలో జనం మధ్యలో పని చేసే నాయకులను ప్రోత్సహించడం లేదు. దానితో బీజేపీకి ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో సైతం పరాజయం తప్పలేదు. 'శీష్ మహల్' గురించి కొంతమేరకు కేజ్రీవాల్‌ను ఇరకాటంలో పడవేసిన బంగారు పూత పూసిన టాయిలెట్ ఫిట్టింగ్‌లు, స్విమ్మింగ్ పూల్ వంటి ప్రచారాలు అవాస్తవమని వెల్లడి కావడంతో వెంటనే బీజేపీ తమ ప్రచారాన్ని మార్చి వేసింది. 'ఒక్కసారి అధికారం ఇస్తే ఢిల్లీ రూపురేఖలను మార్చగలం' అని ఇప్పుడు చెబున్నారు. ఢిల్లీ తీవ్రమైన నీటి సమస్య ఎదుర్కొంటున్న సమయంలో పొరుగున ఉన్న హరియాణాలోని బీజేపీ ప్రభుత్వం సహకరించే విధంగా కేంద్రం ఎటువంటి చొరవ తీసుకోలేక పోయింది.

వాస్తవానికి కేజ్రీవాల్‌తో సమానంగా ప్రజాదరణ గల నాయకులు ఎవ్వరూ ఢిల్లీ బీజేపీలో లేరు. అందుకనే ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించేందుకు ఆ పార్టీ వెనకాడుతోంది. కేవలం ప్రధాని మోదీ ప్రజాకర్షణపైననే ఆధారపడుతోంది. ఆప్ ఈ ఎన్నికలలో గెలుపొందితే జాతీయ స్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్‌తో సంబంధం లేకుండా కేజ్రీవాల్, అఖిలేశ్ యాదవ్, మమతా బెనర్జీ వంటి వారు కలిసి బలమైన ప్రత్యామ్నాయం అందించే అవకాశం ఉంటుంది.

ఈ నేపథ్యంలో ప్రజల జీవన్మరణ సమస్య అయిన కాలుష్యాన్ని వదిలేసి ఆప్, బీజేపీలు ఉచిత పథకాలపై హామీలు గుప్పించి ఎలాగైనా విజయం సాధించాలని చూస్తున్నాయి.

– సభావట్ కళ్యాణ్
లా విద్యార్థి, ఢిల్లీ యూనివర్సిటీ | 90143 22572

పలిత కేశ సందేశం

ఓ పురాణ కథ ప్రకారం రాజ్య వర్ధనుడనే రాజు తన రాజ్యాన్ని 70 వేల సంవత్సరాలు ధర్మబద్ధంగా పాలించాడు. అతని పాలనలో ప్రజలు అనారోగ్యాలు, అనావృష్టులు లేని జీవనం గడిపారు. ఒకరోజు రాజపత్ని, రాజు గారి తలలో తెల్ల వెంట్రుకను చూసి కన్నీరు పెట్టింది. రాజు ఎందుకు ఏడుస్తున్నావని అడిగినా చెప్పకుండా దుఃఖిస్తూనే ఉంది. రాజు ఒత్తిడి చేయడంతో ఆయన తలలో తెల్ల వెంట్రుకను చూసి దుఃఖిస్తున్నానంటుంది. అందుకు రాజు: 'దీనికై బాధ పడకూడదు. ఇన్ని సంవత్సరాలు జీవించాను. ఎన్నో శుభకార్యాలు చేశాను. తెల్ల వెంట్రుకలు వచ్చినా, దేహం ముడతలు పడినా విచారించనవసరం లేదు. ఈ పలిత కేశం వృద్ధాప్యానికి గుర్తు. నేనింక వనాలకు వెళ్ళవలసి ఉంది. ఇన్నాళ్లు లౌకిక సుఖాలు అనుభవించాను. ఇప్పుడు తపస్సు చేసుకుంటాను. కుమారునికి రాజ్యాభిషేకం చేసి వెళతాను' అన్నాడు.



జ్యోతిర్మయం

పలిత కేశం వ్యక్తులు ఇంకా నిర్వహించ వలసిన మిగిలిపోయిన బాధ్యతలను గురించి హెచ్చరిస్తుంది. కుటుంబ బాధ్యతలు తీరిపోతే, దైవ సన్నిధిలో, ఆధ్యాత్మిక మార్గంలో జీవించమని హితవు చెబుతుంది. తలలో నెరసిన వెంట్రుకలను చూసి, వయసై పోతోందే అని వ్యథ చెందనవసరం లేదు. లౌకిక జీవన పోరాటంలో కొట్టుమిట్టాడుతున్న వారికి ముక్తి మార్గాన్ని చూపే హితైషి పలిత కేశం. వయసుతోపాటు శరీరంలో వచ్చే సహజ పరిణామాలను గుర్తు చేసే సత్య బోధిని పలిత కేశం.

అయితే పై కథలో రాజును విడిచి ఉండలేని ప్రజలు, ఇంకా పదివేల ఏళ్ళు రాజు, స్థిర యవ్వనం, అందమైన కేశాలు కలిగి ఉండి తమను పాలించాలని సూర్య దేవుని ప్రార్థించి వరం పొందారు. రాజు, ఆ ప్రజలు లేకుండా తాను వర ప్రభావంతో జీవించి ఉండలేనని, తన కోసం ప్రార్థించిన వారి కోసం తనున్నాళ్ళు వారు జీవించేట్లు వరం ఇమ్మని సూర్యదేవుని ప్రార్థించి వరం పొందాడు. ప్రజలను చక్కగా పాలించాడు. ఈ కథ మార్కండేయ పురాణం లోనిది.

ఎప్పటికైనా వృద్ధాప్యం (పలిత కేశం) రావడం అనివార్యం అనే వాస్తవాన్ని గ్రహించి తదనుగుణంగా (భగవచ్చింతనతో) మెలగాలి.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899



చదువుల తల్లికి నీరా'జనం'

భైంసా: చదువుల తల్లి కొలువైన బాసర పుణ్యక్షేత్రం సోమవారం భక్తజన సంద్రంగా మారింది. వసంత పంచమి వేడుకలను పురస్కరించుకుని భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం రాత్రి 2 గంటల నుంచే ఆలయంలో భక్తులు క్యూలైన్‌లో నిరీక్షిస్తూ కనిపించారు. వీఐపీ క్యూలైన్‌లోనూ ఈసారి భక్తులు బారులు తీరి కనిపించారు. ఆలయ అధికారుల సమన్వయ లోపం కారణంగా దాదాపు 5 గంటలపాటు భక్తులు క్యూలైన్‌లోనే వేచి ఉండాల్సి వచ్చింది. కాగా, నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ ఆలయ అధికారులతో కలిసి అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు.

భక్తులకు జోగుళాంబదేవి నిజరూప దర్శనం



అలంపూర్: రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠం అలంపూర్ శ్రీజోగుళాంబ అమ్మవారు వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నిజరూప దర్శనం ఇచ్చారు. ఉత్సవాల చివరి రోజు వసంత పంచమిని పురస్కరించుకొని భక్తులు సహస్ర కలశాలను సమర్పించారు. అర్చకులు వేదమంత్రాలు పఠిస్తూ అమ్మవారిని పంచామృతాలతో పాటుగా భక్తులు అందించిన కలశాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్రాలు, రకరకాల పూలు, స్వర్ణాభరణాలతో అలంకరించారు. దశవిధ హారతులు సమర్పించి పంచామృతాలను భక్తులకు తీర్థంగా అందజేశారు.

తెలంగాణ ప్రభుత్వం
అటవీ శాఖ
బహిరంగ కలప వేలం ప్రకటన
RC No.1252/2019/S3, తేది: 01.02.2025
ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా ఈ క్రింద తెలుపబడిన అటవీ జాతుల కలప ఈ క్రింద తెలుపబడిన తేదీలలో బహిరంగ వేలం నిర్వహించబడును. తేది: 06-02-2025, 10-02-2025, 15-02-2025, 20-02-2025 & 28-02-2025, ఉదయం 10.00 గం.లకు ఏటూరునాగారం ప్రభుత్వ కలప డిపో (Govt. Timber Depot) నందు బహిరంగ వేలం నిర్వహించబడును. ఈ క్రింది తెలుపబడిన రకముల కలప. 1) యేగిస 2) నల్లమద్ది 3) బండారు 4) బట్టగనం 5) [illegible] 6) టేకు 7) నారేప. పూర్తి వివరములకు అటవీ క్షేత్రాధికారి, ఏటూరునాగారం నార్త్ రేంజ్ గారిని (ఫోన్ నంబర్ 9177720923) నందు సంప్రదించగలరు. నోట్: ఒక వేల సమయం సరిపోకపోతే మరుసటి రోజుకూడా సేల్స్ నిర్వహించబడును.
సం/- (ఏ.లేపీ) డివిజనల్ అటవీ శాఖ అధికారి ఏటూరునాగారం వన్యప్రాణి విభాగం, జిల్లా ములుగు.
DIPR RO No.9933-PP/CL/Advt/1/2024-25, Dt: 03.02.2025

తిరుమల తిరుపతి దేవస్థానములు :: తిరుపతి
శ్రీ పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్,
S.V. ప్రాణదాన ట్రస్ట్
అందజేయబడిన తేది నుండి 12 నెలల (ఒక సంవత్సరం) వ్యవధి కొరకు శ్రీ పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్, తిరుపతి చుట్టూ మరియు లోపల శానిటేషన్ యొక్క నిర్వహణ కొరకు ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సర్వీస్ కొరకు ఇ-టెండర్లు కోరబడుతున్నవి. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది & సమయం : 28.01.2025, బిడ్ దాఖలు ముగింపు తేది & సమయం: 07.02.2025న సా.5.00 గం.కు, మరిన్ని వివరాల కోసం https://tender.approcurement.gov.in (or) www.tirumala.org ను దర్శించండి.
TTD-40021(31)/1/2024-PRO SEC (Adv. No.306), Dt.: 03.02.2025
ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ
ఆపరేషన్: గద్వాల్ సర్కిల్
టెండరు ప్రకటన నం. 05/2024-25
ఓపెన్ టెండరు-టెండరు ప్రకటన- 05/2024-25, స్పెసిఫికేషన్స్-W-16 (2వ పొడిగింపు- ST కొరకు కేటాయించబడినది) & W-28 to W-32/2024-25 (W-30/24-25 SC కొరకు కేటాయించబడినది)
ఆపరేషన్ సర్కిల్ గద్వాల్‌లో వివిధ ప్రదేశాల వద్ద వివిధ ఎలక్ట్రికల్ పనుల కొరకు టెండరు ప్రకటన- 05/2024-25, Sp.Nos. W-16 (2వ పొడిగింపు- ST కొరకు కేటాయించబడినది) & W-28 to W-32/2024-25 (W-30/24-25 SC కొరకు కేటాయించబడినది) కొరకు అర్హతగల వెండర్ల నుండి బిడ్లు కోరబడుతున్నవి & టెండరు అమ్మకం కొరకు ప్రారంభ తేది: 04-02-2025న 11.00 గం.లు మరియు టెండర్లు స్వీకరణకు చివరి తేది: 20-02-2025న 14.00 గం. వరకు. టెండరు ప్రకటనకు సంబంధించి తదుపరి వివరాల కోసం www.tssouthernpower.com ను దర్శించండి.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ I/c, ఆపరేషన్ సర్కిల్: గద్వాల్, TGSPDCL
DIPR RO No.9903-PP/CL/Advt/1/2024-25, Dt:03-02-2025

పాతగుట్ట అధ్యయనోత్సవాలకు శ్రీకారం



ప్రత్యేక అలంకరణలో శ్రీస్వామి అమ్మవార్లు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి పుణ్యక్షేత్రానికి అనుబంధ ఆలయంగా కొనసాగుతున్న పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం ఆచార్యులు అధ్యయనోత్సవాలకు పాంచరాత్ర ఆగమశాస్త్ర అనుసారం శ్రీకారం చుట్టారు. ఆలయాన్ని ఉదయాన్నే తెరిచిన ఆచార్యులు, అనంతర నిత్యారాధనలు జరిపించారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా తిరుమంజన మహోత్సవాన్ని వైభవంగా చేపట్టారు. సాయంత్రం ఆలయంలో తొళక్కం నిర్వహించారు. అనంతరం దివ్య ప్రబంధ సేవా కాలంలో పారాయణికులు పారాయణం చేశారు. ఈ వేడుకల్లో ఆలయ ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త వి.నర్సింహమూర్తి, ప్రధానార్చకులు, రుత్వికులు, పాల్గొన్నారు.

రాజ్‌తరుణ్ భార్య లావణ్యపై హత్యాయత్నం

- లావణ్య ఇంట్లోకి బలవంతంగా చొరబడ్డ మస్తాన్‌సాయి
- రహస్య వీడియోలు ఉన్న హార్డ్‌డిస్క్ ఇవ్వాలని బెదిరింపు
- నార్సింగి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితురాలు
- ఒకరి అరెస్టు, మరొకరికి నోటీసులు, హార్డ్‌డిస్క్ సీజ్
- గతంలో ఆమెపై మస్తాన్ అత్యాచారం చేసినట్టు ఆరోపణలు



లావణ్య

మణికొండ: సినీ హీరో రాజ్ తరుణ్ భార్య లావణ్యపై హత్యాయత్నం జరిగింది. గతంలో ఆమెపై అత్యాచారం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న, గుంటూరులో నమోదైన ఆ కేసులో నిందితుడిగా ఉన్న రావి బావాజీ మస్తాన్ సాయి ఈ దారుణానికి తెగపడ్డాడు. లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న నార్సింగి పోలీసులు సోమవారం మస్తాన్‌ను అరెస్టు చేశారు. అతడికి సహకరించిన గుంటూరు వాసి షేక్ ఖాజా మొయినుద్దీన్‌కు నోటీసులు జారీ చేశారు. పోలీసులు, బాధితురాలి కథనం ప్రకారం... లావణ్యకు మస్తాన్ సాయితో 2022లో పరిచయమైంది. ఆమెతో పలు సందర్భాల్లో వీడియో కాల్స్ మాట్లాడిన మస్తాన్ దాదాపు 40 కాల్స్ రికార్డు చేశాడు. 2023లో గుంటూరులో జరిగిన మస్తాన్ సోదరి వివాహానికి అతడు ఆహ్వానించడంతో లావణ్య వెళ్లింది. ఆ సందర్భంలో ఆమె తన వీడియోల విషయం ప్రశ్నించగా... తీవ్రంగా దాడి చేసిన మస్తాన్ ఆమెపై లైంగిక దాడికీ పాల్పడ్డాడు. వెంటనే ఆమె ఈ విషయాన్ని రాజ్‌తరుణ్‌కు ఫోన్ ద్వారా చెప్పారు. తాను హీరోగా ఉన్నానని, తన పేరు బయటకు రాకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని అతడు అనడంతో లావణ్య అక్కడి పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మస్తాన్‌పై కేసు నమోదైంది.

హార్డ్‌డిస్క్‌లో నగ్నవీడియోలు, కాల్ రికార్డింగ్‌లు..

ఇదిలా ఉండగా... మస్తాన్ సాయి అనేక మంది ఆడవాళ్ల జీవితాలతో ఆడుకుంటున్నాడని, స్నేహం, ప్రేమ, పెళ్లి పేరుతో వారికి వల వేస్తున్నాడని లావణ్యకు తెలిసింది. మరి కొందరి ఫోన్లు హ్యాక్ చేసి వారి వ్యక్తిగత జీవితాల్లోకి చొరబడినట్లు ఆమె దృష్టికి వచ్చింది. అలా సంగ్రహించిన, రికార్డు చేసిన వందలాది నగ్న వీడియోలు, కాల్ రికార్డులను 4 టీబీ సామర్థ్యం కలిగిన హార్డ్‌డిస్క్‌లో మస్తాన్ దాచినట్లు గమనించింది. ఇటీవల మస్తాన్ సాయి ఇంటికి వెళ్లిన ఆమె.. ఆ హార్డ్‌డిస్క్‌ను తన అధీనంలోకి తీసుకుని ఇంటికి తీసుకువచ్చారు. అప్పటి నుంచి ఆ హార్డ్‌డిస్క్ కోసం మస్తాన్ అనేక రకాలుగా లావణ్యపై ఒత్తిడి చేస్తున్నాడు. గత నెల 31న మరికొందరితో కలిసి లావణ్య ఇంటికి వచ్చిన మస్తాన్ ఆమెపై దాడికి యత్నించాడు. టీవీ, సీసీ కెమెరాలు సహా అనేక వస్తువులు ధ్వంసం చేశాడు. తీవ్ర భయాందోళనలకు గురైన ఆమె ఆ రోజు తన స్నేహితురాలి దగ్గర ఆశ్రయం పొంది అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆపై ఆదివారం రాత్రి మరోసారి డ్రగ్స్ మత్తులో లావణ్య ఇంటికి వచ్చిన మస్తాన్ ఆమెతో పాటు ఆమె సోదరుడినీ నిర్బంధించాడు. లావణ్య గొంతు నులిమి హత్యాయత్నం చేసి, ల్యాప్‌టాప్, హార్డ్‌డిస్క్ తదితరాలను బలవంతంగా లాక్కున్నాడు. ఆ సమయంలో అతడి వెంట ఖాజా, మరొకరు కూడా ఉన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆదివారం సాయంత్రం లావణ్య నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మస్తాన్, ఖాజా సహా ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం మస్తాన్‌ను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించిన పోలీసులు ఖాజాకు నోటీసులు జారీ చేశారు. మస్తాన్ వద్ద ఉన్న బ్యాగ్ నుంచి హార్డ్‌డిస్క్, ల్యాప్‌టాప్ తదితరాలు స్వాధీనం చేసుకున్నారు. వీటిని విశ్లేషించిన తర్వాత తదుపరి చర్యలు తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. నార్సింగి పోలీసులకు లావణ్య ఇచ్చిన ఫిర్యాదులో మరో ప్రముఖ హీరో పేరునూ ప్రస్తావించారు.

నాకు ప్రాణహాని ఉంది: లావణ్య

మస్తాన్‌సాయి ఇంట్లో నుంచి తెచ్చిన హార్డ్‌డిస్క్ కోసం తనను చంపేందుకు ప్రయత్నించారని, తనకు ప్రాణహాని ఉందని లావణ్య అన్నారు. సోమవారం ఆమె నార్సింగి పోలీస్‌స్టేషన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ, మస్తాన్‌సాయితో పాటు అతని తండ్రి తనను చంపేందుకు చూస్తున్నారని, ఇప్పటికే తనకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని చెప్పారు. ఇన్ని రోజులు తన వద్ద సరైన సాక్ష్యాధారాలు లేక మిన్నకున్నానని, ఇప్పుడు పూర్తి వివరాలతో మరోమారు పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. ఇప్పుడు కూడా కేసును పక్కదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆమె ఆరోపించారు. తాను మస్తాన్‌సాయిపై ఆదివారం ఇచ్చిన ఫిర్యాదుపై స్టేట్‌మెంట్ రికార్డు చేసేందుకు పోలీసులు పిలిపించారని, వారు అడిగిన వివరాలను ఇచ్చానని ఆమె వివరించారు.

తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ : హైదరాబాద్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
ప్రకటన నం. TVCC/C1/119/2024, తేది : 03.02.2025
ఇ-ప్రొక్యూర్‌మెంట్ పద్ధతి ద్వారా నమోదిత సంస్థలు/కంపెనీలు లేదా వారి అధీకృత డీలర్ల నుండి సరఫరా కొరకు సహాయ పరికరాలు మరియు సాధనముల సేకరణ కొరకు వెబ్‌సైట్ https://tender.telangana.gov.in, ఇ-మెయిల్ ఐడీ : mdtgvcc@gmail.com ద్వారా ఆన్‌లైన్ బిడ్లు పిలువబడుతున్నాయి. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది & సమయం: 05.02.2025న మ॥ 1.00 గంట నుండి. తదుపరి వివరాల కోసం 040-24559048ను సంప్రదించండి.
File/NIT Numbers : 1) TVCC/C1/119/2024-25/5, 5G Smart Phones, 2) TVCC/C1/119/2024-25/7, Hearing Aids, 3) TVCC/C1/119/2024-25/17, Battery Passenger Rickshaw
సం/- జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్
DIPR RO No.9937-PP/CL/Advt/1/2024-25, Dt. 03.02.2025

అదృశ్యమైన విద్యార్థులు విజయవాడలో ప్రత్యక్షం

- కౌన్సెలింగ్ అనంతరం తల్లిదండ్రులకు అప్పగింత

కోదాడ రూరల్: సూర్యాపేట జిల్లా కోదాడ మండలం నెమలిపురిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల నుంచి అదృశ్యమైన ఆరుగురు విద్యార్థులు విజయవాడ రైల్వేస్టేషన్‌లో ప్రత్యక్షమయ్యారు. గురుకుల పాఠశాలలో శనివారం వీడ్కోలు పార్టీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొందరు విద్యార్థులు గొడవ చేయడంతో వారిని పిలిపించిన ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు.. పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. దీంతో ఆదివారం మధ్యాహ్నం ఆరుగురు విద్యార్థులు పాఠశాల నుంచి వెళ్లిపోయారు. నడుచుకుంటూ రామాపురం క్రాస్‌రోడ్‌కు వెళ్లి అక్కడ ఆటో ఎక్కి విజయవాడకు వెళ్లారు. రాత్రి బస్టాండ్ ప్రాంతంలో తిరిగిన అనంతరం ట్రైన్‌లో తిరుపతి వెళ్లాలని నిర్ణయించుకుని రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అయితే డబ్బులు సరిపడా లేకపోవడం, ట్రైన్‌లో టీసీ పట్టుకుంటే ఇబ్బంది అవుతుందని గ్రహించి రాత్రంతా అక్కడే ఉన్నారు. సోమవారం ఉదయం తల్లిదండ్రులకు ఫోన్ చేసి తాము విజయవాడ రైల్వేస్టేషన్‌లో ఉన్నట్లు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే పాఠశాల ఉపాధ్యాయులకు, రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డికి తెలపడంతో విద్యార్థులను స్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఘటనపై సాంఘిక సంక్షేమ శాఖ జోనల్ ఆఫీసర్ విద్యారాణి సోమవారం కోదాడకు వచ్చి వివరాలు తెలుసుకున్నారు.

కన్నతల్లిని కడతేర్చి.. ముళ్లపొదల్లో దాచి..

- మద్యం మత్తులో కుమారుడి కిరాతకం
- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన



యాదమ్మ

బిజినేపల్లి: మద్యం మత్తులో కన్నతల్లిని కడతేర్చాడో కొడుకు. ఆపై మృతదేహాన్ని ముళ్లపొదల్లో దాచి హత్య కేసు నుంచి తప్పించుకోవాలని యత్నించాడు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని మహాదేవునిపేట గ్రామంలో ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికుల వివరాల మేరకు.. మహాదేవునిపేటకు చెందిన లేట్ల యాదమ్మ (45)కు ఇద్దరు కుమారులు. పెద్ద కొడుకు కరుణాకర్ జులాయిగా తిరుగుతూ తాగుడుకు బానిసై డబ్బుల కోసం తల్లితో తరచూ గొడవ పడుతుండేవాడు. గత శుక్రవారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి వచ్చిన కరుణాకర్ తల్లితో వాగ్వాదానికి దిగాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో క్షణికావేశానికి గురైన కరుణాకర్.. యాదమ్మ తలపై పాగ గొట్టంతో బాదడంతో అక్కడికక్కడే మృతిచెందింది. కొంతసేపటి తర్వాత మద్యం మత్తు నుంచి స్పృహలోకి వచ్చిన అతడు.. తమ గుడిసె పక్కన ఉన్న ముళ్లపొదల్లో పాత చీరలు కప్పి.. తల్లి మృతదేహాన్ని దాచిపెట్టాడు. ఆదివారం రాత్రి నుంచి దుర్వాసన రావడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. సోమవారం ఉదయం సీఐ కనకయ్యగౌడ్, ఎస్‌ఐ శ్రీనివాసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

హత్యపై అనుమానాలు..: కాగా, యాదమ్మ హత్యపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. మహాదేవునిపేటకు చెందిన లేట్ల ఉత్తయ్యకు యాదమ్మతో 25 ఏళ్ల క్రితం రెండో వివాహం జరిగింది. శనివారం రాత్రి భార్య కోసం వచ్చిన తండ్రి ఉత్తయ్యతో కొడుకు కరుణాకర్ గొడవ పడినట్లు స్థానికులు తెలిపారు. అలాగే యాదమ్మ మృతదేహంపై పదునైన ఆయుధంతో దాడిచేసినట్లు గాయాలు ఉన్నాయని.. గుడిసెలో రక్తపు మరకలతో కొడవలి ఉన్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు.

పట్టాదార్ పాస్ పుస్తకాల కోసం..
ట్యాంక్ ఎక్కిన రైతులు

- పురుగుమందు డబ్బా, పెట్రోల్ బాటిళ్లతో నారాయణపురం గ్రామస్తుల ఆందోళన
- అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నారాయణపురం రైతులు

సాక్షి, మహబూబాబాద్ /కేసముద్రం: ఎంజాయ్‌మెంట్ సర్వే ప్రకారంగా తమకు పట్టాదార్ పాసు పుస్తకాలు ఇవ్వాలంటూ పురుగుమందు డబ్బా, పెట్రోల్ బాటిళ్లు పట్టుకొని రైతులు ఓవర్‌హెడ్ ట్యాంక్‌పైకి ఎక్కి ఆందోళనకు దిగారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం రైతులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ క్రమంలోనే కొంతమంది తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్ ఎక్కి పురుగుమందు డబ్బాలు, పెట్రోల్ బాటిళ్లతో ఆందోళన చేపట్టారు. ఒక దశలో ట్యాంక్‌పైన తమ వద్ద ఉన్న కాగితాలకు నిప్పంటించారు. తహసీల్దార్ దామోదర్, ఎస్సై మురళీధర్‌రాజు అక్కడకు చేరుకొని పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఇప్పిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. దీంతో వారు కిందకు దిగారు. అక్కడినుంచి పలువురు రైతులు మహబూబాబాద్ జిల్లాకేంద్రానికి చేరుకొని కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. తర్వాత కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఇదీ భూ సమస్య

2017లో భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా మహబూబాబాద్ జిల్లాలోని నారాయణపురం గ్రామాన్ని నెల్లికుదురు మండలం చెట్లముప్పారం రెవెన్యూవిలేజ్ నుంచి వేరు చేశారు. కొత్తగా నారాయణపురం రెవెన్యూ విలేజ్‌గా మార్చి, ఆ తర్వాత కేసముద్రం మండలంలో కలిపారు. ఈ క్రమంలో ఆ గ్రామ భూములన్నీ అటవీ భూములుగా రికార్డుల్లో నమోదయ్యాయి. దీంతో పట్టాదార్ కాలమ్‌లో రైతు పేరుకు బదులుగా అటవీ భూమిగా వచ్చింది. అప్పటి నుంచి రైతులు వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టగా, విషయం అప్పటి సీఎం కేసీఆర్ వరకూ వెళ్లింది. ఆయన ఆదేశాలతో నాటి కలెక్టర్ శశాంక, తొర్రూరు, మహబూబాబాద్ ఆర్డీఓలు, తహసీల్దార్లు సర్వే చేసి నారాయణపురంలోని 149, 150, 154, 165, 166, 168 సర్వే నంబర్లలో మొత్తం 2,400 ఎకరాలు ఉన్నట్టు గుర్తించారు. ఈ భూమి అంతా ఫారెస్టు పేరున ఉండడంతో ఫారెస్టు హద్దులు, రోడ్లు, నివాస స్థలాలు, ఇతర అవసరాలకు వాడుకున్న భూమి మొత్తం 1,398 ఎకరాలు ఉన్నట్టు గుర్తించి తీసేశారు. మిగిలిన వెయ్యి ఎకరాల భూమి కోసం ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అయితే సేత్వారి పహాణి ప్రకారం 380 మంది రైతులకు చెందిన 735 ఎకరాలకు మాత్రమే పాస్‌పుస్తకాలు ఇచ్చే అవకాశముందని అధికారులు నిర్ధారించారు. ఆ మేరకు పట్టాదార్ పాస్ పుస్తకాలు కూడా ఇచ్చారు. అయితే 110 మంది రైతులకు చెందిన 265 ఎకరాల భూమికి పరిష్కారం లభించలేదు. ఇంకా అటవీ భూమిగానే భూ రికార్డుల్లో ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఈ సమస్యపై అసెంబ్లీలో చర్చ కూడా జరిగింది. ఆ తర్వాత ప్రభుత్వం ఆ భూమిని ఫారెస్టు జాబితా నుంచి తొలగిస్తూ గెజిట్ తీసుకొచ్చింది. గెజిట్ వచ్చినా, మిగతా రైతులకు ఇంకా పట్టాదార్‌పాస్ పుస్తకాలు రాలేదు. దీంతో ఆ రైతులు మా సమస్య పరిష్కరించాలంటూ ఆందోళనకు దిగారు. రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ మిగిలిన రైతులకు పాస్ పుస్తకాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

యూకేలో జోయ్ అలుక్కాస్ 2వ షోరూం

సాక్షి, హైదరాబాద్: యూకేలోని సౌతాల్‌లో జనవరి 31న తమ రెండవ షోరూంను ప్రారంభించినట్లు జోయ్ అలుక్కాస్ ఒక ప్రకటనలో తెలిపింది. జోయ్ అలుక్కాస్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ జాన్ పాల్ అలుక్కాస్, సోనియా అలుక్కాస్.. కౌన్సిలర్, ఈలింగ్ మేయర్ ఇవాన్ జాన్సన్‌తో కలిసి షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా జాన్‌పాల్ అలుక్కాస్ మాట్లాడుతూ తమ కస్టమర్లకు ఉత్తమమైన జ్యువెల్లరీ అందించడంపైనే దృష్టి సారించామని తెలిపారు. 38 ద బ్రాడ్‌వే, సౌతాల్, యూబీ1 1పీటీలో ఉన్న ఈ షోరూంలో విలక్షణమైన జ్యువెల్లరీ విస్తృత శ్రేణి కలెక్షన్ అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. డైమండ్, ప్రెషస్ స్టోన్ ఆభరణాల వరకు సందర్భానికి తగ్గట్లుగా అద్భుతమైన కలెక్షన్లు వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా ఉన్నాయన్నారు.

గౌరవనీయ తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ సమక్షంలో
విద్యుత్ నియంత్రణ్ భవన్, జీటీఎస్ కాలనీ, కళ్యాణ్‌నగర్, హైదరాబాద్-500 045.
ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (TGTRANSCO)
బహిరంగ ప్రకటన
O.P.No. 19 of 2025 మరియు O.P.No. 20 of 2025
1. ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (టీజీట్రాన్స్‌కో) a) ట్రాన్స్‌మిషన్ బిజినెస్ కొరకు FY 2025-26 కొరకు ARR, ప్రతిపాదిత సవరించిన ట్రాన్స్‌మిషన్ టారిఫ్ మరియు ఛార్జీలు మరియు FY 2023-24 కొరకు ట్రూ అప్ b) SLDC కార్యకలాపాల కొరకు FY 2025-26 కొరకు ప్రతిపాదిత సవరించిన ARR & SLDC ఛార్జీలు మరియు FY 2023-24 కొరకు ట్రూ అప్ కొరకు తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (TGERC) సమక్షంలో దాఖలు చేసినది [illegible] O.P.No. 19 of 2025 (ట్రాన్స్‌మిషన్ బిజినెస్) మరియు O.P.No. 20 of 2025 (SLDC కార్యకలాపాలు) [illegible]
2. ఈ ఫైలింగ్స్ కాపీలు చీఫ్ ఇంజనీర్ (Commercial & RAC), రూం నం. 149, 'ఎ' బ్లాక్, టీజీ ట్రాన్స్‌కో, విద్యుత్ సౌధ, హైదరాబాద్ - 500 082 [illegible] www.tgtransco.in [illegible] www.tgerc.telangana.gov.in [illegible]
3. [illegible] చీఫ్ ఇంజనీర్ (Commercial & RAC), రూం నం. 149, 'ఎ' బ్లాక్, టీజీ ట్రాన్స్‌కో, విద్యుత్ సౌధ, హైదరాబాద్-500 082 [illegible] 25.02.2025 [illegible] సా.5.00 గం. [illegible] TGERC [illegible]

అభ్యంతరం తెలిపే వ్యక్తి పేరు మరియు పూర్తి చిరునామా	అభ్యంతరం(లు)/ సూచన(లు) సంక్షిప్త వివరాలు	టీజీ ట్రాన్స్‌కో ద్వారా ఫైలింగ్స్‌పై అభ్యంతరాలు: a) ట్రాన్స్‌మిషన్ బిజినెస్ కొరకు FY 2025-26 కొరకు ARR, ప్రతిపాదిత సవరించిన ట్రాన్స్‌మిషన్ టారిఫ్ మరియు ఛార్జీలు మరియు FY 2023-24 కొరకు ట్రూ అప్; b) SLDC కార్యకలాపాల కొరకు FY 2025-26 కొరకు ప్రతిపాదిత సవరించిన ARR & SLDC ఛార్జీలు మరియు FY 2023-24 కొరకు ట్రూ అప్ కొరకు	టీజీ ట్రాన్స్‌కో ఆఫీసు వద్ద అభ్యంతరం కాపీ మరియు ఐక్నాలెడ్జ్‌మెంట్ (అవును/కాదు)	అభ్యంతరం తెలిపే వ్యక్తి స్వయంగా విన్నవించుకోదలిచారా (అవును/కాదు)

4. తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ 11.03.2025న ఉ. 10.30 గం. నుండి TGERC, విద్యుత్ నియంత్రణ్ భవన్, జీటీఎస్ కాలనీ, కళ్యాణ్‌నగర్, హైదరాబాద్ యొక్క కోర్టు హాలులో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని ఉద్దేశిస్తున్నది.
ప్రదేశం : హైదరాబాద్
తేది : 04.02.2025
సం/- ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్, టీజీ ట్రాన్స్‌కో

షెడ్యూలు-I

1. ట్రాన్స్‌మిషన్ బిజినెస్ కొరకు FY 2023-24 కొరకు వార్షిక పనితీరు సమీక్ష (రూ.కోట్లలో)

వివరాలు	FY 2023-24		
	టారిఫ్ ఆర్డర్	అసలు	వ్యత్యాసం
ఖర్చు	2696.53	2481.10	-215.43
O&M వ్యయాలు	1197.51	1325.34	127.83
O&M నిర్వహణ వ్యయాలు	0.00	0.00	0.00
తరుగుదల	1378.79	1073.34	-305.45
వడ్డీలు	120.23	82.42	-37.81
ప్రత్యేక వినియోగం	0.00	0.00	0.00
ఇతర ఖర్చులు	0.00	0.00	0.00
మూలధనంగా పెట్టిన ఖర్చు	176.98	189.28	12.30
మూలధనంగా పెట్టిన O&M ఖర్చులు	176.98	189.28	12.30
నికర ఖర్చులు	2519.55	2291.82	-227.73
RoCE	1766.59	1184.99	-581.60
మొత్తం ARR	4286.14	3476.80	-809.34
నాన్-టారిఫ్ ఆదాయం	477.71	440.69	-37.02
టారిఫ్ నుండి ఆదాయం	3808.43	4117.68	309.25
మొత్తం ఆదాయం	4286.14	4558.37	272.23
మిగులు/(లోటు)	0.00	1081.56	1081.56

2. ట్రాన్స్‌మిషన్ బిజినెస్ కొరకు 4వ నియంత్రణ కాలం (FY 2019-20 to FY 2023-24) కొరకు ట్రూ అప్ ప్రభావం (రూ.కోట్లలో)

క్ర.సం.	ఆర్థిక సంవత్సరం	వివరాలు	వ్యయం
1	2019-20	APR ఆర్డర్ తేది 02.09.2021 ప్రకారం లోటు	(64.88)
2	2020-21	APR ఆర్డర్ తేది 07.04.2022 ప్రకారం మిగులు	173.94
3	2021-22	APR ఆర్డర్ తేది 26.05.2023 ప్రకారం లోటు	(160.80)
4	2022-23	APR ఆర్డర్ తేది 07.06.2024 ప్రకారం మిగులు (నోట్.1)	579.05
5	2023-24	మిగులు (ఆడిట్ చేయబడిన ఖాతాల ప్రకారం)	1081.56
		మొత్తం	1608.87

3. ట్రాన్స్‌మిషన్ బిజినెస్ కొరకు FY 2025-26 కొరకు సవరించిన సమగ్ర ఆదాయ అవశ్యకత (రూ.కోట్లలో)

క్ర.సం.	వివరాలు	FY 2025-26		
		MYT/ టారిఫ్ ఆర్డర్	అంచనాలు	వ్యత్యాసం
1	ఆపరేషన్ & నిర్వహణ ఖర్చులు	1,377.19	1,303.41	-73.78
2	తరుగుదల	863.33	920.9	57.57
3	రుణంపై వడ్డీ ఫైనాన్స్ చార్జీలు	986.85	1,137.49.	150.64
4	నిర్వహణ మూలధనంపై వడ్డీ	81.67	83.34	1.67
5	ఈక్విటీపై రాబడి	628.71	687.51	58.80
6.1	తగ్గింపు: నాన్-టారిఫ్ ఆదాయం	515.70	443.27	-72.43
6.2	ఓపెన్ యాక్సెస్ చార్జీల నుండి ఆదాయం		-	
6.3	ఇతర వ్యాపారం నుండి ఆదాయం		-	
7.1	తగ్గింపు: 4వ నియంత్రణ కాలం కొరకు వర్తించే మిగులు ప్రభావం		1,608.87	1,608.87
	సమగ్ర ఆదాయ అవశ్యకత	3,422.05	2,080.50	-1,341.55

4. ట్రాన్స్‌మిషన్ బిజినెస్ కొరకు FY 2025-26 కొరకు ప్రతిపాదిత ట్రాన్స్‌మిషన్ టారిఫ్‌లు మరియు ట్రాన్స్‌మిషన్ నష్టాలు

వివరాలు	FY 2025-26
	(n+1)
ట్రాన్స్‌మిషన్ బిజినెస్ కొరకు ARR (రూ.కోట్లలో)	2,080.50
ట్రాన్స్‌మిషన్ కాంట్రాక్ట్ కెపాసిటీ (MW)	23,544.83
ట్రాన్స్‌మిషన్ చార్జీలు (Rs/kW/month)	73.64
అంచనా ట్రాన్స్‌మిషన్ నష్టాలు (%లో)	2.46 (+/- 0.2)

5. SLDC బిజినెస్ కొరకు FY 2023-24 కొరకు వార్షిక పనితీరు సమీక్ష (రూ.కోట్లలో)

వివరాలు	FY 2023-24		
	టారిఫ్ ఆర్డర్	అసలు	వ్యత్యాసం
మొత్తం ఖర్చు	48.36	56.03	7.67
SLDC చార్జీల నుండి ఆదాయం	48.35	48.95	0.60
మిగులు/(లోటు)	-0.01	-7.08	-7.07

6. SLDC బిజినెస్ కొరకు 4వ నియంత్రణ కాలం (FY 2019-20 to FY 2023-24) కొరకు ట్రూ అప్ ప్రభావం (రూ.కోట్లలో)

క్ర.సం.	ఆర్థిక సంవత్సరం	వివరాలు	వ్యయం
1	2019-20	APR ఆర్డర్ ప్రకారం మిగులు	0.04
2	2020-21	APR ఆర్డర్ ప్రకారం మిగులు	4.76
3	2021-22	APR ఆర్డర్ ప్రకారం మిగులు	2.99
4	2022-23	APR ఆర్డర్ ప్రకారం లోటు	-9.42
5	2023-24	ఆడిట్ చేయబడిన ఖాతాల ప్రకారం లోటు	-7.07
		నికర లోటు/ క్లెయిమ్	-8.70

7. SLDC బిజినెస్ కొరకు FY 2025-26 కొరకు సవరించిన సమగ్ర ఆదాయ అవశ్యకత (రూ.కోట్లలో)

క్ర.సం.	వివరాలు	యూనిట్స్	రిఫరెన్స్	MYT/ టారిఫ్ ఆర్డర్	FY 2025-26 అంచనాలు	వ్యత్యాసం
1	ఆపరేషన్ & నిర్వహణ ఖర్చులు	రూ.కోట్లు	ఫారం 2	55.36	60.84	5.48
2	తరుగుదల	రూ.కోట్లు	ఫారం 4	6.83	3.52	-3.31
3	రుణంపై వడ్డీ ఫైనాన్స్ చార్జీలు	రూ.కోట్లు	ఫారం 5	2.95	1.09	-1.86
4	నిర్వహణ మూలధనంపై వడ్డీ	రూ.కోట్లు	ఫారం 6	1.32	1.41	0.09
5	ఈక్విటీపై రాబడి	రూ.కోట్లు	ఫారం 7	2.01	1.48	-0.53
తగ్గింపు:						
6	నాన్-టారిఫ్ ఆదాయం	రూ.కోట్లు	ఫారం 8	0.50	0.50	0.00
6.1	ఓపెన్ యాక్సెస్ చార్జీల నుండి ఆదాయం	రూ.కోట్లు	ఫారం 9			
కలుపుట:						
7	ముందటి కాలానికి ట్రూ అప్ ప్రభావం	రూ.కోట్లు	ఫారం 11		8.70	8.70
8	సమగ్ర ఆదాయ అవశ్యకత	రూ.కోట్లు		67.98	76.56	8.58
9	ఉత్పత్తి సామర్థ్యం	MW	ఫారం 12	23387.94	24584.78	
10	SLDC చార్జీలు	Rs./MW/Month		2422.16	2594.98	

8. SLDC బిజినెస్ కొరకు FY 2025-26 కొరకు ప్రతిపాదిత SLDC చార్జీలు

వివరాలు	FY 2025-26 కొరకు అంచనాలు
SLDC వ్యాపారం యొక్క ARR (రూ.కోట్లలో)	76.56
జనరేషన్ కాంట్రాక్టెడ్ కెపాసిటీ (MW)	24584.78
SLDC చార్జీలు (Rs/MW/month)	2594.98

DIPR RO No.9898-PP/CL/Advt/1/2024-25, Dt: 03.02.2025

UNION BUDGET 2025-2026
మధ్య తరగతి సాధికారతే భారత దేశ సాధికారత



మధ్య తరగతి వారికి ప్రధాన ఆదాయ పన్ను ఉపశమనం
- రూ. 12 లక్షల వరకు ఆదాయం కలిగిన వ్యక్తులకు ఆదాయ పన్ను లేదు
- సంవత్సరానికి రూ. 12.75 లక్షల వరకు శాలరీ గల వారికి ఆదాయ పన్ను లేదు (రూ. 75,000 నిర్దిష్ట తగ్గింపుతోపాటు).
- సీనియర్ సిటిజన్స్ కొరకు పన్ను తగ్గింపు ప్రయోజనం కొరకు పరిమితి ప్రస్తుత రూ. 50,000 నుండి రూ. 1 లక్ష వరకు రెట్టింపు చేయబడింది.

ఆదాయ పన్ను శాఖ | సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్
FAQs కొరకు
CBC 15401/13/0015/2425

ఢిల్లీ గద్దె ఎవరిది?

ఢిల్లీ రాష్ట్ర శాసనసభ ఎన్నికల సమరంలో ఓటరు మనసు గెలిచేందుకు విస్తృత ప్రచారం చేసిన ప్రధాన పార్టీలన్నీ ఇప్పుడు ఓటింగ్ సరళి ఎలా ఉండబోతోందనే ఆలోచనలో తలమునకలయ్యాయి. మూడోసారి అధికార పీఠంపై ఆమ్ ఆద్మీ పార్టీ కన్నేసింది. 23 ఏళ్లగా అధికారానికి దూరమైన బీజేపీ ఈసారి ఎలాగైనా ఢిల్లీ ఉట్టికొట్టాలని నిశ్చయించుకుంది. అందుకే కమలనాథులంతా ఏకమై మునుపెన్నడూ లేనంతగా ఎన్నికల ప్రచారం చేశారు. ఉనికి కోసం పోరాడుతున్న కాంగ్రెస్ పార్టీ సైతం ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రాసహా ముఖ్యనేతలతో బాగా ప్రచారం చేయించింది. ఈసారి ఓటరు మహాశయుడు ఆప్ చీపురును పైకెత్తుతాడా? బీజేపీ కమలంను అందుకుంటాడా? కాంగ్రెస్ 'చేయి' పట్టుకుని నడుస్తాడా? అనేది రేపు జరగబోయే పోలింగ్‌తో తేలనుంది. ఉచిత విద్యుత్, మహిళా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలోకి నేరుగా నగదు జమ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, విద్యార్థులకు ఉపకార వేతనం, పెన్షన్లు, వృద్ధులకు ఆరోగ్య సంరక్షణ ప్రయోజనాలు ఇస్తామని ప్రధాన పార్టీలన్నీ ఊదరగొట్టాయి. అయితే రూ.12 లక్షల వార్షిక ఆదాయానికి ఎలాంటి ట్యాక్స్ చెల్లించనక్కర్లేదని సాధారణ బడ్జెట్‌లో ప్రకటించి బీజేపీ పార్టీ ఢిల్లీ మధ్య తరగతి ఓటర్లను దాదాపు తనవైపునకు తిప్పుకున్నంత పనిచేసింది. ఈ ప్రకటన ఫలితాలు పోలింగ్ సరళిలో ఏమేరకు ప్రతిఫలిస్తాయో చూడాలి మరి. రూ.10 లక్షల వార్షికాదాయంపై ఎలాంటి ట్యాక్స్ ఉండకూడదని ఆప్ చీఫ్ కేజ్రీవాల్ ఇన్నాళ్లా డిమాండ్ చేస్తుంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అంతకుమించి లబ్ధి చేకూ రేలా చేసి ఓటర్లు కమలం వైపు తల తిప్పేలా చేసింది. ఈ నేపథ్యంలో అసలు ఏఏ అంశాలు ఢిల్లీ ఎన్నికల్లో ఈసారి ప్రధాన పాత్ర పోషించే వీలుందనే చర్చ మొదలైంది.

మధ్య తరగతి కుటుంబాలు

ఢిల్లీలోని కుటుంబాల్లో 67 శాతం కుటుంబాలు మధ్య తరగతికి చెందినవే. ఇంతటి పెద్ద సంఖ్యలో ఉన్న మధ్య తరగతిని పార్టీలు ప్రధానంగా ఆకట్టుకునే ప్రయత్నంచేశాయి. సాధారణ బడ్జెట్‌లో ప్రకటించినట్లు రూ.12 లక్షల వార్షికాదాయంపై ట్యాక్స్‌ను తొలగిస్తే మిగతా వర్గాల కంటే ముందుగా లబ్ధి చేకూరేది ఈ మధ్య తరగతి వాళ్లకే. ఈ లెక్కన బడ్జెట్ ప్రకటన తర్వాత ఈసారి మధ్య తరగతి వర్గాలు బీజేపీకే జై కొట్టే అవకాశాలు ఒక్కసారిగా పెరిగాయి. రెండుసార్లు అధికారంలో ఉన్న ఆప్ ప్రస్తుతం కొంతమేర ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. దీనికి ఆప్ నేతలపై వెల్లువెత్తిన అవినీతి ఆరోపణలు ప్రధాన కారణం. ఢిల్లీ పరిధిలో మద్యం విధానంలో అక్రమాలు చేసి వందల కోట్లు కూడబెట్టారని ఆప్ నేతలపై ఈడీ అభియోగాలు మోపడం తెల్సిందే. ఈ అవినీతి మరకలను వెంటనే తొలగించుకోవడంలో ఆప్ నేతలు విఫలమయ్యారు. దిగజారిన ప్రతిష్ట ఇప్పుడు పోలింగ్‌లో పార్టీకి వచ్చే ఓట్ల సంఖ్యను దిగజారుస్తుందని విశ్లేషణలు వెలువడుతున్నాయి.

ముస్లింలు, దళితులు

ఢిల్లీ రాష్ట్రంలో ముస్లింల జనాభా 12.68 కాగా దళితుల జనాభా 16.92 శాతం. దళితులు ఎక్కువగా ఢిల్లీలోని జుగ్గీలుగా పిలిచి మురికివాడల్లో నివసిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం మురికివాడలను తొలగిస్తుందన్న భయాలతో వీళ్లంతా తమకు ఆదుకుంటుందని అధికార ఆప్ పార్టీకే జై కొట్టారు. అయితే మురికివాడల జోలికి మేం రాబోమని ఇటీవల ప్రధాని మోదీ ప్రకటించడంతో వీళ్లంతా ఈసారి బీజేపీ వైపు నడవొచ్చనే మాట వినిపిస్తోంది. రాష్ట్రంలో దశాబ్దకాలంగా అధికారంలో లేని కాంగ్రెస్‌తో పోలిస్తే ముస్లింలు ఈసారి కూడా ఆప్ వెంటే ఉండే అవకాశాలున్నాయి. ప్రధానంగా ఆరు నియోజకవర్గాల్లో ముస్లింల జనాభా ఎక్కువ. సీలాంపూర్ నియోజకవర్గంలో అయితే ఏకంగా సగం మంది ఓటర్లు ముస్లింలే. మాటియా మహల్ నియోజకవర్గంలో 48 శాతం మంది, ఓఖ్లాలో 43 శాతం మంది, ముస్తఫాబాద్‌లో 36 శాతం మంది, బలీమరాన్‌లో 38 శాతం మంది, బబర్‌పూర్‌లో 35 శాతం మంది ముస్లిం ఓటర్లే ఉన్నారు. 2020 ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో ఈ ఆరు స్థానాలను ఆప్ గెల్చుకుంది.

ఉచితాలు

ఉచితంగా ఇస్తామంటూ బీజేపీ, ఆప్‌లు ఎన్నికల ప్రచారం చేపట్టాయి. ఉచితంగా విద్యుత్, ఉచితంగా నీటి సరఫరా, మహిళల ఖాతాకు నగదు బదిలీ చేస్తామని ఆప్ ఉచిత హామీలు గుప్పించింది. ఆప్‌తో పోలిస్తే బీజేపీ కాస్త తక్కువ హామీలనే ఇచ్చింది. అయితే రూ.12 లక్షల వార్షికాదాయంపై ట్యాక్స్ మిన హాయింపుతో ఆమేరకు జనానికి లబ్ధి చేకూరు తుందని, అది కూడా ఓ రకంగా ఉచిత హామీయేనని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.

మహిళలు

ఢిల్లీ ఓటర్లలో 48% మంది మహిళలు ఉన్నారు. దీంతో గెలుపు అవకాశాలను మహిళలనూ నిర్ణయించనున్నారు. మొత్తంగా 71.7 లక్షల మంది మహిళా ఓటర్లు న్నారు. ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన పథకం కింద ఇస్తున్న నగదును రెట్టింపు చేస్తామని, నేరుగా బ్యాంక్ ఖాతాలో వేస్తామని మహిళలకు ఆమ్ ఆద్మీ పార్టీ హామీ ఇచ్చింది. నెలకు రూ.2,100 ఇస్తామని ప్రకటించింది. మేం అధికారంలోకి వస్తే నెలకు రూ.2,500 బదిలీచేస్తామని బీజేపీ ప్రకటించింది.



ముఖ్యమంత్రి అభ్యర్థి

ఆమ్ ఆద్మీ పార్టీలో ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరనేది ఢిల్లీ అంతటికీ తెలుసు. కేజ్రీవాల్ తప్ప ఇంకెవరు ఆ పదవికి పోటీపడట్లేరు. గతంలో బెయిల్ లభించక జైలులో ఉన్న కారణంగా ఆతిశీని సీఎం పీఠంపై కూర్చోబెట్టారు. ఈసారి గెలిస్తే కేజ్రీవాల్ మళ్లీ సీఎం కుర్చీపై ఆసీనులవుతారు. బీజేపీలో ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరనేది ఓటరుకు తెలీదు. ప్రధాని మోదీ పేరు, ఛరిష్మా మీదనే బీజేపీ ఓట్లు అడుగుతోంది. సీఎం అభ్యర్థిని ప్రకటించే దమ్ము కూడా బీజేపీకి లేదని తరచూ కేజ్రీవాల్ వెక్కిరించడం తెల్సిందే.

ఫలోదీ సత్తా బజార్ ఏం చెబుతోంది?

ఈసారి ఎన్నికల్లో ఆప్ పార్టీయే ఫేవరెట్‌గా నిలుస్తోందని 'ది ఫలోదీ సత్తా బజార్' తన అంచనాల్లో పేర్కొంది. 2015, 2020 ఎన్నికల కంటే ఈసారి ఆప్ మరింత బలంగా ఎన్నికల బరిలో దూకిందని వ్యాఖ్యానించింది. 70 సీట్లున్న అసెంబ్లీలో దాదాపు 38 నుంచి 40 చోట్ల ఆప్ గెలుస్తుందని ఈ సంస్థ అంచనావేసింది. ఆప్ తర్వాత బీజేపీ దాదాపు 30 నుంచి 32 నియోజకవర్గాల్లో జయకేతనం ఎగరేయొచ్చని సంస్థ చెబుతోంది. కాంగ్రెస్ ఏమేరకు రాణిస్తుందనే వివరాలను సంస్థ వెల్లడించలేదు. ఉనికి కోసం పోరాడుతున్న పార్టీపై సర్వే చేపట్టలేదని తెలుస్తోంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

చంద్రికకు గ్రామీ

న్యూఢిల్లీ: భారత సంతతికి చెందిన అమెరికన్ గాయని, వ్యాపారవేత్త చంద్రికా టాండన్ గ్రామీ అవార్డు గెలుచుకున్నారు. బెస్ట్ న్యూ ఏజ్ కేటగిరీలో చంద్రిక రూపొందించిన ఆల్బం 'త్రివేణి'తో ఆమెకీ గుర్తింపు దక్కింది. లాస్ ఏంజెలెస్‌లోని క్రిప్టో డాట్ కామ్ అరెనాలో ఆదివారం గ్రామీ 67వ ఎడిషన్ ఉత్సవం జరిగింది. 'ఈ గుర్తింపుతో సంగీతమంటే ప్రేమ అనే విషయం మరోసారి రుజువైంది. సంగీతం మనందరి జీవితాల్లో వెలుగులు ప్రసరింపజేస్తుంది. విషాద వేళల్లోనూ సంతోషాన్ని, ఆనందాన్ని నింపుతుంది'అని ఆమె ఇన్‌స్టాలో పేర్కొన్నారు. చంద్రికా టాండన్ ప్రముఖ బిజినెస్ లీడర్, పెప్సికో సీఈవో ఇంద్రా నూయీకి స్వయానా తోబుట్టువు కావడం విశేషం. చెన్నైలో పుట్టిపెరిగిన చంద్రికా టాండన్ 2009లో 'సోల్ కాల్'అనే ఆల్బమ్‌కుగాను మొట్టమొదటి గ్రామీ గెలుచుకున్నారు. చంద్రికా టాండన్, కెల్లర్‌మన్, మట్సుమొటోలతో కలిసి రూపొందించిన త్రివేణి ఆల్బమ్ 2024 ఆగస్ట్‌లో విడుదలైంది.



ఐరోపా సమాఖ్యపైనా టారిఫ్!

సంకేతాలిచ్చిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ వాణిజ్య యుద్ధానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కెనడా, మెక్సికో, చైనాలపై అదనపు టారిఫ్‌లు విధించిన ట్రంప్ ఇప్పుడు యూరోపియన్ యూనియన్ (ఈయూ)పై సుంకాలు విధిస్తానని సంకేతాలు ఇస్తున్నారు. ట్రంప్ సుంకాలు విధిస్తే తాము దీటుగా బదులిస్తామని ఐరోపా సమాఖ్య సైతం కుండబద్దలు కొట్టింది. చర్చల ద్వారా వాణిజ్య సంఘర్షణను నివారించవచ్చని వ్యాఖ్యానించింది. 27 దేశాల కూటమిపై సుంకాల విధింపు అంశాన్ని పరిశీలిస్తున్నారా? అని వైట్‌హౌజ్‌లో ట్రంప్‌ను మీడియా ప్రశ్నించింది.'' దీనికి నిజమైన సమాధానం కావాలా లేక రాజకీయ సమాధానం కావాలా?. ఖచ్చితంగా విధిస్తా'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. యూరోపియన్ యూనియన్ అమెరికా పట్ల వివక్షాపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈయూకు వ్యతిరేకంగా ట్రంప్ గళమెత్తడం ఇది మొదటిసారి కాదు. వాణిజ్యం విషయంలో అమెరికా పట్ల చాలా అన్యాయంగా వ్యవహరిస్తోందని గతంలోనూ ఆయన ఆరోపించారు. ట్రంప్ తొలిసారిగా అమెరికా అధ్యక్ష పీఠంపై కూర్చున్నప్పుడూ స్టీల్, అల్యూమినియం ఎగుమతులకు సంబంధించి ఈయూపై సుంకాలు విధించారు. దీంతో ఆగ్రహం వ్యక్తంచేసిన ఈయూ కూటమి వెంటనే తగిన రీతిలో స్పందించింది. విస్కీ, మోటార్ సైకిళ్లతో సహా పలు అమెరికా వస్తువులపై టారిఫ్‌లు విధించి ప్రతీకారం తీర్చుకుంది.

ప్రతీకారం తప్పదన్న ఈయూ

కెనడా, మెక్సికో, చైనాలపై అమెరికా టారిఫ్‌లు విధించడాన్ని ఈయూ వ్యతిరేకించింది. ''సుంకాలు అనవసరమైన ఆర్థిక అంతరాయాలను సృష్టిస్తాయి. ద్రవ్యోల్బణాన్ని పెంచుతాయి. అవి రెండు వైపులా ఇబ్బందులను కలగచేస్తాయి. అలాంటిది ఈయూ వస్తువులపైనే అన్యాయంగా లేదా ఏకపక్షంగా సుంకాలు విధించే ఏ వాణిజ్య భాగస్వామికైనా మేం గట్టిగా బదులిస్తాం'' అని ఈయూ వ్యాఖ్యానించింది.

మెక్సికోపై టారిఫ్ అమలుకు బ్రేక్

మెక్సికో నుంచి దిగుమతి అయ్యే వస్తూత్పత్తులపై 25 శాతం టారిఫ్ విధిస్తానని ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆఖరి నిమిషంలో తన ఆదేశాల అమలును నిలుపుదల చేశారు. నేటి నుంచి కొత్త టారిఫ్ అమల్లోకి రావాల్సి ఉండగా తన ఉత్తర్వుల అమలును నెల రోజులపాటు వాయిదా వేస్తున్నట్లు సోమ వారం ట్రంప్ ప్రకటించారు. టారిఫ్‌ల అమలు నిలుపుదలపై అమెరికా సర్కార్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షేన్‌బామ్ వెల్లడించారు. సోమవారం ఆమె ట్రంప్‌తో దాదాపు 45 నిమిషాలు ఫోన్‌లో మంతనాలు జరిపారు.

13న ట్రంప్‌తో ప్రధాని మోదీ భేటీ

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ ఈ నెల 13న వాషింగ్టన్‌లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ కానున్నారని సోమవారం అధికారులు తెలిపారు. సాధ్యమైనంత త్వరలో ప్రధాని మోదీ అమెరికా పర్యటన జరిపేందుకు చర్చలు సాగుతున్నాయని విదేశాంగ శాఖ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ట్రంప్ రెండోసారి అమెరికా పాలనాపగ్గాలు చేపట్టాక ఇది ప్రధాని మోదీ మొట్టమొదటి అమెరికా పర్యటన కానుంది. ఫ్రాన్సులో రెండు రోజుల పర్యటనను ముగించుకుని ఆయన వాషింగ్టన్ వెళతారని చెబుతున్నారు. ట్రంప్ బాధ్యతలు చేపట్టాక జనవరి 27వ తేదీన ప్రధాని మోదీ ఆయనతో ఫోన్‌లో సంభాషించారు.

ట్రంప్ కోసం మోదీ ఆరాటం

- ట్రంప్ ప్రమాణస్వీకారంలో పాల్గొనేందుకు విశ్వప్రయత్నం
- అందుకే 3, 4 సార్లు జైశంకర్‌ను అమెరికాకు పంపారు
- పార్లమెంట్‌లో రాహుల్ దుమారం
- జైశంకర్ తీవ్ర అభ్యంతరం

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంలో లోక్‌సభలో చర్చ సందర్భంగా విపక్ష నేత రాహుల్ గాంధీ సుదీర్ఘ ప్రసంగం చేశారు. అయితే జైశంకర్ అమెరికా పర్యటనపై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. వెంటనే ప్రభుత్వం తరఫున మంత్రులు కలగజేసుకుని రాహుల్ మాటలు తప్పుబట్టారు. అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దీంతో లోక్‌సభలో కొద్దిసేపు మాటల మంటలు చెలరేగాయి. తొలుత రాహుల్ గాంధీ మాట్లాడారు. '' అమెరికా గురించి మాట్లాడాలంటే ఆ దేశంతో భారత్ సత్ఫలితాలనిచ్చే సత్సంబంధాలను కొనసాగించాలి. అంతేగానీ మన ప్రధాని మోదీకి కాబోయే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొనేలా ఆహ్వానం అందేలా పరితపించకూడదు. మోదీకి ఆహ్వానం అందేలా చేయడం కోసం విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మూడు, నాలుగు సార్లు అమెరికాకు వెళ్లి వచ్చారు. వాస్తవానికి భారత్ కీలక సరకుల ఉత్పత్తిరంగంలో అగ్రగామిగా ఉంటే, నూతన టెక్నాలజీల అభివృద్ధిలో విజయపతాక ఎగరేసి ఉంటే అమెరికా కాబోయే అధ్యక్షుడే స్వయంగా భారత్‌కు వచ్చి మన ప్రధానికి ఆహ్వాన పత్రిక ఇచ్చి వెళ్లేవాడు'' అని అన్నారు. దీంతో అధికార బీజేపీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. సభలో ఉన్న మంత్రి కిరెణ్ రిజిజు వెంటనే లేచి నిలబడి '' ఇలాంటి తీవ్ర అభ్యంతరకరమైన, నిరాధార ఆరోపణలను విపక్ష నేత హోదాలో ఉన్న వ్యక్తి చేయడం ఏమాత్రం సముచితంగా లేదు. ఆహ్వానాలు అందటం అనేది ఇరు దేశాల మధ్య సత్సంబంధాలకు సంబంధించిన అంశం. ప్రధాని మోదీకి ఆహ్వానంపై పూర్తి అసంబద్ధ ఆరోపణలు రాహుల్ గుప్పిస్తున్నారు. ఎస్.జైశంకర్ నిజంగానే ఈ పని మీదనే అమెరికాకు వెళ్లి వచ్చారని రాహుల్ వద్ద బలమైన సాక్ష్యాధారాలు ఉంటే వెంటనే సభలో చూపించండి'' అని రిజిజు సవాల్ విసిరారు. దీనికి రాహుల్ వ్యంగ్యంగా.. '' మీ ప్రశాంత మనస్సును ఒక్కసారిగా కలవరపరిచినందుకు క్షమించాలి'' అని అన్నారు. తర్వాత చైనా విషయంలో మోదీ సర్కార్ మెతకవైఖరితో మెలుగుతోందని రాహుల్ ప్రసంగం కొనసాగించారు. '' ప్రధాని మోదీ యేమో మన భూభాగాన్ని చైనా ఆక్రమించుకోలేదని చెప్పారు. కానీ భారత ఆర్మీ మాత్రం లద్దాఖ్‌లో 4,000 చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని చైనా ఆక్రమించిందని చెబుతోంది''అని అన్నారు. రాహుల్ వ్యాఖ్యలపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా స్పందించారు. '' సభలో మీరేం మాట్లాడినా దానికి సంబంధించిన సాక్ష్యాధారాలను సమర్పించాల్సిందే'' అని అన్నారు. మళ్లీ రాహుల్ మాట్లాడుతూ.. '' చైనా ఆర్మీ మన భూభాగంలోకి చొరబడిందని



స్వయంగా చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ చెప్పారు. భూభాగంలోకి మాత్రమే కాదు వస్తూత్పత్తుల పరంగానూ చైనా భారత్‌లో చొరబడింది. ఇక్కడ సరకుల ఉత్పత్తి, ఎగుమతి సామర్థ్యం తక్కువ. అందుకే చైనా వస్తువులు భారత్‌ను ముంచెత్తుతున్నాయి. మనం సరిహద్దుల్లో మాత్రమే చైనాతో యుద్ధం చేస్తే సరిపోదు. మన గడ్డపై హవా కొనసాగిస్తున్న చైనీస్ ఎలక్ట్రిక్ మోటార్లు, చైనీస్ బ్యాటరీలు, చైనా ఆప్టిక్స్‌తో పోటీని తట్టుకోవాలి. లేదంటే మనం ఎప్పటికీ వాటినే కొనుక్కుంటూ పోవాల్సి ఉంటుంది'' అని అన్నారు.

మేక్ ఇన్ ఇండియా మంచిదే

''బీజేపీ ప్రభుత్వం తెచ్చిన 'మేక్ ఇన్ ఇండియా' సిద్ధాంతం పరంగా మంచిదే. కానీ దానిని క్షేత్రస్థాయిలో అమలుచేయడంలో బీజేపీ సర్కార్ ఘోరంగా విఫలమైంది. 2014లో జీడీపీలో తయారీరంగం వాటా 15.3 శాతం ఉంటే ఇప్పుడది కేవలం 12.6 శాతానికి పడిపోయింది. ఇది గత 60 ఏళ్లలోనే కనిష్టం. నేను మోదీని నిందించట్లేను. ఆయన ప్రయత్నం చేయలేదని నేను చెప్పను. ప్రయత్నించారుగానీ విఫలమయ్యారు'' అని అన్నారు.

చైనా కంటే భారత్ పదేళ్లు వెనకబడింది

''సమాచారం(డేటా) విషయంలో భారత్ చైనా కంటే పదేళ్లు వెనకబడింది. అదే ఏఐను మనం భారత్‌లో కులగణనకు ఉపయోగిస్తే ఫలితాలు అద్భుతంగా వస్తాయి. ఏ కులం ఎందుకు వెనకబడిందో ఏఐ సమూల వివరాలు, పరిష్కారాలను అందిస్తుంది. మరోవైపు భారతీయ ఏఐతో చైనా ఎలక్ట్రిక్ మోటార్లు, బ్యాటరీలు, సోలార్ ప్యానెళ్లు, పవన విద్యుత్ టర్బైన్ల హవాకు గండికొట్టొచ్చు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంలో చర్చలో 'ఇండియా' ఘట్‌బంధన్ కూటమి నేతగా నేనిచ్చే సలహాలు ఇవే'' అని రాహుల్ అన్నారు.

మోదీకి ఇన్విటేషన్ సాధించేందుకే తాను అమెరికా వెళ్లానన్న వ్యాఖ్యలపై జైశంకర్ స్పందించారు. "రాహుల్ చెప్పేవన్నీ అబద్ధాలు. అయినా ప్రమాణస్వీకారాలకు మన ప్రధాని మోదీ వెళ్లబోరు అనే కనీస జ్ఞానం రాహుల్‌కు ఉండాలి కదా" అని జైశంకర్ స్పష్టం చేశారు.



భక్తులపై పూలవర్షం

పోటెత్తిన భక్తకోటి

వసంత పంచమి వేళ భారీగా తరలివచ్చిన జనం

మహా కుంభ్ నగర్: మహా కుంభమేళాలో అత్యంత పవిత్రమైన మూడో అమృత్‌స్నాన ఘట్టంలో కోట్లాది మంది భక్తులు పాల్గొన్నారు. వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం తెల్లవారుజాము కంటే ముందే ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమ ఘాట్ల వద్ద భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. జనవరి 29న మౌని అమావాస్య సందర్భంగా పోటెత్తిన భక్తుల రద్దీతో తొక్కిసలాట జరిగి 30 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన నుంచి గుణపాఠాలు నేర్చుకున్న యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం అత్యంత కట్టుదిట్టమైన రక్షణ ఏర్పాట్లు చేసింది. భారీ ఎత్తున పోలీసు బలగాలను కుంభమేళా అంతటా మోహరించింది. ఎక్కడా జనం ఒకేచోట పోగుబడి తొక్కిసలాట ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంది. దీంతో సోమవారం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా సాఫీగా పుణ్యస్నానాల కార్యక్రమం కొనసాగింది. జనవరి 29న అమృత్‌స్నాన్ రోజు ఎక్కువ మంది త్రివేణి సంగం నోస్ ఘాట్‌లో పుణ్యస్నానాలపై ఆసక్తి చూపగా ఈసారి చాలా మంది దూరంగా ఉన్న ఘాట్లలోనే పుణ్యస్నానాలు చేశారు. సోమవారం తెల్లవారుజామకంటే ముందే 3.30 గంటల నుంచే ఉత్తరప్రదేశ్ సీఎం యోగి లక్నోలోని తన అధికారిక నివాసం నుంచే ప్రత్యక్ష ప్రసారంలో ఘాట్లలో ఏర్పాట్లు, పోలీసులు పహారాపై సమీక్ష కొనసాగించారు. '' ఇక్కడికి విచ్చేసిన సాధువులు, అఖాడాలు, కల్పవాసీలు, భక్తులు అందరికీ నా ధన్యవాదాలు'' అని తర్వాత 'ఎక్స్'లో సీఎం ఒక పోస్ట్‌చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకల్లా దాదాపు 82 లక్షల మంది పవిత్రస్నానాలు ఆచరించారని యూపీ ప్రభుత్వం ప్రకటించింది. అర్ధరాత్రికల్లా ఐదు కోట్లకుపైగా పుణ్యస్నానాలు చేస్తారని ప్రభుత్వం అంచనావేసింది.

అఖాడా, నాగ సాధువుల అమృత్ స్నానాలు

వసంత పంచమి రోజున షాహీ స్నాన్‌లో భాగంగా అఖాడాలు, లక్షలాది మంది నాగ సాధువులు సోమవారం తెల్లవారుజాము కంటేముందే 4 గంటలకు సన్యాసీ సెక్టార్ ఘాట్లలో అమృతస్నానాలు ఆచరించారు. ఉదయం 10 గంటలకల్లా ముఖ్యమైన అఖాడాల్లోని సాధువులు పుణ్యస్నానాలు ముగించుకుని తమ తమ శిబిరాలకు తిరుగు పయనమయ్యారు. వేలాదిగా తరలివచ్చిన సాధువులపై ప్రభుత్వం హెలికాప్టర్‌ల నుంచి గులాబీ రేకుల వర్షం కురిపించింది.

కుంభమేళా విషాదంపై దద్దరిల్లిన పార్లమెంట్

ఉభయ సభల్లో నినాదాల హోరు ● నిరసనల మధ్యే కొనసాగిన ప్రశ్నోత్తరాలు

సాక్షి, న్యూఢిల్లీ: మహా కుంభమేళాలో తొక్కిసలాట ఘటనపై ప్రతిపక్షాల నినాదాలతో పార్లమెంట్ దద్దరిల్లింది. బడ్జెట్ సమావేశాల రెండో రోజు విపక్షాల ఆందోళనతోనే ఉభయసభలు మొదలయ్యాయి. మహా కుంభమేళాలో తొక్కిసలాటలో 30 మంది మృతి చెందిన అంశంపై చర్చించాలంటూ విపక్షాలు పట్టుబట్టాయి. విషాదానికి ప్రభుత్వానిదే బాధ్యతని ఆరోపించాయి. విపక్షాల డిమాండ్‌ను సభాధిపతులు అంగీకరించకపోవడంతో నినాదాల నడుమనే ప్రశ్నోత్తరాలు సాగాయి. సోమవారం ఉదయం లోక్‌సభ ఆరంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలు చేపట్టారు. ప్రశ్నోత్తరాలు రద్దు చేసి కుంభమేళాలో తొక్కిసలాటపై చర్చించాలని కాంగ్రెస్, ఎస్పీ సహా ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ఇందుకు స్పీకర్ బిర్లా అంగీకరించలేదు. 'రాష్ట్రపతి ప్రసంగంలో కుంభమేళా అంశాన్ని సైతం ప్రస్తావించారని, ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా సభ్యులు ప్రయాగ్‌రాజ్ అంశాన్ని లేవనెత్తవచ్చు'అని సూచించారు. అయినప్పటికీ విపక్ష ఎంపీలు వెనక్కి తగ్గకుండా 'మోదీ, యోగి డౌన్ డౌన్', 'మోదీ–యోగి సిగ్గు సిగ్గు', సనాతన వ్యతిరేక సర్కారు గద్దె దిగాలంటూ నినదించారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన స్పీకర్ 'ప్రశ్నోత్తరాలు చాలా కీలకం. సభ్యులు సహకరించాలి. సభ సజావుగా నడవాలని కోరు కోవట్లేదా..? చర్చ జరగాలని అనుకోవట్లేదా..? అని ప్రశ్నించారు. పట్టించుకోని విపక్ష ఎంపీలు పోడియంలోకి వచ్చి నినాదాలు చేశారు. తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారి పేర్ల జాబితాను అందించాలని డిమాండ్ చేశారు. విపక్షాల నినాదాలు, ఆందోళనల మధ్యే స్పీకర్ 18 వరకు ప్రశ్నలకు సమాధానాలను కొనసాగించారు. మధ్యలో కొందరు సభ్యులు బల్లలు చరుస్తూ అంతరాయం కలిగించడంపై స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు మిమ్మల్ని ప్రశ్నలు అడగటానికే పంపారు తప్ప బల్లలు పగలగొట్టడానికి కాదన్నారు. పన్ను చెల్లింపుదారుల డబ్బును వృధా అయ్యేలా మీ ప్రవర్తన ఉంది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నోత్తరాల అనంతరం కొద్దిసేపు కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, ఎస్పీ సభ్యులు వాకౌట్ చేశారు. అనంతరం వారు తిరిగి వచ్చాక సభ సజావుగా సాగింది.

తొక్కిసలాటకు ప్రభుత్వానిదే బాధ్యత

కుంభమేళాకు వచ్చే భక్తులకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఎంపీ కనిమొళి ఆరోపించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో ఆమె పాల్గొన్నారు. మతం, రాజకీయాలు కలగలిస్తే బలయ్యేది సామాన్యులే. తొక్కిసలాటలో ఎందరు మృతి చెందింది తెలియ దన్నారు.

రాజ్యసభలో విపక్షం వాకౌట్..

కుంభమేళా తొక్కిసలాటపై రాజ్యసభలో విపక్షాలు ఆందోళన కొనసాగించాయి. ప్రశ్నోత్తరాలు రద్దు చేసి తామిచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చించాలని కాంగ్రెస్, ఎస్పీ, డీఎంకే, ఆప్, ఆర్‌జేడీ, సీపీఐ, సీపీఎంలతో సహా ప్రతిపక్ష ఎంపీలు పెద్ద ఎత్తున నిరసనలకు దిగారు. దీనికి చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ నిరాకరించడంతో విపక్షాలు నినాదాలతో హోరెత్తించాయి. దేశ రాజ్యాంగ ప్రయాణంలో రాజ్యసభ ఒక మైలురాయి అని, సభలో సభ్యుల ప్రవర్తన ఆదర్శప్రాయంగా ఉండేలా చూడాలని ఎంపీలకు ధన్‌ఖడ్ విజ్ఞప్తి చేశారు. దీంతో విపక్ష ఎంపీలు సభ నుంచి వాకౌట్ చేశారు.

వేలాది మంది మృతులకు నివాళులు: ఖర్గే

మహాకుంభమేళాలో జనవరి 29వ తేదీన జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలు పోగొట్టుకున్న వేలాది మందికి నివాళులంటూ కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరకం వ్యక్తమైంది. 'ఇది నా అంచనా. నేను చెప్పేది నిజం కాకుంటే, ప్రభుత్వం వాస్తవాలను వెల్లడించాలి. అప్పుడు నేను నా ప్రకటనను సరి చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నా'అని అన్నారు. ఎవరినో విమర్శించడానికి నేను వేలమంది అని అనలేదు. కానీ, ఎందరు చనిపోయారు, ఎందరు గల్లంతయ్యారు, కనీసం సమాచారమైనా అందించండి. తప్పయితే క్షమాపణ చెబుతా'అని ఆయన చెప్పారు. చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ఆ ప్రకటనను వెనక్కి తీసుకోవాలని కోరినా ఖర్గే ససేమిరా అన్నారు.

సోనియాపై హక్కుల తీర్మానం

రాజ్యసభ ఎంపీ సోనియా గాంధీపై బీజేపీకి చెందిన 21 మంది సభ్యులు హక్కుల తీర్మానం ప్రవేశపెట్టారు. ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగంపై సోనియా చేసిన వ్యాఖ్యలు వివాదం రేపడం తెలిసిందే. సోనియా వ్యాఖ్యలు రాష్ట్రపతిని అవమానించేలా, స్థాయిని కించపరిచేలా ఉన్నాయని వారు ఆరోపించారు. ప్రసంగం చివర్లో రాష్ట్రపతి బాగా అలసిపోయారని, అతికష్టమ్మీద మాట్లా డారని, సోనియా మీడియా ఎదుట వ్యాఖ్యా నించారు.

రాజస్తాన్ అసెంబ్లీలో మతమార్పిడి బిల్లు

జైపూర్: రాజస్తాన్‌లోని బీజేపీ ప్రభుత్వం సోమవారం అసెంబ్లీలో మతమార్పిడుల నిరోధక బిల్లును ప్రవేశపెట్టింది. మార్పిడి నిరోధక బిల్లు ప్రకారం అక్రమంగా మత మార్పిడులను ప్రోత్సహించే వారికి నాన్–బెయిలబుల్ వారెంట్లు జారీ చేస్తారు. ఇటువంటి నేరాలపై కోర్టులు విచారణ చేపడతాయి. నేరం రుజువైతే 10 ఏళ్ల వరకు జైలు శిక్షతోపాటు రూ.50 వేల వరకు జరిమానా విధించొచ్చు. రెండో సారి తప్పు చేసిన వారికి రెట్టింపు శిక్షలకు అవకాశముంది. బాధితులకు రూ.5 లక్షల వరకు దోషులుగా తేలిన వారు చెల్లించేందుకు కూడా ఇందులో ఏర్పాట్లున్నాయి. ఎవరైనా మతం మారాలని భావిస్తే 60 రోజులు ముందుగా సంబంధిత ధ్రువీకరణపత్రంతో జిల్లా మేజిస్ట్రేట్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మత స్వేచ్ఛ, లౌకికవాద సాధనే లక్ష్యంగా ఈ బిల్లును తీసుకువచ్చినట్లు రాష్ట్ర ఆరోగ్య మంత్రి గజేంద్ర సింగ్ అసెంబ్లీలో ప్రకటించారు.

సాక్షి హైదరాబాద్

మంగళవారం । 4 । ఫిబ్రవరి । 2025



టెస్ట్ డ్రైవ్ చేస్తామని..

ఓఎల్ఎక్స్‌లో అమ్మకానికి ఉన్న బైకులు కొంటామని వచ్చి..టెస్ట్ డ్రైవ్ చేస్తామని నమ్మించి వాహనాలతో ఉడాయిస్తున్న ఇద్దర్ని బాచుపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. -8లో



ప్రయాగ రాముడు

కుంభమేళాలో అయోధ్య రాముని రెప్లికా నిర్మాణం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ నిర్మాణాన్ని నగరానికి చెందిన రమణ వంక 25 రోజుల్లో రూపుదిద్దారు. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
34.0/18.0

వాతావరణం

నగరంలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం వేళల్లో పొగమంచు వాతావరణం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. రాత్రి వేళ చల్లని గాలులు వీస్తాయి.





పార్కులో ఏర్పాటు చేసిన వైకుంఠపాళి, చెస్ బోర్డులను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం, మేయర్ విజయలక్ష్మి తదితరులు



ఎస్ఎఫ్‌సీ జంక్షన్‌లో ఇలా..

హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచుదాం

- ఆ దిశగానే జంక్షన్ల సుందరీకరణ
- నగరవాసులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించడమే లక్ష్యం
- మంత్రి పొన్నం ప్రభాకర్

బంజారాహిల్స్: హైదరాబాద్ నగర బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, ఇందుకు ప్రజలు కూడా సహకరించాలని బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. నగరంలో కోట్ల రూపాయలు వ్యయం చేసి జంక్షన్లను సుందరీకరిస్తున్నామని, నగరవాసులు ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ మేరకు ఫ్లై ఓవర్లు, జంక్షన్ల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సోమవారం పంజగుట్ట ఎస్ఎఫ్‌సీ జంక్షన్ వద్ద రూ.10.09 కోట్ల వ్యయంతో చేపట్టి వివిధ అభివృద్ధి పనులను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తిలతో కలిసి మంత్రి పొన్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జూబ్లీహిల్స్ రోడ్ నెం.10లో రూ.32 లక్షలతో చిల్డ్రన్ లెర్నింగ్ అండ్ ప్లే పార్కు, రూ. 2.82 కోట్లతో ఎస్ఎఫ్‌సీ జంక్షన్ అభివృద్ధి, రూ.3.80 కోట్లతో పంజగుట్ట ఫ్లైఓవర్ బ్యూటిఫికేషన్, రూ.3.15 కోట్లతో సోమాజిగూడ జంక్షన్లను అభివృద్ధి చేశామన్నారు. హైదరాబాద్ వ్యాప్తంగా జంక్షన్ల అభివృద్ధి, ఫ్లైఓవర్ల కింద వర్టికల్ గార్డెన్ల ఏర్పాటు, భావితరాలకు స్ఫూర్తినిచ్చే విధంగా పెయింటింగ్‌లతో తీర్చిదిద్దినట్లు తెలిపారు. తాగునీరు, వీధి దీపాలు, శానిటేషన్ సమస్యలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పరిష్కరిస్తున్నామన్నారు. అభివృద్ధి, సుందీకరణ అంశాలలో నగర ప్రజలు సూచనలు సలహాలు ఇస్తే మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి పొన్నం తెలిపారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ నగరంలో బ్యూటిఫికేషన్ పనులతో పాటు శానిటేషన్‌ను మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. భవన నిర్మాణ వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ డంప్ చేయకుండా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంతో గట్టి నిఘా ఏర్పాటు చేసి నివారణ చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటి వరకు సుమారు రూ. 42 లక్షలను జరిమానాలు వేశామన్నారు. ఈ క్రమంలో వాణిజ్య సముదాయాల వద్ద డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేశామన్నారు. జీవీపీలను శాశ్వతంగా తొలగించేందుకు బిన్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, కార్పొరేటర్లు విజయారెడ్డి, సంగీత శ్రీనివాస్ యాదవ్, ఎస్ఈ రత్నాకర్, ఈఈ లు విజయ్ కుమార్, వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జారిపడ్డ మేయర్



మేయర్ విజయలక్ష్మికి తృటిలో ప్రమాదం తప్పింది. సోమవారం సాయంత్రం పంజగుట్ట సర్కిల్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సుందరీకరణ పనులను ప్రారంభించిన అనంతరం..రోడ్డుకు అవతలి వైపు ఉన్న ఫుట్‌పాత్‌ను ఆధునీకరించారని..పరిశీలించాలని కోరగా అక్కడికి మంత్రితో వెళ్లిన విజయలక్ష్మి ఫుట్‌పాత్‌ను తగిలి కిందపడ్డారు. పక్కనే ఉన్న డిప్యూటీ మేయర్ శ్రీలత వెంటనే మేయర్‌ను పైకి లేపారు. ఈ ప్రమాదంలో ఆమెకు ఎటువంటి గాయాలు కాలేదు.

మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి

– గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



బంజారాహిల్స్: సమాజాభివృద్ధికి మహిళా సాధికారత చాలా ముఖ్యమని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. మహిళా సాధికారత లేకుండా స్థిరమైన భవిష్యత్తును ఊహించలేమన్నారు. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-46లోని వీ హబ్‌ను సోమవారం ఆయన ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి సందర్శించారు. మహిళా పారిశ్రామికవేత్తలు రూపొందించిన ఉత్పత్తులను ఆయన ఆసక్తిగా తిలకించారు. వినూత్న ఆలోచనల నుంచి తయారుచేసిన ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శించారు. టెక్ స్టార్టప్‌ల నుంచి హ్యాండీక్రాఫ్ట్స్ వరకు విభిన్న రంగాల వ్యాపారాలను మహిళలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ మహిళలకు సమాన అవకాశాలు కల్పించేందుకు, వారికి సుస్థిర భవిష్యత్తును అందించేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలు రాష్ట్ర ఆర్థిక ప్రగతికి భాగస్వాములుగా పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళల సాధికారత కోసం ప్రభుత్వం ఎన్నో రకాల పథకాలను అమలుచేస్తుందన్నారు. మహిళా పారిశ్రామికవేత్తల ఉన్నతిలో తెలంగాణ ముందంజలో ఉందన్నారు. మహిళాశక్తి, మహాలక్ష్మి పథకాలు, స్కిల్ యూనివర్సిటీ ద్వారా మహిళలకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు, వారి ఆలోచనలను విజయవంతమైన వ్యాపారాలుగా మార్చుకునేందుకు తాము కృషి చేస్తున్నామన్నారు. వీ హబ్ సీఈఓ సీతా పల్లచోల్లా మాట్లాడుతూ దేశంలో మహిళా పారిశ్రామికవేత్తల కోసం రాష్ట్ర ప్రభుత్వం స్థాపించిన మొట్టమొదటి సంస్థ వీ హబ్ అన్నారు. పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా తెలంగాణలోని మారుమూల గ్రామీణ ప్రాంతాల వరకు తమ సేవలు అందాల్సిందేనన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలకు మెంటార్‌షిప్, మార్కెట్ అవకాశాల కోసం నిరంతర కృషి చేస్తున్నామన్నారు.

కోర్‌లోనే మోర్!

- జీహెచ్ఎంసీ ప్రజావాణిలో వెల్లడి
- శివార్లలోనూ విచ్చలవిడి నిర్మాణాలున్నా ఫిర్యాదులు రాని వైనం

అక్రమ నిర్మాణాలపై కోర్‌సిటీలో అధిక ఫిర్యాదులు



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ పరిధిలో అనుమతుల్లేని భవనాలు, అనుమతులను మించి ఉల్లంఘనలతో నిర్మాణాలు అన్ని చోట్లా జరుగుతున్నా.. హైదరాబాద్ జిల్లా పరిధిలోకొచ్చే కోర్ సిటీనుంచే ఎక్కువ ఫిర్యాదులందుతున్నాయి. శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, మియాపూర్, కొండాపూర్, కూకట్‌పల్లి, మూసాపేట, ఎల్‌బీనగర్, ఉప్పల్, హయత్‌నగర్, నాగోల్, మన్సూరాబాద్, దిల్‌సుఖ్‌నగర్ వంటి ప్రాంతాల్లో నిర్మాణాలు ఎక్కువగా జరుగుతున్నా..మిగతా ప్రాంతాలతో పోలిస్తే ఈ ప్రాంతాల్లోనే అక్రమ భవన నిర్మాణాలు ఎక్కువగా ఉన్నా..వాటిపై ఫిర్యాదులు చేసేందుకు అక్కడి ప్రజలు మాత్రం ముందుకు రావడం లేదు. వ్యక్తిగతంగా తమకు తీవ్ర సమస్యగా మారినప్పుడో, నిర్మాణాలు జరిపేవారితో పడని సందర్భాల్లో మాత్రమే సదరు ప్రాంతాల నుంచి ఫిర్యాదులు చేస్తున్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రతి సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయానికి అందుతున్న ఫిర్యాదులు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. శివారు ప్రాంతాలున్న శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, ఎల్‌బీనగర్ జోన్ల కంటే కోర్‌సిటీ పరిధిలోకొచ్చే ఖైరతాబాద్, సికింద్రాబాద్, చార్మినార్ జోన్ల నుంచే ప్రజలు అక్రమ నిర్మాణాలపై ఎక్కువ ఫిర్యాదులు చేయడం విశేషం.

- జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఇలంబర్తి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచీ టౌన్ ప్లానింగ్ విభాగంపైనే ఎక్కువ ఫిర్యాదులందుతుండటాన్ని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రతివారం సంబంధిత అధికారులను ఆదేశిస్తున్నప్పటికీ, చర్యలు తీసుకోవడంలోనూ ఆలస్యం జరుగుతోంది. ఎల్‌బీనగర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి జోన్లలోని శివార్లలో ఇబ్బడిముబ్బడిగా నిర్మాణాలు, వాటితోపాటే అక్రమ నిర్మాణాలూ ఎక్కువగా జరుగుతున్నా, సదరు ప్రాంతాల నుంచి ఫిర్యాదులు రావడం లేదంటే, ప్రజలు పట్టించుకోవడం లేదో, లేక అక్కడి అధికారులే ఫిర్యాదులు అందకుండా మేనేజ్ చేస్తున్నారో..అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
- అందిన వాటిల్లో దాదాపు సగం ఫిర్యాదులపై మాత్రమే చర్యలు తీసుకోవడం గుర్తించవచ్చు.
- సర్కిళ్ల పరంగా చూస్తే పాతబస్తీ పరిధిలోకొచ్చే గోషామహల్ సర్కిల్ నుంచి అత్యధికంగా 37, తర్వాతి స్థానాల్లో చార్మినార్ నుంచి 34, ముషీరాబాద్ నుంచి 29, ఖైరతాబాద్‌నుంచి 27 ఫిర్యాదులందాయి.
- ఎల్‌బీనగర్ జోన్‌లోని ఐదు సర్కిళ్ల నుంచీ వెరసి కేవలం 27 ఫిర్యాదులే అందాయంటే పరిస్థితిని అంచనా వేసుకోవచ్చు.
- మొత్తం ఫిర్యాదుల్లో 24 నిర్మాణాల కూల్చివేతలకు ఉన్నతాధికారులు ఆదేశాలివ్వగా, ఏడింటిని కూల్చివేశారు. మిగతావి వివిధ ప్రక్రియల్లో, వివిధ దశల్లో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

అక్టోబర్ 10 నుంచి జనవరి 27 వరకు 'ప్రజావాణి'కి అందిన ఫిర్యాదుల వివరాలు..

జోన్	ఫిర్యాదులు	చర్యలు	పురోగతి /పెండింగ్
ఎల్‌బీనగర్	27	16	11
చార్మినార్	64	34	30
ఖైరతాబాద్	101	52	49
శేరిలింగంపల్లి	28	18	10
కూకట్‌పల్లి	27	18	9
సికింద్రాబాద్	83	36	47
మొత్తం	330	174	156

కొత్తవి లేవ్.. పాతవాటికే నిధులు!

- నాంపల్లి రైల్వే స్టేషన్ పునరభివృద్ధికి రూ.327 కోట్లు
- బడ్జెట్‌లో కొత్త రైల్వే ప్రాజెక్టులు లేవు

సాక్షి, సిటీబ్యూరో: కేంద్ర బడ్జెట్ ఊరించి ఉసూరుమనిపించింది. నగరంలో రైల్వే సదుపాయాల విస్తరణ కోసం కొత్తగా ఎలాంటి ప్రాజెక్టులను కేటాయించలేదు. ఎంఎంటీఎస్ కొత్త రైళ్లు లేవు. గతంలో చేపట్టిన పనులకు కొనసాగింపుగా ఈ బడ్జెట్‌లో నిధులను మాత్రం కేటాయించారు. అమృత్ భారత్ పథకం కింద చేపట్టిన రైల్వేస్టేషన్‌ల పునరభివృద్ధిలో భాగంగా ఈ ఏడాది నాంపల్లి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. ప్రస్తుతం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. కొద్ది రోజుల క్రితమే చర్లపల్లి టెర్మినల్ సేవలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలోనే రూ.327 కోట్లతో నాంపల్లి స్టేషన్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో సర్వేలు, ప్రాథమిక పనులు పూర్తయ్యాయి. తాజాగా ఈ బడ్జెట్‌లో నిధులను కేటాయించారు.

భాగ్యనగర సంస్కృతి ప్రతిబింబించేలా..

నవాబు కుటుంబాలకు రైల్వే సేవల కోసం అప్పటి నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1907లో దక్కన్ రైల్వేస్టేషన్‌ను నిర్మించారు. కాలక్రమంలో ఇది నాంపల్లిస్టేషన్‌గా స్థిరపడింది. మొత్తం 6 ప్లాట్‌ఫామ్‌లతో ప్రతిరోజు సుమారు 50 వేల మంది ప్రయాణికులతో సికింద్రాబాద్ తరువాత నాంపల్లిస్టేషన్ రెండవ స్థానంలో నిలిచింది. చార్మినార్, శబరి, నర్సాపూర్, గోదావరి, తదితర ప్రధాన రైళ్లు నాంపల్లి నుంచి బయలుదేరుతాయి. హైదరాబాద్ సంస్కృతి ప్రతిబింబించే విధంగా నాంపల్లి స్టేషన్‌ను అభివృద్ధి చేయాలనే ప్రతిపాదన చాలకాలంగా ఉంది. దేశవిదేశాలకు చెందిన సందర్శకులు నాంపల్లి స్టేషన్‌కు చేరుకోగానే హైదరాబాద్‌లోని పర్యాటక ప్రాంతాలు, విశేషాలు, చారిత్రక అంశాలు తెలిసేలా..ప్రదర్శనలను ప్రతిబింబిస్తూ స్టేషన్‌ను అధునాతనంగా తీర్చిదిద్దాలని భావించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరభివృద్ధితో పాటే నాంపల్లి పునరభివృద్ధికి కూడా ప్రణాళికలను సిద్ధం చేశారు. కానీ సకాలంలో నిధులు కేటాయించకపోవడం వల్ల జాప్యం చోటుచేసుకుంది. ప్రస్తుతం అమృత్



భారత్ కింద దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన స్టేషన్ల పునరభివృద్ధి పనులు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు నగరంలో పలు స్టేషన్లను ఎంపిక చేశారు. వాటిలో కొన్ని పూర్తయ్యాయి. కొన్నిస్టేషన్లలో పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుత నాంపల్లి స్టేషన్ రీడెవలప్‌మెంట్ కోసం రూ.327 కోట్లు కేటాయించనున్నారు.

అమృత్ భారత్ స్టేషన్లు ఇవే...

అమృత్‌భారత్ పథకంలో భాగంగా బేగంపేట్, ఉందానగర్, మేడ్చల్, యాకుత్‌పురా, హఫీజ్‌పేట్, హైటెక్‌సిటీ, ఉప్పుగూడ, కాచిగూడ, లింగంపల్లి, మల్కాజిగిరి, సికింద్రాబాద్ స్టేషన్‌లను ఎంపిక చేశారు. హైటెక్‌సిటీ, మల్కాజిగిరి, లింగంపల్లి స్టేషన్‌ల పునరభివృద్ధి పూర్తయింది. సుమారు రూ.720 కోట్లతో చేపట్టిన సికింద్రాబాద్‌స్టేషన్ పునరభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ ఏడాది చివరినాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇక సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లిస్టేషన్‌ల నుంచి వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ తదితర స్టేషన్‌లకు నమో భారత్ రైళ్లు రానున్నాయి. ఎదురెదురుగా వచ్చే రైళ్లు ఢీకొనకుండా అరికట్టే విధంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన కవచ్ కోసం.. సికింద్రాబాద్‌లోని ఇరిసెట్ కార్యాలయంలో 'కవచ్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేయనున్నారు.

10,03,286

గ్రేటర్‌లో జీరోబిల్లుల సంఖ్య ఇదీ..

ప్రతి నెలా రూ.38.62 కోట్ల రాయితీ చెల్లింపు



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో 'ఉచిత వెలుగులు' మరింత వికసిస్తున్నాయి. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రతి నెలా జారీ చేస్తున్న జీరో బిల్లుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. గృహలక్ష్మి పథకం కింద ప్రతి నెలా 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే గృహాలకు జీరో బిల్లు జారీ చేస్తున్న విషయం తెలిసిందే. 2024 మార్చి నుంచి ఈ పథకం ప్రారంభమైంది. మొదట్లో ప్రజాపాలన కింద వచ్చిన దరఖాస్తుల్లో అర్హులైన వారికి జీరో బిల్లు అవకాశం కల్పించింది. తొలుత సుమారు 7 లక్షల మంది



ఈ పథకం కింద అర్హత పొందారు. ఆ తర్వాత ఎడిట్ ఆప్షన్ ఇవ్వడంతో కొత్తగా మరికొన్ని కనెక్షన్లు వచ్చి చేరాయి. గ్రేటర్‌లో మొత్తం పది సర్కిళ్లు ఉండగా, వీటి పరిధిలో ఇప్పటి వరకు మొత్తం 10,03,286 మంది జీరో బిల్లుకు అర్హత పొందారు. వీరు ప్రతి నెలా 89.39 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగిస్తుండగా, ఇందుకు సంబంధించిన రాయితీ మొత్తం రూ.38.62 కోట్లు ప్రభుత్వం డిస్కంకు చెల్లిస్తుంది.

జోన్ల వారీగా పరిశీలిస్తే...

మెట్రో జోన్‌లో ప్రతి నెలా 2,55,046 కనెక్షన్లకు జీరో బిల్లులు జారీ అవుతున్నాయి. వీరు ప్రతి నెలా 25.05 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగిస్తుండగా, ఇందుకు సంబంధించిన నెలవారీ విద్యుత్ బిల్లులను రూ.10.91 కోట్లు చెల్లిస్తుంది. అదే విధంగా రంగారెడ్డి జోన్‌లో 3,07,467 మంది ఈ పథకం కింద లబ్ధి పొందుతున్నారు. వీరు ప్రతి నెలా 52.85 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగిస్తుండగా, ప్రభుత్వం రూ.11.19 కోట్లు చెల్లిస్తుంది. అదే విధంగా మేడ్చల్ జోన్‌లో అత్యధికంగా 4,40,773 గృహ విద్యుత్ వినియోగదారులు ఈ పథకం కింద లబ్ధి పొందుతున్నారు. వీరు ప్రతి నెలా 38.49 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. ప్రభుత్వం వీరికి సంబంధించిన రాయితీ బిల్లును రూ.16.52 కోట్లను ప్రభుత్వం చెల్లిస్తుంది. వేసవి నేపథ్యంలో విద్యుత్ వినియోగం మరింత పెరిగి, లబ్ధిదారుల సంఖ్య తగ్గే అవకాశం లేకపోలేదు. వినియోగం విషయంలో చిన్నచిన్న జాగ్రత్తలు పాటిస్తే..ఉచిత విద్యుత్ పథకాన్ని భవిష్యత్తులో కూడా పొందవచ్చని డిస్కం నిపుణులు సూచిస్తున్నారు.


గ్రేటర్ సర్కిళ్ల పరిధిలో ప్రతినెలా జారీ చేస్తున్న జీరో విద్యుత్ బిల్లులు ఇలా...

సర్కిల్ పేరు	జీరో బిల్లులు	ఇస్తున్న రాయితీ(రూ.కోట్లలో)	విద్యుత్ వినియోగం (ఎంయూలు)
బంజారాహిల్స్	32,855	1.57	3.56
హైదరాబాద్ సెంట్రల్	62,709	2.84	6.49
హైదరాబాద్ సౌత్	92,573	3.53	8.18
సికింద్రాబాద్	66,909	2.97	6.82
సైబర్‌సిటీ	68,073	2.67	6.14
రాజేంద్రనగర్	1,29,387	4.04	9.04
సరూర్‌నగర్	1,10,000	4.48	10.31
హబ్సిగూడ	1,21,417	5.39	12.35
మేడ్చల్	1,09,613	4.94	11.32
సంగారెడ్డి	2,09,743	6.19	14.82



ఆచితూచి అడుగులు..

- రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల బీజేపీ అధ్యక్ష పదవికి తీవ్ర పోటీ
- మూడు జిల్లాలకు అధ్యక్షుల ప్రకటన, మరికొన్ని చోట్ల వాయిదా



బుద్ధి శ్రీనివాస్




భరత్ గౌడ్



లంకల దీపక్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: జిల్లా సారథుల ఎంపికపై భారతీయ జనతాపార్టీ అచితూచి వ్యవహరిస్తోంది. ఈ ఏడాది శివార్లలో స్థానిక సంస్థలు, జీహెచ్ఎంసీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో పార్టీ అధ్యక్షుల నియామకంపై విస్తృత సంప్రదింపులు జరుపుతోంది. హైదరాబాద్ సెంట్రల్, మేడ్చల్ రూరల్, మహంకాళి సికింద్రాబాద్ జిల్లాలకు అధ్యక్షులను ప్రకటించిన అధిష్టానం..రంగారెడ్డి అర్బన్, రంగారెడ్డి రూరల్, మేడ్చల్ అర్బన్, వికారాబాద్, హైదరాబాద్ గోల్కొండ, భాగ్యనగర్ జిల్లాలను పెండింగ్‌లో పెట్టింది. తమ వర్గానికి చెందిన నేతలకే పార్టీ పగ్గాలు అప్పగించాలని సీనియర్లు పట్టుబట్టడం కూడా వీటి వాయిదా కారణంగా కనిపిస్తోంది. ప్రధానంగా చేవెళ్ల పార్లమెంటు నియోకవర్గం పరిధిలో ఉన్న రంగారెడ్డి అర్బన్, రూరల్ జిల్లాల అధ్యక్షులుగా తన వర్గీయులను నియమించాలని ఓ కీలక నేత పట్టుబడుతుండగా, రంగారెడ్డి అర్బన్, మేడ్చల్ జిల్లా పరిధిలో మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గంలోని మరో నాయకుడు తన సన్నిహితుడికి అవకాశం కల్పించాలంటూ మొండికేస్తున్నారు. దీంతో ఈ జిల్లాల అధ్యక్షుల నియామక ప్రక్రియకు మరికొన్నాళ్లు పట్టే అవకాశం కనిపిస్తోంది. రంగారెడ్డి గ్రామీణ అధ్యక్ష బాధ్యతలు తనకే అప్పగించాలంటూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన ఓ మహిళా నేత ఒత్తిడి చేస్తున్నారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో చేవెళ్ల పార్లమెంటరీ స్థానం పరిధి పార్టీ సంస్థాగత జిల్లా రంగారెడ్డి రూరల్‌లో అధికంగా ఉన్నందున మాకే అవకాశం ఇవ్వాలని అక్కడి నాయకులు పట్టుబడుతున్నారు.



హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా లంకల దీపక్‌రెడ్డి

హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా లంకల దీపక్‌రెడ్డి, మేడ్చల్ రూరల్ జిల్లా పార్టీ అధ్యక్షుడిగా బుద్ధి శ్రీనివాస్, మహంకాళి సికింద్రాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షుడిగా గుండుగోని భరత్‌గౌడ్‌ను నియమిస్తూ సోమవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. దీపక్ రెడ్డి గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అనుచరుడిగా చెబుతున్నారు. భరత్ గౌడ్ గతంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. ఎంపీ డా.లక్ష్మణ్ అనుచరుడిగా పేరుంది.

స్టేట్ కౌన్సిల్ సభ్యుల నియామకం..

మహంకాళి సికింద్రాబాద్ జిల్లాలో 4 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గం నుంచి ఒక్కో స్టేట్ కౌన్సిల్ సభ్యుడిని ఎన్నుకుంటారు. అందులో ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి శేషసాయి, సనత్‌నగర్ నుంచి సురేష్ రావల్, సికింద్రాబాద్ నుంచి గణేష్ ముదిరాజ్, కంటోన్మెంట్ రాయల్ కుమార్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లాలో అంబర్‌పేట్ నియోజకవర్గం నుంచి నర్సింగరావు యాదవ్, ఖైరతాబాద్ నుంచి నగేష్, జూబ్లీహిల్స్ శ్రీనివాస్‌రెడ్డి, నాంపల్లి అనిల్‌కుమార్‌లకు అవకాశం కల్పించగా, మేడ్చల్ నియోజకవర్గం నుంచి అచ్చని నర్సింహకు స్టేట్ కౌన్సిల్‌లో స్థానం లభించింది.



బ్రహ్మోత్సవ వెలుగులు

జగద్గిరిగుట్టలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి 54వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని లైట్లు, పూలతో అందంగా అలంకరించారు. డ్రోన్ వ్యూలో ఆలయ పరిసరాలు ఇలా కాంతులీనుతూ కన్పించాయి. - జగద్గిరిగుట్ట

టెస్ట్ డ్రైవ్ చేస్తానని వాహనాలతో ఉడాయింపు

- ఇద్దరు బైక్ దొంగల అరెస్టు..
- పరారీలో మరొకరు
- ఆరు బైక్‌ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బైకులు

జీడిమెట్ల: ఓఎల్ఎక్స్‌లో అమ్మకానికి ఉన్న బైకులు కొంటామని వచ్చి టెస్ట్‌డ్రైవ్ చేస్తామని నమ్మించి వాహనాలతో ఉడాయిస్తున్న ఇద్దరు వ్యక్తులను బాచుపల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం షాపూర్‌నగర్‌లోని డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ సురేష్‌కుమార్, బాచుపల్లి ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, డీఐ యాదయ్యతో కలిసి వివరాలు వెల్లడించారు. బాచుపల్లి, కౌసల్య కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మహేష్ తన బైక్‌ను విక్రయించేందుకు ఓఎల్ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. దీనిని చూసిన సూరారం ప్రాంతానికి చెందిన ఒంగోలు రమేష్‌బాబు, చంద్రమోలు గుండప్ప, నరసింహతో కలిసి గత నెల 23 న మహేష్ ఇంటికి వచ్చారు. రమేష్‌బాబు మహేష్‌తో మాట్లాడుతుండగా మిగతా ఇద్దరూ దూరంగా ఉన్నారు. మహేష్‌తో మాట్లాడిన అనంతరం టెస్ట్‌డ్రైవ్ చేస్తానంటూ బైక్ తీసుకెళ్లిన రమేష్ బాబు తిరిగి రాలేదు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన మహేష్ అదేరోజు బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించిన పోలీసులు నిందితులు ముగ్గురూ మహేష్ ఇంటికి ఆటోలో వచ్చినట్లు గుర్తించి వారి కదలికలపై నిఘా ఏర్పాటు చేశారు. ఆదివారం చోరీ చేసిన బైక్‌పై తిరుగుతున్న రమేష్, గుండప్పలను అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితులు ఇదే తరహాలో బాచుపల్లిలో 3, మియాపూర్‌లో, జగద్గిరిగుట్ట, మియాపూర్ ప్రాంతాల్లో ఒకటి చొప్పున బైక్‌ల చోరీకి పాల్పడినట్లు అంగీకరించారు. వారి నుంచి 6 బైకులను స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు నరసింహ పరారీలో ఉన్నట్లు తెలిపారు. చాకచక్యంగా కేసును ఛేదించిన కానిస్టేబుళ్లు అంజయ్య, కనకయ్యలను డీసీపీ అభినందించి రివార్డులు అందజేశారు.

కారు అదుపుతప్పి యువకుడి మృతి

కీసర: కారు అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. లాలోనిగూడకు చెందిన వేల్పుల మహేష్ (31) ఆదివారం రాత్రి రాంపల్లి దాయర సమీపంలో దావత్‌కు వెళ్లి వస్తుండగా కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీ కొట్టింది. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జయింది. కారులో ఇరుక్కున్న మహేష్‌ను అతికష్టం మీద బయటికి తీసిన పోలీసులు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బుగ్గ కార్లపై కన్నేది?

- ఇబ్బడిముబ్బడిగా లైట్లతో కూడిన వాహనాలు
- సైరన్‌తో దూసుకెళుతున్న మరి కొన్ని వాహనాలు
- అనర్హులు వాడితే చర్యలు తీసుకునే అవకాశం
- పట్టనట్లు వ్యవహరిస్తున్న ట్రాఫిక్ పోలీసులు
- ఎవరు వినియోగించాలన్న అంశంపై సందిగ్ధత





సాక్షి, సిటీబ్యూరో: అద్దాలపై పరిమితికి మించిన రంగుతో కూడిన ఫిల్మ్ వేసుకుని సంచరిస్తున్న వాహనాలే కాదు... టాప్‌పై ఎరుపు, నీలి రంగు లైట్లు (బుగ్గలు), సైరన్లు పెట్టుకుని సంచరిస్తున్న వాహనాలకు కొదవే లేదు. వీటి వినియోగం కేవలం నిబంధనల ఉల్లంఘన మాత్రమే కాదు... భద్రత పరంగానే పెను సవాలే. అయినా మూడు కమిషనరేట్లకు చెందిన ట్రాఫిక్ విభాగం అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. తొలుత తేలికపాటి వాహనాలైన కార్లు తదితరాల టాపులపై ఈ బుగ్గలు పెట్టుకోవడానికి ఎవరు అనర్హులనే దానిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

ఎక్కడికైనా దూసుకెళ్లే అవకాశం...

సాధారణంగా ఈ తరహా లైట్లు, సైరన్‌తో వచ్చే వాహనాలను చూసి సామాన్యులే కాదు పోలీసులు కూడా అప్రమత్తం అవుతారు. సాధారణ వాహనచోదకులు దారి ఇవ్వడానికి ప్రయత్నిస్తే... వాటిని ఆవడానికి విధుల్లో ఉన్న పోలీసులు సైతం సాధారణంగా ప్రయత్నించరు. ఆయా వాహనాల్లో ప్రముఖులు ఉంటారనే భావనే దీనికి ప్రధాన కారణం. దీనిని ఆసరాగా చేసుకునే కొందరు అనర్హులు, ఆకతాయిలు తమ వాహనాలపై ఈ తరహా లైట్లు పెట్టుకుని సంచరిస్తుంటారు. 2001లో ఢిల్లీలోని పార్లమెంట్‌పై దాడి చేసిన ఉగ్రవాదులు ఇలాంటి లైట్లు ఉన్న వాహనాలనే వాడారు. ఈ తరహా లైట్లు, సైరన్లు ఉన్న కారణంగానే భద్రతా సిబ్బంది కూడా ఆ వాహనాలను పార్లమెంట్ ఆవరణలోకి రాకుండా అడ్డుకోలేదు.

వినియోగిస్తున్న వారిలో 90 శాతం అనర్హులే...

ఈ తరహా లైట్లు, సైరన్లు వినియోగిస్తున్న వారిలో 90 శాతం అనర్హులే ఉంటున్నారు. సెంట్రల్ మోటారు వెహికిల్ రూల్స్–1989 ప్రకారం కేవలం 43 మంది వీవీఐపీలు మాత్రమే వీటిని వినియోగించాలి. అయితే అసెంబ్లీ, సెక్రటేరియేట్‌తో పాటు కొన్ని శాఖలకు చెందిన ఉన్నతాధికారులు తమ వాహనాలపై ఎరుపు, నీలం లైట్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. పలువురు వీఐపీలు సైతం ఈ లైట్లు, సైరన్లను అక్రమంగా వినియోగిస్తున్నారు. స్పెషల్ సెక్రటరీ హోదాలో ఉన్న అధికారులకు కూడా తమ కార్లపై ఈ తరహా లైట్లు పెట్టుకునే అవకాశం లేదు. అయినప్పటికీ వివిధ హోదాలకు చెందిన వాళ్లు వీటిని వినియోగిస్తున్నారు. అధికారుల పరిస్థితే ఇలా ఉంటే ఇక సామాన్యుల పరిస్థితి చెప్పనక్కర్లేదు. ఈ లైట్లు, సైరన్ కలిగి ఉండటం హోదాగా భావించే వాళ్లు అనేక మంది ఉంటున్నారు.

బ్లూ లైట్...

ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు, అసెంబ్లీ స్పీకర్–డిప్యూటీ స్పీకర్, కౌన్సిల్ చైర్మన్, ఉపాధ్యక్షుడు

- వాహనంలో సదరు ప్రముఖులు ఉన్నప్పుడు మాత్రమే లైట్ వినియోగించాలని, లేని పక్షంలో దానిపై నల్ల కవర్ తప్పనిసరిగా వేయాలి.



ఎవరు వినియోగించాలంటే...

ఫ్లాషర్‌తో కూడిన రెడ్‌లైట్:

రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాని, మాజీ రాష్ట్రపతులు, ఉప ప్రధాని, చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా, లోక్‌సభ స్పీకర్, కేంద్ర క్యాబినెట్ మంత్రులు, ప్లానింగ్ కమిషనర్ ఉపాధ్యక్షుడు, మాజీ ప్రధానులు, ఉభయసభల ప్రతిపక్ష నేతలు, సుప్రీం కోర్టు జడ్జిలు (వీరు దేశ వ్యాప్తంగా ఎక్కడైనా ఈ లైట్‌తో తిరగవచ్చు.)

ఫ్లాషర్ లేని రెడ్‌లైట్:

చీఫ్ ఎలక్షన్ కమిషనర్, కాగ్, ఉభయసభల ఉపాధ్యక్షులు, కేంద్ర సహాయ మంత్రులు, ప్లానింగ్ కమిషన్ సభ్యులు, అటార్నీ జనరల్, క్యాబినెట్ సెక్రెటరీ, త్రివిధ దళాల అధిపతులు, కేంద్ర డిప్యూటీ మంత్రులు, క్యాట్ చైర్మన్, మైనార్టీ కమిషన్ చైర్మన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ల అధ్యక్షులు, యూపీఎస్సీ చైర్మన్ (వీరు దేశ వ్యాప్తంగా ఎక్కడైనా ఈ లైట్‌తో తిరగవచ్చు.)

కేవలం రెడ్‌లైట్:

రాష్ట్ర గవర్నర్, గవర్నర్ ఎస్కార్ట్ వాహనాలు, సీఎస్, డీజీపీ, సీజే ఆఫ్ తెలంగాణ, హైకోర్టు జడ్జిలు, లోకాయుక్త, టీజీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ చైర్మన్, క్యాట్ వైస్ చైర్మన్.

ప్రైవేట్ బస్సు ఢీ కొని భర్త మృతి

భార్యకు తీవ్ర గాయాలు

అబిడ్స్: బైక్‌పై వెళుతున్న దంపతులను ఓ ప్రైవేట్ బస్సు ఢీకొన్న ఘటనలో భర్త మృతి చెందగా, భార్యకు తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అబిడ్స్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.లాలాగూడకు చెందిన సంతా ఆడోమ్ క్యారమ్ (67), తన భార్య జసంతతో కలిసి సోమవారం బైక్‌పై బషీర్ బాగ్ చౌరస్తా మీదుగా అబిడ్స్ ఛాపెల్ రోడ్డు వైపు వెళుతున్నాడు. ఎల్బీ స్టేడియం ఎదుట రాంగ్ రూట్‌లో వచ్చిన ఆరెంజ్ ట్రావెల్స్ బస్సు వీరి బైక్‌ను ఢీకొంది. దీంతో భార్యా భర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అబిడ్స్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సమీపంలోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆడోమ్ క్యారమ్ మృతి చెందగా, అతని భార్య జసంత చికిత్స పొందుతోంది. కాగా సంతా జసంత ఛాపెల్ రోడ్ లోని సెవెంత్ డే అడ్వెంటిస్ట్ హైస్కూల్లో టీచర్‌గా పని చేస్తోంది. ఆమెను స్కూల్ వద్ద వదిలేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు బస్సును సీజ్ చేశారు..

అనారోగ్యంతో బాధపడుతూ..

వ్యక్తి ఆత్మహత్య

ఉప్పల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రామంతాపూర్ గాంధీనగర్ ప్రాంతానికి చెందిన గొల్లపల్లి రమేష్(30) సెంట్రింగ్ పని చేసేవాడు. గత కొంత కాలంగా అతను అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపానికి లోనైన రమేష్ సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

మద్యానికి బానిసై యువకుడు..

ఘట్‌కేసర్: మద్యానికి బానిసైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పరుశురాం కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ద్వారకనగర్‌కు చెందిన డేరంగుల శేఖర్(32) డ్రైవర్‌గా పని చేసేవాడు. కొన్నాళ్లుగా మద్యానికి బానిసైన అతను తరచూ కుటుంబ సభ్యులు, భార్యతో గొడవ పడేవాడు. దీంతో అతడి భార్య వేరుగా ఉంటోంది. శనివారం మద్యం మత్తులో మరోసారి అన్నదమ్ములతో గొడవపడిన అతను అదే రోజు రాత్రి స్థానిక చిన్న చెరువు సమీపంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం రాత్రి దీనిని గుర్తించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డీఎస్పీ నర్సింగ్‌రావును అభినందించిన శాండిల్య



సాక్షి, సిటీబ్యూరో: పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటిన తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీ ఏఎన్‌బీ) డీఎస్పీ కె.నర్సింగ్‌రావును డైరెక్టర్ సందీప్ శాండిల్య సోమవారం అభినందించారు. కరీంనగర్‌లో గత మంగళవారం నుంచి శనివారం వరకు తెలంగాణ స్టేట్ పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ జరిగింది. 105 కేజీల పవర్ లిఫ్టింగ్ విభాగంలో పాల్గొన్న నర్సింగ్‌రావు బంగారు పతకం సాధించారు. ఈ నేపథ్యంలోనే ఆయన సోమవారం సందీప్ శాండిల్యను కలిశారు. నర్సింగ్‌రావును అభినందించిన ఆయన భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

రహదారులను ఆక్రమిస్తే కఠిన చర్యలు

- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్
- ప్రజావాణిలో 71 ఫిర్యాదులు



సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలో ఆక్రమణకు గురైన రహదారులను గుర్తించి తక్షణమే ఆక్రమణలను తొలగించాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 71 మంది ఫిర్యాదులు అందజేశారు. వీటిలో అత్యధికం పార్కులు, రహదారుల కబ్జాలకు సంబంధించినవే ఉన్నాయి. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలను గూగుల్ మ్యాప్స్ ద్వారా పరిశీలించిన రంగనాథ్ దశాబ్దం క్రితం అక్కడ పరిస్థితి ఎలా ఉంది? ఇప్పుడు ఎలా ఉందనేది తెలుసుకున్నారు. వాటిని ఫిర్యాదుదారులకూ చూపించి సమస్యకు పరిష్కార మార్గాలను సూచించారు. అనేక ప్రాంతాల్లో ఒకప్పుడు సెప్టిక్ ట్యాంకుల కోసం కేటాయించిన స్థలాలు ఇప్పుడు వినియోగంలో లేవని, వాటిని ప్రజావసరాలకు కేటాయించిన స్థలంగానే పరిగణించాలని, ఎవరైనా కబ్జా చేస్తే వెంటనే తొలగించాలని కమిషనర్ అధికారులకు సూచించారు. కాప్రా మున్సిపాలిటీలోని వంపుగూడ పక్కన ఉన్న ఎస్ఆర్ఐ కాలనీ వాసులు ఇలాంటి స్థలంలోనే ప్రహరీ నిర్మించారు. చందానగర్ సర్కిల్–21లోని మాతృశ్రీనగర్‌లో పార్కులో కొంత భాగాన్ని, పార్కులో ఉన్న సెప్టిక్ ట్యాంక్‌ను కబ్జా చేశారంటూ హైడ్రాకు ఫిర్యాదులు అందాయి.అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడ గ్రామంలో సమ్మిరెడ్డి బాల్ రెడ్డి తమ ప్లాట్లను కబ్జా చేశారంటూ పలువురు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 951 నుంచి 954 వరకు ఉన్న గ్రామపంచాయతీ లే ఔట్‌లో తాము 1986లో ప్లాట్లు కొంటే అవి ఇప్పుడు కనిపించట్లేదని వాపోయారు.

నల్ల మల్లారెడ్డి మా ప్లాట్లను తీసుకున్నారు

ఘట్‌కేసర్ మండలం కొర్రెముల్ గ్రామ పంచాయతీలో మా ప్లాట్లను నల్ల మల్లారెడ్డి కబ్జా చేశారు. సర్వే నంబరు 716 నుంచి 718లో గ్రామ పంచాయతీ లేఅవుట్‌లో 23 మంది 1987లో కొన్న వాటిని కాజేశారు. 2010లో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖకు చెందిన రికార్డులను ట్యాంపరింగ్ చేశారు. నల్లమల్లారెడ్డిపై 2013లో ల్యాండ్ గ్రాబింగ్ కేసు కూడా పెట్టాం. మొత్తం 23 కేసుల వివరాలతో ఆంధ్రప్రదేశ్ గజెట్ కూడా ప్రచురితమైంది. విద్యా సంస్థల అధినేత నల్ల మల్లా రెడ్డి మా ప్లాట్లను మాత్రమే కాకుండా, ప్రభుత్వ భూమిని కూడా ఆక్రమించి, తన రాజకీయ శక్తిని ఉపయోగించి వాటిని అనుభవిస్తున్నారు.

\- ఖాజా మీరన్ మొయినుద్దీన్

యాప్రాల్ నాగిరెడ్డి గొలుసుకట్టు చెరువును కాపాడండి

మల్కాజిగిరి మున్సిపాలిటీలోని యాప్రాల్ నాగిరెడ్డి గొలుసుకట్టు చెరువును ఫంక్షన్ హాల్ యజమానులు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. గతంలో రెండుసార్లు స్థానిక అధికారులు కూల్చివేయగా.. ఇటీవల హైడ్రా కూడా కూల్చివేసింది. ఈ చెరువు నాలాను పూర్తిగా ఆక్రమించిన ఫంక్షన్ హాల్ యజమానులపై చర్యలు తీసుకోవాలి. కబ్జాలను తొలగించి చెరువును కాపాడాలి. అనుమతి లేని ఫంక్షన్ హాల్‌ను తొలగించాలి.

\- యాప్రాల్ కులసంఘాల జేఏసీ చైర్మన్ ఆర్. చంద్రశేఖర్

ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని ఇప్పించండి

నేను మాజీ సైనిక ఉద్యోగిని. ప్రభుత్వం కూకట్‌పల్లి–నిజాంపేట రోడ్డులోని హోలిస్టిక్ ఆసుపత్రి వెనుక 300 గజాల స్థలాన్ని కేటాయించింది. దీంతో పాటు మొత్తం 1253 గజాల స్థలాన్ని స్థానిక మహిళ కబ్జా చేసింది. ఇదంతా ప్రభుత్వ స్థలం. కోర్టు ఉత్తర్వులతో పాటు ప్రభుత్వ ఆదేశాలున్నాయి. ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడి ప్రభుత్వం నాకు కేటాయించిన 300 గజాల స్థలం ఇప్పించండి.

\- పి. సీతారామరాజు, మాజీ సైనిక ఉద్యోగి

నష్టాల నుంచి గట్టెక్కేందుకు చోరీల బాట

- షట్టర్ లిఫ్టింగ్ కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు
- రూ. 28.62 లక్షల నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ సర్దార్ సింగ్

రాంగోపాల్‌పేట్: కోవిడ్ సమయంలో వస్త్ర వ్యాపారంలో వచ్చిన నష్టాల నుంచి గట్టెక్కేందుకు చోరీల బాట పట్టిన ముగ్గురు దొంగలను మహంకాళి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.28.60 లక్షల నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం మహంకాళి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ సర్దార్‌సింగ్, ఇన్‌స్పెక్టర్ పరశురాం, డీఐ వైకే ప్రసాద్‌లతో కలిసి వివరాలు వెల్లడించారు. మహారాష్ట్ర, థానేకు చెందిన మురళీధర్ మోహన్‌లాల్ శర్మ వస్త్ర దుకాణంలో పని చేసేవాడు. యూపీ జౌనుపూర్‌కు చెందిన వస్త్ర వ్యాపారి చంద్రభాన్ పటేల్, బిస్కట్ ఫ్యాక్టరీలో వాచ్‌మెన్‌గా పనిచేసే ఉదయ్‌రాజ్ సింగ్ స్నేహితులు. మురళీధర్ మోహన్‌లాల్ శర్మ ముంబైలోని ఓ దుకాణంలో పని చేసే సమయంలో చంద్రభాన్ పటేల్‌తో అతడికి పరిచయం ఏర్పడింది. అతను మురళీధర్ వద్ద దుస్తులు తీసుకుని విక్రయిస్తుండగా, ఉదయ్ రాజ్ సింగ్ అతడికి సహాయకుడిగా పనిచేసేవాడు. ఈ నేపథ్యంలో ముగ్గురూ వస్త్ర వ్యాపారం నిమిత్తం గత కొన్నేళ్లుగా హైదరాబాద్‌కు వచ్చి వెళుతున్నారు. కరోనా తర్వాత మురళీధర్‌కు వ్యాపారంలో నష్టాలు రావడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. వాటి నుంచి ఎలాగైనా బయట పడాలని భావించిన అతను అందుకు చోరీలే మార్గమని నిర్ణయించుకున్నాడు. ఈ విషయాన్ని మిగతా ఇద్దరికీ చెప్పి చోరీకి ప్లాన్ రూపొందించాడు.

రెక్కీ నిర్వహించి...

నిందితులు ముగ్గురూ గత నెల 26న పథకం ప్రకారం సికింద్రాబాద్‌లోని సితారా హోటల్‌లో దిగారు. రాణీగంజ్ ప్రాంతంలో వ్యాపార లావాదేవీలపై మురళీధర్‌కు పూర్తి అవగాహన ఉంది. దీంతో వారు చోరీకి అనువైన దుకాణాలను గుర్తించేందుకు ఐదు రోజుల పాటు ఆయా ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించారు. ఆ తర్వాత మోటర్లు విక్రయించే షాప్‌ను ఎంచుకుని రాత్రి దొంగతనానికి పాల్పడ్డారు.

కుమారుడి ఎంబీబీఎస్ సీటు కోసం దాచుకున్న నగదు చోరీ

1 వ తేదీ తెల్లవారు జామున ముగ్గురూ కలిసి ఓల్డ్‌బోయిగూడలోని మోటార్లు విక్రయించే దీప్ ఇంజినీరింగ్ కంపెనీ షాపులో షట్టర్ ఎత్తి చేసి లాకర్‌లో ఉన్న రూ.30.20 లక్షలు చోరీ చేశారు. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న మహంకాళి పోలీసులు డీసీపీ రష్మీ పెరుమాళ్, ఏసీపీ సర్దార్‌సింగ్ ఆదేశాలతో రాంగోపాల్‌పేట్, మార్కెట్ పోలీసులతో కలిసి నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. సోమవారం మధ్యాహ్నం నిందితులను అదుపులోకి తీసుకున్నారు. దొంగతం జరిగిన షాపు యజమాని తన కుమారుడిని ఎంబీబీఎస్‌లో చేర్పించేందుకు పెద్ద మొత్తంలో నగదును తెచ్చిపెట్టుకున్నాడు. ఇంట్లో కుటుంబ సభ్యులు కుంభమేళాకు వెళ్లడంతో షాపులో నగదు సురక్షితంగా ఉంటుందని భావించి అందులోని లాకర్‌లో భద్రపరిచాడు. నిందితులు కూడా ఊహించని విధంగా పెద్ద మొత్తంలో డబ్బు దొరకడంతో మరో ప్రయత్నం చేయలేదు.

అదే హోటల్‌లో జల్సాలు..

చోరీ అనంతరం నిందితులు తమను ఎవరూ పట్టుకోలేరనే ధీమాతో సికింద్రాబాద్‌లో తాము బస చేసిన హోటల్‌లోనే ఉండిపోయారు. చోరీ సొత్తును పంచుకుని మద్యం తాగుతూ జల్సా చేశారు. కొన్ని అవసరాల మేరకు సుమారు రూ.లక్షల వరకు ఖర్చు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుల కదలికలపై నిఘా వేసిన పోలీసులు వారు బస చేసి హోటల్‌లోనే అదుపులోకి తీసుకుని కటకటాల్లోకి పంపారు. సమావేశంలో ఎస్సైలు గంగాధర్, శ్రీవర్ధన్ క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

HOUSE FOR SALE

KARMANGHAT Near Main Road 200 Yards 30 Feet Road West Face G+1=2BHK +3BHK House for Sale. Ph-98852 02404 [HA-1050]

LEASE / RENT

5Floors Building Ladies Hostel sutbel @ Gowrishankar colony, Rd No.10, Banjarahills, Street No.3, Hyd. 8142237799, 9701806246 [HA-1396]

PLOT FOR SALE

విజయవాడ హైవే, నార్కట్‌పల్లి దగ్గర అద్భుతమైన గేటెడ్ కమ్యూనిటీ ఫామ్ ల్యాండ్ వెంచర్‌లో స్విమ్మింగ్‌పూల్, గెస్ట్‌హౌస్, ఎర్ర చందనం & పండ్ల మొక్కలతో 1210 గజాల (10 గుంటలు) ప్లాట్స్ కలవు. సంప్ర : 6304222202 [HA-1192]

Commercial Plot for sale. Extent 2677. Sq.Yds. Adjecenti to 80 feet Housing Board Colony Road. Near car shed Jn., Potinamallayyapalem, Visakhapatnam. A.P. Available in parts. Direct parties only. Cont : 79935 28543 [V- 13304]

Services

HOME NEEDS

PEST CONTROL

వాసనలేని మరకలు పడని ISI కెమికల్స్ 5 సం॥ వారంటీతో చెదలు, (బొద్దింకలు, నల్లులు, బల్లులు) నివారించే సంస్థ. హిందుస్తాన్ పెస్ట్ కంట్రోల్. ఫోన్: 7981533849/ 9059989604 [HA-1097]

PERSONAL CARE

CHANGE OF NAME

I, Geetika Murari Sharma, W/o Mayur Rabinder Chhabra, resident of A1701 Aparna Sarovar Grande, Nallagandla, Hyd-500019 Telangana, have changed the name from Geetika Murari Sharma to Geetika Mayur Chhabra vide Affidavit dated 31.01.2025 before Notary Public/Hyderabad Telangana [HA-15430]

I, Srinivas Aakuthotha, S/o Sammaiah residing 3-146/65, Sri Sai Residency, Chengicherla, have my changed my name Srinivas Akuthota for all purposes. [HA-08439]

I, Kalali Raju H.No. 1-98 Bhanur, near Hanuman Temple, (M) Patancheru, (D) Sangareddy PIN-502305, have changed my name to Kalali Raju Goud. [UA-51623]

I, Suyasha Gajanan Gulahe D/o, Saroj Gulahe R/o Flat No.-g10, Amethyst (j) Tower, Pbel City, Pbel City Road, Near Tspa, Rajendra Nagar, Rangareddy District Pin: 500091, Telangana, India, have changed my name to Suyasha Gulahe. [DA-40973]

LOST

PENUGONDA PRADEEPKUMAR S/o SRINIVASA RAO R/o Nizampet, I Lost my Passport bearing no: L7315505, if anybody found 9949311556 [SCA25001508]

I, Smt. Molala Shobharani W/o. Molala Nagendar Kumar (late) H.no:8-5-248/1, Syndicate Bank Colony Old Bownpally, Hyd. I Lost my Original Saledeed & Link Documents no's 10381/2007, 9949/2007, 4823/2001&3091/2000 if anybody found 8125388036 [SCA25001509]

GSS Reddy S/o G V Reddy Midtown, CZECH Colony, Hyd-18, Have Lost the Original Link Document Nos. 2401/2001, 2404/ 2001, 2398/2001 & 2400/2001. If found Contact: 9000808045 [HA-71039]

OLD AGE HOME

సూర్యతేజ హోంకేర్ వృద్ధులకు పేషెంట్ల సేవకు బేబీకేర్ వంట/ఇంటి పని కొరకు ఆడ/మగ కేర్ టేకర్స్‌ను పంపగలము. Ph: 8309069400/8465902060 [HA-1052]

వృద్ధులు, NRI'S, విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి, దీర్ఘకాలిక మంచానపున్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్. ఉప్పల్ & ECIL-కీసర రోడ్, చీర్యాల్ 'X' రోడ్, భోజన వసతితో. 7981467036, 9391039990, 9949520296 [H-783367]

సాయిరాం హోంకేర్ సర్వీస్ 24/7 వృద్ధులను, పేషెంట్లను, బేబీకేర్, వంట పని, ఇంటిపనికి అనుభవం గల పని మనుషులు M/F మీ ఇంటికి పంపబడును. 9553402079, 9553402073 [HA-1429]

Wanted

జంటనగరాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. వసతి, మంచి జీతం కలదు. సంప్రదించండి : 9392663777, 9246663777 [HA-1395]

ఇంట్లోనే ఉండి పనిచేయుటకు ఇంటి, వంట పనికి, పిల్లలను, పెద్దలను చూసుకొనుటకు ఆడవాళ్లు కావలెను. జీ: 18k-25k, Ph: 8919080878 [SCA25001494]

Wanted M/F Telicallers work from Home. Marketing managers & Executives M/F Salary + incentives. Ph: 9100885354 [SCA25001475]

Applications for various posts of academic and administrative staff in Air Force School Begumpet Hyderabad are invited from eligible candidates. For requisites qualifications and other details visit school website www. airforceschoolbegumpet.edu.in. Last date to submit duly filled application is 20/2/2025. [HA-1254]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

జోన్ సెంటర్స్			
దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
అత్తాపూర్	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-3-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34 Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

వైభవంగా రథమహోత్సవ వేడుకలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి వార్షిక రథమహోత్సవ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా సోమవారం పెద్దమ్మతల్లికి వేకువజామునే అభిషేకం, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగములు, మండప పూజలు, వేద పారాయణం, పంచోపనిషత్, దేవీ భాగవత, మహా విద్యా, చండీ పారాయణాదులు, నవగ్రహజపం, రుద్రాభిషేకాలు, వేద పారాయణం, సప్తశతి పారాయణం నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి విచ్చేశారు.

ప్రభుత్వ స్థలాల కబ్జాలపై కఠిన చర్యలు



కబ్జా స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ అనితారెడ్డి

ఫిలింనగర్: ప్రభుత్వ స్థలాలను కబ్జాలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని వినాయకనగర్ బస్తీలో పర్వాతాంజనేయస్వామి ఆలయాన్ని ఆనుకొని జీహెచ్ఎంసీ రీటైనింగ్ వాల్ పక్కన ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని ఫిర్యాదులు రావడంతో సోమవారం అనితారెడ్డి సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఓ వ్యక్తి ఇక్కడ గ్రానైట్ రాళ్లు వేసి నిర్మాణానికి ప్రయత్నిస్తున్నట్లు తెలుసుకొని వాటిని తొలగించారు. ఎవరైనా కబ్జాలకు పాల్పడితే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రహరీని ఆనుకొని ఉన్న స్థలాన్ని పరిశీలించడం జరిగిందని ఎవరు స్థలం ఆక్రమించిన చర్యలు తీవ్రంగా ఉంటాయని వెల్లడించారు.

కేంద్ర మంత్రుల దిష్టిబొమ్మల దహనం



రహమత్‌నగర్: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు సమాధానం చెప్పాలని రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి డిమాండ్ చేశారు. టీపీసీసీ అధ్యక్షుడి పిలుపు మేరకు సోమవారం రహమత్‌నగర్‌లో కేంద్ర మంత్రుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా సీఎన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉన్న ఫలితం లేకుండా పోయిందన్నారు.

వాట్సాప్ పోస్టుకు స్పందన



రహమత్‌నగర్: వాట్సాప్ పోస్టుపై జలమండలి అధికారులు క్షణాల్లో స్పందించారు. ఎస్పీఆర్ హిల్స్ టీఅంజయ్య నగర్ ఫేస్-1 అమృతనగర్ రోడ్డు మధ్యలో ఓ వ్యక్తి తన వ్యక్తిగత అవసరాల కోసం ఎలాంటి అనుమతిలేకుండా సోమవారం రోడ్డును తవ్వుతున్నాడు. విషయం తెలుసుకున్న బస్తీ నాయకుడు శివ ఓ గ్రూప్‌లో దానిని పోస్టు చేశాడు. దీంతో వెంటనే స్పందించిన ఎస్పీఆర్‌హిల్స్ జలమండలి మేనేజర్ రాజేందర్ అక్రమ తవ్వకాలను నిలిపి వేయించారు. మేనేజర్ స్పందించిన విధానంపై బస్తీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నందినగర్ మజీద్ అధ్యక్షుడి మృతి



ఇద్రీస్ పిరాన్ (ఫైల్)

వెంకటేశ్వరకాలనీ: బంజారా హిల్స్ రోడ్‌నెం. 14లోని నందినగర్ మజీద్–ఈ–మదీనా అధ్యక్షుడు ఇద్రీస్ పిరాన్ సాబ్(75) అనారోగ్య కారణాలతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. నందినగర్‌లోని మజీద్‌కు ఆయన 35 సంవత్సరాలుగా అధ్యక్షుడిగా కొనసాగడంతో పాటు బస్తీ సీనియర్ నేతగా, సామాజికవేత్తగా స్థానికులకు, రాజకీయ నేతలకు సుపరిచితుడు. ఈ సందర్భంగా స్థానిక నేతలు ఫరూఖ్ అహ్మద్, నజీర్ అహ్మద్, అబ్దుల్ జబ్బార్, ఇంతియాజ్ అలీ, అశ్వక్ హుస్సేన్ తదితరులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించిన నివాళులు అర్పించారు.

పైప్‌లైన్లపై పట్టింపేది..?

వేసవికాలం ముంచుకొస్తున్నది. అప్పుడే భూగర్భ జలాలు అడుగంటాయి. నల్లాల్లో నీళ్ల ప్రెషర్ తక్కువైంది. నిన్నమొన్నటి దాకా గంటన్నర పాటు వచ్చిన నల్లాల వేళలు కుంచించుకుపోతున్నాయి. అయితే మంచినీటి సమస్య పరిష్కారం కోసం వేయాల్సిన పైప్‌లైన్లు ఎక్కడికక్కడే పడి ఉంటున్నాయి. నిర్మాణ పనులు చేపట్టడంలో ఆర్థిక సమస్యలు తలెత్తుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

వేసవిలో ముంచుకొస్తున్న నీటి సమస్య | ఏళ్లుగా భారీ నీటి పైప్‌లైన్ పనులు నిలిపివేత | టెండర్ దశలోనే ఆగిపోయిన పనులు

ప్రభుత్వం కనికరించాలని స్థానికుల ఎదురుచూపులు



నిర్మాణం కోసం తీసుకువచ్చిన భారీ మంచినీటి పైపులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్, వెంకటేశ్వరకాలనీ డివిజన్ల బస్తీలు, కాలనీలవాసులకు దాహార్తిని తీర్చేందుకు భారీ మంచినీటి పైప్‌లైన్ పనులు ఐదేళ్ల క్రితమే ప్రారంభం కావాల్సి ఉంది. అప్పటి ప్రభుత్వం పైప్‌లైన్ పనులకు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో తెలంగాణ భవన్ మీదుగా నిర్మించాల్సిన భారీ మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. పైపులు తీసుకువచ్చి రోడ్డు పక్కన పడేశారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని అగ్రసేన్, కళింగ జంక్షన్ నుంచి తెలంగాణ మీదుగా బంజారాహిల్స్ రోడ్డునెంబర్-10లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఎదురుగా ఉన్న తట్టిఖానా వాటర్ రిజర్వాయర్‌కు అనుసంధానిస్తూ ప్రశాసన్‌నగర్ రిజర్వాయర్ నుంచి గ్రావిటీతో నీటి సరఫరా చేసేందుకు అంచనాలు రూపొందించి టెండర్ ప్రక్రియ కూడా పూర్తి చేశారు. రూ.4.50 కోట్ల వ్యయంతో 900 ఎంఎం దయా పైప్‌లైన్ వేసి తట్టిఖానా వాటర్ రిజర్వాయర్‌లో నీళ్లను నింపడం ద్వారా బంజారాహిల్స్, వెంకటేశ్వరకాలనీ డివిజన్ల పరిధిలోని 25కి పైగా బస్తీలు, కాలనీలకు ఎలాంటి ఆటంకం లేకుండా మంచినీటి సరఫరా చేసేందుకు ఈ పైప్‌లైన్ పనులు వేయాలని తలపెట్టారు. పైపులు కూడా తెలంగాణ భవన్ పక్కనే వేసి ఏడాది కావస్తున్నది. పాత టెండర్ స్థానంలో కొత్తగా మరో టెండర్ పిలవాలని నిర్ణయించారు. అయితే టెండర్ దగ్గరే పనులు నిలిచిపోయాయి. అంచనాలకు మించి ఖర్చు పెరగడంతో గతంలో విడుదలైన రూ.4.50 కోట్లకు బదులు ప్రస్తుతం రూ.6 కోట్ల దాకా ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

- ఐదేళ్ల క్రితమే అగ్రసేన్ చౌరస్తా నుంచి తెలంగాణ భవన్ మీదుగా తట్టిఖానా వాటర్ రిజర్వాయర్‌కు ఈ పైప్‌లైన్ నిర్మాణం చేపడితే రూ.4.50 కోట్లు సరిపోయేవి.
- అయితే తెలంగాణ భవన్ ముందు నుంచి పైపులు వేసేందుకు అప్పటి ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో పనులు నిలిచిపోయాయి.
- తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పైప్‌లైన్లు వేయాలని నిర్ణయించి మరోసారి ప్రతిపాదనలను తెరపైకి తీసుకువచ్చింది. టెండర్ ప్రక్రియ తాజాగా విడుదల చేయాల్సి ఉంది.
- స్థానికుల మంచినీటి సమస్య పరిష్కరించేందుకు ఈ పైప్‌లైన్ పనులు ప్రారంభించే విధంగా ప్రజాప్రతినిధులు, అధికారులపై ఒత్తిడి పెంచాల్సి ఉంది. అయితే ఖైరతాబాద్ ఎమ్మెల్యేతో పాటు ఇతర ప్రజాప్రతినిధులెవరూ ఒక్కసారి కూడా ఈ మంచినీటి పైప్‌లైన్లు ఎందుకు వేయడం లేదని అడిగిన పాపానపోలేదు.
- ఈ భారీ పైప్‌లైన్ నిర్మాణం చేపట్టడమే కాక సుమారుగా పదివేల కుటుంబాలకు మంచినీరు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా సరఫరా చేయాల్సిన పరిస్థితి ఉంటుంది.
- స్థానిక ఎమ్మెల్యే మాత్రం ఈ పనులపై చిత్తశుద్ధి చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మిగతా ప్రజాప్రతినిధులకు రోడ్డు పక్కనే ఈ పైపులు ఎందుకు పడి ఉన్నాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.
- ప్రజాప్రతినిధులు ఒత్తిడి పెంచితేనే ఈ పైప్‌లైన్ పనులు ప్రారంభమయే పరిస్థితి ప్రస్తుతం నెలకొంది.
- జలమండలి అధికారులు సైతం ఈ పైప్‌లైన్ పనులు త్వరగా ప్రారంభించే దిశలో చొరవ చూపుతున్నా ఎమ్మెల్యే పట్టించుకునేంటే త్వరితగతిన టెండర్ విడుదలయ్యే అవకాశం ఉంది.

ప్రతి ఒక్కరి సహకారంతోనే మధురానగర్ అభివృద్ధి



నరసింహారావును సన్మానిస్తున్న కాలనీనేతలు..

వెంగళరావునగర్ : మధురానగర్‌కాలనీకి ఎంతో ఘన చరిత్ర ఉందని, ఈ కాలనీకి నగరంలోని అన్ని కాలనీలకు ఆదర్శంగా నిలుస్తుందని ప్రముఖ సినీ డైరెక్టర్ రేలంగి నరసింహారావు తెలియజేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్‌కాలనీలో ఉన్న డి.సిహెచ్.ఎస్.ఎన్.రాజు ఇండోర్ స్టేడియం అండ్ జిమ్ 26వ వార్షికోత్సవ వేడుకలు కాలనీలోని సాగి రామకృష్ణంరాజు కమ్యూనిటీహాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రేలంగి నరసింహారావు మాట్లాడుతూ గతంలో కాలనీ ఉన్న ప్రాంతంలో కేవలం పంట పొలాలు మాత్రమే ఉండేవన్నారు. అయితే కాలనీ ఏర్పాటైన నాటి నుంచి ఎంతో మంది పారిశ్రామికవేత్తలు, సినీ, రాజకీయ, విద్యావేత్తలు, వైద్యులు, సంఘ సేవకులు ముందుకు వచ్చి చేయి చేయి కలిపి కాలనీని అన్ని రకాలుగా అభివృద్ధి పరిచారని అన్నారు. ఇదే కాలనీలో పార్కులు, జిమ్, ఇండోర్ స్టేడియం ఈ విధంగా అసోసియేషన్ నేతలు ఏర్పాటు చేశారని అన్నారు. ఎన్నోమార్లు బెస్ట్ కాలనీ అవార్డు కూడా జీహెచ్ఎంసీ నుంచి అవార్డు తీసుకున్న ఘనత ఈ కాలనీకి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్, కాలనీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రతాప్‌రెడ్డి, కోడె సాంబశివరావు, కోశాధికారి సుగుణ, ఉపాధ్యక్షులు మనోహర్‌రావు, సంయుక్త కార్యదర్శి హనుమంతరావు, బి.బ్లాక్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. తొలుత వివిధ క్రీడాపోటీల్లో విజయం సాధించిన చిన్నారులకు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం సినీ డైరెక్టర్ రేలంగి నరసింహారావును ఘనంగా సన్మానించారు.

నేటి నుంచి 28 వరకు ఉచిత కేన్సర్ నిర్ధారణ శిబిరం

బంజారాహిల్స్: ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బంజారాహిల్స్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో ఉచిత కేన్సర్ నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఫిబ్రవరి 4వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కేన్సర్ వైద్య నిపుణులచే ఉచిత ప్రాథమిక పరీక్షలు నిర్వహిస్తారన్నారు. తదుపరి అవసరమైన వారికి 20 శాతం తగ్గింపుతో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించుకోవడానికి వీలు కల్పిస్తారన్నారు. అంతేకాకుండా ఫిబ్రవరి నెలంతా అత్యంత తక్కువ ఖర్చుతో హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకునే సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. కేవలం ఒక డోసు సుమారు 4వేల రూపాయలు ఖరీదైన ఈ వ్యాక్సిన్ రూ.1500లకే అందించనున్నామన్నారు. 9 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాల వయస్సు కలిగిన ఆడపిల్లలకు ఆరునెలల వ్యవధిలో రెండు డోసుల ఇంజక్షన్లు తీసుకోవాల్సి ఉండగా, 15 నుంచి 26 వయస్సున్న యువతులకు మూడు డోసుల వ్యాక్సిన్ అంటే ఆరు నెలల వ్యవధిలో మూడు డోసులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ పథకం ఫిబ్రవరి మాసంలో మొదటి డోసు తీసుకున్న వారికి మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.

ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలి

ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఘంటా చక్రపాణి

బంజారాహిల్స్: పనిచేసే సంస్థ పట్ల ఉద్యోగులు నిబద్ధతగా ఉండాలని, చేసే పనిలో పారదర్శకత అవసరమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయ ఉప కులపతి ఆచార్య ఘంటా చక్రపాణి పేర్కొన్నారు. సెంటర్ ఫర్ స్టాఫ్ ట్రెనింగ్ అండ్ డెవలప్‌మెంట్ (సీఎస్‌టీడీ) ఆధ్వర్యంలో ఇటీవల టీజీఎస్పీ ద్వారా నియమితులైన జూనియర్ అసిస్టెంట్ సిబ్బందికి వారం రోజులపాటు జగరనున్న 'ఆఫీసు అడ్మినిస్ట్రేషన్ ఫర్ జూనియర్ అసిస్టెంట్స్' శిక్షణ కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వరంగంలో పనిచేసే సిబ్బంది ఎప్పటికప్పుడు ఆయా రంగాల్లో వస్తున్న ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, మార్కెట్‌కు అనుగుణంగా వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయంలో పనిచేసే ఉద్యోగులకు సేవా తత్పరత చాలా అవసరమని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ పుష్పా చక్రపాణి, రిజిస్ట్రార్ విజయకృష్ణారెడ్డి పాల్గొని ప్రసంగించగా సీఎస్‌టీడీ ఆఫీసర్ ఇన్‌చార్జి పరాంకుశం వెంకటరమణ అధ్యక్షత వహించారు.

అభివృద్ధి పనులను ఆలస్యం చేయొద్దు

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్



ఓపెన్ జిమ్ పార్క్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్లు

వెంగళరావునగర్: ప్రజా నిధులతో చేపట్టే అభివృద్ధి పనుల్లో ఆలస్యం లేకుండా కాంట్రాక్టర్ వేగవంతం చేయాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తెలియజేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్‌కాలనీలో సోమవారం రూ.15.50 లక్షలతో నిర్మించనున్న ఓపెన్ జిమ్ పార్కు పనులకు ఆయన స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాగంటి మాట్లాడుతూ పార్కును అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా పార్కులో ఏర్పాటు చేసే ఓపెన్‌జిమ్ మెటీరియల్‌తో పాటుగా పరిసరాలను సైతం కాపాడుకోవాల్సిన బాధ్యత స్థానికులపైనే ఉందని అన్నారు. మధురానగర్‌కాలనీలో అసోసియేషన్ సహకారంతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మధురానగర్‌కాలనీ నేతలు ప్రతాప్ రెడ్డి, కోడె సాంబశివరావు, సుగుణ, పద్మావతి, విజయవాణి, మనోహర్‌రావు, రేలంగి నరసింహారావు, బీఆర్ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, వేణు, శ్యాంరావు, పవన్ ముదిరాజ్, బాలు, శారద, సుజాత, వాణి తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో జాప్యం... అవస్థల్లో బస్తీజనం

వెంకటేశ్వరకాలనీ: అభివృద్ధి పనులు నెమ్మదిగా సాగుతుండటంతో బస్తీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.4 అంబేడ్కర్ విగ్రహం నుంచి సుఖ్‌దేవ్ నగర్ వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పనుల్లో భాగంగా రెండు నెలల క్రితం ఈ రోడ్డును తవ్వేశారు. అయితే పనులు ఆలస్యంగా జరుగుతుండటంతో సుఖ్‌దేవ్‌నగర్ బస్తీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్తీకి అడ్డంగా పెద్దపెద్ద మట్టికుప్పలు పోయడంతో ద్విచక్ర వాహనాలు కూడా పోవడంలేదని ఇంకెన్ని రోజుల పాటు ఈ పనులు చేస్తారంటూ స్థానికులు అధికారులపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పనుల్లో వేగంపెంచి త్వరితగతిన రోడ్డును అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉంది.



సుఖ్‌దేవ్‌నగర్ బస్తీ వద్ద రోడ్డుకు అడ్డంగా పోసిన మట్టి కుప్పలు

ఓపెన్ నాలాపై స్లాబ్ ఏర్పాటు చేయండి

రహమత్‌నగర్: ఓపెన్ నాలా, ఫుట్‌పాత్ వ్యాపారాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్వస్తిక్ కాంప్లెక్స్ వాసులు వాపోతున్నారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ అధ్యక్షుడు బిషప్ సెబాస్టియన్ మాట్లాడుతూ తమ కాంప్లెక్స్ ముందున్న ఓపెన్ నాలా మూలంగా దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నామని ఎంటామాలజీ విభాగంలో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. జీహెచ్ఎంసీ సర్కిల్-19 అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజాభవన్‌లో కూడా ఫిర్యాదు చేయాల్సి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు నాలాపై స్లాబ్ ఏర్పాటుతోపాటు ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలని కోరారు.

బీఆర్ఎస్ కేలండర్ ఆవిష్కరణ



బంజారాహిల్స్: బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మాగంటి గోపీనాథ్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదేశాల మేరకు సోమవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌లో ఆ పార్టీ 2025 నూతన డైరీ, కేలండర్‌ను ఆవిష్కరించారు. ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి డివిజన్ల వారీగా బీఆర్ఎస్ ముఖ్య నేతలు, అధ్యక్షులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ చేతుల మీదుగా కేలండర్లు, డైరీలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హిమాయత్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ హేమలత, బంజారాహిల్స్ డివిజన్ బీఆర్ఎస్ నేత జేజోళ్ల రాజు, ఖైరతాబాద్ డివిజన్ నాయకురాలు తాండ్ర మేఘన, సోమాజీగూడ నాయకులు రూపేష్ యాదవ్, జూబ్లీహిల్స్ డివిజన్ నాయకులు శంకర్, సుజాత, మొరకొండ వెంకటేష్, రమేష్, ఎండీ అన్వర్, అబ్దుల్ వహీద్ తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా వసంత పంచమి వేడుకలు



సరస్వతి దేవిగా దర్శనమిచ్చిన దైవసన్నిధానం రాజరాజేశ్వరి దేవి అమ్మవారు



అక్షరాభ్యాసంలో చిన్నారులు, తల్లిదండ్రులు

బంజారాహిల్స్: వసంత పంచమి సందర్భంగా ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫిలింనగర్ దైవసన్నిధానంలోని రాజరాజేశ్వరిదేవి అమ్మవారు వసంత పంచమి సందర్భంగా శ్రీ సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన అక్షరాభ్యాస వేడుకల్లో చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడి ఆవరణలోని సరస్వతిదేవి ఆలయంలో సైతం పెద్ద ఎత్తున అక్షరాభ్యాస వేడుకలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సంస్కార్ స్కూల్‌లో ...

శ్రీనగర్‌కాలనీ: చిన్నారులు భక్తిశ్రద్ధలతో వసంత పంచమి వేడుకల్లో పాల్గొన్నారు. సోమవారం ఎర్రగడ్డ సంస్కార్ ది లైఫ్ స్కూల్‌లో వసంత పంచమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు వసంత పంచమి విశిష్టతను చిన్నారులకు ఉపాధ్యాయులు తెలియజేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. స్కూల్ సీఈఓ మోహనవంశీ, డైరెక్టర్ మధుమతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్ పెద్దమ్మగుడిలో అక్షరాభ్యాసాలు



వసంత పంచమి వేడుకల్లో సంస్కార్ చిన్నారులు

మమ్మల్ని తిరిగి విధుల్లోకి తీసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్

పంజగుట్ట: చిన్నచిన్న కారణాలు, తప్పులు చూపించి రిమూవ్ ఫర్ సర్వీస్ చేసిన హోంగార్డులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఉద్యోగం నుంచి తొలగించిన హోంగార్డులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహేందర్, రామకృష్ణ, సురేష్‌లు మాట్లాడుతూ 10 నుంచి 15 సంవత్సరాలు హోంగార్డులుగా విధులు నిర్వహించిన తాము గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా 211 మందిని చిన్నచిన్న ఆరోపణలు, అనారోగ్య సమస్యలతో విధులకు గైర్హాజరైనందుకు సర్వీస్ నుంచి రిమూవ్ చేశారని తెలిపారు. ఉద్యోగాలు కోల్పోయిన తాము కుటుంబాలు పోషించుకోలేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమౌతున్నామన్నారు. న్యాయస్థానం ఆశ్రయించగా న్యాయస్థానం కూడా తమను విధుల్లోకి తీసుకోవాలని సూచించిందని, అయినా తీసుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో తమకు న్యాయం చెయ్యాలని విజ్ఞప్తి చేశారు. హోంగార్డుల సమస్యలు తెలిసిన నగర పోలీస్ కమీషనర్ సి.వి ఆనంద్ తమకు న్యాయం చేయాలని కోరారు.

కానిస్టేబుల్‌పై దాడి

వెంగళరావునగర్: కానిస్టేబుల్‌పై ఓ యువకుడు దాడిచేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ... హజారీ సంజయ్ మధురానగర్‌కాలనీలో వ్యాపారం చేస్తుంటాడు. ఆదివారం రాత్రి అతని కుమారుడు హజారీ ఓంసింగ్ అతడితో గొడవ పడ్డాడు. దీంతో హజారీ సంజయ్ పోలీసులకు ఫోన్ చేయగా కానిస్టేబుల్ ఆర్.నవీన్‌గౌడ్ ఆ ప్రాంతానికి వెళ్లి ఓం సింగ్‌ను వారించాడు. అయినప్పటికీ మాట వినకపోవడంతో తన ట్యాబ్ నుంచి వీడియో తీశాడు. దాంతో ఆగ్రహించిన యువకుడు కానిస్టేబుల్ వద్ద ఉన్న ట్యాబ్ లాక్కుని విసిరేశాడు. అనంతరం కానిస్టేబుల్‌పై దాడి చేశారు. ఈ సంఘటనలో కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో ట్రాలీ మాయం

వెంగళరావునగర్: పార్క్ చేసిన ఆటో ట్రాలీ మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ... రహమత్‌నగర్‌లో నివసించే మహ్మద్ నజీర్ ఆటో ట్రాలీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. శనివారం రాత్రి తన ఆటో ట్రాలీ వాహనాన్ని కార్మికనగర్ చౌరస్తాలో పార్క్ చేసి మరుసటి రోజు వచ్చి చూడగ కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

నిమ్స్ వైద్యురాలికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అకడమిక్ అవార్డు

అభినందించిన నిమ్స్ డైరెక్టర్ బీరప్ప



లక్డీకాపూల్: దేశ క్లినికల్ పరిశోధన రంగంలో చేసిన విశేష కృషికి నిమ్స్ క్లినికల్, ఫార్మాకాలజీ, థెరపెటిక్ విభాగాధిపతి డాక్టర్ ఉషారాణికి అరుదైన గౌరవం దక్కింది. ఆమెను ఐఎస్‌సీఆర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అకడమిక్ అవార్డుతో ఘనంగా సత్కరించింది. క్లినికల్ పరిశోధన అభివృద్ధికి, నైపుణ్యాభివృద్ధికి కీలకపాత్ర పోషిస్తున్న ఉషారాణికి ఈ గౌరవం దక్కడం పట్ల పలువురు నిమ్స్ వైద్యులు, డైరెక్టర్ బీరప్ప, అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డా.ఎన్.లక్ష్మీ భాస్కర్ తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన కృషిని గుర్తించిన ఐఎస్‌సీఆర్‌ను ప్రత్యే కంగా అభినందించారు. నాణ్యతతో కూడిన క్లినికల్ పరిశోధనలను నిర్వహించడానికి ప్రోత్సహిస్తున్న నిమ్స్ డైరెక్టర్, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

హైకోర్టు ఆదేశాలతో తాజ్ బంజారా చెరువు పరిశీలన

బంజారాహిల్స్: కాలుష్య కాసారంగా మారుతున్న అంతగాని కుంట తాజ్‌బంజారా లేక్ చెరువు దుస్థితిపై ఇటీవల కాలుష్య నియంత్రణ మండలి తీరును తప్పుబడుతూ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో అధికారుల బృందం సమన్వయంగా సోమవారం తాజ్ బంజారా చెరువును పరిశీలించింది. కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సురేష్, ఇరిగేషన్ శాఖ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ ప్రియాంక, షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి, బంజారాహిల్స్ డీజీఎం షీలారాణి, తాజ్ హోటల్స్ మేనేజర్ మాధవరెడ్డి, సీవరేజి ట్రీట్‌మెంట్‌ప్లాంట్ మేనేజర్, జీహెచ్‌ఎంసీ అధికారులు ఈ చెరువును పరిశీలించారు. తాజ్‌బంజారా చెరువును మురికి కూపంగా మారుస్తున్నారని, చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయని, మురుగు మొత్తం చెరువులో కలుస్తోందని, చర్యలు తీసుకోవాలంటూ 2017లో ఖుర్షుద్దీన్ హసన్ అనే వ్యక్తి హైకోర్టు మెట్లెక్కాడు. వారం క్రితం హైకోర్టు ధర్మాసనం ఈ పిటిషన్‌ను పరిశీలించింది. ఈ విషయంపై పీసీబీపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజా కౌంటర్ దాఖలు చేయాలని సూచించింది. చెరువులో మరోసారి పర్యటించి సమస్యలు తెలుసుకొని వాటిపై నివేదిక ఇవ్వాల్సిందిగా కూడా ఆదేశాలు జారీ చేసింది. దీంతో వివిధ శాఖల అధికారులు సమన్వయంగా జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేశారు. 14 ఎకరాల్లో అంతగాని కుంట చెరువు విస్తరించి ఉంది.

ప్రజావాణికి 130 అర్జీలు



అర్జీలను స్వీకరిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

లక్డీకాపూల్: ప్రజావాణికి వచ్చిన అర్జీదారుడికి లిఖిత పూర్వకంగా సమాధానం పంపించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొన్న కమిషనర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల సమస్య పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. ఈ విషయంలో జాప్యాన్ని సహించేది లేదన్నారు. ప్రజావాణి ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా నాలుగు విన్నపాలు రాగా, వాటిని సత్వర పరిష్కారం నిమిత్తం ఆయా విభాగాలకు పంపించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 44 దరఖాస్తులు అందాయి. అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, యాదగిరిరావు, గీత రాధిక, గంగాధర్, ప్రదీప్, వాటర్ వర్క్స్ జీఎం సాయిరమణ, హౌసింగ్ ఎస్ఈ కృష్ణారావు, ఈఈ రాజేశ్వర్‌రావు, చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ అబ్దుల్ వకీల్, ఎస్టేట్ ఆఫీసర్ ఉమా ప్రకాష్, వాల్యుయేషన్ అధికారి మహేష్ కులకర్ణి, ఓఎస్‌డీ అనురాధ, ఏఎంసీలు ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీ-హబ్, ఐటీఎఫ్‌ఏ మధ్య అవగాహన ఒప్పందం

సాక్షి, సిటీబ్యూరో: ఇండియా, టర్కీ మధ్య వివిధ రంగాల్లో పరస్పర సహకారాన్ని బలోపేతం చేసేందుకు టీ-హబ్ ఇండో-టర్కీ ఫ్రెండ్‌షిప్ అసోసియేషన్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లోని టర్కీ కాన్సులేట్ జనరల్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో అవగాహన ఒప్పందం అధికారికంగా ఆమోదించారు. ఈ నెల 26న టర్కీ టూరిజం రోడ్‌షో, ఏప్రిల్‌లో టర్కీకి వ్యాపార పర్యటన, మే 3 నుంచి 18 వరకు టర్కీ ఫుడ్ ఫెస్టివల్, జూన్‌లో టర్కీ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహించాలని నిర్ణయించాయి. కార్యక్రమంలో టీ-హబ్ సీఈఓ సుజిత్ జగిర్దార్, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ హాజరయ్యారు.



బినామీ బుకింగ్‌పై నిఘా!

కస్టమర్ ప్రమేయం లేకుండా క్యాన్ నంబర్లపై బుకింగ్

- ఆపరేటర్ల చేతివాటం.. బ్లాక్‌లో ట్యాంకర్ల డెలివరీ
- వాటర్ ట్యాంకర్ల దారుల స్మార్ట్ కార్డుల బ్లాక్
- రంగంలో దిగిన జలమండలి విజిలెన్స్ బృందం
- వాటర్ ట్యాంకర్లు పక్కదారి పట్టకుండా పక్కా వ్యూహం

వేసవి ముందే 50 శాతం పెరిగిన ట్యాంకర్ల తాకిడి



సరిగ్గా నాలుగు రోజుల క్రితం మాదాపూర్‌లోని నల్లా నీటి వినియోగదారుడికి గత నెల 7న క్యాన్ నంబర్‌పై వాటర్ ట్యాంకర్ బుక్ చేసినట్లు సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. వాటర్ ట్యాంకర్ బుక్ చేయకున్నా.. మెసేజ్ రావడంతో సాంకేతిక సమస్య కావొచ్చని పట్టించుకోలేదు. మరో వారం రోజులకు మళ్లీ ట్యాంకర్ బుకింగ్ చేసినట్లు సందేశం వచ్చింది. 10 రోజుల గడువులో మరో రెండుసార్లు వాటర్ ట్యాంకర్ బుక్ చేసినట్లు, డెలివరీ కూడా అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో ఖంగుతిన్న సదరు వినియోగదారుడు ఏకంగా జలమండలి ప్రధాన కార్యాలయానికి ఫోన్ చేసి నేరుగా ఎండీకి ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలో దిగిన విజిలెన్స్ బృందం టోకెన్ నంబర్ ఆధారంగా విచారణ జరిపి వాటర్ ట్యాంకర్లను గుర్తించారు. తక్షణమే వాటర్ ట్యాంకర్ ఆపరేటర్ ప్రీపెయిడ్ స్మార్ట్ కార్డును బ్లాక్ చేశారు. ఇదో ఉదాహరణ.. ఇలాంటి వాటర్ ట్యాంకర్‌దారుల బినామీ దందా సర్వసాధారణమే.

సాక్షి, సిటీబ్యూరో:

వేసవిలో వాటర్ ట్యాంకర్ల సరఫరాలో అక్రమాలపై కొరడా ఝులిపించేందుకు జలమండలి చర్యలకు ఉపక్రమించింది. వాటర్ ట్యాంకర్ ఆపరేటర్ల చేతివాటం, బీనామి బుకింగ్‌లను నిగ్గు తేల్చేపనిలో పడింది. వేసవి కంటే ముందే భూగర్భ జలాలు అడుగంటుతుండటంతో పలు ప్రాంతాల్లో ట్యాంకర్ల బుకింగ్ తాకిడి పెరుగుతోంది. దీంతో ఇప్పటి నుంచే ట్యాంకర్ల ద్వారా జరిగే నీటి సరఫరాలో జాప్యం, వెయిటింగ్ పీరియడ్, పెండెన్సీ తగ్గించేలా చర్యలు తీసుకుంటోంది. క్షేత్రస్థాయిలో వాటర్ ట్యాంకర్ల సరఫరాపై నిఘా పెట్టేందుకు విజిలెన్స్ విభాగాన్ని రంగంలోకి దింపింది. ఇప్పటికే అన్ని ఫిల్లింగ్ స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రధాన కార్యాలయానికి అనుసంధానంతో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పర్యవేక్షిస్తోంది. తాజాగా ట్యాంకర్ల బుకింగ్, సరఫరాపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. వాటర్ ట్యాంకర్ల ఆపరేటర్లు కస్టమర్లకు తెలియకుండా వారి క్యాన్ నంబర్లపై ట్యాంకర్లను బుకింగ్ చేసి బ్లాక్‌లో అధిక ధరకు సరఫరా చేసి సొమ్ము చేసుకోవడాన్ని జలమండలి తీవ్రంగా పరిగణించింది.

ఎంసీసీ బుకింగ్‌కు ప్రాధాన్యం

మెట్రో కస్టమర్ కేర్(ఎంసీసీ) ద్వారా జరిగే బుకింగ్‌లకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని జలమండలి నిర్ణయించింది. అత్యవసరం పేరిట ఫిల్లింగ్ స్టేషన్ల వద్ద, నేరుగా వాటర్ ట్యాంకర్ ఆపరేటర్ల ద్వారా జరిగే నాన్ ఎంసీసీ బుకింగ్‌లకు రెండో ప్రాధాన్యత ఇచ్చేందుకు సిద్ధమైంది. ఎంసీసీ ద్వారా జరిగే బుకింగ్ ఐదు ట్యాంకర్ల ఫిల్లింగ్ తర్వాత నాన్ ఎంసీసీ ద్వారా జరిగే ఒక బుకింగ్ చొప్పన సరఫరా జరిగే విధంగా చర్యలకు ఉపక్రమించింది. మరో వైపు ట్యాంకర్ మేనేజ్‌మెంట్ సెల్ ఏర్పాటు చేసి వివిధ సర్కిళ్లు, డివిజన్లు, సెక్షన్ల నుంచి సమన్వయంతో ట్యాంకర్ల సరఫరా జరిగే విధంగా ఆదేశాలు జారీ చేసింది. వాటర్ ఫిల్లింగ్ పాయింట్లకు డీజీఎం స్థాయి అధికారికి పర్యవేక్షణ బాధ్యత అప్పగించింది. ట్యాంకర్ బుకింగ్ మొదలు.. డెలివరీ వరకు సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వాటర్ బోర్డు ప్రత్యేక యాప్ రూపొందించింది. ఫుడ్ డెలివరీ యాప్ తరహాలో ట్రాకింగ్ యాప్‌ను అమలు చేస్తోంది. దీంతో వినియోగదారులు తాము బుక్ చేసుకున్న ట్యాంకర్ ఎక్కడి వరకు వచ్చిందో ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.

కొత్తగా 100 ట్యాంకర్లు

వేసవి దృష్టిలో పెట్టుకొని డిమాండ్‌ను అధిగమించేందుకు కొత్తగా వంద ట్యాంకర్లను జలమండలి అందుబాటులో తీసుకొచ్చింది. దీంతో ట్యాంకర్ల సంఖ్య 949కు చేరింది. ప్రస్తుతం 78 ఫిల్లింగ్ స్టేషన్లు ఉండగా అందులో 126 ఫిల్లింగ్ పాయింట్లు ఉన్నాయి. తాజాగా వాటర్ ట్యాంకర్ల బుకింగ్ 50 శాతం పెరిగింది. మరోవైపు ఉచిత, ఇతరత్ర వాటికి ట్యాంకర్ల సరఫరా కూడా పెరిగింది. ఫిబ్రవరి నెలలో మరింత పెరిగే అవకాశాలు ఉండటంతో ట్యాంకర్లు పక్కదారి పట్టకుండా చర్యలకు ఉపక్రమించినట్లు కనిపిస్తోంది.

జనవరి నెలలో ట్యాంకర్ల బుకింగ్ ఇలా..

బుకింగ్	2024	2025
ఎంసీసీ	52,450	78,518
నాన్ ఎంసీసీ	22,312	32,545

వాటర్ ట్యాంకర్ల సరఫరాపై నిఘా



వాటర్ ట్యాంకర్ల సరఫరాపై నిఘా పెట్టాం. బుకింగ్ నుంచి డెలివరీ వరకు రియల్ టైమ్‌ను పర్యవేక్షిస్తున్నాం. ట్యాంకర్ ఆపరేటర్లు చేతివాటం ప్రదర్శిస్తే చర్యలు తప్పవు. అవసరమైతే బ్లాక్ లిస్టులో పెడతాం. మరోవైపు బుకింగ్ పెండెన్సీ లేకుండా డిమాండ్ తగ్గట్లు సరఫరా చేసేందుకు ఫిల్లింగ్ స్టేషన్లలో ఫిల్లింగ్ టైమ్ తగ్గించే విధంగా చర్యలు చేపట్టాం. ఫిల్లింగ్ సమయాన్ని ఐదు నిమిషాలకు తగ్గిస్తే రెట్టింపు ట్రిప్పులు డెలివరీ చేయవచ్చు. వాటర్ ఫిల్లింగ్ స్టేషన్లు, వాటర్ ఫిల్లింగ్ పాయింట్లను పెంచాం. ట్యాంకర్ల కోసం వేచి చూసే పరిస్థితి లేకుండా సరఫరా చేస్తాం.

– అశోక్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్, జలమండలి

నగరంలో నేడు

- ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ కేన్సర్ రిజిస్ట్రీ డేటా (ఐసీఎంఆర్-ఎన్‌సీడీఐఆర్) పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఉదయం 10 గంటలకు నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో జరుగుతుంది.
- కేన్సర్ రోగుల సౌకర్యార్థం నిమ్స్ అంకాలజీ విభాగంలో ఏర్పాటు చేసిన ఆకర్షణ లైబ్రరీని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ సాయంత్రం 5.15 గంటలకు ప్రారంభిస్తారు.
- నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో రివైవింగ్ ది రూట్స్ పేరిట కళాకారుడు డాక్టర్ కొండపల్లి శేషగిరి రావు వేసిన చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిమ్స్ మెడికల్ అంకాలజీ విభాగం ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు ఎమర్జెన్సీ బ్లాక్ గేట్ నుంచి పంజాగుట్ట గేట్ వరకు వాక్ జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ ఛైర్మన్ వీజీఆర్ నారగోని



మాట్లాడుతున్న నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ ఛైర్మన్ వీజీఆర్ నారగోని

కాచిగూడ: విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థలలో బీసీలకు 44శాతం రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టాలని నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ ఛైర్మన్ వీజీఆర్ నారగోని డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలు, మహిళలు, మైనార్టీలకు జనాభా ప్రాతిపదికన ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు ఇవ్వని కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కుటుంబ సర్వే బీసీ కులగణన సర్వే నివేదిక వచ్చినందున విద్యా, ఉద్యోగాల్లో బీసీ రిజర్వేషన్లను 25 శాతం నుంచి 44 శాతానికి పెంచుతూ జీవో జారీ చేయాలని, స్థానిక సంస్థల రిజర్వేషన్లను బీసీలకు 42శాతానికి పెంచుతూ అసెంబ్లీలో ప్రకటన చేసి జీవో జారీ చేయాలన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపితే ఉపయోగం లేదని, ఇది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిదేనని, ఈ రెండు అంశాలపై అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలన్నారు. రాష్ట్రంలో మిగిలిన ఆరు మంత్రిత్వ శాఖలను బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అన్ని వర్గాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించకుండా రాజ్యాంగాన్ని ఉల్లంఘించిన కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ కన్వీనర్లు కేబీ శ్రీధర్, జేఎల్ ఆశీర్వాదం, ఎంబీ గోపీ, సలీం బాషా, పాల్, స్వామిజీ రాజులు, సూర్యనారాయణ, టీవీ రామనర్సయ్య, యం.నర్సయ్య, కె.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలను కూల్చేసిన హైడ్రా

ఊటపల్లిలో రహదారి స్థలంలోని అక్రమ కట్టడాలను కూల్చివేత



సంపత్‌నగర్‌లోని పార్కు స్థలంలో షెడ్డును కూల్చివేసిన అధికారులు



మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన మూడు అక్రమ కట్టడాలను సోమవారం ఉదయం హైడ్రా అధికారులు కూల్చివేశారు. పట్టణంలోని సదరన్ ప్యారడైజ్ (సంపత్‌నగర్)లో 998 గజాల పార్కు స్థలంలో ఓ వ్యక్తి రేకులతో షెడ్డు వేయడంతో స్థానికులు ఇటీవల హైడ్రాకు ఫిర్యాదు చేశారు. పరిశీలించిన హైడ్రా అధికారులు వారం క్రితం నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ స్థలంలోనే నిర్మాణం ఉన్నట్లు నిర్ధారించుకున్న హైడ్రా అధికారులు దాన్ని నేలమట్టం చేశారు. అదేవిధంగా పట్టణంలోని ఊటపల్లిలోని కెప్టెన్-2 కాలనీలో 33 అడుగుల రహదారి స్థలంలో ఇద్దరు నిర్మించిన ప్రహరీలను అధికారులు కూల్చివేశారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రహదారి స్థలంలో నిర్మాణం చేసిన వ్యక్తులు తాము కొనుగోలుదారుల చేతిలో మోసపోయామని లబోదిబోమన్నారు. – శంషాబాద్

పైప్‌లైన్ పనులు త్వరగా పూర్తి చేయండి

- జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి



హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో పర్యటిస్తున్న మేయర్ గద్వాల విజయలక్ష్మి

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మంజీరా పైప్‌లైన్ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి ఆదేశించారు. డివిజన్ పరిధిలోని మంజీరా పైప్‌లైన్ రోడ్డు పనులు, మురళీధర్ సొసైటీ రోడ్డును సోమవారం ఉదయం ఆకస్మికంగా పర్యటించి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా స్థానికులు ఆర్టీసీ కాలనీ వద్ద రోడ్డంతా గుంతలు ఉన్నాయని, పట్టించుకునే అధికారి కరువయ్యారని వాపోయారు. నిధులు విడుదల చేసినా ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని మేయర్‌కు ఫిర్యాదు చేశారు. మేయర్ విజయలక్ష్మి ఇంజినీరింగ్ విభాగం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంజీరా పైప్‌లైన్ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధి బాధ్యత తమదేనన్నారు. తన వద్దకు వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీకి జీహెచ్‌ఎంసీ అభివృద్ధిపై స్పష్టమైన అవగాహన ఉందని, పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్‌లలో పెండింగ్‌లో ఉన్న పనులు సంబంధిత అధికారులతో కలిసి పూర్తి చేసే విధంగా కృషి చేస్తానన్నారు. శేరిలింగంపల్లి జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, కార్పొరేటర్లు జగదీశ్వర్‌గౌడ్, పూజితగౌడ్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నగరాన్ని శుభ్రంగా ఉంచుతున్నాం.. వేతనాలు పెంచరేం..



లక్డీకాపూల్: జీహెచ్‌ఎంసీ పరిధిలో శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్లు(ఎస్ఎఫ్ఏ)లకు కనీస వేతనం రూ.35 వేలు ఇవ్వాలని సీఐటీయూ కార్మిక సంఘం నగర ఉపాధ్యక్షుడు జి.రాములు, సహాయ కార్యదర్శి సి.మల్లేష్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఏల ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం జరిగిన జీహెచ్‌ఎంసీ ప్రజావాణిలో వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేతలు మాట్లాడుతూ గ్రేటర్ పరిధిలో దాదాపు 900 మంది ఎస్ఎఫ్ఐలు పనిచేస్తున్నారని, హైదరాబాద్ నగర అభివృద్ధిలో భాగంగా శుభ్రతలోనూ నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచడంలో వీరి కృషి అమోఘం అన్నారు. నగరానికి అనేక అవార్డులు, రివార్డులు వస్తున్నాయంటే శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర ఘనంగా ఉందన్నారు. దీంతో వీరికి రోజు రోజుకూ పనిభారం పెరుగుతోందన్నారు. కానీ వీరికి వేతనాలు మాత్రం తక్కువ ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఇందిరమ్మ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇచ్చి ఎస్ఎఫ్ఏలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ గీతారాధికకు వినతిపత్రాన్ని సమర్పించినట్లు రాములు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అంబర్‌పేట్ జోన్ నాయకులు పి.శ్రీనివాస్, ఆదిల్ పాల్గొన్నారు.

మాతృభూమిని ప్రేమించినప్పుడే దేశాలు సుభిక్షం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

రాయదుర్గం: కన్నతల్లిని, మాతృభూమిని ప్రేమించినప్పుడే అన్ని దేశాలు సుభిక్షంగా ఉంటాయని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ అభివృద్ధి కేంద్రం, సెంటర్ ఫర్ హ్యూమన్ సెక్యూరిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ కన్నెగంటి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో 'టెక్నాలజీ రిస్క్ మేనేజ్‌మెంట్' జాతీయ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధిలో బ్యాంకులు, ఆరోగ్య, వ్యాపార, వాణిజ్య, ఐటీ తదితర రంగాల్లో భాగమైన వాటి భద్రతను చోరీ చేసే ప్రక్రియలకు సైబర్ నేరగాళ్లు ప్రయత్నిస్తుంటారని అన్నారు. కృత్రిమ మేధను కూడా సవాల్ చేస్తూ బ్లాక్‌చైన్, క్రిప్టో కరెన్సీ, హ్యాకింగ్ తదితర విధానాల ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేసే ప్రయత్నాలను విఫలం చేస్తూ, భారత శాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖ దేశ రక్షణలో కీలక భూమిక పోషిస్తోందన్నారు. అమెరికా, జర్మనీ, ఇంగ్లాండ్ తరహాలో మన దేశంలో కూడా డేటా సెంటర్లు ఎక్కువగా పెరగాల్సిన అవసరం ఉందన్నారు. 15 రోజుల పాటు శిక్షణ కొనసాగుతుంది. సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి శ్రీరామ్ బిరుదవేలు, అస్కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన నిజామియా ఆధ్యాత్మిక పరీక్షలు



ఆధ్యాత్మిక పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ పాతబస్తీలోని ఇస్లామిక్ జామియా నిజామియా విశ్వవిద్యాలయంలో రెండు రోజుల పాటు జరిగిన ఆధ్యాత్మిక పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ముహమ్మద్ సైఫుల్లా షేక్ అల్-జామియా పర్యవేక్షణలో సయ్యిదునా ఇమామ్, అసిమ్ పఠన, రాత ఆధ్యాత్మిక పరీక్షలు జరిగాయి. నగరానికి చెందిన 3,200 మంది, జిల్లాల నుంచి 857 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు పరీక్షల నియంత్రణాధికారి మౌలానా ముఫ్తీ అన్వర్ అహ్మద్ తెలిపారు.

విజిట్ మలేషియా ఇయర్- 2026

16 లక్షల మంది పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యం

- మలేషియా టూరిజం డైరెక్టర్ జనరల్ మనోహరన్



సాక్షి, సిటీబ్యూరో: వివాహ పర్యాటకం, విహార యాత్రలు, అత్యాధునిక సమావేశ మందిరాలు, లగ్జరీ హోటల్స్, అంతర్జాతీయ సదస్సులు, ప్రదర్శనలకు మలేషియా గమ్యస్థానంగా నిలుస్తోందని మలేషియా టూరిజం డైరెక్టర్ మనోహరన్ పెరియాస్వామి అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయేది విజిట్ మలేషియా ఇయర్ 2026 (వీఎంవై 2026). వచ్చే ఏడాది 16 లక్షల మంది భారతీయ పర్యాటకులను ఆకట్టుకోవడమే లక్ష్యంగా ఆకర్షణీయమైన ప్యాకేజీలు ప్రకటిస్తున్నామన్నారు. 2024లో 10 లక్షల మంది పర్యాటకులు వచ్చినట్లు తెలిపారు. మైస్ టూరిజం, వివాహ పర్యాటకం, విహార యాత్రల పరంగా చూస్తే మలేషియా ప్రధాన గమ్యస్థానంగా నిలిపేందుకు కృషి చేస్తున్నామన్నారు. దక్షిణ భారత్‌తో బలమైన రవాణా సౌకర్యాలు ఉన్నాయన్నారు. వారంలో చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, కొచ్చిల నుంచి 151 విమాన సర్వీసులు నడుస్తున్నాయన్నారు. మలేషియా పర్యాటక రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. సోమవారం నుంచి 7వ తేదీ వరకు దేశవ్యాప్తంగా టూరిజం రోడ్ షో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 62 మంది మలేషియా సేల్స్ ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ప్రోత్సాహకాలు, సమావేశాలు, ఎగ్జిబిషన్స్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో టూరిజం మలేషియా చెన్నై డైరెక్టర్ హిషాముద్దీన్ ముస్తఫా, మలేషియా పర్యాటకశాఖ ప్రతినిధులు, వివిధ టూరిజం ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏజీవర్సిటీలో యంత్ర ప్రదర్శన

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యాలయంలోని ఫాం ఇంప్లిమెంట్స్ స్కీంలో భాగంగా వ్యవసాయ యంత్ర పరికరాల ప్రదర్శనను సోమవారం ఏర్పాటు చేశారు. దేశంలో వ్యవసాయ ఉత్పాదకత పెంచాల్సిన అవసరం ఉందని, వ్యవసాయ యంత్ర పరికరాల విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజయ్య వివరించారు. ఇది రైతులకు పంట సంరక్షణ విత్తన పరికరాల వినియోగం శరీర శ్రమను తగ్గించడం, వ్యవసాయ ఖర్చులను నియంత్రించడంలో సహాయపడుతుందన్నారు. యాంత్రీకరణతో పంట ఉత్పత్తి 10 నుంచి 20 శాతం వరకు పెంచవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు.



పోరాటాల ప్రేరణతో అరుణోదయ ఆవిర్భావం



అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నూతన కార్యవర్గంతో విమలక్క

ముషీరాబాద్: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య(ఏసీఎఫ్) జంట నగరాల మహాసభ సోమవారం కోఠిలో జరిగింది. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు విమలక్క, ప్రొఫెసర్ కట్ట భగవంత్‌రెడ్డి, ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 1974లో ఉస్మానియా ఇంజినీరింగ్ కళాశాలలో జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ నేతృత్వంలో అరుణోదయ ఆవిర్భవించి 50 ఏళ్లను పూర్తి చేసుకొని ముందుకు సాగుతోందని తెలిపారు. నక్సల్‌బారి, శ్రీకాకులం, సిరిసిల్ల, జగిత్యాల, గోదావరి లోయ పోరాటాల ప్రేరణతో అరుణోదయ ఆవిర్భవించిందని తెలిపారు. అమరులు నూతన్, పరుపుబండ గోపాల్, రెక్కల సహదేవరెడ్డి, నాగన్న, సంతోష్ వంటి ఎంతో మంది అమరులైన కళాకారులకు నివాళులర్పించారు. జంట నగరాల నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షులు మల్సూర్ ప్రకటించారు.

నూతన కమిటీ..

జంట నగరాల అరుణోదయ అధ్యక్షుడిగా రాకేష్, ఉపాధ్యక్షులుగా అఫీజ్, సంతోషా, ప్రసన్న, ప్రధాన కార్యదర్శిగా సురేష్, కార్యదర్శులుగా సౌజన్య, అరుంధతి, సంగీత, కోశాధికారిగా చైతన్యతో పాటు మరో ఆరుగురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

సాక్షి 11
హైదరాబాద్‌। మంగళవారం। 4। ఫిబ్రవరి। 2025

సిటీ ప్లస్

క్యాన్సర్‌పై అవగాహన పెరగాలి



సినీ నటి మీనాక్షి

బంజారాహిల్స్‌ : నిత్యం అనేక సమస్యలతో మహిళలు పోరాడుతుంటారని, అలాంటి వారు సరైన అవగాహన లేకపోవడంతోనే బ్రెస్ట్‌, సర్వైకల్‌ క్యాన్సర్‌ బారిన పడుతున్నారని సినీ హీరోయిన్‌ మీనాక్షి చౌదరి అన్నారు. జూబ్లీహిల్స్‌ అపోలో క్యాన్సర్‌ సెంటర్‌లో గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన, ఉచిత టీకా డ్రైవ్‌ సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన మీనాక్షి చౌదరి మాట్లాడుతూ క్యాన్సర్‌ను నిరోధించేందుకు బాల్య దశలోనే ప్రివెంటివ్‌ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని, దురదృష్టవశాత్తు వాటిపై ఎక్కువ మందికి అవగాహన లేకపోవడంతో వ్యాక్సిన్లకు దూరమవుతున్నారని అన్నారు. క్యూర్‌ ఫౌండేషన్‌, అపోలో క్యాన్సర్‌ ఆధ్వర్యంలో బాలికలకు ఉచితంగా ఈ వ్యాక్సిన్‌ వేయడం అభినందనీయమన్నారు. డాక్టర్‌ విజయ్‌ ఆనంద్‌ రెడ్డి మాట్లాడుతూ 4న ప్రపంచ క్యాన్సర్‌ దినోత్సవాన్ని పురస్కరించుకుని అపోలో ఆస్పత్రి క్యాన్సర్‌ సెంటర్‌లో ఫిబ్రవరి నెల మొత్తం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఉచితంగా హెచ్‌పీవీ (హ్యూమన్‌ ప్యాపిలోమా వైరస్‌) టీకాలు వేస్తున్నామని తెలిపారు.





ఆహా ఏమి రుచి..

నగరంలో యునైటెడ్‌ వరల్డ్‌ యంగ్‌ చెఫ్స్‌ కార్యక్రమం

పాల్గొన్న తొమ్మిది దేశాలకు చెందిన చెఫ్‌లు


సాక్షి, సిటీబ్యూరో: నగరం వేదికగా నిర్వహించిన యునైటెడ్‌ వరల్డ్‌ యంగ్‌ చెఫ్స్‌ గ్యాస్ట్రోనమిక్‌ ఎక్స్‌పీరియన్స్‌ ఆహార ప్రియులకు పసందైన రుచులను పరిచయం చేసింది. గచ్చిబౌలిలోని ది గ్లాస్‌ ఆనియన్‌ వేదికగా సోమవారంజరిగిన పాక శాస్త్ర కార్యక్రమంలో తొమ్మిది దేశాల నుంచి వచ్చిన యువ చెఫ్‌లు వారి జాతీయ వంటకాలతో అలరించారు. ఇంటర్నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ హోటల్‌ మేనేజ్‌మెంట్‌ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్‌ హాస్పిటాలిటీ కౌన్సిల్‌ లండన్‌ భాగస్వామ్యంతో దేశ వ్యాప్తంగా హైదరాబాద్‌, గోవా, బెంగళూరు, కోల్‌కతా, పూణే, అహ్మదాబాద్‌ వంటి నగరాల్లో వివిధ దేశాలకు చెందిన 50 మంది చెఫ్‌లు ఇందులో పాల్గొన్నారు. కాగా ఇందులో నగరానికి చెందిన తొమ్మిది మంది చెఫ్‌లు పాల్గొన్నారు. అల్బేనియా, ఆస్ట్రేలియా, గ్రీస్‌, ఉజ్బెకిస్తాన్‌, కజకిస్తాన్‌, తైమూర్‌–లెస్టే, నైజీరియా, ఉగాండా, ఫిలిప్పీన్స్‌ వంటి దేశాలకు ప్రాతినిధ్యం వహించిన ప్రతినిధులు, నగరంలోని ప్రసిద్ధ వ్యక్తులకు ప్రత్యేకంగా తమ వంటకాలను ప్రదర్శించారని నిర్వాహకులు ఇమ్మాన్యుయేల్‌ తెలిపారు.






మహా కుంభమేళాకి వెళ్తున్నారా? వెళ్లట్లేదా! అయోధ్య నుంచి బాలరాముడు కూడా మహాకుంభమేళా కోసం ప్రయాగ్‌రాజ్‌ చేరుకున్నాడు. నిజమా! అవును నిజమే. అయోధ్య వెళ్లలేని వాళ్ల కోసం రాముడే స్వయంగా త్రివేణి సంగమానికి తరలి వచ్చాడని సంబరపడుతున్నారు భక్తులు. అచ్చం అయోధ్యలోని బాలరాముడి ఆలయాన్ని పోలిన నిర్మాణాన్ని యూపీలోని కుంభమేళాలో ఆవిష్కరించాడు మన హైదరాబాదీ. ఆయన పేరు రమణ వంక. సినిమాలకు ఆర్ట్‌ డైరెక్టర్‌గా సొబగులద్దే రమణ ఈ మహాకుంభమేళా సందర్భంగా అయోధ్యరాముడి ఆలయాన్ని, బాలరాముడి విగ్రహాన్ని తీర్చిదిద్దారు.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్‌







రాముడే పిలిచాడు!

బీఎస్సీ చదివి 10–5 జాబ్‌ చేశాను. సంతృప్తినివ్వలేదు. దీంతో నాకిష్టమైన డ్రాయింగ్‌లో ఎమ్‌ఎఫ్‌ఏ చేశాను. ఆర్ట్‌ డైరెక్టర్‌గా పాతికకు పైగా సినిమాలకు పనిచేసి నేషనల్‌ అవార్డు అందుకున్నాను. నా కెరీర్‌లో ది బెస్ట్‌ టాస్క్‌ ఆలయ రెప్లికా నిర్మాణం. వెనక్కి తిరిగి చూసుకుంటే నా చరిత్రలో రాముడున్నాడు. జీవితానికి ఇది చాలు.

– రమణ వంక, సినీ ఆర్ట్‌ డైరెక్టర్‌

ప్రయాగ రాముడు

కుంభమేళాలో అయోధ్యరాముని రెప్లికా

ప్రత్యేక అట్రాక్షన్‌గా రామ మందిరం	ప్రతిరూప నిర్మాణం 25 రోజుల్లో పూర్తి	హైదరాబాదీ రూపశిల్పి రమణ వంక ప్రతిభ

‘శ్రీ మ సినిమాకు టెంపుల్‌ సెట్‌ వేసిన అనుభవం ఉంది. అది తెలిసి ఆద్యశ్రీ ఎన్‌ఫోటైన్‌మెంట్‌, శ్రీ గరుడ రామ్‌మందిర్‌ వారు పిలిచారు. ‘శతమానం భవతి’ సినిమా కోసం దాదాపు యాభై రోజులు నియమనిష్ఠలు పాటించాను. అలాగే రాముడి మందిరానికి భూమి పూజ చేసిన డిసెంబర్‌ 26 నుంచి నిష్ఠలో ఉన్నాను. ఫిబ్రవరి 26తో మహా కుంభమేళా ముగుస్తుంది. కానీ శ్రీరామనవమి వేడుకల వరకూ (మార్చి 15) మందిరాన్ని ఉంచాలని అనుకుంటున్నారు. అప్పటి వరకూ నిష్ఠను కొనసాగిస్తాను’ అన్నారు రమణ వంక.

అయోధ్య మందిరాన్ని చూడలేదు..

అయోధ్య మందిరానికి ప్రతిరూప నిర్మాణాన్ని 25 రోజుల్లో పూర్తి చేశారు రమణ. ఒక ఆలయానికి రూపకల్పన చేయాలంటే శాస్త్రాలను, మత విశ్వాసాలను, నిర్మాణశైలిని అధ్యయనం చేయాలి. ప్రతి చిన్న డీటెయిలింగ్‌ వెనుక ఒక అధ్యయనం ఉంటుంది. అప్పటికే ఉన్న ఆలయానికి రెప్లికా కాబట్టి రోజుల్లోనే చేయగలిగానని, ఇది నా అదృష్టమని రమణ చెబుతున్నారు. అయితే ‘అయోధ్య మందిరాన్ని సందర్శించలేదని, కానీ నిర్మాణాన్ని ఫొటోలో చూడగానే ఒక అవగాహన వచ్చిందని, ఈ నిర్మాణంలో వెదురు, ఫైబర్‌, ఫోమ్‌, క్లాత్‌ వాడామని, ఎనిమిది డిగ్రీల చలిలో, మంచుతో తడిసిన వెదురు కర్రల మీద 80 అడుగుల ఎత్తులో పని చేస్తున్నప్పుడు ఆందోళనగా ఉండేదని, ఎటువంటి చిన్న ప్రమాదం లేకుండా పని పూర్తి చేయగలిగామని, అవకాశం వచ్చినప్పుడే మనల్ని మనం నిరూపించుకోవాలి’ అని చెబుతున్నారు రమణ. కాగా కుంభమేళాలో అయోధ్య రాముడి నమూనా నిర్మాణం చేపట్టిన ఘనత హైదరాబాదీది, పైగా తెలుగు వాడిది కావడం గర్వకారణం.





అయోధ్యలో సగం!

ప్రయాగ్‌రాజ్‌ రామ మందిరానికి అయోధ్య మందిరం కొలతల్లో యాభై శాతం తీసుకున్నారు. 161 అడుగుల ఎత్తును 81 చేశారు. 360 అడుగుల పొడవు, 161 అడుగుల వెడల్పు 140, 120గా తీసుకున్నారు. రాముడి విగ్రహాన్ని అసలు రూపం కంటే మూడు అంగుళాలు తక్కువగా తీసుకున్నారు. ప్రాణ ప్రతిష్ఠ బదులు జల ప్రతిష్ఠ చేశారు. నిత్యపూజలు దర్శనాలు ఉదయం 7 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకూ ఉంటాయి. రోజుకు 15 నుంచి 20 వేల మంది దర్శనం చేసుకుంటున్నారు.

సర్వమతం.. శ్రీరామం..

ప్రయాగ్‌రాజ్‌ రామమందిరం రూపశిల్పి రమణ తెలుగు వాడు. అయితే హిందీ, బెంగాలీ వాళ్లు మొత్తం రెండు వందల మంది కళాకారులు ఇందులో పాల్గొన్నారు. నిత్యం ‘జై శ్రీరామ్‌’ అంటూ దీక్షగా పని చేసుకుపోయిన వారిలో వివిధ భాషలే కాదు, మతాలు కూడా ఉన్నాయి. ఈ 200 మందిలో హిందూ, క్రిస్టియన్‌, ముస్లింలు ఉన్నారు. ప్రయాగ్‌రాజ్‌లో త్రివేణి సంగమానికి ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో చుంగ్లీ అనే ప్రదేశంలో ఉంది. త్రివేణి సంగమం, సెక్టార్‌ 1, గ్రౌండ్‌ 17లో ఉంది.



ప్రతి జ్యువెలరీ కళాత్మకం

ఐఏఎస్‌ అధికారిణి రేఖారాణి

బంజారాహిల్స్‌ : కళాకారులు అసాధారణ రీతిలో జ్యువెలరీని తయారు చేస్తున్నారని, ప్రతి జ్యువెలరీలో ఓ చరిత్రను, ఓ కథను చెప్పే విధంగా రూపొందిస్తున్నారని ఏపీ హ్యాండ్లూమ్‌ అండ్‌ టెక్స్‌టైల్‌ కమిషనర్‌, ఐఏఎస్‌ అధికారిణి రేఖారాణి అన్నారు. జూబ్లీహిల్స్‌లో అనంత్‌ డైమండ్స్‌, జ్యువెలర్స్‌ స్టోర్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. తాను స్వతహాగా కళాత్మకంగా ఉండే జ్యువెలరీని ఇష్టపడతానని అన్నారు. అనంత్‌ డైమండ్స్‌ అధినేత వెంకట భాను ప్రకాశ్‌ మాట్లాడుతూ భారతీయ సంప్రదాయ క్లాసిక్‌ జ్యువెలరీని తాము ప్రత్యేకంగా తయారు చేస్తున్నట్లు వెల్లడించారు.

సేవా స్వరూపం

కుముద్‌బెన్‌ జోషి మొదలు జిష్ణుదేవ్‌ వర్మ వరకూ

ఎనిమిది మంది గవర్నర్ల వద్ద ఆయాగా స్వరూప విధులు



బంజారాహిల్స్‌: రాజ్‌భవన్‌లో 36 సంవత్సరాలుగా సేవలందించిన బి.స్వరూప ఉద్యోగ విరమణ చేశారు. రాజ్‌భవన్‌ సంస్కృతి, కమ్యూనిటీ హాల్‌లో రాజ్‌భవన్‌ ఎంప్లాయీస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆమెకు వీడ్కోలు పార్టీని నిర్వహించింది. 1988లో రాజ్‌భవన్‌లోని మెయిన్‌ హాల్‌లో గవర్నర్‌ వద్ద ఆయాగా చేరారు. అప్పటి నుంచి ఎనిమిది మంది గవర్నర్ల వద్ద విధులు నిర్వహించారు. 1988లో కుముద్‌బెన్‌ జోషి గవర్నర్‌గా ఉన్నప్పటి నుంచి ప్రస్తుత గవర్నర్‌ జిష్ణుదేవ్‌వర్మ (2025) వరకూ ఎనిమిది మంది గవర్నర్ల వద్ద పనిచేసి ఉత్తమ ఉద్యోగి అవార్డును కూడా పొందారు. ఆమెకు నలుగురు కూతుళ్లు, ఒక కుమారుడు. భర్త సురేష్‌ యాదవ్‌ పీడబ్ల్యూడీలో మేసన్‌గా పనిచేస్తూ మృతి చెందాడు. భర్త ఉద్యోగాన్ని ఆమెకు కేటాయిస్తూ రాజ్‌భవన్‌లో ఆయాగా అపాయింట్‌ చేశారు. రంగరాజన్‌, నరసింహన్‌ తదితరులు ఆమె కూతుళ్ల పెళ్లిళ్లకు హాజరయ్యారు. స్వరూప తన విధులను అంకితభావంతో, చిత్తశుద్ధితో నిర్వహించి పలువురు గవర్నర్ల మన్ననలను పొందారు. మెయిన్‌ హాల్‌లో ఉద్యోగం చేయడాన్ని ప్రతి ఒక్కరూ గర్వంగా భావిస్తుంటారు. అలాంటి హాల్‌లో 36 ఏళ్లుగా స్వరూప పని చేశారు. ఇన్నేళ్లుగా తనను ఆదరించడం ఆనందాన్ని కలిగిస్తుందని ఆమె పేర్కొన్నారు. రాజ్‌భవన్‌ నుంచి ఉద్యోగ విరమణ చేసి వెళ్లిపోవడం బాధగా ఉందని, ఈ అనుబంధం జీవితంలో మర్చిపోలేనని వ్యాఖ్యానించారు.

రీ సైకిల్‌.. రీ క్రియేట్‌

ఆకట్టుకున్న విద్యార్థుల కళా ప్రదర్శన

పర్యావరణ పరిరక్షణపై అవగాహన



సాక్షి, సిటీబ్యూరో: పర్యావరణ స్పృహకు చిన్నారుల ఆలోచనలు తోడైతే.. సమాజహితమైన అద్భుతాలను చూడొచ్చు. సరిగ్గా ఇదే అంశంపై నగరంలోని మేరు ఇంటర్నేషనల్‌ స్కూల్‌ విద్యార్థులు ఇంట్లో పనికిరాని వస్తువులతో అందమైన, ఆకర్షణీయమైన ప్రతిమలను రూపొందించి పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యాన్ని గుర్తు చేశారు. పాఠశాల ఆధ్వర్యంలో మేరు అంతరాగ్ని తెల్లాపూర్‌ ఎడిషన్‌ 2025లో భాగంగా రీసైకిల్‌, అప్‌సైకిల్‌ చేసిన పదార్థాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు రూపొందించిన అద్భుతమైన కళాకృతులు ఆలోచింపజేసేలా ఉన్నాయి. ఈ ప్రదర్శనను మై హోమ్‌ గ్రూప్‌, మేరు ఇంటర్నేషనల్‌ స్కూల్స్‌ ఛైర్మన్‌ డాక్టర్‌ జూపల్లి రామేశ్వరరావు, పాఠశాల వ్యవస్థాపకురాలు జూపల్లి మేఘన గోరుకంటి, యశోద హాస్పిటల్స్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ గోరుకంటి సురేందర్‌ రావు సోమవారం ప్రారంభించారు. ఈ ఏడాది థీమ్‌ ‘సుస్థిరత’లో భాగంగా ఇలాంటి వినూత్న ప్రదర్శనలు, వాతావరణ సంరక్షణ, సుస్థిర అంశాలపై మన బాధ్యతను ప్రతిబింబిస్తాయని అన్నారు.





అలరించిన సృజనాత్మకత..

ఈ ప్రదర్శనలో నీటి బిందువులు – వర్షపు నీటి పరివర్తన శక్తిని ప్రతిబింబించే కళ, చీమల శ్రేణితో ఆకట్టుకునే ప్రదర్శన, గృహాల మొదలు కాస్మోస్‌ వరకూ మానవ పరిణామం తెలియజేసే ప్రదర్శనలతో పాటు తేనెటీగల పెంపకంతో పర్యావరణ సమతుల్యతను కాపాడే అంశాన్ని ప్రదర్శించిన చిన్నారుల కళ, హెల్మెట్‌లను బగ్‌–టేస్టిక్‌ ఆర్ట్‌గా రీసైక్లింగ్‌ చేయడాన్ని తెలియజేసిన సృజనాత్మకత విశేషంగా అలరించింది.

కూటమి కాలకేయుల సాక్షిగా..
ప్రజాస్వామ్యం ఖూనీ!

ఏపీలో మున్సిపల్ ఉప ఎన్నికల్లో అధికార మదంతో అరాచక పర్వం

సాక్షి ప్రతినిధి, తిరుపతి, సాక్షి, అమరావతి, నెట్‌వర్క్: ఆదిమ తెగల్లోనూ కానరాని అకృత్యాలు టీడీపీ కూటమి సర్కారు పాలనలో ఆవిష్కృతమయ్యాయి! పట్టపగలు.. తిరుపతి నడి రోడ్డుపై పోలీసులు, జనం సాక్షిగా ప్రజాస్వామ్యం ఖూనీ అయింది. తాలిబన్లు.. ఐసిస్.. హమాస్ ఉగ్రమూకలను తలదన్నే రీతిలో రాష్ట్రవ్యాప్తంగా మునిసిపల్ ఉప ఎన్నికల్లో పచ్చ ముఠాలు దాడులకు తెగబడి విధ్వంసం, భయోత్పాతం సృష్టించాయి! పలు మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో చైర్మన్లు, డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్మన్ పదవులకు సోమవారం జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీ నేతలు అరాచకాలకు తెగబడ్డారు. అసలు ఒక్క సీటు కూడా గెలవని చోట్ల.. తమకు ఏమాత్రం సంఖ్యా బలం లేని చోట్ల భయపెట్టి నెగ్గేందుకు కూటమి పార్టీలు కుతంత్రాలకు దిగాయి. పోలీసులతోపాటు ఆర్డీవో.. కలెక్టర్ దాకా ప్రభుత్వ వ్యవస్థలన్నింటినీ వాడుకుంటూ అధికార దుర్వినియోగానికి బరి తెగించాయి. బల ప్రయోగం, అక్రమాలు, అరాచకాలు, ప్రలోభాలతో ప్రజాస్వామ్య వ్యవస్థకే కళంకం తెచ్చేలా వ్యవహరించాయి. మునిసిపల్ ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా పార్టీ గుర్తులతో జరిగాయి. అలాంటిది.. ఒక పార్టీ గుర్తుపై నెగ్గిన వారిని భయపెట్టి, ప్రలోభాలకు గురి చేసి ఇంత దారుణంగా ఫిరాయింపులకు ప్రోత్సహిస్తుంటే.. అసలు ఇక ఎన్నికలు ఎందుకు? పార్టీ గుర్తులు ఎందుకు? అని ప్రజలు తీవ్రస్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి డిప్యూటీ మేయర్ ఉప ఎన్నికలో నెగ్గేందుకు కూటమి పార్టీల గూండాలు అరాచకం సృష్టించారు. ఉప ఎన్నికలో పాల్గొనేందుకు వాహనంలో వెళ్తున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల బస్సు ఆపి రాడ్లతో అద్దాలు పగలగొట్టి లోపలకు చొరబడి దాడులకు తెగబడ్డారు. బస్సులో ఉన్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లపై దాడిచేసి చొక్కా పట్టుకుని ఈడ్చుకెళ్లారు. మహిళా కార్పొరేటర్ల ఆర్తనాదాలు ఖాకీల చెవికెక్కలేదు. కార్పొరేటర్లను బలవంతంగా లాక్కెళుతున్న కూటమి గూండాల వాహనాలకు పోలీసులు దగ్గరుండి దారిచ్చి సాగనంపడం నివ్వెరపరుస్తోంది. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు పోలీసుల సాక్షిగా కూటమి గూండాలు చిత్తూరు, తిరుపతిలో సృష్టించిన అరాచకం ఇదీ!!

మూడు నగర కార్పొరేషన్లు, ఏడు మున్సిపాలిటీల్లో ఖాళీ అయిన డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు సోమవారం ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నోటిఫికేషన్ జారీ చేయగా టీడీపీ నేతల దౌర్జన్యాలు, దాడులు, బెదిరింపులతో సగం చోట్ల ఐదు చోట్ల ఎన్నికలు జరగకుండా వాయిదా పడటం గమనార్హం.


వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల బస్సు అద్దాలను పగలగొడుతున్న కూటమి గూండా శంకర్‌యాదవ్


తిరుపతిలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను కిడ్నాప్ చేసి కారులో తీసుకెళుతున్న కూటమి గూండాలు

అర్ధరాత్రి నుంచి అరాచకం..

మూడేళ్ల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుపతి కార్పొరేషన్‌లో మొత్తం 49 డివిజన్లకు గానూ 48 చోట్ల వైఎస్సార్‌సీపీ గెలుపొందింది. వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయ కర్త భూమన అభినయరెడ్డి సార్వత్రిక ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేయడంతో తిరుపతి డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ పదవులకు రాజీనామా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డిప్యూటీ మేయర్ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ వెలువడింది. కూటమికి ఒకే ఒక్క కార్పొరేటరే ఉన్నా అధికార బలంతో దాన్ని దక్కించుకునేందుకు కుట్రలకు తెర తీశారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ సెనెట్ హాలులో సోమవారం డిప్యూటీ మేయర్ ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉంది. ఉప ఎన్నికలో ఎలాగైనా గెలవాలనే కుయుక్తులతో కూటమి నేతలు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను కిడ్నాప్ చేసేందుకు సిద్ధమయ్యారు..

బస్సుని అడ్డుకుని.. అద్దాలు ధ్వంసం చేసి

డిప్యూటీ మేయర్ ఉప ఎన్నిక కోసం సోమవారం ఉదయం 11 గంటలకు కార్పొరేటర్లంతా భూమన నివాసం నుంచి ప్రత్యేక బస్సులో ఎస్వీ యూనివర్సిటీలోని సెనెట్ హాలు వద్దకు బయలు దేరారు. దాదాపు 25 మంది కార్పొరేటర్లు, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం అందులో ఉండగా వర్సిటీ సమీపంలో వారి బస్సును కూటమి గూండాలు అడ్డుకున్నారు. సుమారు 500 మంది ఒకేసారి బస్సుపైకి దూసుకొచ్చి పోలీసుల సమక్షంలోనే రాడ్లతో అద్దాలను పగులగొట్టారు. లోపలకు చొరబడి బస్సు తలుపు తెరిచారు. బస్సులో ఉన్న అమరనాథరెడ్డి, అనీష్‌రాయల్, మోహన్‌కృష్ణ యాదవ్, బోగం అనిల్, వెంకటేష్‌పై దాడిచేసి చొక్కా పట్టుకుని ఈడ్చుకెళ్లారు. అప్పటికే సిద్ధంగా ఉన్న వాహనాల్లో కార్పొరేటర్లను బలవంతంగా ఎక్కించి అతివేగంగా దూసుకెళ్లారు. బస్సులో ముందు వైపు కూర్చున్న మహిళా కార్పొరేటర్లను నెట్టుకుంటూ లోపలకు చొరబడడంతో భయభ్రాంతులకు గురయ్యారు. కార్పొరేటర్లు కేకలు వేస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారు. కార్పొరేటర్లను కాపాడకపోగా మిగిలిన వారిపై దౌర్జన్యానికి దిగారు.

ఎంపీ, సాక్షి ప్రతినిధులపై దాడి

కార్పొరేటర్లతో పాటు బస్సులో ప్రయాణిస్తున్న ఎంపీ గురుమూర్తిపై కూడా కూటమి గూండాలు దాడికి యత్నించారు. బస్సు ముందు సీట్లో కూర్చొని ఉన్న ఎంపీపై రాడ్లతో దాడి చేసేందుకు యత్నించగా గన్‌మెన్‌ను చూసి వెనక్కి తగ్గారు. ఈ అరాచకాలను చిత్రీకరిస్తున్న సాక్షి ప్రతినిధి, సాక్షి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేశారు. ఎమ్మెల్యే కుమారుడు ఆరణి మదన్, సునీల్ చక్రవర్తి ఫొటోగ్రాఫర్ చేతిలోని రూ.రెండు లక్షలు విలువచేసే కెమెరాను లాక్కుని ధ్వంసం చేశారు. సెల్‌ఫోన్లో ఘటనను చిత్రీకరిస్తున్న సాక్షి ప్రతినిధిపై కూడా దాడికి తెగబడ్డారు. ఉదయం 10.15 గంటల నుంచి 10.45 వరకు యథేచ్ఛగా సాగిన విధ్వంసంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. కూటమి నేతల విధ్వంస కాండతో రాకపోకలన్నీ స్తంభించిపోయాయి. బస్సులో, వాహనాల్లో ప్రయాణిస్తున్న వారు ఈ ఘటనను చూసి 'ఇంత అరాచకమా? ఇంత బరి తెగింపా?' అంటూ నివ్వెరపోయారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి


ఒంటిపై పెట్రోల్ పోసుకుంటున్న వాసు

వలంటీర్ల కోసం సమిధనవుతా..

- కూటమి ప్రభుత్వం వారిని విధుల్లోకి తీసుకోకుండా వేధింపులు
- సర్కారు తీరును నిరసిస్తూ యువకుడి ఆత్మహత్యాయత్నం

సాక్షిప్రతినిధి, విజయవాడ: 'కష్టాల్లో ఉన్న వలంటీర్ వ్యవస్థను కాపాడుకుందాం.. కరోనా సమయంలో వారు చేసిన సేవలను గుర్తిద్దాం. మనలోని మానవత్వాన్ని చాటుకుందాం' అంటూ ఓ యువకుడు బ్యానర్‌ను ప్రదర్శిస్తూ విజయవాడలోని అంబేడ్కర్ స్మృతివనం దగ్గర సోమవారం ఆత్మహత్యాయత్నం చేశాడు. వలంటీర్‌లపై టీడీపీ కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న కక్షపూరిత ధోరణిని నిరసిస్తూ ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన నక్కా వాసు ఒంటిపై పెట్రోల్ పోసుకుని లైటర్‌తో నిప్పు అంటించుకుంటుండగా.. అక్కడే విధుల్లో ఉన్న సూర్యారావుపేట సీఐ అబ్దుల్ అలీషేక్ అడ్డుకున్నారు. అనంతరం సూర్యారావుపేట స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా విధుల్లోకి తీసుకోవాలని వలంటీర్లు చేస్తున్న ఆందోళన తనను కలిచి వేసిందన్నాడు. కరోనా సమయంలో సొంత వాళ్లే దగ్గరకు రాని దుర్భర పరిస్థితుల్లో వలంటీర్లు ప్రజలకు మర్చిపోలేని సేవలందించారని గుర్తుచేశాడు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు నేడు పింఛన్ కోసం పడరాని పాట్లు పడుతున్నారని, వలంటీర్లు ఉన్న రోజుల్లో హాయిగా ఇళ్ల వద్దే పింఛన్లు తీసుకున్నారని చెప్పారు. అప్పటి నుంచే వలంటీర్ వ్యవస్థకు అభిమానిగా మారానని, అంతటి సేవ చేసిన వలంటీర్లను ప్రస్తుత ప్రభుత్వం విధుల్లోకి తీసుకోకుండా వేధిస్తుండటంపై మనస్తాపానికి లోనై ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించినట్టు చెప్పాడు. వాసు కొన్నేళ్లుగా తండ్రితో కలిసి ఉండవల్లి సమీపంలోని పోలకంపాడులో ఉంటున్నాడు. కుంచనపల్లిలో నాటు కోళ్ల ఫాంను నడుపుతూ విజయవాడ, గుంటూరు, మంగళగిరి ప్రాంతాల్లోని చికెన్ షాపులకు నాటు కోళ్లను సరఫరా చేస్తుంటాడు. వాసుకు ఎలాంటి రాజకీయ నేపథ్యం లేదు. కేవలం వలంటీర్ వ్యవస్థ రావాలని బలంగా కోరుకుంటూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

వీడియో కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి



'సచివాలయం'లో నీడ కరువు

రాష్ట్ర సచివాలయం ప్రధాన గేట్ల వద్ద నిలువ నీడలేక.. వివిధ పనులపై వచ్చే సందర్శకులు, అక్కడ విధులు నిర్వహించే సెక్యూరిటీ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని విమర్శలు వస్తున్నాయి. రాష్ట్రం నలుమూలలనుంచి వచ్చే ప్రజలు గేట్–2 నుంచి లోపలికి వెళ్లాల్సి ఉంటుంది. అయితే ముందుగా పాస్‌లు తీసుకున్నాక, పోలీసు సిబ్బంది తనిఖీ తర్వాత వారిని అనుమతిస్తారు. ఈ నేపథ్యంలో అక్కడ చాలా సేపు వేచి ఉండాల్సి ఉంటుంది. గేట్ల వద్ద నీడనిచ్చే సదుపాయం లేక ఎండైనా, వానైనా అలాగే ఉండాల్సి వస్తోంది. అలాగే గేట్–4 వద్ద కూడా పరిస్థితి ఇలాగే ఉంది. వచ్చేది ఎండాకాలం కావడంతో ఇక్కడ టెంట్ లాంటివి ఏర్పాటు చేయాలని, తాగునీటి సదుపాయం కల్పించాలని సందర్శకులు కోరుతున్నారు.

– సాక్షి, హైదరాబాద్

'ఏఐ' అంటే హైదరాబాద్ గుర్తుకు రావాలి

- ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- కొత్త సవాళ్లకు యువత సిద్ధంగా ఉండాలి
- డీటీసీసీ కార్యాలయం ప్రారంభించిన మంత్రి


డీటీసీసీ కార్యాలయం ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

సాక్షి, హైదరాబాద్: కృత్రిమ మేధ (ఏఐ)లో రాష్ట్ర యువతను నిపుణులుగా తీర్చి దిద్దాలనే సంకల్పంతో ఏఐ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. సోమవారం హైటెక్ సిటీలో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సేవలు అందిస్తున్న డిపాజిటరీ ట్రస్ట్ క్లియరింగ్ కార్పొరేషన్(డీటీసీసీ) నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో పెట్టుబడులు పెట్టాలనుకునే పారిశ్రామికవేత్తలను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. 200 ఎకరాల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏఐ సిటీని నిర్మించనున్నామని, అక్కడే ఏఐ యూనివర్సిటీని ఏర్పాటు చేసి, దాని నిర్వహణలో సంబంధిత పరిశ్రమలను, ఏఐ నిపుణులను భాగస్వాములను చేస్తామని చెప్పారు. ఏఐ అంటే తెలంగాణ, హైదరాబాద్ అని గుర్తుకు వచ్చేలా తీర్చి దిద్దుతామన్నారు. రోజురోజుకీ టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతోందని, అదే సమయంలో కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో యువత వినూత్నంగా ఆలోచించి, వాటి పరిష్కారాల కోసం నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని సూచించా రు. ఆ దిశగా కృషి చేసే వారికి ప్రభు త్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలతో పాటు అన్ని రంగాలకు చెందిన కంపెనీలున్నాయని, అలాంటివి 100 నుంచి 120 కంపెనీలు ఇక్కడి నుంచే ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సేవలందిస్తున్నాయని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. అన్ని రకా ల పరిశ్రమలను స్థాపించేందుకు అనువైన వాతావరణం తెలంగాణలో ఉందన్నారు. దేశంలో డీటీసీసీ తన రెండో కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించడం సంతోషంగా ఉందని, తద్వారా సుమారు 500 మందికి కొత్తగా ఉపాధి దొరకబోతుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఈ కంపెనీలో 2వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. వీటిలో అధిక శాతం తెలంగాణ యువతకు ఇవ్వాలని కోరగా, అందుకు యాజమాన్యం అంగీకరించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీటీసీసీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ రెనీ లారోకే మోరీస్, చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ లిన్ బిషప్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కరణలతో మెరుగైన పోలీసింగ్

డీజీపీ జితేందర్



సాక్షి, హైదరాబాద్ : పోలీస్‌శాఖలో అవసరమైన సంస్కరణలతో ప్రజా సంక్షేమానికి మెరుగైన పోలీసింగ్‌ను అందించవచ్చని డీజీపీ డాక్టర్ జితేందర్ అభిప్రాయపడ్డారు. ఇండియన్ పోలీస్ ఫౌండేషన్ (ఐపీఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం డీజీపీ కార్యాలయ సమావేశ మందిరంలో 'పోలీస్ సంస్కరణల ద్వారా మెరుగైన పోలీసింగ్'అనే అంశంపై సమావేశం జరిగింది. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి డాక్టర్ ఈశ్‌కుమార్ ఉపాధ్యక్షులుగా ఉన్న ఐపీఎఫ్‌లో రిటైర్డ్, ప్రస్తుతం పని చేస్తున్న ఐపీఎస్ అధికారులు సభ్యులుగా ఉన్నారు. పోలీస్‌శాఖలో అంతర్గత సంస్కరణలు, సాంకేతిక పోలీసింగ్, జైళ్ల శాఖలో సంస్కరణలు, ఫోరెన్సిక్ సైన్సెస్‌లో పరిశోధన, మహిళలపై నేరాలు, పోలీసుల ఆరోగ్యం వంటి ఆరు అంశాలపై ఐపీఎఫ్ పరిశోధనలు చేస్తోంది. పరిశోధనల్లో వచ్చిన అంశాలను ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా డీజీపీ జితేందర్ మాట్లాడుతూ, పోలీస్‌శాఖ పనితీరుపై ఎప్పటికప్పుడు సమీక్షించుకోవడం ద్వారా పోలీసింగ్ మెరుగుపరుచుకోవాలన్నారు. ఉన్నతాధికారులు పోలీస్‌స్టేషన్లు, పోలీస్ కార్యాలయాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తే క్షేత్రస్థాయిలో పరిస్థితిలో మార్పు వస్తుందని చెప్పారు. తెలంగాణ పోలీస్‌శాఖను అగ్రభాగాన నిలిపేందుకు నూతన విధానాలను అవలంబిస్తూ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామన్నారు. ఐపీఎఫ్ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఈశ్‌కుమార్ మాట్లాడుతూ, అంతర్గత పోలీస్ సంస్కరణల ప్రాజెక్టును పంజాబ్, రాజస్తాన్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో అమలు చేస్తున్నామన్నారు. తెలంగాణలో నోడల్ అధికారిగా పోలీస్ ట్రైనింగ్ డీజీ అభిలాష బిస్త్, రిటైర్డ్ ఎస్పీ ఎం.మల్లారెడ్డి పర్యవేక్షణ అధికారిగా వ్యవహరిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రజల అభిప్రాయాలు సేకరించి తగిన శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని ఈశ్‌కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో పోలీస్ ట్రైనింగ్ డీజీ అభిలాష బిస్త్, సీఐడీ డీజీ శిఖాగోయల్, అదనపు డీజీలు సంజయ్‌కుమార్ జైన్, స్వాతి లక్రా, ఐజీలు ఎం.రమేశ్, ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, వి.సత్యనారాయణ, రమేశ్‌నాయుడు, డీఐజీ గజరావు భూపాల్, రిటైర్డ్ ఎస్పీ ఎం.మల్లారెడ్డి పాల్గొన్నారు.

రథసప్తమికి తిరుమల ముస్తాబు

తిరుమల: ఒకరోజు బ్రహ్మోత్సవంగా ప్రసిద్ధి పొందిన రథసప్తమి వేడుకలకు తిరుమల ముస్తాబైంది. ఏడు వాహన సేవల్లో విహరించే శ్రీవారిని దర్శించి తరించేందుకు అశేష భక్తకోటి తరలివచ్చింది. ఉ.5.30 నుంచి రాత్రి 9 గంటల వరకు స్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో వాహనాలపై విహరిస్తూ భక్తులను కటాక్షించనున్నారు. వాహన సేవలను తిలకించేందుకు వచ్చే భక్తుల కోసం టీటీడీ విస్తృత ఏర్పాట్లుచేసింది. ఆలయం వద్ద, నాలుగు మాడ వీధుల్లో ప్రత్యేక బ్యారికేడ్లు, గ్యాలరీలు, చలువ పందిళ్లు నిర్మించారు. గ్యాలరీల్లో ఉంటూ వాహన సేవలను తిలకించే భక్తులకు అన్నప్రసాదాలు, మజ్జిగ, నీళ్లు, వేడి పాలు అందజేయనున్నారు. ఏకధాటిగా ఏడు వాహన సేవలు ఉండడంతో కచ్చితమైన సమయాన్ని పాటించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. మ.2 గంటల నుంచి 3 మధ్యలో పుష్కరిణిలో చక్రస్నానం జరుగుతుంది. సుదర్శన చక్రత్తాళ్వారు స్నానమాచరించే పుణ్యప్రదేశంలో సాధారణ భక్తు లు ప్రవేశించకుండా ఇనుప కమ్మీలు ఏర్పాటుచేశారు.

పలు సేవలు, ప్రివిలేజ్ దర్శనాలు రద్దు

ఇక రథసప్తమి వేడుకలకు భారీగా భక్తజనం వస్తుండడంతో అష్టదళ పాద పద్మారాధన, కళ్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలు రద్దయ్యాయి.

■ ఎన్‌ఆర్‌ఐలు, చంటి బిడ్డల తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్లు, వికలాంగుల ప్రివిలేజ్ దర్శనాలూ రద్దు. ■ తిరుపతిలో ఫిబ్రవరి 3–5 వరకు స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్ల జారీ రద్దు. ■ ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు, బ్రేక్ దర్శనాలకు సంబంధించి ఫిబ్రవరి 3న ఎలాంటి సిఫార్సు లేఖలు స్వీకరించరు. ప్రత్యేక ప్రవేశ దర్శనం భక్తులు వేచి ఉండకుండా నిర్ణీత సమయంలో మాత్రమే వైకుంతం క్యూకాంప్లెక్స్ వద్ద రిపోర్ట్ చేయాలి.

వాహన సేవల వివరాలు

ఉ.5.30-8 గంటల వరకు : సూర్యప్రభ వాహనం
ఉ.9-10 గంటల వరకు : చిన్న శేష వాహనం
ఉ.11 నుంచి మ.12 వరకు : గరుడ వాహనం
మ.1 నుంచి 2 వరకు : హనుమంత వాహనం
మ.2 నుండి 3 వరకు : చక్రస్నానం
సా.4 నుండి 5 వరకు : కల్పవృక్ష వాహనం
సా.6 నుంచి 7 వరకు : సర్వభూపాల వాహనం
రాత్రి 8 నుంచి 9 వరకు : చంద్రప్రభ వాహనం

రామోజీ ఫిలింసిటీలోనే ఇళ్ల స్థలాలివ్వాలి

- వేరేచోట కేటాయిస్తామంటే ఊరుకునేది లేదు : సీపీఎం నేతలు
- లబ్ధిదారులతో కలిసి రంగారెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత


కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో ఇచ్చిన ఇళ్ల స్థలాలను రామోజీ ఫిలింసిటీలో కాకుండా.. మరో చోట కేటాయిస్తామంటే ఊరుకునే ప్రసక్తే లేదని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య హెచ్చరించారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో పోల్కంపల్లి, నాగన్‌పల్లి, రాయపోల్ గ్రామాలకు చెందిన లబ్ధిదారులతో కలిసి సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బాధితులకు న్యాయం చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లిలోని 189 సర్వేనంబరులో 12 ఎకరాలు, 203 సర్వే నంబరులో 8.4 ఎకరాల భూమిని ప్లాట్లుగా చేసిన అప్పటి ప్రభుత్వం 2007లో ఒక్కొక్కరికి 60 గజాల చొప్పున 677 మంది నిరుపేద లబ్ధిదారులకు కేటాయించిందన్నారు. అధికారులు పట్టాలు కూడా పంపిణీ చేశారని తెలిపారు. కానీ రామోజీ ఫిలింసిటీ యాజమాన్యం వీరిని పొజిషన్‌లోకి అనుమతించలేదన్నారు. ఫలితంగా పేదలు ఇళ్లు నిర్మించుకోలేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. ఇదిలాఉండగా కొంతమంది లబ్ధిదారుల నుంచి అధికారులు ఇటీవల పట్టాలను వెనక్కి తీసుకున్నారన్నారు. ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇస్తుందని చెప్పారని, ఈ స్థలాల విషయమై తాము 17 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నామని స్పష్టం చేశారు. 2022 నవంబర్‌లో కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించామని గుర్తు చేశారు. ఈ సమయంలో స్పందించిన రామోజీ ఫిలింసిటీ యాజమాన్యం సర్వే నంబరు 189, 203లో ఇంటి స్థలాల కోసం కేటాయించిన భూమిని తమకు వదిలేస్తే.. వేరే సర్వేనంబర్లలోని 25 ఎకరాల అసైన్డ్ భూమిని రైతుల సేకరించేందుకు అవసరమైన పరిహారాన్ని చెల్లిస్తామని ప్రభుత్వానికి ప్రతిపాదన చేసిందన్నారు. ఈమేరకు కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఫిలింసిటీ యాజమాన్యం, అధికారుల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు వెంటనే స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. కానీ ఈరోజు వరకూ ఎలాంటి కదలిక లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా లబ్ధిదారులకు కేటాయించిన సర్వే నంబర్లలోనే ఇంటి స్థలాలు ఇవ్వాలని, అందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.సామేలు, కందుకూరి జగన్, ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి బుగ్గ రాములు తదితలరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సీపీఐ నేతల వినతి

రామోజీ ఫిలింసిటీలో ఇళ్ల స్థలాలు ఉన్న లబ్ధిదారులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఓరుగంటి యాదయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డికి ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. పోల్కంపల్లి, నాగన్‌పల్లి, రాయపోల్ గ్రామాల ప్రజలకు పట్టాలు, పొజిషన్ ఇస్తే అందులోకి రాకుండా రామోజీ యాజమాన్యం అడ్డుకోవడం చట్ట విరుద్ధమన్నారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలు ఉద్యమించాలి

జస్టిస్ ఈశ్వరయ్య


మాట్లాడుతున్న జస్టిస్ ఈశ్వరయ్య

నాంపల్లి(హైదరాబాద్): రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలు ఉద్యమించాలని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. సోమవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో ఆయన అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికల్లో '42 శాతం రిజర్వేషన్లు.. బీసీ కులాల సాధికారత కల్పన'అనే అంశంపై సదస్సు జరిగింది. రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, విద్యార్థి సంఘం నేత విక్రమ్‌గౌడ్, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, ప్రొఫెసర్లు సింహాద్రి, మురళీమనోహర్, తిరుమలి, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బండి సాయన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ గతంలో 34 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను గత కేసీఆర్ ప్రభుత్వం 18 శాతానికి తగ్గించిందన్నారు. తమిళనాడు తరహాలో రిజర్వేషన్ల అమలు కోసం బీసీ మేధావులు ముందుకు రావాలని కోరారు.

స్టూడెంట్ ముసుగులో రెక్కీ!

- కేవలం బడా కాలేజీలే బత్తుల ప్రభాకర్ టార్గెట్
- తొలుత విద్యార్థిగా పరిశీలన
- ఆ వివరాలతో పక్కాగా డ్రాయింగ్స్ రూపకల్పన
- తర్వాత అదును చూసుకుని దొంగతనం చేస్తున్నట్టు గుర్తించిన పోలీసులు
- కస్టడీకి కోరుతూ కోర్టులో పిటిషన్



సాక్షి, హైదరాబాద్: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని గచ్చిబౌలి ప్రిజం పబ్ వద్ద కాల్పులకు తెగబడిన ఘరానా దొంగ బత్తుల ప్రభాకర్ వ్యవహారంలో కీలక అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. కేవలం బడా కాలేజీలను మాత్రమే టార్గెట్‌గా చేసుకుని రెచ్చిపోయిన ప్రభాకర్.. వాటిలో విద్యార్థి ముసుగులో ముందే రెక్కీ చేసినట్టు పోలీసులు గుర్తించారు. అతడిని కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇక ఈ ఘరానా దొంగ కేసు పూర్వాపరాలపై ఆదాయ పన్ను శాఖతోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా దృష్టి పెట్టడం గమనార్హం.

కనీసం పక్షం రోజులు 'చదువుకుని'..

పోలీసువర్గాలు తెలిపిన వివరాల మేరకు.. ప్రభాకర్ ఏదైనా కాలేజీని టార్గెట్‌గా చేసుకున్న తర్వాత ముందుగా రెక్కీ చేస్తాడు. ఆ కాలేజీ విద్యార్థి మాదిరిగా కొన్ని పుస్తకాలు పట్టుకుని, అందుకు తగ్గ దుస్తులు ధరించి వెళతాడు. క్లాసుల్లోకి వెళ్లకుండా, ప్రాంగణమంతా తిరిగి.. అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఆఫీస్ రూమ్, లాకర్ తదితరాలు ఎక్కడ ఉన్నాయి? ఎలా ఉన్నాయి? పరిశీలిస్తాడు. తర్వాత ఓ పేపర్ మీద డ్రాయింగ్ వేసుకుని, లాకర్ ఉన్న రూమ్, అక్కడికి వెళ్లడానికి ఉన్న మార్గాలతో మ్యాప్ సిద్ధం చేసుకుంటాడు. లాకర్‌ను కట్ చేయడానికి ఎలక్ట్రిక్ కట్టర్ వాడే ప్రభాకర్... దానికి ప్లగ్ పెట్టడానికి పాయింట్ ఎక్కడ ఉందో కూడా చూసుకుంటాడు. ఇలా పక్కాగా సిద్ధమయ్యాక చోరీ చేస్తాడు.

ఆ డబ్బు ఖర్చయ్యాకే మరో చోరీ..

విలాసవంతమైన జీవితం గడిపే బత్తుల ప్రభాకర్.. నెలకు కనీసం రూ.50 వేల నుంచి రూ.లక్ష అద్దె ఉండే ఫ్లాట్స్‌లో మరికొందరితో కలిసి బస చేస్తాడు. ఏదైనా చోరీ చేశాక ఆ సొమ్ముతో జల్సాలు చేస్తాడు. సాధారణంగా ఆ డబ్బంతా ఖర్చయ్యే వరకు మరో నేరం చేయడని.. కొన్ని సందర్భాల్లో మాత్రం వరుసపెట్టి నేరాలు చేశాడని గుర్తించామని పోలీసు వర్గాలు తెలిపాయి. అతను ఆయుధం వినియోగించడం ఇదే తొలిసారని వెల్లడించాయి. ఎనిమిది నెలల క్రితమే ఓ సివిల్ కాంట్రాక్టర్ ద్వారా పరిచయమైన వ్యక్తి ద్వారా బిహార్‌కు చెందిన అన్ను నుంచి తుపాకీలు, తూటాలు కొన్నాడని తేలిందని పేర్కొన్నాయి.

ఆ కాలేజీల గుండెల్లో దడ..

విశాఖపట్నం సెంట్రల్ జైల్లో ఉన్న బత్తుల ప్రభాకర్‌ను అనకాపల్లిలో నమోదైన కేసు విచారణ నిమిత్తం 2022 మార్చి 23న అక్కడి కోర్టుకు తీసుకువెళ్లారు. విచారణ తర్వాత వైజాగ్ తీసుకువచ్చి, సంకెళ్లు తీసి జైలు అధికారులకు అప్పగిస్తుండగా తప్పించుకున్నాడు. అప్పటి నుంచి సైబరాబాద్, హైదరాబాద్, రాచకొండ, సంగారెడ్డి, సూర్యాపేట పరిధిలో కాలేజీలలో చోరీలు చేశాడు. ఆ చోరీ డబ్బులో అత్యధికం డొనేషన్లకు సంబంధించిందేనని, ఈ నేపథ్యంలో కొన్ని కాలేజీలు ఫిర్యాదు కూడా చేయలేదని పోలీసులు చెప్తున్నారు. మరోవైపు ప్రభాకర్ ఏయే కాలేజీల నుంచి ఎంత మొత్తం తస్కరించాడనే దానిపై ఆదాయ పన్ను శాఖతోపాటు ఈడీ అధికారులు ఆరా తీస్తున్నట్టు తెలిసింది. ఆ కాలేజీల్లో అంత మొత్తం నగదు ఎందుకు ఉంది? దాన్ని లెక్కల్లో చూపారా? లేదా? అన్న వివరాలను ఆరా తీస్తున్నట్టు సమాచారం. చోరీ జరిగినా ఇన్నాళ్లు సైలెంట్‌గా ఉన్న కాలేజీ యాజమాన్యాల గుండెల్లో ఇప్పుడు రైళ్లు పరిగెడుతున్నాయని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

ప్రిజం కాల్పుల కేసులో ఇద్దరు యువకుల విచారణ

గచ్చిబౌలి (హైదరాబాద్): ప్రిజం పబ్‌లో బత్తుల ప్రభాకర్ సీసీఎస్ పోలీసులపై కాల్పులు జరిపిన కేసులో మరో ఇద్దరు యువకులను పోలీసులు విచారిస్తున్నారు. స్కోడా కారులో పబ్ వద్ద ప్రభాకర్‌ను డ్రాప్ చేసిన రంజిత్, మరో యువకుడు రోహిత్‌లను గచ్చిబౌలి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు ఇంకా స్నేహితులు ఎవరెవరు ఉన్నారు? వారిని నిందితుడు ఎలా ఉపయోగించుకున్నాడనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్టు తెలిసింది.

సినీ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ కేపీ చౌదరి ఆత్మహత్య

- గోవాలో బలవన్మరణం..
- స్వస్థలం ఖమ్మం జిల్లా రాయన్నపేట



బోనకల్: సినిమాలపై మోజుతో ఆ రంగంలో అడుగుపెట్టి అప్పులపాలైన సినీ నిర్మాత, ఫిలిం డిస్ట్రిబ్యూటర్ బోడెపూడి కృష్ణప్రసాద్ చౌదరి (కేపీ చౌదరి) (38) సోమవారం గోవాలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రాయన్నపేటకు చెందిన శేషగిరిరావు – విజయ దంపతుల కుమారుడు కృష్ణప్రసాద్ మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. ఆయన సోదరి అమెరికాలో స్థిరపడగా తండ్రి లాయర్‌గా, తల్లి ఉపాధ్యాయురాలిగా పనిచేశారు. చదువు అనంతరం మహారాష్ట్రలోని పుణెలో ఏరోనాటికల్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉద్యోగం చేసిన చౌదరి.. సినీ రంగంపై మోజుతో హైదరాబాద్ వచ్చి ప్రముఖులతో పరిచయాలు ఏర్పరచుకున్నారు. 2016లో కబాలి నిర్మాతగా వ్యవహరించిన ఆయన, సర్దార్ గబ్బర్‌సింగ్, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాల డిస్ట్రిబ్యూషన్ చేశారు. అయితే, సినిమా రంగంలో వచ్చిన నష్టాలు పూడ్చుకునేందుకు తల్లిదండ్రుల ఆస్తులను విక్రయించారు. అనంతరం డ్రగ్స్ కేసులో పోలీసులకు పట్టుబడ్డారు. ఇటీవల బెయిల్‌పై విడుదలైన చౌదరి తల్లిదండ్రుల వద్దకు వెళ్లకుండా హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. ఇంతలోనే గోవా వెళ్లిన కృష్ణప్రసాద్ అక్కడే ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషయాన్ని గోవా పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.



మానవుల జీర్ణవ్యవస్థ (గట్)లో ప్రతి చదరపు సెంటీమీటరుకు కోటానుకోట్ల సూక్ష్మజీవులు నివసిస్తుంటాయి. మనిషి దేహం మొత్తంలో 30 ట్రిలియన్ కణాలుంటాయని అంచనా వేస్తే గట్‌లో నివాసముండే సూక్ష్మజీవుల సంఖ్య 38 ట్రిలియన్లు! ఈ సూక్ష్మజీవుల సముదాయాన్ని డాక్టర్లు 'మైక్రోబియమ్'గా చెబుతుంటారు. ఈ సూక్ష్మ జీవ జాలపు సమతౌల్యతే మనిషి ఆరోగ్యాన్ని కాపాడుతుంటుంది. మంచి జీర్ణక్రియకు దోహదపడుతుంటుంది. వ్యాధి నిరోధక వ్యవస్థ (ఇమ్యూనిటీ) సమర్థంగా పని చేయడానికి ఉపయోగపడుతుంది. మానవుల మూడ్స్‌ను సైతం ఈ మైక్రోబయోమ్ ప్రభావితం చేస్తుంది. అలాంటి సూక్ష్మజీవుల సముదాయమే క్యాన్సర్ గడ్డ (ట్యూమర్)లోనూ ఉంటుందని తెలుసుకున్నారు పరిశోధకులు. గట్‌లో ఉండేవి 'గట్ బయోమ్' అయితే ట్యూమర్‌లో ఉండేవి 'ట్యూమర్ బయోమ్'!! ట్యూమర్ పెరుగుదలనూ, చికిత్స సమయంలో ట్యూమర్ ప్రతిస్పందించే తీరునూ ఈ 'ట్యూమర్ బయోమ్' ప్రభావితం చేస్తుంది. నేడు (ఫిబ్రవరి 4న) 'వరల్డ్ క్యాన్సర్ డే' సందర్భంగా చికిత్సతో పాటు అనేక అంశాలను ప్రభావితం చేసే ఈ 'ట్యూమర్ సూక్ష్మక్రిముల' గురించి తెలుసుకుందాం.

● గట్ బయోమ్‌లాగే...

క్యాన్సర్ బయోమ్ ట్యూమరమ్మతు


డా॥ ఏవీఎస్ సురేశ్,
సీనియర్ మెడికల్ ఆంకాలజిస్ట్

ట్యూమర్ బయోమ్‌తో ఉపయోగాలు

- ఈ బయోమ్ కనుగొనడంతో క్యాన్సర్‌కు మరింత సమర్థమైన చికిత్సలు సాధ్యం
- మైక్రోబయోమ్ ప్రతిస్పందనలకు అనుగుణంగా కొత్త మందుల రూపకల్పన
- జన్యుశాస్త్ర, బయోమ్‌ల సమన్వయాలతో సరికొత్త థెరపీలు కనుగొనే వీలు

ఆరోగ్య స్పృహ ఉన్న వర్గాల్లో గట్ బయోమ్ గురించి బాగానే తెలుసు. కానీ అదే తరహాలో క్యాన్సర్ గడ్డలోనూ సూక్ష్మజీవుల సముదాయాలుంటాయన్న విషయం చాలామందికి పెద్దగా తెలియకపోయినప్పటికీ ఇది వాస్తవం. నిజానికి ఈ 'బయోమ్' ఎంత ప్రభావశీలమైనదంటే... క్యాన్సర్ కణం ఎలా ప్రవర్తించాలన్న అంశాన్నీ ఇది ప్రభావితం చేస్తుంది. ట్యూమర్ ఇన్‌ఫ్లమేషన్‌ను ఇది పెంచనూవచ్చు, తగ్గించనూవచ్చు.

జెనెటిక్స్‌తో మరింత తోడ్పాటు...

ట్యూమర్ మైక్రోబయోమ్ సహాయంతో క్యాన్సర్ చికిత్సలను మరింత ప్రభావవంతంగా అందించడానికి జెనెటిక్స్ (జన్యుశాస్త్రం) మంచి తోడ్పాటును అందిస్తుంది. జన్యుశాస్త్ర సహాయంతో ట్యూమర్‌లోని మైక్రోబయోమ్ మనకు అనుకూలంగా పనిచేస్తోందా లేక ప్రతికూలంగా ఉందా, దాని బట్టి ఎలాంటి చికిత్స అందిస్తే మంచి ఫలితాలొస్తాయి వంటి అంశాలను అధ్యయనం చేస్తూ, మైక్రోబయోమ్‌నూ జెనెటిక్ ప్రొఫైలింగ్‌నూ సమన్వయం చేసుకోవడం వల్ల మరింత ప్రభావవంతమైన చికిత్సను అందించవచ్చు. ఇలా చేయడం వల్ల వచ్చే ఫలితాలూ అద్భుతంగా ఉంటాయి. అక్కడి సూక్ష్మజీవుల జన్యుపటలాల అధ్యయన విశ్లేషణలతో అవెలా మనుగడ సాగిస్తున్నాయో, వాటిని ఎదుర్కొనేలా బాధితులకు సరిగ్గా సరిపడేలా వ్యక్తిగతమైన మందుల రూపకల్పన ఎలా అన్న విషయాలను తెలుసుకోవచ్చు. దాంతో క్యాన్సర్ చికిత్సలను మరింత సమర్థంగా జరిగేలా చూడవచ్చు. ఫలితంగా బాధితుల్లో వ్యాధిని పూర్తిగా నయం చేయడానికీ, వారు కోలుకుని మంచి నాణ్యమైన జీవితాన్ని అనుభవించడానికీ ఈ అధ్యయనాలు తోడ్పడతాయి.

జీవక్రియలు ఓ సింఫనీ అనుకుంటే... జీవనశైలీ, ఆహారాలతో ప్రయోజనాలివి...

మానవ జీవితంలోని జీవక్రియలను ఓ సింఫనీతో పోల్చవచ్చు. సింఫనీ అంటే అనేక మంది గాయకులు ఒకే స్వరంతో స్వరం కలిపి ఒకే లయలో పాడటం. అప్పుడు ఓ అద్భుత సంగీతం (మెలొడీ) ఆవిష్కృతమవుతుంది. ఇందులో కణాలన్నీ మంచి గాయకులనుకుంటే మంచి మైక్రోబియమంతా లయాత్మకంగా వాద్యాలను వాయించే అద్భుత సంగీతకారులు (మ్యూజీషియన్స్). అప్పుడు వినిపించేదంతా హాయినిగొలిపే 'ఆరోగ్య'కరమైన సంగీతం. ఈ హెల్దీ సంగీత లహరి అలా హాయిగా సాగిపోతుండగా మనం తీసుకునే అనారోగ్యకరమైన, పోషకరహితమైన ఆహారం కారణంగా వినిపించే కొన్ని అనారోగ్యల అపస్వరాల ఆలాపాల వల్ల కలిగే అనర్థాలు!

ఇక ఈ పోలికలో ట్యూమర్ అనేది చక్కగా సాగే సింఫనీని చెడగొట్టేలా అన్నీ అపస్వరాలతో గట్టిగా గానాన్ని వినిపించే సోలో గాయకుడూ, అలాగే 'ట్యూమర్'లోనూ ఉన్న మైక్రో బయోమ్ కూడా వినిపించే అందరూ సమన్వయంతో పాడుతుండగా వినిపించే ఈ అపస్వరాల అనారోగ్యం కర్ణ కఠోరంగా వినిపించే 'రుగ్మత'.

ఇలాంటి సమయాల్లో మనం తీసుకునే పోషకాలతో కూడిన మంచి ఆహారంలోని ఫైబర్ పుష్కలంగా ఉండే న్యూట్రిషన్, ప్రోబయాటిక్స్, యాంటీ ఆక్సిడెంట్లూ ఇవన్నీ ఆ అపస్వరాలను అధిగమిస్తూ, వాటిని కప్పేస్తూ గట్టిగా వినిపించే సుస్వరాలు. అనుసరించే అద్భుతారోగ్యకరమైన జీవనశైలి (లైఫ్‌స్టైల్) కూడా అదనంగా వినిపిస్తుండే ఆర్కెస్ట్రైజేషన్! ఇలా చేస్తున్నప్పుడు సమన్వయంతో సాగే సింఫనీలో పూర్తిగా అపస్వరాలే పైచేయి సాధించకుండా కనీసం వాటిని కప్పేస్తూ తప్పులను దొర్లనివ్వకుండా, దొరకనివ్వకుండా చేసే 'కోకఫోనీ'!

అంటే... ఈ పోలికను క్యాన్సర్ జబ్బుతో అన్వయించినప్పుడు... మంచి చికిత్స, మంచి ఆహారం, మంచి లైఫ్‌స్టైల్‌తో జబ్బు మరింత పెరగదు. అనర్థాలు కనిపించవు. అపస్వరాలను డామినేట్ చేసేలా చికిత్స, ఆహారనియమాలూ, జీవనశైలి సాగితే క్రమంగా అపస్వరాలే వినిపించనివ్వకుండా చేసేలా మనకు మేలు చేసే మంచి మైక్రోబియమ్ పెరుగుతుంది. ఆ చెడు మైక్రోబియమ్‌ను అది డామినేట్ చేసి మరీ చికిత్సతో క్యాన్సర్ నయం చేయడానికి సహాయపడుతుందని ఈ పోలిక చెబుతోంది.

ఈ ఏడాది థీమ్ 'యునైటెడ్ బై యునీక్' వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా వచ్చే రెండేళ్ల పాటు (అంటే 2025 నుంచి 2027 వరకు) అమల్లో ఉండే 'థీమ్'... 'యునైటెడ్ బై యునీక్'!

ప్రతి క్యాన్సర్ బాధితుడూ ఓ ప్రత్యేక వ్యక్తి. ఈ బయోమ్ కారణంగా అతడిలోని జబ్బు అతడికే ప్రత్యేకం. అందుకే ఒక వ్యక్తిలో క్యాన్సర్ ప్రవర్తించే తీరును బట్టి వ్యక్తిగతంగా అతడికే ప్రత్యేకమైన మందుల రూపకల్పనకూ ప్రయత్నాలు జరుగుతున్నాయి. అలాంటి ఎంతో మంది ప్రత్యేక వ్యక్తులంతా ఐక్యంగా కలిసి క్యాన్సర్‌ను ఎదుర్కొనేందుకు ప్రయత్నించాలన్నదే ఈ థీమ్ అర్థం. తెలుగులో చెప్పుకోవాలంటే... ఇది 'ప్రత్యేకుల ఐక్యత'! అంటే ప్రత్యేకమైన వ్యక్తిత్వాలన్నీ ఏకమై క్యాన్సర్‌ను తుదముట్టించేందుకు ప్రయత్నించాలంటూ ఈ ప్రత్యేకమైన థీమ్ పిలుపునిస్తోంది.

కొన్ని ట్యూమర్ బయోమ్‌తో సమర్థమైన ఇమ్యూనో చికిత్స సాధ్యం...

క్యాన్సర్‌కు అందించే చికిత్సల్లో కీమో, రేడియేషన్, శస్త్రచికిత్సలతో పాటు ఇమ్యూనో థెరపీ అన్నది కూడా ఓ ప్రభావవంతమైన చికిత్స. ప్రతి వ్యక్తిలో ప్రతిరోజూ 200 నుంచి 1000 క్యాన్సర్ కణాలు పుడుతుంటాయి. మనందరిలో ఉండే వ్యాధి నిరోధక వ్యవస్థ (ఇమ్యూనిటీ) వాటిని తుదముట్టిస్తుంది. ఆ వ్యవస్థ విఫలమైనప్పుడు అలా తుదముట్టించే ప్రక్రియలో ఒక్క క్యాన్సర్ కణమైనా తప్పించుకుని బతికితే అప్పుడు బాధితులకు క్యాన్సర్ వ్యాధి వస్తుంది.

ఈ ఇమ్యూనో థెరపీలో బాధితుల వ్యాధి నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తారు. ఫలితంగా క్యాన్సర్ రాకముందు వ్యాధినిరోధక వ్యవస్థ రోజూ పుట్టే క్యాన్సర్ కణాలను మట్టుబెట్టే ప్రక్రియే ఈ ఇమ్యూనోథెరపీలోనూ జరుగుతుంది. ఈ థెరపీ సమయంలో క్యాన్సర్ ట్యూమర్‌లోనూ, ఆ పరిసరాల్లోనూ ఉండే సూక్ష్మ జీవుల సముదాయం మానవులకు మేలు చేసేదైతే ఈ చికిత్సకు ఆ బయోమ్ మరింత దోహదపడి ట్యూమర్‌ను తగ్గించడానికి దోహదం చేస్తుంది.

ట్యూమర్‌కు కీడు చేసే బయోమ్‌తో బాధితుడికి మేలు...

గట్ బ్యాక్టీరియమ్‌లో మేలు చేసేవి ఎక్కువగా ఉన్నప్పుడు అవి మంచి ఆరోగ్యాన్నిస్తూ, చెడు బయోమ్ పెరిగినప్పుడు ఆరోగ్యం చెడిపోయినట్టే... క్యాన్సర్ ట్యూమర్‌లోనూ... ఆ గడ్డకు సహాయం చేసే బయోమ్ పెరిగితే అది చికిత్సను అడ్డుకుంటుంది. ట్రీట్‌మెంట్ ప్రభావాన్ని తగ్గిస్తుంది. అలాగే... ఇక దానికి చేటు చేసే బయోమ్ పెరిగినప్పుడు... ఆ సూక్ష్మ జీవుల సముదాయం క్యాన్సర్ గడ్డ పెరుగుదలకు అడ్డుకట్ట వేస్తుంది. ట్యూమర్ చుట్టూ అలాంటి బయోమ్ ఉన్నప్పుడు పేషెంట్స్‌కు అందించే చికిత్సకు... ముఖ్యంగా 'కీమో' చికిత్సకు బాధితులు సానుకూలంగా స్పందిస్తుంటారు. అలా ట్యూమర్ మైక్రోబయోమ్‌కూ క్యాన్సర్ చికిత్సకూ మధ్య పరస్పరం ప్రతిస్పందనలు కొనసాగుతుంటాయి.

బ్యూటిప్

పాదాల పగుళ్లు తగ్గాలంటే...



కొద్దిగా మైనం, ఆవనూనె కలిపి వేడి చేయాలి. ఈ మిశ్రమాన్ని రాత్రి పడుకునే ముందు పాదాల పగుళ్లు ఉన్న చోట రాయాలి. తర్వాత కాటన్ సాక్స్ ధరించాలి. రాత్రి మొత్తం ఇలాగే ఉంచి మరుసటి రోజు ఉదయం శుభ్రపరుచుకోవాలి.

సమ్‌థింగ్ స్పెషల్

ఆడుతు పాడుతు ఊడుస్తుంటే...



అంతకు మించిన హాయి ఏమున్నది!

శ్రమదానం మనకు కొత్త కాదు. అయితే అయేషా చేసిన శ్రమదానం వీడియో వైరల్ అయింది. ఇంతకీ ఆమె శ్రమదానం ప్రత్యేకత ఏమిటి అనే విషయానికి వస్తే...

అయేషా మన అమ్మాయి కాదు.

జోద్‌పూర్‌ను చూడడానికి తుర్కియే నుంచి వచ్చింది. జోద్‌పూర్‌లోని మాండోర్ గార్డెన్‌కు వెళ్లిన అయేషా అక్కడి పనివాళ్లు ఊడ్చే దృశ్యాలను చూసింది. 'నాకు కూడా ఒక చీపురు కావాలి' అని అడిగింది.

అక్కడ ఉన్న గైడ్, వర్కర్స్ అయేషా జోక్ చేస్తుంది అనుకున్నారు. కాని ఆమె సీరియస్‌గానే అడిగింది అని తెలుసుకోవడానికి ఎంతోసేపు పట్టలేదు. చీపురుతో అరగంట పాటు ఊడ్చుతూ శ్రమదానం చేసింది.

ఈ వీడియోను చూస్తూ నెటిజనులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

'గార్డెన్‌లకు వెళ్లడం అనేది ఆహ్లాదకరమైన అనుభవం. అయితే గార్డెన్‌లలో ఎక్కడ పడితే అక్కడ చెత్త కనిపిస్తూ చిరాకు కలిగిస్తుంది. చెత్త వేసే వాళ్లు గార్డెన్‌లకు వెళ్లడానికి అనర్హులు. పరిసరాల పరిశుభ్రత అనే స్పృహ ఉన్న అయేషాలాంటి వాళ్లు మనకు ఆదర్శం కావాలి'

'శ్రమదానానికి సరిహద్దులు లేవని నిరూపించిన వీడియో ఇది'... ఇలాంటి కామెంట్స్ ఎన్నో నెటిజనుల నుంచి వచ్చాయి.



క్యాన్సర్ 'ఏ టు జడ్' స్క్రీనింగ్స్ ఇలా!

చాప కింది నీరులా వ్యాపిస్తున్న ప్రాణాంతక వ్యాధుల్లో క్యాన్సర్ ఒకటి. అయితే క్యాన్సర్‌ను వీలైనంత త్వరగా అంటే... దాని నాలుగు దశల్లో... మొదటి లేదా రెండో దశలోనైనా కనుక్కోగలిగితే క్యాన్సర్‌ను నయం చేసుకోవడం కష్టమేం కాదు. అయితే క్యాన్సర్స్‌ను ముందుగానే గుర్తించడమెలా, మహిళలకూ, పురుషులకూ లేదా ఈ ఇద్దరిలోనూ వచ్చే సాధారణ క్యాన్సర్లేమిటి... ఇలాంటి విషయాలన్నీ తెలుసుకోడానికి ఉపయోగపడే ప్రత్యేక కథనాన్ని సాక్షి హెల్త్ ప్లస్‌లో చూడవచ్చు.



ఎంతైనా అమ్మ అమ్మే!

'ఢిల్లీకి రాజు అయినా తల్లికి కొడుకే!' అని ఊరకే అనలేదు.

'అమ్మా... పెద్ద విజయం సాధించాను' అని చెప్పినా సరే...

'సంతోషం' అంటూనే 'ఇంతకీ భోజనం చేశావా?' అని ఆరా తీస్తుంది.

తల్లికి పిల్లల విజయాల కంటే వారి ఆరోగ్యం, క్షేమం ముఖ్యం. ఇట్టి విషయాన్ని మరోసారి నిరూపించిన స్క్రీన్ షాట్ గురించి.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ 'ఓపెన్ ఏఐ'లో అన్షితా సైనీ గ్రోత్ ఇంజినీర్. చాట్‌జీపీటీ కోసం ఆమె అభివృద్ధి చేసిన ఫీచర్ 'టెక్ క్రంచ్' హైలెట్ అయింది. ఇది ఆమె కెరీర్‌లో ఒక ప్రధాన మైలు రాయిగా చెప్పవచ్చు.

తన విజయం గురించి ఒక టెక్ పత్రికలో వచ్చిన వ్యాసం లింక్‌ను తల్లికి పంపించింది అన్షిత.

'నేను రూపొందించిన ఫీచర్ గురించి పత్రికలో గొప్పగా రాశారు' అని తల్లికి టెక్స్ మెసేజ్ ఇచ్చింది.

'నైస్... గ్రేట్ ఇన్‌స్పిరేషన్' అని బదులు ఇచ్చిన వెంటనే...

'నీ ఫీచర్ సంగతి సరే... ఈరోజు తినడానికి నీ దగ్గర నట్స్, ఫ్రూట్స్ ఉన్నాయా?' అని అడిగింది.

చాట్‌లో తల్లి అడిగిన ప్రశ్న స్క్రీన్‌షాట్ తీసి 'ఎక్స్'లో షేర్ చేసింది అన్షిత. దీనికి కొన్నిగంటల్లోనే లక్షకు పైగా వ్యూస్ వచ్చాయి.

గెలుపు దారి



తోట పని గురించి పెద్దలు చెప్పిన మాట... 'జీవితానికి ఉత్సాహాన్ని ఇస్తుంది. ఉత్సాహానికి ప్రయోగశీలతను ఇస్తుంది' పుదుచ్చేరిలోని తెలుగు సంతతికి చెందిన శ్రీలక్ష్మికి తోట అనేది ఉత్సాహాన్ని ఇచ్చే శక్తి మాత్రమే కాదు ప్రయోగక్షేత్రం కూడా! తాను చదివిన చదువుకు చేసిన ప్రయోగాలకు సంబంధమే లేదు. ఎంబీఏ చేసిన శ్రీలక్ష్మికి కార్పొరేట్ దారి కనిపించలేదు. పచ్చటి వ్యవసాయ క్షేత్రాలే కనిపించాయి. ప్రయోగాలు దారి చూపించాయి నిమ్మ వాసనతో కూడిన మిరియాల వంగడాన్ని అభివృద్ధి చేయడంలాంటి ఎన్నో ఆవిష్కరణలు చేసింది శ్రీలక్ష్మి...

ప్రయోగాలే ప్రాణమై...

కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో కూడపాక్కం గ్రామంలో తెలుగు సంతతికి చెందిన వెంకటపతి రెడ్డియార్ కుటుంబం ఉంది. వెంకటపతి రెడ్డియార్ 4వ తరగతిలోనే బడి మానేసి వ్యవసాయ పనులలో తల్లిదండ్రులకు సాయంగా పొలం బాట పట్టాడు. హార్టికల్చర్ మీద ఆసక్తితో తనకు ఉన్న స్వీయ అనుభవాలతో కొత్తరకం పూల మొక్కల పెంపకంలో రాణించాడు. వందరకాల కనకాంబరం వంగడాల అభివృద్ధితో రికార్డు సృష్టించాడు. ఎన్నో పేటెంట్లను కలిగిన రెడ్డియార్ పరిశోధనలకు గుర్తింపుగా పద్మశ్రీ పురస్కారం వరించింది.

పరిశోధనల కోసం జీవితాన్ని అంకితం చేసిన తండ్రి వెంకటపతి రెడ్డియార్ అడుగు జాడలలో ఆమె కూతురు శ్రీలక్ష్మి(32) నడుస్తోంది. కొత్తరకం సువాసనలతో వివిధ రకాల వంగడాలను సృష్టిస్తోంది.

తండ్రి వెంకటపతి రెడ్డియార్‌ను స్ఫూర్తిగా తీసుకొని ఏడు సంవత్సరాల వయస్సులోనే శ్రీలక్ష్మి పొలం బాట పట్టింది. ఓ వైపు చదువుకుంటూ, మరో వైపు పొలం పనులు చేసేది. కాలక్రమంలో తండ్రి పరిశోధనలకు చేదోడు వాదోడుగా మారింది.

కార్పొరేట్ ప్రపంచాన్ని కాదనుకొని...

ఎంబీఏ చేసినా, వ్యవసాయం మీద మక్కువతో ఆ దిశగానే అడుగులు వేసింది. తండ్రి మెళకువలు అంది పుచ్చుకుంది శ్రీలక్ష్మి. సేంద్రియ, సేంద్రియేతర విధానాలతో పొలంలో వివిధ రకాల మొక్కల పెంపకం, వాటిని పలు రాష్ట్రాలకు ఎగుమతులు చేయడం మొదలు పెట్టింది. ఆరెంజ్, చాక్లెట్, నేరేడు, పన్నీర్ సువాసనలతో కొత్తరకం జామవంగడాల సృష్టి ప్రత్యేకతను సంతరించుకుంది. వీటిలో ఆరంజ్ ఫ్లేవర్‌కు ప్రధాని నరేంద్ర మోదీ, చాక్లెట్ ఫ్లేవర్‌కు కిరణ్ బేడీల పేర్లు పెట్టారు.

మన ఆసక్తే మన శక్తి...

పంటపొలాల్లోకి వెళితే కొత్తప్రపంచంలోకి వెళ్లినట్లుగా ఉంటుంది. ఆ సంతోషమే ఉద్యానరంగంలోకి అడుగు పెట్టేలా చేసింది. ప్రయోగాల విషయంలో నాన్న ఇచ్చిన స్ఫూర్తి ఇంతా అంతా కాదు. 'మన ఆసక్తే మనశక్తి' అనేది ఆయన మాట. ఆ ఆసక్తితోనే ప్రయోగాల దారిలో ప్రయాణం చేస్తున్నాను. వ్యవసాయ పరిశోధనల్లో మహిళల కొరత కనిపిస్తోంది. పరిశోధన రంగంలోకి అడుగు పెట్టే మహిళల సంఖ్య పెరిగేకొద్దీ కొత్త ఆవిష్కరణలు సాధ్యం అవుతాయి.

– శ్రీలక్ష్మి

నిమ్మ మిరియం!

నిమ్మ సువాసనతో 1.5 ఎకరాలలో కొత్త రకం మిరియాల మొక్కలను పండించారు. సాధారణ రకం మిరియాల మొక్కలతో ఆరేడు సంవత్సరాల తర్వాతే పంట చేతికి వస్తుంది. దీనికి భిన్నంగా సరికొత్త వంగడంతో అంతకన్నా తక్కువ ఖర్చు, తక్కువ సమయం, తక్కువ శ్రమతోనే దిగుబడి ఆశాజనకంగా ఉండే విధానాన్ని శ్రీలక్ష్మి ఆవిష్కరించింది.

'పది సంవత్సరాలుగా పరిశోధన చేశాం. ఎట్టకేలకు మా కష్టం ఫలించింది. వివిధ మొక్కలను పలు రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నాం. ఈ కొత్త ఆవిష్కరణకు పేటెంట్ కోసం ప్రయత్నిస్తున్నాం' అంటుంది శ్రీలక్ష్మి.

– ఎం. అస్మతీన్ మైదీన్,
సాక్షి, చెన్నై



తెలంగాణ షూటర్ సురభికి కాంస్యం

జాతీయ క్రీడల్లో తెలంగాణకు రెండో పతకం లభించింది. ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న ఈ క్రీడల్లో సోమవారం మహిళల షూటింగ్ 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో తెలంగాణ అమ్మాయి రాపోలు సురభి భరద్వాజ్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో సురభి 448.8 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచింది. పంజాబ్‌కు చెందిన ఒలింపియన్ సిఫ్ట్ కౌర్ సమ్రా (461.2 పాయింట్లు) స్వర్ణ పతకం దక్కించుకోగా... పంజాబ్‌కే చెందిన అంజుమ్ మౌద్గిల్ (458.7 పాయింట్లు) రజత పతకాన్ని సాధించింది. అంతకుముందు 29 మంది షూటర్లు పాల్గొన్న క్వాలిఫయింగ్‌లో సురభి 490 పాయింట్లు స్కోరు చేసి నాలుగో స్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరింది. క్వాలిఫయింగ్‌లో టాప్-8లో నిలిచిన వారు ఫైనల్లో పోటీపడతారు. మరోవైపు బెంగళూరుకు చెందిన 15 ఏళ్ల కుర్రాడు జొనాథన్ ఆంథోనీ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో స్వర్ణ పతకం నెగ్గి సంచలనం సృష్టించాడు. పసిడి పతకం నెగ్గే క్రమంలో జొనాథన్ (కర్ణాటక) ఇద్దరు ఒలింపియన్స్ సరబ్‌జ్యోత్ సింగ్, సౌరభ్ చౌదరీలను ఓడించడం విశేషం.

ఐసీసీ ‘టీమ్ ఆఫ్ ద టోర్నీ’లో త్రిష

భారత్ నుంచి కమలిని, ఆయుశి, వైష్ణవిలకూ చోటు


గొంగడి త్రిష


కమలిని


ఆయుశి శుక్లా



వైష్ణవి శర్మ

కౌలాలంపూర్: అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్‌ను వరుసగా రెండోసారి సాధించిన భారత జట్టులోని పలువురు ప్లేయర్లకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టీమ్‌లో చోటు దక్కింది. ఆదివారం జరిగిన టైటిల్ పోరులో నికీ ప్రసాద్ నేతృత్వంలోని భారత అమ్మాయిల జట్టు తొమ్మిది వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాపై జయభేరి మోగించిన సంగతి తెలిసిందే. ఈ టోర్నీ ఆసాంతం విశేషంగా రాణించిన తెలంగాణ స్టార్ ఓపెనర్ గొంగడి త్రిష సహా మొత్తం నలుగురు భారత క్రికెటర్లకు ఐసీసీ ‘టీమ్ ఆఫ్ ద టోర్నమెంట్’లో స్థానం లభించింది. త్రిష ఓపెనింగ్ భాగస్వామి కమలిని, లెఫ్టార్మ్ స్పిన్ ద్వయం వైష్ణవి శర్మ, ఆయుశి శుక్లాలు కూడా ఐసీసీ ఎంపిక చేసిన జట్టులో ఉన్నారు. హార్డ్ హిట్టర్ త్రిష ఈ టోర్నీ చరిత్రలోనే తొలి సెంచరీ సహా 309 పరుగులు చేసింది. లెగ్‌స్పిన్‌తో 7 వికెట్లను కూడా పడగొట్టింది. ఆమెతో జోడీగా దిగిన కమలిని 143 పరుగులు చేసింది. ఇంగ్లండ్‌తో జరిగిన సెమీఫైనల్లో కమలిని (50 బంతుల్లో 56 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో ఆకట్టుకుంది. భారత స్పిన్నర్లలో ఆయుశి 14 వికెట్లను చేజిక్కించుకోగా, వైష్ణవి 17 వికెట్లతో టోర్నీలోనే అగ్రస్థానంలో ఉంది. మలేసియాపై ‘హ్యాట్రిక్’తో ఆమె (5/5) అత్యుత్తమ గణాంకాలు నమోదు చేసింది.

ఐసీసీ టీమ్ ఆఫ్ ద టోర్నీ: కైలా రేనెకె (కెప్టెన్; దక్షిణాఫ్రికా), జెమ్మా బోతా (దక్షిణాఫ్రికా), త్రిష, కమలిని, ఆయుశి శుక్లా, వైష్ణవి శర్మ (భారత్), దేవినా పెరిన్, కేటీ జోన్స్ (ఇంగ్లండ్), కావొంహె బ్రే (ఆస్ట్రేలియా), చమొది ప్రబొద (శ్రీలంక), పూజ మహతో (నేపాల్), 12వ ప్లేయర్: ఎన్‌తబిసెంగ్ నిని (దక్షిణాఫ్రికా).



చాంపియన్ ప్రజ్ఞానంద


ప్రజ్ఞానంద
గుకేశ్

- టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నీ టైటిల్ సొంతం
- టైబ్రేక్‌లో ప్రపంచ చాంపియన్ గుకేశ్‌పై 2–1తో విజయం

విక్ ఆన్ జీ (నెదర్లాండ్స్): సుదీర్ఘ విరామం తర్వాత ప్రతిష్టాత్మక టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్ టైటిల్ భారత గ్రాండ్‌మాస్టర్ ఖాతాలో చేరింది. తమిళనాడుకు చెందిన 19 ఏళ్ల భారత స్టార్ గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద టాటా స్టీల్ మాస్టర్స్ టోర్నీలో చాంపియన్‌గా అవతరించాడు. ప్రపంచ చాంపియన్, భారత మరో స్టార్ గ్రాండ్ మాస్టర్ దొమ్మరాజు గుకేశ్‌తో జరిగిన ‘ప్లే ఆఫ్స్ టైబ్రేక్’లో ప్రజ్ఞానంద 2–1తో విజయం సాధించాడు. విశ్వనాథన్ ఆనంద్ (2006లో) తర్వాత టాటా స్టీల్ చెస్ టోర్నీ టైటిల్ గెలిచిన భారత ప్లేయర్‌గా ప్రజ్ఞానంద గుర్తింపు పొందాడు. 14 మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య 13 రౌండ్లపాటు ఈ టోర్నీ జరిగింది. నిర్ణీత 13 రౌండ్ల తర్వాత ప్రజ్ఞానంద, గుకేశ్ 8.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. దాంతో విజేతను నిర్ణయించేందుకు ప్లే ఆఫ్స్ టైబ్రేక్‌ను నిర్వహించారు. బ్లిట్జ్ ఫార్మాట్‌లో మూడు బ్లిట్జ్ గేమ్‌లు జరగ్గా... తొలి గేమ్‌లో 18 ఏళ్ల గుకేశ్ 42 ఎత్తుల్లో ప్రజ్ఞానందను ఓడించి 1–0తో ఆధిక్యంలోకి వెళ్లాడు. రెండో గేమ్‌లో ప్రజ్ఞానంద 39 ఎత్తుల్లో గుకేశ్‌పై గెలిచి స్కోరు 1–1తో సమం చేశాడు. చివరిదైన మూడో గేమ్‌లో ప్రజ్ఞానంద 62 ఎత్తుల్లో గుకేశ్‌ను ఓడించి 2–1 స్కోరుతో టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. చివరి గేమ్‌లో తన ఓటమి ఖరారైన వెంటనే గుకేశ్ నిరాశకు గురై కుర్చీలో వెనక్కి వాలిపోయాడు. ఈ టోర్నీలో ఆడిన భారత ఇతర గ్రాండ్‌మాస్టర్లు పెంటేల హరికృష్ణ 6.5 పాయింట్లతో ఆరో స్థానంలో, ఇరిగేశి అర్జున్ 5.5 పాయింట్లతో పదో స్థానంలో, లియోన్ మెండోకా 5 పాయింట్లతో 13వ స్థానంలో నిలిచారు.

చెస్ ప్రపంచంలో టాటా స్టీల్ మాస్టర్స్ టోర్నీకి ‘వింబుల్డన్ ఆఫ్ చెస్’గా పేరుంది. 87 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ టోర్నీని 2011 నుంచి టాటా స్టీల్ పేరుతో నిర్వహిస్తున్నారు. అంతకుముందు 2000 నుంచి 2010 వరకు కోరస్ స్టీల్ చెస్ టోర్నీగా జరిగింది. ఆ సమయంలో భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ ఈ టోర్నీని మూడుసార్లు గెలిచాడు. కోరస్ స్టీల్‌ను టాటా స్టీల్ కొనుగోలు చేయడంతో 2011 నుంచి ఈ టోర్నీ టాటా స్టీల్ మాస్టర్స్ టోర్నీగా మారింది. టాటా స్టీల్ మాస్టర్స్ పేరుతో నిర్వహిస్తున్నాక ఈ ఏడాది తొలిసారి ప్రజ్ఞానంద రూపంలో భారత గ్రాండ్‌మాస్టర్ విజేతగా అవతరించాడు.



సుశ్రుత-శ్రీశాన్వి జోడీకి కాంస్య పతకం

సాక్షి, హైదరాబాద్: జాతీయ సబ్ జూనియర్, క్యాడెట్ టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు కాంస్య పతకం లభించింది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరంలో జరిగిన ఈ టోర్నీలో అండర్-15 బాలికల డబుల్స్ విభాగంలో సుశ్రుత అనియా ఆనంద్-శ్రీశాన్వి కామారపు (తెలంగాణ) జోడీ కాంస్య పతకాన్ని దక్కించుకుంది. సెమీఫైనల్లో సుశ్రుత-శ్రీశాన్వి ద్వయం 11-13, 6-11, 9-11తో దివ్యాంశి-నైషా (మహారాష్ట్ర) జంట చేతిలో ఓడిపోయింది. తెలంగాణ జట్టుకు ఎస్.ప్రణీత్, ఎం.చైతన్య కోచ్‌లుగా వ్యవహరించారు.

పోరాడి ఓడిన సహజ



ముంబై: ఎల్ అండ్ టీ ముంబై ఓపెన్ డబ్ల్యూటీఏ-125 టెన్నిస్ టోర్నీలో తెలంగాణ క్రీడాకారిణి, భారత నంబర్‌వన్ సహజ యామలపల్లి పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. సోమవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 291వ ర్యాంకర్ సహజ 3-6, 6-2, 1-6తో ప్రపంచ 175వ ర్యాంకర్ లాన్‌లానా తారారుడీ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయింది. 2 గంటల 30 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ రెండు ఏస్‌లు సంధించి, ఏడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను ఎనిమిదిసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. సహజతోపాటు ఈ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి శ్రీవల్లి రష్మిక, అంకిత రైనా, వైష్ణవిలకు ‘వైల్డ్ కార్డు’తో నేరుగా మెయిన్ ‘డ్రా’లో చోటు కల్పించారు.

భారత్ ‘చాంపియన్స్ ట్రోఫీ’ మ్యాచ్‌ల టికెట్లు సిద్ధం

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా భారత జట్టు ఆడే మూడు లీగ్ మ్యాచ్‌లతో పాటు తొలి సెమీఫైనల్ మ్యాచ్ టికెట్లను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) సోమవారం నుంచి అభిమానుల కోసం అందుబాటులో ఉంచింది. సోమవారం సాయంత్రం గం. 5:30 నుంచి టికెట్ల అమ్మకాలు మొదలయ్యాయి. భారత్ తమ అన్ని మ్యాచ్‌లను యూఏఈలోని దుబాయ్‌లోనే ఆడుతుంది. ఈ నెల 20న బంగ్లాదేశ్‌తో, 23న పాకిస్తాన్‌తో, మార్చి 2న న్యూజిలాండ్‌తో తమ గ్రూప్ ‘ఎ’లో తలపడుతుంది. ఈ ఫలితాల అనంతరం భారత్ ముందంజ వేస్తే తొలి సెమీఫైనల్ కూడా దుబాయ్‌లోనే ఆడుతుంది. కాబట్టి ఈ మ్యాచ్ కోసం టికెట్లను కూడా ఐసీసీ ముందుగానే అమ్ముతోంది. టికెట్ల కనీస ధర 125 యూఏఈ దిర్హామ్‌లు (సుమారు రూ. 2,900)గా నిర్ణయించారు.

సామ్సన్ వేలికి గాయం

ఆరు వారాలు ఆటకు దూరం



న్యూఢిల్లీ: భారత వికెట్ కీపర్, బ్యాటర్ సంజూ సామ్సన్ గాయంతో ఆరు వారాలు పూర్తిగా ఆటకు దూరం కానున్నాడు. దీంతో రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్స్‌కు అతను కేరళ జట్టుకు అందుబాటులో ఉండటం లేదు. ఇంగ్లండ్‌తో ఆదివారం ముంబైలో జరిగిన చివరిదైన ఐదో టి20లో బ్యాటింగ్ చేస్తుండగా సీమర్ జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో అతని కుడి చూపుడు వేలికి గాయమైంది. ‘స్కానింగ్’లో స్వల్పంగా ఫ్రాక్చర్ అయినట్లు తేలింది. దీంతో సామ్సన్ ఆరు వారాలు ఆటకు దూరమవుతాడు. పుణే వేదికగా ఈ నెల 8 నుంచి 12 వరకు జమ్మూ కశ్మీర్‌తో కేరళ ఆడే రంజీ క్వార్టర్ ఫైనల్ పోరులో అతను బరిలోకి దిగడు’ అని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఒక ప్రకటనలో తెలిపింది. అన్ని అనుకున్నట్లు జరిగితే సామ్సన్ ఐపీఎల్ కల్లా అందుబాటులో ఉంటాడని బోర్డు పేర్కొంది. లీగ్‌లో అతను రాజస్తాన్ రాయల్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టి20ల సిరీస్‌లో సంజూ సామ్సన్ పేలవ ప్రదర్శనతో కేవలం 51 పరుగులు సాధించాడు. ఈ నెల 6న నాగ్‌పూర్‌లో జరిగే తొలి వన్డేతో భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్ మొదలవుతుంది.

అదరగొడుతున్న ‘అభి’
విధ్వంసానికి చిరునామాగా అభిషేక్ శర్మ
మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

సంక్రాంతికి వస్తున్నాం సరికొత్త రికార్డు

- రూ.303 కోట్లు సాధించిన తొలి తెలుగు ప్రాంతీయ చిత్రం

వెంకటేశ్ హీరోగా నటించిన ‘సంక్రాంతికి వస్తున్నాం’ సినిమా చిత్ర పరిశ్రమలో సరికొత్త రికార్డు సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్ల వసూళ్లను దాటిన మొదటి తెలుగు ప్రాంతీయ చిత్రంగా నిలిచినట్లు పేర్కొని, పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన చిత్రం ‘సంక్రాంతికి వస్తున్నాం’. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేష్ హీరోయిన్లుగా నటించారు. ‘దిల్’ రాజు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై శిరీష్ నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదలై, సూపర్ హిట్‌గా నిలిచింది. ‘‘ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ నేపథ్యంలో వచ్చిన సినిమాల బాక్సాఫీస్ రికార్డులను మా ‘సంక్రాంతికి వస్తున్నాం’ బద్దలు కొట్టింది. ప్రపంచవ్యాప్తంగా 303 కోట్ల వసూళ్లు రాబట్టింది. తన తరం హీరోల్లో రూ.300 కోట్ల వసూళ్లను సాధించిన తొలి నటుడిగా వెంకటేశ్ నిలిచారు. నిర్మాతలు, పంపిణీదారులు, ఎగ్జిబిటర్స్‌కు గొప్ప లాభాలు తెచ్చిన మూవీ ఇది. అనేక ప్రాంతాల్లో పాన్ ఇండియా చిత్రాల కలెక్షన్లను కూడా అధిగమించింది. నాల్గవ వారంలోకి అడుగుపెట్టినప్పటికీ బాక్సాఫీస్ వద్ద అద్భుతంగా రాణిస్తోంది’’ అని చిత్రబృందం పేర్కొంది.


• వెంకటేశ్

ప్రళయ కాల రుద్రుడు


• ప్రభాస్

‘ప్రళయ కాల రుద్రుడు.. త్రికాల మార్గదర్శకుడు... శివాజ్ఞ పరిపాలకుడు.. రుద్ర’ అంటోంది ‘కన్నప్ప’ మూవీ టీమ్. విష్ణు మంచు హీరోగా ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన చిత్రం ‘కన్నప్ప’. ప్రీతీ ముకుందన్ హీరోయిన్‌గా నటించిన ఈ మూవీలో మోహన్ బాబు, ప్రభాస్, మోహన్‌లాల్, శరత్ కుమార్, బ్రహ్మానందం, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. ఈ మూవీలో రుద్ర పాత్రలో ప్రభాస్ నటించినట్లు వెల్లడించి, ఫస్ట్‌లుక్‌ను సోమవారం విడుదల చేశారు మేకర్స్. అవా ఎంటర్‌టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకాలపై మోహన్‌బాబు నిర్మించిన ‘కన్నప్ప’ ఏప్రిల్ 25న పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతోంది.

మద్రాస్ నేపథ్యంలో...


• దుల్కర్ సల్మాన్

దుల్కర్ సల్మాన్ హీరోగా నటించిన లేటెస్ట్ పీరియాడికల్ ఫిల్మ్ ‘కాంత’. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించిన ఈ మూవీలో సముద్రఖని ఓ లీడ్ రోల్ చేశారు. ‘ది హంట్ ఫర్ వీరప్పన్’ డాక్యుమెంటరీ ఫేమ్ సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించారు. ఈ మల్టీ లాంగ్వేజ్ ఫిల్మ్‌ని రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ నిర్మించారు. నటుడిగా దుల్కర్ పదమూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ‘కాంత’లోని ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ‘‘1950 నాటి మద్రాస్(చెన్నై) నేపథ్యంలో ‘కాంత’ ఉంటుంది. అప్పటి మానవీయ సంబంధాలు, సామాజిక పరిస్థితుల నేపథ్యంతో ఈ మూవీ కొత్తగా ఉంటుంది’’ అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: జాను.

కె ర్యాంప్ షురూ


• యుక్తీ తరేజా, కిరణ్ అబ్బవరం, ‘దిల్’ రాజు

‘క’ వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత కిరణ్ అబ్బవరం హీరోగా ‘కె-ర్యాంప్’ అనే మూవీ షురూ అయింది. నూతన దర్శకుడు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో యుక్తీ తరేజా హీరోయిన్. హాస్య మూవీస్ పతాకంపై రాజేష్ దండ నిర్మిస్తున్న ఈ సినిమా సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. నిర్మాత అనిల్ సుంకర కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత ‘దిల్’ రాజు క్లాప్ ఇచ్చారు. తొలి సన్నివేశానికి యోగి గౌరవ దర్శకత్వం వహించారు. దర్శకులు విజయ్ కనకమేడల, రామ్ అబ్బరాజు, యదు వంశీ, రైటర్ ప్రసన్నలు మేకర్స్‌కు స్క్రిప్ట్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు ధీరజ్ మొగిలినేని, వంశీ నందిపాటి, నటుడు వీకే నరేశ్ పాల్గొన్నారు. ‘వెన్నెల’ కిశోర్, వీకే నరేశ్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: చేతన్ భరద్వాజ్, సహ-నిర్మాతలు: బాలాజీ గుట్ట, ప్రభాకర్ బురుగు.

కొత్తగా అనిపిస్తుంది

– వినోద్ కుమార్ విజయన్

‘‘ఒక పథకం ప్రకారం’ స్క్రీన్ ప్లే బేస్డ్ మూవీ. తెలుగు ప్రేక్షకులకు మా సినిమా చాలా కొత్తగా అనిపిస్తుంది’’ అని వినోద్ కుమార్ విజయన్ అన్నారు. డైరెక్టర్ పూరి జగన్నాథ్ సోదరుడు సాయిరామ్ శంకర్ హీరోగా నటించిన సీట్ ఎడ్జ్ సస్పెన్స్ థ్రిల్లర్ ‘ఒక పథకం ప్రకారం’. వినోద్ విహాన్ ఫిల్మ్స్ -విహారి సినిమా హౌస్‌పై గార్లపాటి రమేష్‌తో కలిసి వినోద్ కుమార్ విజయన్ నిర్మించడంతో పాటు, దర్శకత్వం వహించారు. శ్రీలక్ష్మి ఫిలిమ్స్‌పై బాపిరాజు ఈ సినిమాని తెలుగులో ఈ నెల 7న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ విజయన్ మాట్లాడుతూ– ‘‘చిన్న వయసులోనే కేరళకి వెళ్లాను. అక్కడ చాలా చిత్రాలను నిర్మించాను.. దర్శకత్వం వహించాను. నేను చేసిన చిత్రాలకు జాతీయ అవార్డులు కూడా వచ్చాయి. ఫాహద్ ఫాజిల్, గోపీ సుందర్ వంటి వారిని ఇండస్ట్రీకి పరిచయం చేశాను. తెలుగులో సినిమా చేయాలని ఎప్పటి నుంచో ఉంది. సాయిరామ్, నేను మంచి స్నేహితులం. తనకి ‘ఒక పథకం ప్రకారం’ కథ నచ్చడంతో ఈ మూవీ చేశాం. సాయిరామ్‌తో పాటు శృతీ సోది, ఆషిమా నర్వాల్, సముద్రఖనిగారి పాత్రలు కూడా ఆకట్టుకుంటాయి’’ అన్నారు.



సతీ లీలావతి వినోదం


• లావణ్యా త్రిపాఠి

లావణ్యా త్రిపాఠి టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం ‘సతీ లీలావతి’. మలయాళ నటుడు దేవ్ మోహన్ మరో లీడ్ రోల్ చేస్తున్నారు. తాతినేని సత్య దర్శకత్వంలో ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ సమర్పణలో ఎమ్. నాగమోహన్‌బాబు, టి.రాజేష్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవం సోమవారం జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి హీరో వరుణ్ తేజ్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత హరీష్ పెద్ది క్లాప్ ఇచ్చారు. తొలి సన్నివేశానికి డైరెక్టర్ టీఎల్‌వీ ప్రసాద్ గౌరవ దర్శకత్వం వహించారు. తాతినేని సత్య మాట్లాడుతూ– ‘‘మనస్ఫూర్తిగా నవ్వుకునే రొమాంటిక్ డ్రామా ‘సతీ లీలావతి’. అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించే అంశాలతో తెరకెక్కుతోంది. సోమవారం నుంచే రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభిస్తున్నాం’’ అని తెలిపారు. ‘‘ఈ స్క్రిప్ట్ వినగానే నేటి తరం ఆడియన్స్‌కు కనెక్ట్ అయ్యేలా ఈ సినిమా ఉంటుందనిపించింది’’ అన్నారు నిర్మాతలు ఎమ్. నాగమోహన్ బాబు, టి. రాజేష్.

తండేల్ స్వచ్ఛమైన ప్రేమకథ


– బన్నీ వాసు

‘‘తండేల్’ మూవీ యాభై శాతం ఫిక్షన్ అయితే యాభై శాతం నాన్ ఫిక్షన్. రాజు, సత్య అనే ఫిక్షనల్ క్యారెక్టర్స్‌ని చందు అద్భుతంగా డిజైన్ చేశారు. మా సినిమా గురించి ఒక్కమాటలో చెప్పాలంటే స్వచ్ఛమైన ప్రేమకథ. ఆ లవ్ స్టోరీ ద్వారా వాస్తవ ఘటనలను ప్రేక్షకులకు చూపిస్తున్నాం’’ అని నిర్మాత బన్నీ వాసు చెప్పారు. నాగచైతన్య, సాయి పల్లవి జోడీగా నటించిన చిత్రం ‘తండేల్’. చందు మొండేటి దర్శకత్వం వహించారు. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్‌పై బన్నీ వాసు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 7న విడుదలవుతోంది. ఈ సందర్భంగా బన్నీ వాసు విలేకరులతో మాట్లాడుతూ– ‘‘రచయిత కార్తీక్ రాసిన కథ నా క్లాస్ మేట్ భానుకి నచ్చింది. దీంతో కార్తీక్‌ని నా వద్దకు తీసుకొచ్చాడు.. నాకూ బాగా నచ్చడంతో కథ వినమని చందూగారికి చెప్పాను. ఆయనకి కూడా నచ్చడంతో చాలా పరిశోధన చేసి, పూర్తి కథని డెవలప్ చేశాం. మత్స్యలేశ్యం అనే ఊరు ఆధారంగా తీసుకున్న కథ ‘తండేల్’. ఇక్కడి వారు గుజరాత్ పోర్ట్‌కి చేపల వేటకి వెళుతుంటారు. మెయిన్ లీడర్‌ని తండేల్ అంటారు. అలా మా మూవీకి ‘తండేల్’ టైటిల్ పెట్టాం. ఈ చిత్రంలో రాజు పాత్ర కోసం నాగచైతన్య మౌల్డ్ అయిన విధానం అద్భుతం. ఈ చిత్రం కథ నాగార్జునగారికి బాగా నచ్చిందని చైతన్యగారు చెప్పారు. సాయి పల్లవి కూడా చైతన్యకి మ్యాచ్ అయ్యేలా నటించారు. ‘నమో నమఃశ్శివాయ..’ పాటలో చైతన్య, సాయి పల్లవి డ్యాన్స్ థియేటర్స్‌లో పూనకం తెప్పిస్తుంది. అరవింద్‌గారు ‘తండేల్’ చూసి, విజయంపై చాలా నమ్మకంగా ఉన్నారు. అందుకే ప్రమోషన్స్‌లో చాలా ఉత్సాహంగా, ఎంజాయ్‌మెంట్‌గా కనిపిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం ఇప్పటికే బ్లాక్ బస్టర్ అయింది. శ్యామ్‌దత్‌గారి విజువల్స్ అద్భుతంగా ఉంటాయి’’ అని తెలిపారు.

మహిషాసుర మర్దిని


• మిథాలి, అర్చన

అర్చనా శాస్త్రి, మిథాలీ చౌహాన్, వినోద్ అల్వా, ‘కాలకేయ’ ప్రభాకర్, ‘బలగం’ సంజయ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘కర్మస్థలం’. రాకీ షెర్మన్ దర్శకత్వంలో రాయ్ ఫిల్మ్స్‌పై శ్రీనివాస్ సుబ్రహ్మణ్య నిర్మించారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్ రిలీజ్‌లో అర్చన మాట్లాడుతూ–‘‘మహిషాసుర మర్దిని కాన్సెప్ట్‌తో ఈ మూవీ తెరకెక్కింది. ఈ సినిమాకు నాకు చాలా ప్రత్యేకం’’ అన్నారు. ‘‘వీఎఫ్ఎక్స్ వల్ల ఈ చిత్రం షూటింగ్ ఆలస్యం అయింది’’ అని తెలిపారు రాకీ షెర్మన్. ‘‘ఈ మూవీ పెద్ద హిట్ అవుతుంది’’ అన్నారు శ్రీనివాస్ సుబ్రహ్మణ్య. సంగీత దర్శకుడు ఎంఎల్ రాజా, నటులు ‘దిల్’ రమేష్, ‘బలగం’ సంజయ్ పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
319	121
77,186	23,361

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

నాస్‌డాక్	19,399	▽	239
డోజోన్స్	44,373	▽	172
ఎఫ్‌టీఎస్ఈ 100	8,584	▽	91
డాక్స్	21,428	▽	304
షాంఘై	3,251	▽	2
నికాయ్	38,520	▽	1052

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (24 క్యారెట్లు)	81,740
బంగారం (22 క్యారెట్లు)	77,850
వెండి (కిలో)	1,07,000

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.05	87.07
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.20	108.00
€	యూరో	ఎస్‌బీఐ	88.77	91.39
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.62	55.98
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.19	55.39
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	60.95	65.62
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.13	23.69
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.19	23.74
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.01	12.83

పెట్టుబడి బంగారమే!

1971 నుంచి వార్షికంగా 8 శాతం ప్లస్



- ఈక్విటీలతో సమానంగా రిటర్నులు
- ద్రవ్యోల్బణం, బాండ్లను మించి పరుగులు
- కమోడిటీలతో పోల్చితే నిలకడైన రాబడి
- ఇటీవల ప్రధాన కరెన్సీలను మించిన స్పీడ్

తరతరాలుగా ప్రపంచ దేశాల ప్రజలను, కేంద్ర బ్యాంకులను ఆకర్షిస్తున్న అయస్కాంతం పసిడి! గత ఐదు దశాబ్దాలకుపైగా చరిత్రను తీసుకుంటే పసిడి తళతళలు అర్థమవుతాయ్. 1971 నుంచి చూస్తే బంగారం ప్రతీ ఏటా ఈక్విటీలతో సమానంగా సగటున 8 శాతం రిటర్నులు అందించింది!! ఈ బాటలో ఇతర కమోడిటీలతో పోల్చితే నిలకడను చూపుతూ బలాన్ని ప్రదర్శించడం విశేషం.

గత ఐదు దశాబ్దాలలో బంగారం ధరలు వార్షిక పద్ధతిన 8 శాతం చొప్పున పుంజుకున్నాయి. అంటే ఇటీవల అత్యంత ఆకర్షణీయంగా మారిన ఈక్విటీలతో సమానంగా లాభపడ్డాయి. ఇదే సమయంలో బాండ్లతో పోలిస్తే అధిక రాబడి అందించాయి. ఈ బాటలో గత రెండు దశాబ్దాలను పరిగణిస్తే అంటే గత 5, 10, 15, 20 ఏళ్లలో సైతం వీటి ధరలు పలు ఇతర ఆస్తులకంటే మెరుగ్గా రాణించాయి. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్(డబ్ల్యూజీసీ) మదింపు ప్రకారం బంగారం ఒక వ్యూహాత్మక ఆస్తి! యూఎస్ డాలర్- గోల్డ్ కన్వర్టిబిలిటీని రద్దు చేసిన 1971 నుంచి చూస్తే యూఎస్‌తోపాటు ప్రపంచ వినియోగ ధరల ద్రవ్యోల్బణ ఇండెక్సు(సీపీఐ)లను సైతం బంగారం అధిగమించింది.

మూలధన వృద్ధి

ద్రవ్యోల్బణం 2–5 శాతం మధ్య నమోదైన గత కాలాన్ని లెక్కలోకి తీసుకుంటే సగటున పసిడి 8 శాతం చొప్పున దౌడు తీసింది. వెరసి దీర్ఘకాలానికి ఈ విలువైన లోహం మూలధనాన్ని పరిరక్షించడమేకాకుండా పెట్టుబడి వృద్ధికీ దోహదం చేసింది. అంటే అటు పెట్టుబడి సాధనంగా.. ఇటు విలాసవంత వస్తువుగా కూడా మెరిసింది! వివిధ ఈక్విటీ ఇండెక్సులు, కమోడిటీలు, ఇతర ప్రత్యామ్నాయ ఆస్తులతో పోలిస్తే వివిధ మార్గాలలో బంగారానికి పుడుతున్న డిమాండ్ కారణంగా కొన్ని దశాబ్దాలుగా నిలకడను ప్రదర్శిస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రపంచంలోని అన్ని ప్రధాన కరెన్సీలు, కమోడిటీలతో మారకాన్ని పరిగణించినా పసిడిది పైచేయే! ఈ బాటలో ఇటీవల చాలా ప్రధాన కరెన్సీలతో పోలిస్తే మెరుగైన వృద్ధిని అందుకుంది.

కారణాలున్నాయ్..

నిజానికి బంగారాన్ని గనుల నుంచి వెలికి తీస్తారు. అయితే గత రెండు దశాబ్దాలలో గోల్డ్ మైనింగ్ వార్షికంగా సగటున 1.7 శాతమే పెరగడం ధరలకు రెక్కలిస్తోంది. కాగా.. డబ్ల్యూజీసీ రీసెర్చ్ ప్రకారం ప్రతిద్రవ్యోల్బణ(డిఫ్లేషన్) పరిస్థితుల్లోనూ పసిడి మెరుగ్గానే రాణించింది. చౌక వడ్డీ రేట్లు, నీరసించిన వినియోగం, బలహీనపడిన పెట్టుబడులు, ఆర్థిక ఒత్తిళ్లు సైతం యెల్లో మెటల్‌కు డిమాండును పెంచడం గమనార్హం! 2008లో తలెత్తిన ప్రపంచవ్యాప్త ఆర్థిక సంక్షోభం, తిరిగి 2020లో కరోనా మహమ్మారి వ్యాప్తి కారణంగా పలు దేశాలు సరళతర పరపతి విధానాలను అవలంబించాయి. ద్రవ్య లభ్యత(లిక్విడిటీ)ను భారీగా పెంచాయి. ఓవైపు కరెన్సీలు పతనంకావడం, కొనుగోలు శక్తి క్షీణించడం వంటి పరిస్థితుల్లో రక్షణ(హెడ్జింగ్)గా కేంద్ర బ్యాంకులు, ఇతర ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ బంగారంలో మదుపు చేశాయి.

– సాక్షి, బిజినెస్ డెస్క్

ఒకే ఒక్కటి

ప్రపంచ దేశాలను కుదిపేసిన సబ్‌ప్రైమ్ సంక్షోభ కాలంలో ఈక్విటీలు, హెడ్జ్ ఫండ్స్, రియల్టీ, పలు కమోడిటీలు, ఇతర రిస్క్ ఆస్తులు విలువలో పతనమయ్యాయి. అయితే బంగారం మేలిమిగా నిలిచింది. 2007 డిసెంబర్ నుంచి 2009 ఫిబ్రవరి మధ్యకాలంలో పసిడి ధరలు 21 శాతం ఎగశాయి. ఇటీవల ఈక్విటీ మార్కెట్లు పతనబాటలో సాగిన 2020, 2022లోనూ బంగారం ధరలు సానుకూల ధోరణిలోనే సాగాయి. గత కొన్నేళ్లలో ఈక్విటీ మార్కెట్లు బుల్ పరుగు తీస్తున్న నేపథ్యంలోనూ పసిడి పోటీ పడుతోంది.



రూ.85,000 పైకి పసిడి

- 10 గ్రాములకు రూ.400 పెరుగుదల
- ఢిల్లీలో రూ.85,300కు చేరిక




న్యూఢిల్లీ: పసిడి పరుగు కొనసాగుతోంది. సోమవారం ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాములకు మరో రూ.400 బలపడింది. 99.9 స్వచ్ఛత బంగారం రూ.85 వేల మార్క్‌ను దాటేసి రూ.85,300కు చేరుకుంది. రూపాయి బలహీనత, అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న పరిస్థితులు బంగారం ధరలను కొత్త గరిష్టాలకు చేర్చినట్టు ట్రేడర్లు తెలిపారు. రూపాయి ఒక్కరోజే 55 పైసలు పడిపోవడం గమనార్హం. 99.5 శాతం స్వచ్ఛత బంగారం ధర సైతం రూ.400 లాభపడి 10 గ్రాములకు రూ.84,900కు చేరింది. కిలో వెండి ధర రూ.300 పెరుగుదలతో రూ.96,000కు చేరింది. ఎంసీఎక్స్ ఫ్యూచర్స్ మార్కెట్లో ఏప్రిల్ నెల బంగారం కాంట్రాక్టుల ధర 10 గ్రాములకు రూ.461 పెరిగి రూ.82,765కు చేరింది. కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ మాత్రం ఔన్స్‌కు 7.50 డాలర్ల మేర క్షీణించి 2,827 డాలర్లుగా ఉంది.

రూపాయి మరింత క్రాష్..

- మరో 49 పైసల క్షీణత
- 87.11 వద్ద ముగింపు
- డాలరు పటిష్టత, వాణిజ్య యుద్ధ భయాల ఎఫెక్ట్

ముంబై: అమెరికా డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ దాదాపు ప్రతి రోజు సరికొత్త రికార్డు కనిష్టాలకు పడిపోవడం కొనసాగుతోంది. సోమవారం మరో 49 పైసలు క్షీణించి 87 స్థాయిని కూడా దాటేసింది. 87.11 వద్ద క్లోజయ్యింది. కెనడా, మెక్సికో, చైనాపై అమెరికా టారిఫ్‌ల మోత మోగించడమనేది వాణిజ్య యుద్ధాలకు దారి తీస్తుందనే భయాలతో ప్రపంచ మార్కెట్లు క్షీణించడం .. మన రూపాయిపైనా ప్రతికూల ప్రభావం చూపింది. అమెరికా డాలరు పటిష్టంగా ఉండటం, విదేశీ పెట్టుబడులు తరలిపోతుండటం వంటి అంశాల కారణంగా రూపాయి బలహీనంగానే ట్రేడయ్యే అవకాశాలు ఉన్నాయని మిరే అసెట్ షేర్‌ఖాన్ రీసర్చ్ ఆనలిస్ట్ అనుజ్ చౌదరి తెలిపారు. అమెరికా టారిఫ్‌లపై ఆందోళన వల్ల కూడా రూపాయి మీద ఒత్తిడి పెరగవచ్చని వివరించారు. అయితే, రిజర్వ్ బ్యాంక్ గానీ జోక్యం చేసుకుంటే రూపాయి పతనానికి కాస్త బ్రేక్ పడొచ్చని పేర్కొన్నారు. గతేడాది డిసెంబర్ 31న 85.61 వద్ద ఉన్న రూపాయి మారకం విలువ ఈ ఏడాది ప్రారంభమైనప్పటి నుంచి 1.8 శాతం క్షీణించింది.

మార్కెట్ ఆధారితమైనదే..: రూపాయి మారకం విలువ మార్కెట్ ఆధారితంగానే ఉంటుందే తప్ప ప్రభుత్వం జోక్యం చేసుకుని, తగ్గించడమనేది జరగదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, లోక్‌సభకు ఇచ్చిన రాతపూర్వక సమాధానంలో తెలిపారు. డాలర్ ఇండెక్స్, పెట్టుబడుల ప్రవాహాలు, వడ్డీ రేట్లు, క్రూడాయిల్ కదలికలు, కరెంటు అకౌంటు లోటు తదితర జాతీయ, అంతర్జాతీయ అంశాలెన్నో రూపాయిపై ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. రూపాయి క్షీణత వల్ల ఎగుమతులపరంగా పోటీపడేందుకు వీలవుతుందని, ఇది ఎకానమీకి సానుకూలమని చెప్పారు.



జీఆర్‌టీ జ్యువెలర్స్ ‘గోల్డ్ ఎక్స్ఛేంజ్ ఆఫర్’

ముంబై: ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ ‘జీఆర్‌టీ జ్యువెలర్స్’ పాత బంగారు ఆభరణాలను మార్చుకునేందుకు అవకాశాన్ని కల్పిస్తుంది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలో ‘స్వర్ణ అవతారం’, తమిళనాడులో ‘తంగా అవతారం’ పేరుతో కొత్త ఆఫర్ తీసుకొచ్చింది. ఇందులో భాగంగా కస్టమర్లు తమ పాత బంగారాన్ని మార్పిడి చేసుకున్నప్పుడు ప్రతి గ్రాముకు అదనంగా రూ.75లు అందిస్తుంది. ఈ పరిమితకాల ఆఫర్ కేవలం బంగారం ఎక్స్ఛేంజీల్లో మాత్రమే అందుబాటులో ఉంటుంది. ఈ ఆఫర్‌ను కస్టమర్లు వినియోగించుకోవాలని జీఆర్‌టీ జ్యువెలర్స్ ఎండీ జీఆర్ ‘ఆనంద్’ అనంత పద్మనాభన్ తెలిపారు.

మార్కెట్‌కు ట్రంప్ సుంకాల పోటు

- అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూలతలు
- రూపాయి భారీ కోత ప్రభావం
- అరశాతం పతనమైన సూచీలు
- ఒక్క రోజులో రూ.4.29 లక్షల కోట్ల ఆవిరి



ముంబై: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కెనడా, మెక్సికో, చైనాలపై దిగుమతి సుంకాలు పెంచుతూ ఆదేశాలు జారీ చేయడంతో సోమవారం దేశీయ స్టాక్ మార్కెట్ అర శాతం నష్టపోయింది. దేశీయ కరెన్సీ రూపాయి భారీ కోత, అధిక వెయిటేజీ రిలయన్స్ (–1.50%), ఎల్‌అండ్‌టీ (–4.50%) క్షీణతలూ ప్రతికూల ప్రభావం చూపాయి. సెన్సెక్స్ 319 పాయింట్లు నష్టపోయి 77,186 వద్ద నిలిచింది. దీంతో ఈ సూచీ 5 రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడినట్లైంది. నిఫ్టీ 121 పాయింట్లు క్షీణించి 23,361 వద్ద నిలిచింది. వాణిజ్య యుద్ధ భయాలతో ఆసియా మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయమే నష్టాల్లో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 750 పాయింట్లు క్షీణించి 76,756 వద్ద, నిఫ్టీ 260 పాయింట్లు కుప్పకూలి 23,222 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. అయితే మిడ్ సెషన్ నుంచి కన్జూమర్ డ్యూరబుల్, ఐటీ, ఫార్మా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. దీంతో సూచీలు కొంతమేర నష్టాలు భర్తీ చేసుకోగలిగాయి.

→ క్యాపిటల్ గూడ్స్, ఇండస్ట్రియల్స్, విద్యుత్, యుటిలిటీస్, ఆయిల్‌అండ్‌గ్యాస్, మెటల్ షేర్లు భారీ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 2%, మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఒక శాతం చొప్పున నష్టపోయాయి.

→ మార్కెట్ పతనంతో రూ.4.29 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. బీఎస్ఈలో మొత్తం కంపెనీల మార్కెట్ విలువ రూ.419 లక్షల కోట్లకు తగ్గింది.

ప్రపంచ మార్కెట్లు డీలా

ట్రంప్ టారిఫ్ దాడికి ప్రతిగా తాము కూడా టారిఫ్‌లు పెంచుతామని కెనడా, మెక్సికో ప్రకటించడంతో వాణిజ్య యుద్ధ భయాలు మరింత తీవ్రమయ్యాయి. ఆసియాలో జపాన్, తైవాన్, కొరియా సూచీలు 3.50% క్షీణించాయి. ఇండోనేషియా, సింగపూర్, హాంగ్‌కాంగ్ దేశాలు 2–0.5% పతనమయ్యాయి. యూరప్ మార్కెట్లు 1% నష్టపోయాయి. అమెరికా సూచీలు నాస్‌డాక్ 1%, ఎస్‌అండ్‌పీ అర శాతం, డోజోన్స్ పావుశాతం నష్టాలతో ట్రేడవుతున్నాయి.

‘సాక్షి ప్లస్’ ఈ-పేపర్‌లో ..

షార్ట్ వీడియో ప్లాట్‌ఫామ్‌ల జోరు	5న భారత్‌కు చాట్ జీపీటీ ఆల్ట్‌మన్

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో 40 ఫ్యాకల్టీ పోస్టులు

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్.. వివిధ విభాగాల్లో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 40.
- **విభాగాలు:** మ్యాథ్స్, కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, కెమిస్ట్రీ, ప్లాంట్ సైన్స్, యానిమల్ బయాలజీ, బయోకెమిస్ట్రీ, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, మెడికల్ సైన్స్, న్యూరల్ కాగ్నిటివ్ సైన్సెస్, ఫిలాసఫీ, ఉర్దూ, అప్లైడ్ లింగ్విస్టిక్స్ అండ్ ట్రాన్స్‌లేషనల్ స్టడీస్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, కమ్యూనికేషన్స్, డాన్స్, థియేటర్ ఆర్ట్స్.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ, మాస్టర్స్ డిగ్రీ, నెట్, సెట్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 65 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు ప్రొఫెసర్‌కు రూ.1,44,200 నుంచి రూ.2,18,200, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,31,400 నుంచి రూ.2,17,100, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.57,700 నుంచి రూ.1,82,400.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 20.02.2025.
- **వెబ్‌సైట్:** https://uohyd.ac.in

ఎన్‌టీపీసీ లిమిటెడ్‌లో 475 ఇంజనీరింగ్ ఎగ్జిక్యూటివ్ ట్రైనీ పోస్టులు

న్యూఢిల్లీలోని ఎన్‌టీపీసీ లిమిటెడ్.. ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన గేట్-2024 స్కోర్ ద్వారా ఇంజనీరింగ్ ఎగ్జిక్యూటివ్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 475.
- **విభాగాల వారీగా ఖాళీలు:** ఎలక్ట్రికల్–135, మెకానికల్–180, ఎలక్ట్రానిక్స్ /ఇన్‌స్ట్రుమెంటేషన్–85, సివిల్–50, మైనింగ్–25.
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ/ఇన్‌స్టిట్యూట్ నుంచి ఇంజనీరింగ్ లేదా టెక్నాలజీ/ఏఎంఐఈలో 65 శాతం మార్కులతో ఫుల్ టైం బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి(ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులు 55% శాతం మార్కులతో) పాటు గేట్-2024 స్కోర్ తప్పనిసరి ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి రూ.1,40,000.
- **వయసు:** 13.02.2025 నాటికి 27 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** గేట్–2024 స్కోర్, షార్ట్‌లిస్ట్, సర్టిఫికేట్‌ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.02.2025
- **వెబ్‌సైట్:** https://ntpc.co.in

ఎన్ఐఆర్‌డీపీఆర్, హైదరాబాద్‌లో 11 ఫ్యాకల్టీ పోస్టులు

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్(ఎన్ఐఆర్‌డీపీఆర్).. ఒప్పంద ప్రాతిపదికన స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ పంచాయతీరాజ్‌లో స్కూల్ లెవల్ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 11.
- **పోస్టుల వివరాలు:** అసోసియేట్ ప్రొఫెసర్–02, అసిస్టెంట్ ప్రొఫెసర్–09.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం కలిగి ఉండాలి.
- **వయసు:** అసోసియేట్ ప్రొఫెసర్‌కు 50 ఏళ్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,20,000, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.2,50,000.
- **ఎంపిక విధానం:** దరఖాస్తుల షార్ట్‌లిస్టింగ్, రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.02.2025.
- **వెబ్‌సైట్:** http://career.nirdpr.in

సివిల్స్‌కు సన్నద్ధమవ్వండిలా!



సివిల్స్ ప్రిలిమ్స్-2025

- సివిల్స్ 2025 నోటిఫికేషన్‌ను విడుదల చేసిన యూపీఎస్సీ
- 23 సర్వీసుల్లో 979 పోస్ట్‌ల భర్తీకి ఎంపిక ప్రక్రియ
- మే 25న తొలి దశ ప్రిలిమినరీ పరీక్ష
- దరఖాస్తు విధానంలో కొత్త నిబంధనలు
- సబ్జెక్ట్ నాలెడ్జ్, సమకాలీన పరిజ్ఞానంతో విజయం

సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్.. దేశంలో ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి ఉన్నత స్థాయి పోస్టుల భర్తీకి యూపీఎస్సీ ప్రతిఏటా నిర్వహించే ఎంపిక ప్రక్రియ! సివిల్స్ నోటిఫికేషన్ కోసం ఏటా లక్షల మంది ఎదురు చూస్తుంటారు. వీరంతా తమ కసరత్తుకు పదును పెట్టుకోవాల్సిన సమయం ఆసన్నమైంది! కారణం.. సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2025 నోటిఫికేషన్ విడుదల కావడమే!! మూడంచెల ఎంపిక ప్రక్రియలో.. తొలిదశ ప్రిలిమ్స్‌ను మే 25న నిర్వహించనున్నట్లు యూపీఎస్సీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో.. సివిల్స్ నోటిఫికేషన్ సమాచారం, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..

23 సర్వీసులు.. 979 పోస్ట్‌లు

సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్–2025 ద్వారా ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్ సహా మొత్తం 23 సర్వీసుల్లో 979 పోస్ట్‌లను భర్తీ చేయనున్నారు. అయితే గత రెండేళ్లతో పోల్చితే ఈ ఏడాది పోస్ట్‌ల సంఖ్య తగ్గడం గమనార్హం. 2024 నోటిఫికేషన్‌లో 1056 పోస్ట్‌లు, 2023లో 1105 పోస్ట్‌లు ఉండగా.. ఈ ఏడాది ఆ సంఖ్య 979కు తగ్గింది.

అర్హతలు

- బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయసు:** 2025 ఆగస్ట్ 1 నాటికి 21–32 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

దరఖాస్తు నిబంధనలు

- సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్–2025కు సంబంధించి దరఖాస్తు విధానంలో కొత్త నిబంధనలు పేర్కొన్నారు. యూపీఎస్సీ తాజా నిబంధనల ప్రకారం–అభ్యర్థులు ప్రిలిమ్స్ దరఖాస్తుతోపాటే అన్ని అవసరమైన డాక్యుమెంట్లు (అర్హతల సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్స్) అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.
- గత ఏడాది వరకు బ్యాచిలర్ డిగ్రీ ఫైనల్ విద్యార్థులు.. ప్రిలిమ్స్‌లో విజయం సాధించాక.. మెయిన్స్‌కు దరఖాస్తు చేసుకునే సమయంలోనే విద్యార్హతల సర్టిఫికెట్ ఇవ్వాల్సిన విధంగా నిబంధన ఉండేది. కాని ఈ ఏడాది నుంచి ఆ సర్టిఫికెట్‌ను మెయిన్స్‌లో విజయం సాధించాక సమర్పించేలా సడలింపు కల్పించారు.

ప్రిలిమ్స్ పరీక్ష విధానం

- సివిల్స్ ఎంపిక ప్రక్రియలో తొలి దశ ప్రిలిమినరీ పరీక్షను రెండు పేపర్లలో నాలుగు వందల మార్కులకు నిర్వహిస్తారు. అవి.. పేపర్–1 జనరల్ స్టడీస్ 100 ప్రశ్నలు – 200 మార్కులకు, అదేవిధంగా పేపర్–2 ఆప్టిట్యూడ్ టెస్ట్ 80 ప్రశ్నలు–200 మార్కులకు ఉంటాయి. ప్రిలిమినరీ ఎగ్జామ్ పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో మల్టిపుల్ ఛాయిస్ కొశ్చన్స్‌తో నిర్వహిస్తారు.
- ప్రిలిమినరీ పరీక్షలో పేపర్–1(జనరల్ స్టడీస్)లో నిర్దిష్ట కటాఫ్ మార్కులను సాధించిన వారిని రెండో దశ మెయిన్స్ ఎగ్జామినేషన్‌కు ఎంపిక చేస్తారు. పేపర్–2లో కనీసం 33 శాతం మార్కులు సాధించాలనే నిబంధన ఉంది. ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కు ఒక్కో పోస్ట్‌కు 12 లేదా 13 నిష్పత్తిలో ఎంపిక చేస్తారు.

మెయిన్ ఎగ్జామ్

- ఎంపిక ప్రక్రియ రెండో దశ మెయిన్ ఎగ్జామినేషన్‌లో రెండు లాంగ్వేజ్ పేపర్లు, ఒక జనరల్ ఎస్సే పేపర్, నాలుగు జనరల్ స్టడీస్ పేపర్లు, రెండు ఆప్షనల్ పేపర్లు ఉంటాయి. అర్హత పేపర్లయిన లాంగ్వేజ్ పేపర్లలో పొందిన మార్కులను తుది జాబితా రూపకల్పనలో పరిగణనలోకి తీసుకోరు. కానీ వీటిలో తప్పనిసరిగా కనీస అర్హత మార్కులు సాధిస్తేనే మెయిన్ ఎగ్జామ్‌లోని మిగతా పేపర్లను మూల్యాంకన చేస్తారు.
- ఇండియన్ లాంగ్వేజ్(300 మార్కులు), ఇంగ్లిష్ పేపర్లు(300 మార్కులు) అర్హత పేపర్లు. ఇండియన్ లాంగ్వేజ్‌కు సంబంధించి 21 భాషల్లో పరీక్ష రాయొచ్చు. అర్హత పేపర్‌లలో తప్పనిసరిగా 25 శాతం మార్కులు సాధించాలి.
- మొత్తం ఏడు పేపర్లలో ఒక్కో పేపర్‌కు 250 మార్కులు చొప్పున మొత్తం 1750 మార్కులకు పూర్తి డిస్క్రిప్టివ్ విధానంలో మెయిన్ ఎగ్జామినేషన్ ఉంటుంది.
- మెయిన్ ఎగ్జామ్ తర్వాత చివరగా పర్సనాలిటీ టెస్ట్ నిర్వహిస్తారు. మెయిన్ పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు ఇద్దరు లేదా ముగ్గురిని (1:2 లేదా 1:3 నిష్పత్తిలో) పర్సనాలిటీ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు. పర్సనాలిటీ టెస్ట్‌కు 275 మార్కులు కేటాయించారు.

సిలబస్‌పై అవగాహన

- ప్రిలిమ్స్‌కు హాజరయ్యే అభ్యర్థులు తొలుత నిర్దేశిత సిలబస్‌ను క్షుణ్నంగా పరిశీలించాలి. దీంతోపాటు గత ప్రశ్న పత్రాలను విశ్లేషించాలి. తద్వారా పరీక్ష ట్రెండ్‌తోపాటు తమ వ్యక్తిగత సామర్థ్య స్థాయిపై అవగాహన వస్తుంది. ప్రిపరేషన్ పరంగా ప్రధానంగా దృష్టి సారించాల్సిన అంశాల గురించి తెలుస్తుంది.
- సిలబస్‌ను పరిశీలించిన తర్వాత ప్రామాణిక మెటీరియల్ సేకరణపై దృష్టి పెట్టాలి. ఒక్కో సబ్జెక్ట్‌కు నాలుగైదు పుస్తకాలు చదివే బదులు ఒకట్రెండు ప్రామాణిక పుస్తకాలకు పరిమితమవడం మేలు.

మారుతున్న ప్రశ్నల శైలి

గత అయిదేళ్ల సివిల్స్ ప్రిలిమ్స్ ప్రశ్న పత్రాలను పరిశీలిస్తే.. ఏటేటా ప్రశ్నలు అడుగుతున్న శైలిలో మార్పు కనిపిస్తోంది. స్టేట్‌మెంట్ ఆధారిత ప్రశ్నలు, అసెర్షన్ టైప్ ప్రశ్నలకు ప్రాధాన్యం పెరిగింది. గత నాలుగేళ్లలో కరెంట్ అఫైర్స్ ప్రశ్నల విషయంలోనూ మార్పు కనిపిస్తోంది. డైరెక్ట్ కొశ్చన్స్ స్థానంలో ఇన్‌డైరెక్ట్ కొశ్చన్స్ సంఖ్య ఏటేటా పెరుగుతోంది. ముందుగా అంచనా వేయలేని విధంగా ఆయా అంశాల నుంచి ప్రశ్నల సంఖ్య ఉంటోంది.

కరెంట్ అఫైర్స్

గత ప్రశ్నల శైలిని పరిశీలిస్తే.. కరెంట్ అఫైర్స్‌పై మరింత ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అవసరముందనే విషయం అర్థమవుతోంది. ఎందుకంటే.. కోర్ సబ్జెక్ట్‌లకు సంబంధించి కూడా సమకాలీన అంశాలు సమ్మిళితమైన ప్రశ్నలు అడుగుతున్నారు. గతేడాది కరెంట్ అఫైర్స్ ప్రశ్నల్లో పాలిటీ, ఎకానమీ, జాగ్రఫీ తదితర కోర్ సబ్జెక్టుల సమ్మిళితంగా ప్రశ్నలు ఎదురయ్యాయి.

టైమ్ మేనేజ్‌మెంట్

ప్రిపరేషన్ పరంగా అభ్యర్థులు కచ్చితంగా పాటించాల్సిన వ్యూహం.. టైమ్ మేనేజ్‌మెంట్. ప్రతి రోజు కనీసం ఎనిమిది గంటలు ప్రిపరేషన్ సాగించే విధంగా సమయ ప్రణాళిక రూపొందించుకోవాలి. అదే విధంగా ప్రతి రోజు అన్ని సబ్జెక్ట్‌లను చదవడమనే విధానం అనుసరించాలి.ఒక సబ్జెక్ట్ పూర్తయ్యాక మరో సబ్జెక్ట్ వైపు అనే విధానం ఏ మాత్రం సరికాదు.దీనివల్ల కొన్నిసార్లు సిలబస్ అంశాలన్నింటినీ పూర్తి చేయడంలో ఇబ్బందులు ఎదురుకావచ్చు.

పేపర్-2 అప్రమత్తంగా

సివిల్స్ ప్రిలిమ్స్ అభ్యర్థులు పేపర్–2(ఆప్టిట్యూడ్ టెస్ట్) విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. వాస్తవానికి ఈ పేపర్‌ను అర్హత పరీక్షగానే పేర్కొన్నప్పటికీ.. 33 శాతం మార్కులు సాధిస్తేనే పేపర్–1(జనరల్ స్టడీస్) మూల్యాంకన చేస్తారు. పేపర్–2లోని రీడింగ్ కాంప్రహెన్షన్, న్యూమరికల్ ఎబిలిటీ, డెసిషన్ మేకింగ్ అంశాలపై దృష్టి పెట్టాలి.

డిస్క్రిప్టివ్ అప్రోచ్

ప్రిలిమినరీ పరీక్ష రెండు పేపర్లలో ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. అభ్యర్థులు డిస్క్రిప్టివ్ విధానంలో చదవడం మేలు చేస్తుంది. దీనివల్ల ఒక విషయంపై అన్ని కోణాల్లో అవగాహన లభిస్తుంది. ఇది మెయిన్స్ ప్రిపరేషన్‌ను సులభం చేస్తుంది. ఒక అంశానికి సంబంధించి ప్రామాణిక మెటీరియల్‌లో ఉండే అన్ని కోణాలపై స్పష్టత ఏర్పరచుకోవాలి.

మెయిన్స్‌తో అనుసంధానం

మెయిన్స్‌లో ఆప్షనల్ సబ్జెక్ట్ పేపర్లు, ఎథిక్స్ పేపర్ మినహా మిగతా అన్ని పేపర్లు ప్రిలిమ్స్ జనరల్ స్టడీస్‌లో నిర్దేశించిన విభాగాలకు సంబంధించినవే. కాబట్టి అభ్యర్థులు ప్రిలిమ్స్ సిలబస్‌ను మెయిన్స్‌తో అనుసంధానం చేసుకుంటూ చదవాలి. ఆయా టాపిక్స్ నేపథ్యంతోపాటు సమకాలీన పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి. దీంతోపాటు ప్రిలిమ్స్ పరీక్ష తేదీకి నెల రోజుల ముందు నుంచి అభ్యర్థులు పూర్తిగా రివిజన్‌కే సమయం కేటాయించే విధంగా టైమ్ ప్లాన్ రూపొందించుకోవాలి. ఈ సమయంలో మాక్ టెస్ట్‌లు, మోడల్ టెస్ట్‌లకు హాజరు కావాలి.

115-120 లక్ష్యంగా

సివిల్స్ ప్రిలిమ్స్ అభ్యర్థులు పేపర్ 1లో కనీసం 115 నుంచి 120 మార్కులు సాధించే విధంగా కృషి చేయాలి. తద్వారా మెయిన్స్‌కు ఎంపికయ్యే అవకాశాలు మెరుగవుతాయి,

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2025, ఫిబ్రవరి 11
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం:** ఫిబ్రవరి 12 నుంచి 18 వరకు
- **ప్రిలిమ్స్ పరీక్ష తేదీ:** 2025, మే 25
- **మెయిన్స్ పరీక్ష తేదీలు:** ఆగస్ట్ 22 నుంచి అయిదు రోజులు
- **వెబ్‌సైట్:** www.upsc.gov.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం– రసాయన శాస్త్రం
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం– పర్యావరణం » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం– జనరల్ ఇంగ్లిష్

క్లుప్తంగా...

అంగన్‌వాడీ కేంద్రాలకు నిధులు పెంచండి

కేంద్రమంత్రి అన్నపూర్ణాదేవికి మంత్రి సీతక్క విజ్ఞప్తి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో అంగన్‌వాడీ కేంద్రాలకు నిధులు పెంచాలని కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖమంత్రి అన్నపూర్ణాదేవికి రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖమంత్రి ధనసరి అనసూయ (సీతక్క) విజ్ఞప్తి చేశారు. సోమవారం ఢిల్లీలో టీజీ ఫుడ్స్ చైర్మన్ ఎం.ఎ ఫహీం, మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్ కాంతి వెస్లీతో కలిసి సీతక్క.. కేంద్రమంత్రిని కలిశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల కోసం అల్పాహార పథకాన్ని అమలు చేసేందుకు అవసరమైన బడ్జెట్ ప్రతిపాదనలను అందజేశారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరాన్ని వివరించారు. ఒక్కో చిన్నారికి రోజుకు అల్పాహారం కోసం రూ.8 ఖర్చయ్యే అవకాశముందని, ఈ పథకం అమలు చేయాలంటే ఏడాదికి రూ.206 కోట్లు ఖర్చు అవుతాయని సీతక్క వెల్లడించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అల్పాహారం పథకం ప్రతిపాదనను అన్నపూర్ణాదేవి ప్రశంసించారు. చిన్నారుల బ్రేక్‌ఫాస్ట్ స్కీంకు కేంద్రం నుంచి సహకారం అందిస్తామని హామీఇచ్చారు.

మార్చి 12 నుంచి పీజీ ఈసెట్ దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: వచ్చే నెల 12వ తేదీ నుంచి ఇంజనీరింగ్ పోస్టుగ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష దరఖాస్తులను ఆన్‌లైన్ విధానంలో స్వీకరిస్తున్నట్టు పీజీఈసెట్ కన్వీనర్ ఎ.అరుణ కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. సెట్ కమిటీ సోమవారం భేటీ అయి ఈమేరకు నిర్ణయం తీసుకుంది. మార్చి 12న నోటిఫికేషన్ ఇస్తారని, అదే నెల 17 నుంచి మే 19 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని, పరీక్ష జూన్ 16 నుంచి 19 వరకు జరుగుతుందని వెల్లడించారు.

మార్చి 6 నుంచి టెన్త్ ప్రీ ఫైనల్స్

సాక్షి, హైదరాబాద్: టెన్త్ విద్యార్థులకు మార్చి 6 నుంచి 15 వరకు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించాలని పాఠశాల విద్య డైరెక్టర్ నర్సింహారెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సైన్స్‌ను ఫిజికల్, బయలాజికల్ పేపర్లుగా విడగొట్టడంతో ఈ పరీక్ష మధ్యాహ్నం 12.15 నుంచి 3.15 వరకు నిర్వహిస్తారన్నారు.

'మూల్యాంకన రెమ్యునరేషన్ వెంటనే ఇప్పించాలి'

సాక్షి, హైదరాబాద్: పదో తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకన రెమ్యునరేషన్ వెంటనే ఇప్పించాలని ప్రభుత్వాన్ని పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు జి.హర్షవర్ధన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం పాఠశాల పరీక్షల విభాగం డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. రెమ్యునరేషన్ గతంలో మాదిరి కాకుండా వెంటనే చెల్లించేలా చూడాలన్నారు.

సమ్మెలో పాల్గొనవద్దంటూ భయపెడుతున్నారు: ఆర్టీసీ జేఏసీ

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ సమ్మెలో పాల్గొనవద్దని కార్మికులను అధికారులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఇటీవల సమ్మె నోటీసు ఇచ్చిన కార్మిక సంఘాల జేఏసీ ఒక ప్రకటనలో ఆరోపించింది. తాము సమ్మె నోటీసు ఇచ్చినప్పటి నుంచి అధికారులు గేట్ మీటింగ్స్ ఏర్పాటు చేసి.. కార్మికులెవరూ సమ్మెకు సిద్ధం కావద్దని బెదిరిస్తున్నారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని జేఏసీ ప్రతినిధులు వెంకన్న, థామస్‌రెడ్డి, బి.యాదయ్య, కె.యాదయ్య, మౌలానా, సురేశ్ పేర్కొన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను పరిష్కరించాలని తాము సమ్మెకు సిద్ధమయ్యామని, దీనికి అధికారులు మద్దతునివ్వాలని కోరారు.

మాటలు ఫుల్లు.. నిధులు నిల్లు: చామల

సాక్షి, హైదరాబాద్: తెలంగాణపై కేంద్రం అంతులేని వివక్ష కారణంగా బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని, రాష్ట్రానికి నయాపైసా కేటాయించకపోవడం బీజేపీ నిర్లక్ష్యానికి నిదర్శనమని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇద్దరు కేంద్రమంత్రులు రాష్ట్రం నుంచి ఉన్నా, నిధులు మాత్రం గుండు సున్నా.. అని ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన గాడిద గుడ్డు అనే పోస్టర్‌ను జతచేసి ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. 'పన్నుల రూపంలో తెలంగాణ, కేంద్రానికి రూపాయి ఇస్తే తెలంగాణకు తిరిగి వస్తుంది 42 పైసలే. తెలంగాణకు చెందిన 58 పైసలను తన ఖాతాలో వేసుకుంటున్న కేంద్రం, రాష్ట్ర డిమాండ్లను మాత్రం బుట్టదాఖలు చేస్తోంది. తెలంగాణకు కొత్త ప్రాజెక్టులు లేవు.. బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రుల మాటలు ఫుల్లు, నిధులు నిల్లు.. బీజేపీ నేతలు కోతల రాయుళ్లు' అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.

హైదరాబాద్‌కు బుల్లెట్ బండి!

హైదరాబాద్-ముంబై మధ్య హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణం

బెంగళూరు వరకు ఈ కారిడార్ విస్తరణ	అలాగే హైదరాబాద్-చెన్నై మధ్య మరో కారిడార్ నిర్మాణం

ఫైనల్ లొకేషన్ సర్వే కోసం టెండర్లు పిలిచిన రైల్వే శాఖ.. కన్సల్టెన్సీ సంస్థ 'రైట్స్' ఆధ్వర్యంలో నోటిఫికేషన్ జారీ

బిడ్ల దాఖలుకు ఫిబ్రవరి 24 వరకు గడువు	బుల్లెట్ రైళ్లతో రెండు-రెండున్నర గంటల్లోనే గమ్యం చేరే అవకాశం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌కు బుల్లెట్ రైలు రానుంది. దేశవ్యాప్తంగా కొన్ని ప్రధాన నగరాలను హైస్పీడ్ రైల్ కారిడార్ (బుల్లెట్ రైలు)తో అనుసంధానించే భారీ ప్రాజెక్టులో కీలక ముందడుగు పడింది. ప్రస్తుతం ముంబై- అహ్మదాబాద్ నగరాల మధ్య బుల్లెట్ రైలు కారిడార్ దాదాపు కొలిక్కి వచ్చిన నేపథ్యంలో, 2051 నాటికి దేశంలో 8 వేల కి.మీ. మేర బుల్లెట్ రైలు కారిడార్ నిర్మించాలన్నది కేంద్ర ప్రభుత్వ ఆలోచన. ఇందుకోసం కేంద్రం నేషనల్ రైల్ ప్లాన్ (ఎన్‌ఆర్‌పీ)ని రూపొందించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే హైదరాబాద్-ముంబై మధ్య 709 కి.మీ. మేర హైస్పీడ్ రైల్ కారిడార్‌ను నిర్మించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. అలాగే దీనికి కొనసాగింపుగా ఆ కారిడార్‌ను హైదరాబాద్ నుంచి బెంగళూరు వరకు విస్తరించాలని రైల్వే శాఖ భావిస్తోంది. మరోవైపు మైసూరు-చెన్నై మధ్య ప్రతిపాదించిన బుల్లెట్ రైలు కారిడార్‌ను హైదరాబాద్ వరకు విస్తరించాలన్నది తదుపరి యోచనగా చెపుతున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై కారిడార్‌లకు సంబంధించి ఫైనల్ లొకేషన్ సర్వే కోసం రైల్వే శాఖ టెండర్లు ఆహ్వానించింది. నేషనల్ రైల్ ప్లాన్‌కు కన్సల్టెన్సీగా వ్యవహరిస్తున్న 'రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనమిక్ సర్వీస్ లిమిటెడ్ (రైట్స్)' విభాగం జనవరి 31న దీనికి సంబంధించి ఈ-టెండర్‌లు పిలిచింది. ఈనెల 24వ తేదీలోగా బిడ్లను దాఖలు చేయాలని పేర్కొంది. కాగా, 8 నెలల్లో సర్వే నివేదిక అందజేయాలని రైట్స్ సూచించింది. ఇందుకోసం రూ.33 కోట్లు కేటాయించింది.



ఏయే నివేదికలు ఇవ్వాలంటే..

ఈ టెండర్ దక్కించుకునే సంస్థలు ఆధునిక పద్ధతిలో ఫైనల్ లొకేషన్ సర్వే నిర్వహించాల్సి ఉంటుంది. ఇందుకు అత్యాధునిక లైడార్ సర్వే జరపాలి. ఈ కారిడార్‌ను ఏయే ప్రాంతాల మీదుగా నిర్మిస్తే బాగుంటుందో వివరించే ఫైనల్ అలైన్‌మెంటు డిజైన్, ఈ రైలు ద్వారా ఎంతమంది ప్రయాణించే వీలుంటుందో అంచనా వేసే ట్రాఫిక్ స్టడీ రిపోర్టు, ఆదాయం ఎంత వస్తుందో తెలిపే ఆర్‌ఓఆర్ అంచనా, ఈపీసీ డాక్యుమెంటు.. మొత్తంగా అంచనా వ్యయంతో కూడిన డీపీఆర్ అందించాలని టెండర్ డాక్యుమెంటులో రైట్స్ సంస్థ ప్రకటించింది.

జపాన్ సహకారంతో ముంబై-అహ్మదాబాద్ కారిడార్..

ప్రస్తుతం ముంబై-అహ్మదాబాద్ మధ్య జపాన్ సంస్థ సాంకేతిక, ఆర్థిక సహకారంతో హైస్పీడ్ కారిడార్ నిర్మిస్తున్నారు. ఆ మార్గంలో జపాన్ తయారీ బుల్లెట్ రైలును నడపనున్నారు. దాని వేగం గంటకు 320 కి.మీ. ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆ వేగానికి తగ్గట్టుగా ట్రాక్‌ను రూపొందిస్తున్నారు. ఇది పూర్తిగా ఎలివేటెడ్ కారిడార్. ఇదే తరహాలో తదుపరి లక్నో, మథుర, అయోధ్య, ప్రయాగరాజ్, ఆగ్రా, ఇటావా, రాయ్‌బరేలి, భాదోని మీదుగా ఢిల్లీ-వారణాసి మధ్య మరో కారిడార్ నిర్మించనున్నారు. దీనికి సంబంధించిన డీపీఆర్‌ను కన్సల్టెన్సీ సంస్థ ఇప్పటికే సమర్పించింది. దీంతోపాటు మరో 8 వేల కి.మీ. కారిడార్‌ను సిద్ధం చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఇందులోనే హైదరాబాద్-ముంబై, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై, వారణాసి-పట్నా, అమృత్‌సర్-జమ్మూ, పట్నా-గువహటి, చెన్నై-బెంగళూరు-మైసూరు తదితరాలున్నాయి. ఇదిలా ఉండగా హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై కారిడార్లను ఎలివేటెడ్, భూగర్భ మార్గాల్లో నిర్మిస్తారు.

తక్కువ సమయంలోనే గమ్యస్థానానికి..

హైదరాబాద్-బెంగళూరు మధ్య సుమారు 618 కి.మీ. దూరం ఉండగా, సాధారణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో గమ్యం చేరేందుకు సగటున 11 గంటల సమయం పడుతుంది. అదే వందేభారత్‌లో ఎనిమిదిన్నర గంటలు పడుతుంది.

ప్రతిపాదిత హైస్పీడ్ కారిడార్‌లో అయితే కేవలం 2 గంటలలోనే గమ్యం చేరుకోవచ్చని నిపుణులు చెపుతున్నారు. ఈ కారిడార్‌లో బయలుదేరే బుల్లెట్ రైలు.. షాద్‌నగర్-మహబూబ్‌నగర్-గద్వాల-కర్నూలు-గుంతకల్- అనంతపురం-ధర్మవరం-హిందూపూర్-యలహంకల మీదుగా బెంగళూరు చేరుకుంటుంది.

కాగా, హైదరాబాద్-చెన్నైల మధ్య సుమారు 757 కి.మీ. దూరం ఉంది. సాధారణ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో గమ్యం చేరడానికి 15 గంటల సమయం పడుతుంది. అదే హైస్పీడ్ కారిడార్‌లో వెళితే రెండున్నర గంటల లోపే చేరుకునే వీలుంటుందని అంటున్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తి అయ్యేందుకు 10 నుంచి 13 సంవత్సరాల సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు. అయితే ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించటం ద్వారా ఆ సమయాన్ని తగ్గించాలని ఇంజనీరింగ్ నిపుణులు యోచిస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల నుంచి మరిన్ని వందేభారత్‌లు

- కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరగలేదు
- కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ, ఏపీ నుంచి మరిన్ని వందే భారత్ రైళ్లు నడిపిస్తామని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. సోమవారం ఢిల్లీలోని రైల్వే ప్రధాన కార్యాలయంలో అశ్విని వైష్ణవ్ విలేకరులతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా కొత్తగా 100 నమో భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే నడుస్తున్న వందే, అమృత్, నమోభారత్ రైళ్లు 100 శాతం ఆక్యుపెన్సీతో మంచి ఫలితాలు సాధిస్తున్నాయన్నారు. ప్రస్తుతం తెలంగాణలో 7 జిల్లాల మీదుగా 5 వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయని పేర్కొన్నారు. రైల్వే ప్రాజెక్టుల విషయంలో తెలంగాణకు ఎలాంటి అన్యాయం జరగలేదని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. 2026 నాటికి దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం రైల్వే నెట్‌వర్క్‌లో రైలు ప్రమాదాల నివారణ కోసం ఆటోమేటిక్ రైలు రక్షణ (ఏటీపీ) టెక్నాలజీ 'కవచ్'ను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. సికింద్రాబాద్‌లో 'కవచ్'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. కాజీపేటలో రైల్వే ప్రొడక్షన్ యూనిట్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. కాజీపేట రైల్వే స్టేషన్‌ను మరింత అభివృద్ధి చేస్తున్నామన్న ఆయన.. కొన్ని అనుమతులు రావాల్సిన నేపథ్యంలో పనుల్లో జాప్యం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో రైల్వే లైన్ల విద్యుదీకరణ 100% పూర్తయిందన్నారు. రైల్వే స్టేషన్ల నిర్మాణం, పాతవాటి అభివృద్ధి, కొత్త లైన్ల ఏర్పాటు తదితర పనుల కోసం రూ.41,677 కోట్లు కేటాయించామని, పనుల ప్రాధాన్యతను బట్టి దీనిని తగ్గించడం లేదా పెంచడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో రూ.39,300 కోట్లలో కొత్త రైల్వే ట్రాక్‌లకు సంబంధించి 22 ప్రాజెక్టుల పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. రూ.1,992 కోట్లతో 40 రైల్వే స్టేషన్లను అమృత్ స్టేషన్లుగా అభివృద్ధి చేశామని వివరించారు. సికింద్రాబాద్, హైదరాబాద్ రైల్వే స్టేషన్లలో మొత్తం రూ.1,042 కోట్లతో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. గత పదేళ్లలో తెలంగాణలో రైల్వే అభివృద్ధి కోసం రూ.41,677 కోట్లు కేటాయించామని వివరించారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణలో రైల్వే అభివృద్ధి పనుల కోసం రూ.5,337 కోట్లు కేటాయించిందని, యూపీఏ పాలనతో పోల్చితే ఇది ఆరు రెట్లు ఎక్కువని తెలిపారు. బడ్జెట్‌లో తెలంగాణకు పెద్దఎత్తున కేటాయింపులు చేసినందుకు ప్రధాని మోదీకి ఈ సందర్భంగా కేంద్రమంత్రి ధన్యవాదాలు తెలిపారు.

ఘట్కేసర్-యాదాద్రి ఎంఎంటీఎస్ పనులు సొంత నిధులతోనే..

ద.మ.రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం తన వంతు వాటా నిధులు ఇవ్వటంలో జాప్యం చేసినా.. ఘట్కేసర్-యాదాద్రి ఎంఎంటీఎస్ పనులను రైల్వే శాఖ సొంత నిధులతో పూర్తి చేస్తుందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ పేర్కొన్నారు. రూ.650 కోట్ల అంచనా వ్యయంతో ఈ కారిడార్ పనులు ప్రారంభిస్తున్నట్టు పేర్కొన్నారు. ఎంఎంటీఎస్ రెండో దశకు సంబంధించి రాష్ట్రం తన వంతు వాటా నిధుల్లో రూ.491 కోట్లు బకాయి ఉందని, అయినా ఆ పనులను రైల్వే శాఖ పూర్తి చేసిందన్నారు. కేంద్రప్రభుత్వ సాధారణ బడ్జెట్‌లో దక్షిణ మధ్య రైల్వే కేటాయింపులపై సోమవారం సాయంత్రం రైల్ నిలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాజా బడ్జెట్‌లో తెలంగాణలోని రైల్వే ప్రాజెక్టులకు రూ.5,337 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ.9,417 కోట్లు కేటాయించినట్టు పేర్కొన్నారు. గత బడ్జెట్‌కంటే ఎక్కువ నిధులు కేటాయించినందుకు ఆయన కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో 40 స్టేషన్లను 'అమృత్‌భారత్' కింద ఆధునీకరిస్తున్నామని, ఈ సంవత్సరాంతానికి కొన్ని స్టేషన్ల పనులు పూర్తవుతాయన్నారు.

పెరిగింది రూ.కోటి మాత్రమే: గత బడ్జెట్‌తో పోలిస్తే తెలంగాణకు రైల్వే కేటాయింపుల్లో రూ.కోటి మాత్రమే ఎక్కువగా అందబోతోంది. గతేడాది బడ్జెట్‌లో రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులకు రూ.5,336 కోట్లు కేటాయించగా, తాజా బడ్జెట్‌లో ఆ మొత్తాన్ని రూ.5,337 కోట్లుగా చూపారు. అకోలా-డోన్ డబ్లింగ్, గుంటూరు-బీబీనగర్, భద్రాచలం-డోర్నకల్, మనోహరాబాద్-కొత్తపల్లి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు పెరిగినట్టు సమాచారం.

డ్రగ్స్ రహిత తెలంగాణ సాధనకు కృషి చేయాలి

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చేందుకు ఉపాధ్యాయులు తమవంతు కృషి చేయాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డి అన్నారు. విద్యార్థులను డ్రగ్స్ వినియోగం నుంచి రక్షించడానికి తీసుకోవాల్సిన చర్యలపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే ట్రైనర్ల శిక్షణ కార్యక్రమాన్ని ఐటీ విభాగం, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో సోమవారం ఎస్సీఈఆర్ హెచ్‌ఆర్డీలో నిర్వహించారు. అన్ని జిల్లాల నుంచి జిల్లా విద్యాధికారులు, సెక్టోరియల్ అధికారులు, మండల విద్యాధికారులు(ఎంఈఓ), ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్‌లు ఇందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీజీ ఏఎన్‌బీ ఎస్పీ పి.సాయిచైతన్య, ఐటీ విభాగం ఎమర్జింగ్ టెక్నాలజీస్ డైరెక్టర్ రమాదేవి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ప్రతి అభ్యంతరానికి రూ.500

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఈఏపీ సెట్)కు సంబంధించి ఈసారి ఓ కీలక మార్పు చేశారు. పరీక్ష జరిగిన తర్వాత ప్రాథమిక కీ విడుదల చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో ప్రశ్నలకు వారు ఇచ్చిన జవాబులపై విద్యార్థులు అభ్యంతరాలు లేవనెత్తేందుకు అవకాశం ఉంది. గత ఏడాది వరకూ దీనికి ఎలాంటి ఫీజు ఉండేది కాదు. కానీ ఈసారి కొత్తగా ప్రతి సవాలు లేదా అభ్యంతరానికి రూ.500 చొప్పున చెల్లించాలనే నిబంధన తీసుకొచ్చారు. సెట్ నిర్వహణపై సోమవారం సమావేశమైన ఈఏపీ సెట్ కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

సరైనదని తేలితే రూ.500 వాపస్

విద్యార్థి లేవనెత్తిన అభ్యంతరాన్ని నిపుణుల బృందం పరిశీలిస్తుంది. అది సరైనదని తేలితే రూ.500 తిరిగి చెల్లిస్తారు. లేని పక్షంలో ఎలాంటి చెల్లింపు ఉండదు. 'కీ'లోని జవాబులపై ప్రతి సంవవత్సరం ఎలాంటి హేతుబద్ధత లేకుండా అభ్యంతరాలు వస్తున్నాయి. గత సంవత్సరం 906 అభ్యంతరాలు వచ్చాయి. వీటన్నింటినీ నిపుణుల కమిటీ పరిశీలించి, వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాతే తుది 'కీ', ఫలితాలు విడుదల చేయాల్సి ఉంటుంది. దీని వల్ల ఫలితాల వెల్లడిలో జాప్యం జరుగుతోందని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తాజా నిబంధన తీసుకువస్తున్నట్టు వారు తెలిపారు.

ఈసారి 100 శాతం సిలబస్

ఈఏపీ సెట్‌కు ఈ నెల 25వ తేదీ నుంచి ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ 4 వరకూ దరఖాస్తులు తీసుకుంటారు. ఇందుకు సంబంధించిన సమగ్ర నోటిఫికేషన్ ఈ నెల 20వ తేదీన విడుదల కానుంది. అగ్రికల్చర్ ఫార్మసీ పరీక్ష ఏప్రిల్ 29, 30 తేదీల్లో జరుగుతుంది. ఇంజనీరింగ్ పరీక్ష మే 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకూ జరుగుతుంది. కోవిడ్ వల్ల గతంలో ఇంటర్ సిలబస్‌ను తగ్గించారు. ఈసారి మొదటి, రెండో సంవత్సరం నుంచి వంద శాతం సిలబస్ ఉంటుంది. కమిటీ సమావేశంలో జేఎన్‌టీయూహెచ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, మండలి వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ ఇ.పురుషోత్తం, ఎస్కే మహమూద్, సెట్ కన్వీనర్ డీన్ కుమార్, కో-కన్వీనర్ ప్రొఫెసర్ కె.వి జయకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈఏపీ సెట్‌లో ఈసారి కొత్త నిబంధన

- 'కీ'పై ఒక్కో అభ్యంతరానికి రూ.500 చొప్పున చెల్లించాల్సిందే
- ఏటా హేతుబద్ధత లేకుండా వందల సంఖ్యలో అభ్యంతరాలు
- అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామన్న ఈఏపీ సెట్ కమిటీ
- అగ్రికల్చర్ ఫార్మసీ, ఇంజనీరింగ్ పరీక్షలకు 25 నుంచి దరఖాస్తులు

టీజీ ఈఏపీసెట్ నిర్వహణ వివరాలు..

20.2.25	సెట్ నోటిఫికేషన్ విడుదల
25.2.25	ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
4.4.25	దరఖాస్తుల స్వీకరణకు తుది గడువు
29, 30.4.25	అగ్రి, ఫార్మసీ సెట్
2–5.5.25	ఇంజనీరింగ్ సెట్

నాటుకోళ్లూ మృత్యువాత!


- పౌల్ట్రీ పరిశ్రమ నుంచి గ్రామాలకు వైరస్ వ్యాప్తి
- బర్డ్‌ఫ్లూను వ్యాప్తి చేసే హెచ్5ఎన్1 వైరస్సే కారణం
- బలం మందు వేయడమే తప్ప మరో మార్గం లేదంటున్న పశుసంవర్ధక శాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పౌల్ట్రీ పరిశ్రమను 15రోజులుగా అతలాకుతలం చేస్తున్న బర్డ్‌ఫ్లూ క్రమంగా గ్రామాలకు సోకుతోంది. నాటుకోళ్లు కూడా ఈ వైరస్ కారణంగా మృత్యువాత పడుతున్నాయని తెలుస్తోంది. బర్డ్‌ఫ్లూను వ్యాప్తి చేసే హెచ్5 ఎన్1 అనే వైరస్ ఇందుకు కారణమని, కోళ్ల ఫారాల్లోని కోళ్లు ఈ సీజన్‌లో మృత్యువాత పడ్డాయని పశుసంవర్ధక శాఖ చెబుతోంది. అయితే, ఈ వైరస్ కారణంగా ఎన్ని కోళ్లు చనిపోయాయన్న దానిపై అధికారిక లెక్కలు మాత్రం లేవు. సంక్రాంతి తర్వాత తెలంగాణ పౌల్ట్రీ పరిశ్రమలో ఈ వైరస్ ప్రబలంగా సోకిందని, సంక్రాంతి కోళ్ల పందేల కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కోళ్ల నుంచి ఈ వైరస్ సంక్రమించిందని భావిస్తున్నా, అధికారికంగా మాత్రం ధ్రువీకరణ జరగడం లేదు. అసలు ఈ వైరస్‌కు సంబంధించిన ఏ వేరియంట్ వచ్చిందో కూడా అర్థం కావడం లేదని, ఎక్కడి నుంచి వచ్చిందో తెలడం లేదని, కేవలం కోడి అస్వస్థతకు గురైనప్పుడు బలం మందు వేయడం తప్ప మరోమార్గం లేదని వెటర్నరీ డాక్టర్లు చెబుతున్నారు. సోకిన తర్వాత బలం మందు వేయడం, ఒకవేళ చనిపోతే బయోడిస్పోజబుల్ వేస్ట్ రూపంలో చనిపోయిన కోళ్లను గుంతలు తీసి పూడ్చడం చేస్తున్నామని అంటున్నారు. అయితే, ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు కూడా క్షేత్రస్థాయికి సమాచారం పంపారు. మహారాష్ట్రలోని లాతూర్‌లో ఈ వైరస్ సోకి 4,200 కోడిపిల్లలు చనిపోయిన నేపథ్యంలో రాష్ట్రంలో కూడా ఈ వైరస్ ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్.మల్లేశ్వరి పేరిట గత నెల 23న సర్క్యులర్ పంపారు. అయితే పశుసంవర్ధక శాఖ అధికారులు జాతీయ పశుగణనలో బిజీగా ఉన్నారు. అసలు ఈ వైరస్ ఎలా సోకిందో.. ఎలా సంక్రమిస్తుందో కూడా తెలకపోవడం, కోళ్ల మందుకు రాష్ట్రంలో కొరత ఏర్పడడంతో పరిస్థితి చేయి దాటిపోతుందేమోననే ఆందోళన మాత్రం క్షేత్రస్థాయిలో వ్యక్తమవుతోంది. అయితే పౌల్ట్రీ సంఘంనేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు మాత్రం రాష్ట్రంలో అలాంటి విపత్తు ఏమీలేదని 'సాక్షి'తో చెప్పారు.

1,382 మందికి త్వరలో టీచర్ పోస్టింగ్!

డీఎస్సీ 2008 బీఎడ్ అభ్యర్థులకు హైకోర్టులో ఊరట

- ఈ నెల 10లోగా నియామక పత్రాలు ఇవ్వాలన్న ధర్మాసనం
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో దీనికి సంబంధం లేదని స్పష్టీకరణ
- నియామకాలు చేపట్టకపోతే ఉన్నతాధికారులు హాజరుకావాల్సి ఉంటుందని హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: డీఎస్సీ 2008 అభ్యర్థులకు హైకోర్టులో ఊరట లభించింది. 1,382 మందిని వెంటనే కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా నియమించాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. అంతకుముందు వారిని టీచర్లుగా నియమించేందుకు సిద్ధంగా ఉన్నామని, ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమల్లో ఉన్నందున అది ముగిసిన వెంటనే పోస్టింగ్‌లు ఇస్తామని అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఏ.సుదర్శన్‌రెడ్డి చెప్పారు. అయితే ఈ నియామకాలకు ఎన్నికల కోడ్‌తో సంబంధం లేదని, వెంటనే నియామకాలు చేపట్టాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ నియామకాలకు ఏడాది క్రితమే హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని, ఇవి కొత్తగా ఇస్తున్నవి కాదని పేర్కొంది. వెంటనే నియామకాలు చేపట్టి సంబంధిత వివరాలను ఈ నెల 10న తమ ముందుంచాలని స్పష్టం చేసింది. లేదంటే ఉన్నతాధికారులు తమ ముందు హాజరయ్యేలా ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంటుందని హెచ్చరించింది.

2009లో హైకోర్టులో పిటిషన్‌తో మొదలు..

2008 డిసెంబర్ 6న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 35 వేల పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటించింది. ఎస్జీటీ పోస్టులను కామన్ మెరిట్ ప్రకారం భర్తీ చేస్తామని, వీటికి బీఈడీ, డీఈడీ అభ్యర్థులు అర్హులని పేర్కొంది. సుమారు 50 రోజుల తర్వాత ఎస్జీటీ పోస్టుల్లో 30 శాతం డీఈడీ అభ్యర్థులకు కేటాయిస్తూ 2009 జనవరి 29న జీవో 28ని తీసుకొచ్చింది. అయితే తమ కంటే తక్కువ అర్హత కలిగిన డీఎడ్ అభ్యర్థులకు 30 శాతం ఎస్జీటీ పోస్టులు రిజర్వు చేయడాన్ని, ఇందుకు సంబంధించి తమకు వ్యతిరేకంగా ట్రిబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ 70 మంది బీఎడ్ అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. 2009లో దాఖలైన ఈ కేసు సుప్రీంకోర్టు వరకు వెళ్లి మళ్లీ ఇక్కడికే వచ్చింది. ఈ పిటిషన్లపై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ తిరుమలాదేవి ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ వాదనలు వినిపించారు.

నియామకాలకు సీఎం ఆమోదం తెలిపారు..

'1,382 మంది బీఎడ్ అభ్యర్థులకు కాంట్రాక్టు ఉద్యోగాలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపారు. 2024, ఫిబ్రవరి 24న కేబినెట్ సబ్ కమిటీని కూడా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు జీవో 292ను జారీ చేసింది. కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్ అభ్యర్థుల వివరాలను పరిశీలించారు. 1,382 మంది అభ్యర్థులు కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా పని చేసేందుకు సిద్ధంగా ఉన్నారని జిల్లాల డీఈవోలు తెలిపారు. ఇదే విషయాన్ని పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ సబ్ కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో కమిటీ కూడా నియామకాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే నియామకాలు చేపడతాం..' అని ఏజీ చెప్పారు. వీలైనంత త్వరగా నియామక ఉత్తర్వులు ఇస్తామని ఏజీ చెప్పినప్పటికీ.. ఈ నెల 10లోగా పోస్టింగ్‌లు ఇవ్వాలని న్యాయమూర్తి స్పష్టం చేస్తూ విచారణ వాయిదా వేశారు.

గ్రూప్–1 నియామకాలకు లైన్ క్లియర్

సుప్రీంకోర్టులో నమోదైన రెండు కేసులు డిస్మిస్

- పరీక్షల ఫలితాల వెల్లడికి మార్గం సుగమం
- దాదాపు ఏడాది నుంచి అన్ని కేసుల్లో సానుకూల తీర్పులు వచ్చాయంటున్న అధికారులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ విభాగాల్లో గ్రూప్–1 ఉద్యోగాల భర్తీకి సంబంధించిన అడ్డంకులన్నీ తొలగిపోయాయి. 563 పోస్టుల భర్తీకి సంబంధించి గత ఏడాది ఫిబ్రవరిలో నోటిఫికేషన్ జారీ చేసిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్.. ప్రిలిమినరీ పరీక్షలు, మెయిన్ పరీక్షలను సైతం వేగంగానే నిర్వహించిన విషయం తెలిసిందే. కానీ మెయిన్స్ పరీక్షల కోసం అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన జీఓ 29పై, వికలాంగులకు వర్టికల్ పద్ధతిలో రిజర్వేషన్లు అమలు చేయాలనే అంశంపై వేర్వేరుగా కేసులు నమోదయ్యాయి. ఈ రెండు కేసులకు సంబంధించి సుదీర్ఘ వాదనలు విన్న సుప్రీంకోర్టు.. తాజాగా వాటిని డిస్మిస్ చేసింది. దీంతో గ్రూప్–1 ఉద్యోగ నియామకాలకు సంబంధించిన అడ్డంకులన్నీ తొలగిపోయి.. తుది ఫలితాల ప్రకటనకు మార్గం సుగమమైంది. ఇప్పటికే మెయిన్స్ పరీక్షలకు సంబంధించి జవాబు పత్రాల మూల్యాంకనం దాదాపు కొలిక్కి వచ్చినట్టు టీజీపీఎస్సీ వర్గాలు తెలిపాయి. సుప్రీంకోర్టులో కేసుల నేపథ్యంలో వేచి ఉన్నామని, త్వరలోనే ఫలితాలు వెల్లడిస్తామని వెల్లడించాయి.

ఏడాదిగా అనుకూల తీర్పులే.. : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గత ఏడాది కాలంలో దాదాపు 25 కేటగిరీల్లో 13 వేలకు పైబడి ఉద్యోగాలను భర్తీ చేసింది. దీనిపై కోర్టుల్లో వందల సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. ఈ న్యాయపరమైన చిక్కులను అధిగమించేందుకు టీజీపీఎస్సీ ప్రత్యేకంగా లీగల్ టీమ్‌ను ఏర్పాటు చేసింది. పరీక్షలు, ఫలితాలు, కీ, మెరిట్ జాబితాలు తదితర అంశాలను న్యాయబద్ధంగా పూర్తి చేస్తూ ఉద్యోగాల భర్తీని కొనసాగించింది. దీంతో పెద్దసంఖ్యలో కేసులు నమోదైనా.. పక్కాగా వ్యవహరించడంతో అనుకూల తీర్పులు వచ్చాయని టీజీపీఎస్సీ వర్గాలు చెబుతున్నాయి.

పరీక్షలయ్యాక జోక్యం చేసుకోలేం: సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో గ్రూప్–1 పరీక్షలు ఇప్పటికే పూర్తయి, ఫలితాల ప్రకటనకు సిద్ధమైన నేపథ్యంలో.. ఈ అంశంలో జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ పరీక్షలకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్–29ను రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్లను సోమవారం డిస్మిస్ చేసింది. గత నెల 22న జీవో 29ను రద్దు చేయాలని కోరుతూ.. గ్రూప్–1 అభ్యర్థులు బి.శ్రుతి, పి.రాంబాబు, ఎల్.మంజుల, జి.సుధాకర్ తదితరులు సుప్రీంకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. వాటిపై సోమవారం జస్టిస్ పమిడిఘంటమ్ శ్రీనరసింహ, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం విచారణ చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 29తో వేల మంది విద్యార్థులకు నష్టం వాటిల్లుతుందని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు ఆదిత్య సోంది, మోహిత్ రావు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. జీవో 29ను రద్దు చేసి, గ్రూప్–1 పరీక్షలను తిరిగి నిర్వహించేలా ఆదేశించాలని కోరారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. ''గ్రూప్–1 పరీక్షలు ఇప్పటికే పూర్తయ్యాయి కదా. ఫలితాలు ప్రకటించేందుకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. కాబట్టి ఈ అంశంలో ఇప్పుడు జోక్యం చేసుకోవడం సరి కాదు. ఈ పిటిషన్లను డిస్మిస్ చేస్తున్నాం..''అని పేర్కొంది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
మంగళవారం ၊ 4-2-2025

మిగిలింది ఎవరు.. ఎందరు?

- దేశవ్యాప్తంగా వరుస ఎన్‌కౌంటర్లలో నేలకొరుగుతున్న మావోయిస్టులు
- 'తెలంగాణ'కూ తాకిన ఎన్‌కౌంటర్ల సెగ
- బలహీనపడుతున్న వివిధ కమిటీలు
- దళాల ప్రొఫైళ్లు ఆరాతీస్తున్న పోలీసు వర్గాలు


మావోయిస్టులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఉత్తర తెలంగాణలో పీపుల్స్‌వార్ పార్టీ బలహీనపడ్డాక ఛత్తీస్‌గఢ్ నుంచే భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) పేరుతో కార్యకలాపాలు ఎక్కువగా సాగుతున్నాయి. కరోనా సంక్షోభం ముగిసే నాటికి తెలంగాణ రాష్ట్ర కమిటీతో పాటు బీకే-ఏఎస్ఆర్ (భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు జిల్లాలు), జేఎండబ్ల్యూపీ (జయశంకర్ భూపాలపల్లి - ములుగు - మహబూబాబాద్ - వరంగల్ - పెద్దపల్లి జిల్లాలు), కేబీఎం (కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల) డివిజన్ కమిటీలే మిగిలి ఉన్నాయి. వీటి పర్యవేక్షణలో పెద్దపల్లి, ఏటూరునాగారం-మహదేవపూర్, వాజేడు- వెంకటాపురం, ఇల్లెందు- నర్సంపేట, మంగి, ఇంద్రవెల్లి, సిర్పూర్, చర్ల- శబరి, మణుగూరు- పాల్వంచ, కోల్‌బెల్ట్ ఏరియా కమిటీల పేర్లతో సాయుధ దళాలు సంచరిస్తూ పార్టీ విస్తరణకు పనిచేసేవి. ఈ ఏరియా, డివిజన్ కమిటీల పేర్లతోనే లేఖలు జారీ అయ్యేవి. మొత్తంగా ఒక రాష్ట్ర కమిటీ, మూడు డివిజనల్ కమిటీలు, పది ఏరియా కమిటీలు యాక్టివ్‌గా ఉండేవి. ఇందులో వందమంది వరకు మావోయిస్టులు వివిధ హోదాల్లో పనిచేస్తున్నట్టుగా పోలీసు రికార్డులు చెబుతున్నాయి. అయితే, తెలంగాణకు చెందిన పలువురు మావోయిస్టులు ఇతర రాష్ట్రాలకు చెందిన డివిజన్, ఏరియా కమిటీల్లో పనిచేస్తుంటే ఇతర రాష్ట్రాలకు చెందిన కామ్రేడ్లు తెలంగాణకు సంబంధించిన వివిధ కమిటీల్లో పని చేస్తుండేవారు.

మావోల మరణాలు

గతేడాది జనవరిలో యాంటీ నక్సల్స్ కోసం చేపట్టిన ఆపరేషన్ కగార్‌తో ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఒడిశా, జార్ఖండ్, మహారాష్ట్రల్లోనూ ఎదురుకాల్పుల ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటివరకు వివిధ ఎన్‌కౌంటర్లలో 300 మందికిపైగా మావోయిస్టులు చనిపోయారు. ఇలా చనిపోయిన వారిలో ఏరియా కమిటీ నుంచి కేంద్ర కమిటీ సభ్యుడి వరకు ఉన్నారు. ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దు కర్రిగుట్టల్లో, 16న పూజారి కాంకేర్- మారేడుబాక అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మందికి పైగా మావోలు చనిపోయారు. ఇది జరిగిన కొద్ది రోజులకే గరియాబంద్ జిల్లాలో ఈనెల 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు రామచంద్రారెడ్డి అలియాస్ చలపతి మరణించారు. దీంతో తెలంగాణకు చెందిన వివిధ కమిటీల్లో ఎందరు మావోయిస్టులు ఉన్నారు.. అదే విధంగా అజ్ఞాతంలో ఉంటూ దేశంలోని ఇతర కమిటీల్లో పని చేస్తున్న తెలంగాణ నేతలు ఎవరనే అంశంపై పోలీసు శాఖ మరోసారి ఆరా తీయడం మొదలెట్టింది.

బలహీనపడిన కమిటీలు

2024 సెప్టెంబర్ 4న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌తో పాల్వంచ-మణుగూరు ఏరియా కమిటీ, అదే ఏడాది డిసెంబర్ 1న ములుగు జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నర్సంపేట-ఇల్లెందు, ఏటూరునాగారం-మహదేవపూర్ కమిటీలు, అంతకు ముందు 2014 మార్చిలో గడ్చిరోలి జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇంద్రవెల్లి, మంగి ఏరియా కమిటీలు బలహీనపడినట్టు గుర్తించారు. అయితే ఏ కమిటీ ఎంతమేర బలహీనపడింది?, అందులో ఎంతమంది దళ సభ్యులు ప్రస్తుతం ఉన్నారనే 'ప్రొఫైల్' రూపకల్పనపై ఖాకీలు దృష్టి సారించారు. క్రమం తప్పకుండా చోటుచేసుకుంటున్న ఎదురుకాల్పులు, విస్తృతమైన కూంబింగ్ ఆపరేషన్ల కారణంగా ఎప్పటికప్పుడు తాజా సమాచారం అందడం కష్టంగా మారినట్లు తెలుస్తోంది. అయినా స్పష్టమైన సమాచారం కోసం 'ఇంటెలిజెన్స్'కు పోలీసులు పదును పెడుతున్నారు.

ఆ నలుగురు సేఫ్..

వరుస ఎన్‌కౌంటర్లలో దళ సభ్యులు, ఏరియా కమిటీ కమాండర్లు ప్రాణాలు కోల్పోయారు. అయితే ఇప్పటికీ బీకే -ఏఎస్ఆర్ కమిటీకి కొయ్యాడ సాంబయ్య అలియాస్ ఆజాద్, జేఎండబ్ల్యూపీకి వెంకటేశ్, కేబీఎంకి మైలారపు డెళ్ల అలియాస్ భాస్కర్ నేతృత్వం వహిస్తున్నారు. ఈ ముగ్గురు డివిజన్ కమిటీ నేతలు సేఫ్‌గానే ఉండగా... తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి దామోదర్ సైతం సురక్షితమేనని ఇటీవల మావోయిస్టులు విడుదల చేసిన లేఖ ద్వారా వెల్లడైంది.



'రిపబ్లిక్ డే' కంటింజెంట్ అధికారులను సత్కరించిన గవర్నర్

సాక్షి, హైదరాబాద్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో నిర్వహించిన పరేడ్‌లో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించిన రిపబ్లిక్ డే పరేడ్ కంటింజెంట్ అధికారులను, కేడెట్లను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సత్కరించారు. ఈ మేరకు సోమవారం రాజ్‌భవన్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. యువతలో క్రమశిక్షణ, నాయకత్వం, సామాజిక బాధ్యతను పెంపొందించడంలో ఎన్‌సీసీ సహకారాన్ని గవర్నర్ ప్రశంసించారు. నాయకత్వం, ధైర్యం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణను పెంపొందించడంలో ఎన్‌సీసీ కీలకమని పేర్కొన్నారు. ఎన్‌సీసీలో ఎక్కువ మంది విద్యార్థులు భాగస్వాములయ్యేలా ప్రోత్సహించాలని విద్యాసంస్థలకు సూచించారు. సీనియర్ ఎన్‌సీసీ అధికారులు, కంటింజెంట్ సభ్యులకు గవర్నర్ జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ తెలంగాణ, ఏపీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వీఎం రెడ్డి, యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం, కల్చర్ ప్రిన్సిపల్ సెక్రటరీ స్మితా సబర్వాల్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, గవర్నర్ డిప్యూటీ సెక్రెటరీ పల్లవి, ఎన్‌సీసీ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.


సోమవారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద రంగురంగుల బెలూన్‌లు విక్రయిందానికి తీసుకెళుతున్న యువకుడు

మాంసమే.. నైవేద్యం..

వనపర్తి జిల్లా పాతపల్లి చింతలకుంట ఆంజనేయస్వామికి ప్రత్యేక నైవేద్యం

- పొట్టేళ్లు, మేకలు, కోళ్లు కోసి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు
- మూడు శతాబ్దాలుగా కొనసాగుతున్న ఆనవాయితీ
- కోరిన కోరికలు తీర్చే దేవుడిగా ప్రసిద్ధి




జాతరలో భక్తుల కిటకిట

వనపర్తి: ఆంజనేయస్వామిని ఎంతో నియమనిష్ఠలతో పూజిస్తారు. వడపప్పు, కొబ్బరి నీళ్ల తీర్థ ప్రసాదాలను నైవేద్యంగా పెడతారు. కానీ వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం పాతపల్లి గ్రామంలోని చింతలకుంట ఆంజనేయస్వామికి మాత్రం భక్తులు మాంసాన్ని నైవేద్యంగా పెట్టి మొక్కులు చెల్లించుకుంటారు. మూడు శతాబ్దాలుగా ఇక్కడ ఈ ఆనవాయితీ కొనసాగుతోంది. పాతపల్లి గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో వెలిసిన ఈ ఆలయంలో సంక్రాంతి పండుగ సందర్భంగా మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. అయితే ఏడాది పొడవునా భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు ఆలయానికి తరలివస్తుంటారు.

చింతలకుంట ఆంజనేయస్వామిగా..

పాతపల్లికి రెండు కిలోమీటర్ల దూరంలో వెలసిన అంజన్నను భక్తులు చింతలకుంట ఆంజనేయస్వామిగా పిలుచుకుంటారు. ఎక్కడా లేని విధంగా ఈ ఆలయంలో పొట్టేళ్లు, మేకలు, కోళ్లను బలిస్తారు. పూర్వం ఆలయ పరిసరాల్లో చింతచెట్లు భారీగా పెరిగి చిన్నపాటి అడవిగా ఉండేది. ఆ అడవుల పరిసర ప్రాంతాల్లో తరచూ.. ప్రజలు, పశువులు చనిపోతుండేవి. రాక్షసుల వలనే ఇలా జరుగుతోందని ప్రజలు ఆంజనేయస్వామిని వేడుకున్నారు. ప్రజల భక్తిని మెచ్చిన ఆంజనేయస్వామి రాక్షసులను వధించి ప్రజలతో పాటు పశుపక్ష్యాదులను కాపాడినట్లు స్థానికులు చెబుతుంటారు.




చింతలకుంట ఆంజనేయస్వామి మూల విగ్రహం. పొట్టేళ్లను బలిస్తున్న భక్తులు

300 ఏళ్ల చరిత్ర..: ఈ ఆలయానికి సుమారు 300 ఏళ్ల చరిత్ర ఉంది. అడవికి వెళ్లిన పశువుల కాపరులు ముందుగా స్వామివారి విగ్రహాన్ని గుర్తించి వారితో పాటు స్థానికులు ప్రత్యేక పూజలు చేయడం ప్రారంభించారని.. కోరిన కోరికలు తీరుతుండటంతో ఆ నోట ఈ నోట వెలుగులోకి వచ్చిందని స్థానిక పురాణాలు చెబుతున్నాయి. శ్రీరంగాపురం వాసుదేవరావు ఆలయాన్ని నిర్మించడం, ఆలయం చింతలచెరువు సమీపంలో ఉండటంతో చింతలకుంట ఆంజనేయస్వామి అని పేరొచ్చింది.

మద్యం, మాంసం..

ఇతర ఆలయాలకు భిన్నంగా ఇక్కడ స్వామి వారికి మద్యం, మాంసాన్ని భక్తులు నైవేద్యంగా సమర్పిస్తారు. కోళ్లు, పొట్టేళ్లను బలిస్తారు. మాంసాన్ని వండి నైవేద్యంగా సమర్పిస్తారు. పిల్లలకు పుట్టువెంట్రుకలు తీయించి, మొక్కు చెల్లించుకుంటారు. కొత్తగా కొనుగోలు చేసిన వాహనాలు, బైక్‌లు, ఆటోలకు పొట్టేళ్లను బలిచ్చి పూజలు చేస్తారు. చింతలకుంట ఆంజనేయస్వామి ఆలయం వద్ద సంక్రాంతికి రెండు రోజుల పాటు పెద్ద ఎత్తున జాతర నిర్వహిస్తారు. భక్తులు ఉమ్మడి పాలమూరు జిల్లాతో పాటు చుట్టు పక్కల జిల్లాల నుంచి అధిక సంఖ్యలో తరలివస్తుంటారు.

తాతల కాలం నుంచి నిత్యపూజలు

మా తాతల కాలం నుంచి చింతలకుంట ఆంజనేయస్వామికి నిత్య పూజలు చేస్తున్నాం. ఆంజనేయస్వామి పాదాల కింద అణగతొక్కబడిన రాక్షసుల ఆకలిని తీర్చేందుకు భక్తుల కోరికలను నెరవేరుస్తున్నాడు. భక్తులు మొక్కుబడిగా ఆలయం ఎదుట కోళ్లను, పొట్టేళ్లను, మేకలను కోస్తూ వండిన ఆహారాన్ని నైవేద్యంగా పెడతారు. ఆ నైవేద్యంతో రాక్షసుల ఆకలి తీరుతుంది. ఏటా సంక్రాంతి రోజున జాతర నిర్వహిస్తున్నాం.

– వెంకటేశ్వర్లు, ఆలయ పూజారి


కోళ్లను బలిస్తున్న భక్తులు

ఒక్క నెలలో 20 కేసులు..

- అవినీతిపరులపై ఏసీబీ కొరడా
- జనవరిలో 10 ట్రాప్ కేసులు నమోదు చేసిన అధికారులు
- లంచగొండి అధికారుల సమాచారం ఇవ్వాలని ప్రజలకు ఏసీబీ డీజీ సూచన

సాక్షి, హైదరాబాద్: అవినీతిపరులపై ఏసీబీ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 20 కేసులను ఏసీబీ నమోదు చేసింది. ఇందులో 10 ఏసీబీ ట్రాప్ కేసులు కాగా, ఒకటి ఆదాయానికి మించిన ఆస్తుల కేసు, మూడు క్రిమినల్ మిస్ కండక్ట్, మూడు రెగ్యులర్ ఎంక్వైరీ కేసులు మరో మూడు డిస్ట్రిక్ట్ ఎంక్వైరీ కేసులు ఉన్నాయి. జనవరిలో నమోదైన ఈ కేసులలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సహా మొత్తం ఏడుగురిని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపారు. ఏసీబీ ట్రాప్ కేసులలో లంచగొండి అధికారుల నుంచి రూ.1,45,000 స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులలో శాఖలపరంగా చూస్తే విద్య, రెవెన్యూ, హోం, ఫైనాన్స్, పశుసంవర్ధకశాఖ, మున్సిపల్, ఆరోగ్య శాఖలకు సంబంధించినవి ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఆదాయానికి మించి ఆస్తులను కూడబెట్టిన ఆరోపణలపై గిరిజన సంక్షేమశాఖ ఉద్యోగిపై నమోదు చేసిన కేసులో ఏసీబీ అధికారులు లెక్కల్లో చూపని రూ.65,50,000 విలువైన ఆస్తులను గుర్తించారు. లంచం డిమాండ్ చేసే అధికారులపై ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ డీజీ విజయ్‌కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఏసీబీ 'ఎక్స్'ఖాతా twitter@telanganaACB లేదా ఫేస్‌బుక్ @telanganaacb లోనూ ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

బీసీల లెక్కలు అధికారికంగా వెల్లడించడాన్ని స్వాగతిస్తున్నాం

బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్



సాక్షి, హైదరాబాద్: కులగణన అధికారిక వివరాలు బీసీల రాజ్యాధికార సాధనకు తొలిమెట్టు అని, బీసీల లెక్కలు అధికారికంగా వెల్లడించడాన్ని స్వాగతిస్తున్నామని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ తెలిపారు. అదే సమయంలో గత సర్వేతో పోలిస్తే 5 శాతం బీసీల జనాభా తగ్గడం.. ఓసీల జనాభా పెరగడం పలు అనుమానాలకు దారి తీస్తోందని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2014లో బీఆర్ఎస్ హయాంలో చేసిన కులగణన సర్వే వివరాలను కూడా బహిర్గతం చేయాలని, ప్రభుత్వం రెండు నివేదికలతో కూడిన శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని సురేశ్ డిమాండ్ చేశారు. ఈ విషయాలపై స్పష్టతను తీసుకురావడానికి ప్రజా సంఘాలు, రిటైర్డ్ న్యాయ నిపుణులు, ప్రొఫెసర్లతో ఒక కమిటీని ఏర్పాటు చేసి నిజా నిజాలను నిగ్గుతేల్చాలన్నారు. బీసీల అవకాశాలను హరిస్తే ఏ పార్టీ అయినా కాలగర్భంలో కలవడం ఖాయమని హెచ్చరించారు.

ఆ పేర్లెలా వచ్చాయి?

అగ్గలయ్య గుట్ట, భద్రకాళి చెరువుల నేపథ్యమేమిటి?

- అగ్గలయ్య గుట్టపై వెలుగులోకి కీలక శాసనం
- 10వ శతాబ్దం నాటి కన్నడ శాసనంలో పలు అంశాలు
- రాష్ట్రకూటుల కాలంలోనే భద్రకాళి చెరువు.. శాసనం ద్వారా వెల్లడవుతున్న వాస్తవాలు
- 'సాక్షి'తో డిస్కవరీ మ్యాన్ రెడ్డి రత్నాకర్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, వరంగల్: హనుమకొండలోని అగ్గలయ్యగుట్ట.. 'అగ్గలయ్య' అనే వైద్యుడి పేరుమీద వచ్చినదేనా? ఇప్పటి వరకు భద్రకాళి చెరువు అని పిలుస్తున్న చెరువును కూడా గతంలో వేరే పేరుతో పిలుచుకునేవారా? అంటే.. లభిస్తున్న చారిత్రక ఆధారాలను బట్టి అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయని డిస్కవరీ మ్యాన్ రెడ్డి రత్నాకర్‌రెడ్డి అంటున్నారు. భద్రకాళి చెరువు, దాని చుట్టూ ఉన్న పరిసరాలు గుట్టలపై విశేషంగా పరిశోధిస్తున్న రత్నాకర్‌రెడ్డి.. నితిన్, గణేశ్‌తో కలిసి కాపువాడ, బ్రాహ్మణవాడ మీదుగా గుట్టకు మధ్యలో కనిపించే వరసిద్ధి వినాయక దేవాలయాన్ని ఇటీవల సందర్శించారు. ఇక్కడ వెలుగుచూసిన కన్నడ శాసనం ద్వారా పలు అంశాలు తెలుస్తున్నాయని ఆయన చెబుతున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి'కి ఆయన పలు విశేషాలను తెలిపారు. వివరాలు ఆయన మాటల్లోనే..

అగ్గలయ్య గుట్టపైన అనేక ఆనవాళ్లు..

కొద్ది దూరం శిలల పైనుంచి.. ఇళ్ల మధ్య నుంచి గుట్టపైకి చేరుకునేందుకు నిటారైన కొండకు ఎత్తైన మెట్ల మార్గం ఉంది. ఒక్కొక్క మెట్టు అడుగు నుంచి రెండడుగుల ఎత్తులో ఉండగా.. ఈ మెట్ల మార్గం మొదలయ్యే చోట కుడివైపు రెండు లేదా మూడు వరుసల్లో కనిపించే పొడవైన శాసనం ఉంది. దీన్ని 10వ శతాబ్దం నాటి కన్నడ శాసనంగా ప్రాథమికంగా గుర్తించారు. శాసనం పైభాగంలో మెట్ల మార్గం గుండా పైకి ఎక్కితే సముద్రమట్టానికి 215 మీటర్ల ఎత్తులో రాష్ట్రకూటుల కాలం నాటి చతుర్భుజ వినాయక శిల్పం ఉంది. గుట్టపై ఉన్న శాసనం, వినాయక శిల్పంతోపాటు భద్రకాళి చెరువు మత్తడిపైన ఉన్న రెండు శిలలకు ఒకే రకమైన వినాయక శిల్పాలు, శివలింగాలు ఉన్నాయి. చెరువు నీటిలో మునిగే మూడు వేర్వేరు శిలలపై చెక్కిన వీరభద్రుడు, శివలింగం, నంది, వినాయకుడు, మహిషాసుర మర్దిని, కుమారస్వామి, సూర్యుడి శిల్పాలు కూడా చాళుక్య ప్రభువుల రాజ వైద్యుడు అగ్గలయ్య కన్నా పూర్వం నుంచి ఉన్నాయి. ఈ ప్రాంతం రాష్ట్రకూటుల ప్రాభవాన్ని తెలుపుతున్నది. ఇదే సమయంలో భద్రకాళి చెరువు కూడా రాష్ట్రకూటుల కాలంలో తవ్వించినట్లు తెలుస్తున్నది.


వరంగల్‌లో అగ్గలయ్య గుట్టపైన చెక్కిన శాసనం


భద్రకాళి చెరువు తవ్వించిందే..?

అగాలయవు అనే తమిళ పదానికి 'త్రవ్వకం' అనే అర్థం ఉంది. ఇప్పుడున్న భద్రకాళి చెరువు సహజసిద్ధమైనది కాకుండా తవ్విన చెరువై ఉంటుంది. పూర్వం దీని పేరు 'అగాలయ చెరువు' అని పిలిచే వారని భావించడానికి అవకాశం ఉంది. భద్రకాళి చెరువు అగ్గలయ్య గుట్టను ఆనుకునే ఉన్న కారణంగా అగాలయ గుట్ట క్రమంగా అగ్గలయ్య గుట్టగా వ్యవహారంలో స్థిరపడినట్లు చరిత్ర ఆధారాలు చెబుతున్నాయి. శాసనం పరిష్కరించిన తర్వాత అగ్గలయ్య గుట్ట చరిత్రపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కాగా సంస్కృతంలో అఘ అనగా దుఃఖము లేదా పాపం.. లయ అంటే నాశనం చేయడం. అఘాలయ అనే పదానికి అర్థం పాపాలను లేదా దుఃఖాన్ని పోగొట్టేవాడుగా గుట్టపైన ఉన్న వరసిద్ధి వినాయకుడిని పూజించి ఉండవచ్చు.. లేదా కాలగర్భంలో కలిసిపోయిన మరేదైనా ఆలయం ఉండవచ్చు. ఇదిలా ఉంటే కర్ణాటక రాష్ట్రం, కృష్ణరాజుపేట తాలూకా, మాండ్య జిల్లాలో 'అఘాలయ' అనే గ్రామంలో కూడా మల్లీశ్వరుడిని పాపాలు పోగొట్టే దేవుడిగా పూజిస్తారు.


అగ్గలయ్య గుట్టపైకి మెట్ల మార్గం


అగ్గలయ్య గుట్టపై 215 మీటర్ల ఎత్తులో చతుర్భుజ వినాయకుడి శిల్పం


భద్రకాళి చెరువులో శిల్పాలు..


అగ్గలయ్య గుట్టపై శాసనాన్ని పరిశీలిస్తున్న పరిశోధకుడు

ప్రత్యక్ష దైవమా.. ప్రణామం

12 సూర్య నమస్కారాలు, వేసే పద్ధతులు



రామవరప్పాడు: సమస్త జీవరాశి మనుగడకూ సూర్యుడే మూలాధారం. ఉదయభానుని అరుణ కిరణ స్పర్శతోనే ప్రకృతి మేల్కొంటుంది. ప్రాణికోటికి ప్రాణప్రదాత, ఆరోగ్యదాత భాస్కరుడే. ఆటవికుల నుంచి ఆధునికుల వరకూ జాతిమతాలకు అతీతంగా ఇనబాంధవుని ఆరాధిస్తూనే ఉంటారు. భారతీయ సంస్కృతిలో కశ్యప పుత్రుని స్థానం సమున్నతం. మాఘమాసంలో శుక్లపక్షం సప్తమి తిథినాడు రథసప్తమి పేరుతో సూర్యజయంతిని దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటారు. ఈ రోజున సూర్యుడు సప్తాశ్వాలు పూనిన రథాన్ని అధిరోహించి దక్షిణాయనాన్ని ముగించుకుని పూర్వోత్త దిశగా ప్రయాణం ఆరంభిస్తాడని భక్తుల విశ్వాసం. మాఘ సప్తమి నుంచి రానున్న ఆరు మాసాలు ఉత్తరాయణ పుణ్యకాలంగా పరిగణిస్తారు. సూర్యోపాసన చేస్తే రుణ, రోగ, శత్రుబాధలు నశిస్తాయని భారతీయుల నమ్మకం. సూర్యకిరణాలు తప్పనిసరిగా శరీరంపై ప్రసరించాలి. ఇందులో భాగంగానే వైదిక సంస్కృతిలో సంధ్యావందనం, సూర్యనమస్కారాలు వంటి పలు ప్రక్రియలు ఆచరణలోకి వచ్చాయి.

సూర్యనమస్కారాల విశిష్టత

సూర్యనమస్కారములు ఒక అద్భుతమైన వ్యాయామ పద్ధతి. సూర్య నమస్కారం అనే పేరు ఒక్కటే అయినా పన్నెండు భంగిమలతో కూడిన సూర్యనమస్కారాలలో ఒక సంక్షిప్తమైన ప్రాణాయామం, ధ్యానం, సమ్మిళితమైన వ్యాయామం ఇమిడి ఉంది. ఇందులో ఒక విశిష్టమైన ఆసన సరళి, ఒక మహోన్నతమైన శ్వాస నియంత్రణ ఒక పరమోత్కృష్ట ధ్యాన విధానం ఉన్నాయి. సూర్యనమస్కారాలు చూడటానికి సాధారణ వ్యాయామంలాగే కనిపించినా ఆచరించి చూస్తే ఒక అవ్యక్తానుభూతి కలుగుతుందని యోగ గురువులు చెబుతున్నారు.

సూర్య నమస్కారాలతో మంచి ఆరోగ్యం

నిత్యం సూర్య నమస్కారాలు చేయడం వల్ల అనారోగ్య సమస్యలు తొలగి ఆరోగ్యవంతులవుతారు. శరీరంలోని ప్రతి అంగాన్నీ ఉత్తేజపరచే ప్రక్రియలు సూర్యనమస్కారాలు. ఈ పన్నెండు ఆసనాలు వేయడం వల్ల శరీరంలోని బిగువులు తొలగడం, విషపదార్థాలు కరిగిపోవడం, దేహ కదలికలు సులువు కావడం, కీళ్ల వదులవడంతో నరాలు, కండరాల వ్యవస్థ సమతుల్యంగా పని చేస్తుంది. దృష్టి, వినికిడి, వాసన, రుచి శక్తులు పెరుగుతాయి. సూర్య నమస్కారాలతో ఎముకలు, కండరాలు బలోపేతమై మనిషి ఆరోగ్యంగా ఉండటమే కాకుండా మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బుల నుంచి కూడా ఉపశమనం లభిస్తుందని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. వీటి వల్ల బరువు తగ్గడంతోపాటు జీర్ణక్రియ మెరుగుపడటం, మానసిక ప్రశాంతత కూడా లభిస్తుంది. సూర్యనమస్కారాలు శరీర భాగాలపైనే కాకుండా గ్రంథులపైనా పని చేస్తాయి. థైరాయిడ్, పారా థైరాయిడ్, పిట్యూటరీ వంటి గ్రంథులు సాధారణ స్థాయిలో పనిచేయడానికి ఇవి ఎంతో ఉపకరిస్తాయి.

1. నమస్కారాసనం (ఓం మిత్రాయనమః)

ఛాతీని ముందుకు చాచి భుజాలను విశ్రాంతిగా ఉంచాలి. శ్వాస తీసుకుంటూ రెండు చేతులనూ ప్రక్కల నుంచి ఎత్తి శ్వాస వదులుతూ రెండు చేతులనూ కలుపుతూ నమస్కార ముద్రలో ఛాతీని ముందుకు తీసుకురావాలి. సూర్యునికి అభిముఖంగా నమస్కారం చేస్తున్నట్లు నిలబడి సూర్యుని నామాన్ని ఉచ్చరించాలి.

2. హస్త ఉత్తానాసనం (ఓం రవయేనమః)

కొద్దిగా శ్వాస పీల్చి రెండు చేతులను పైకెత్తి వెనుకకు తీసుకురావాలి. భుజాలను చెవులకు దగ్గరగా తీసుకురావాలి. తలను, నడుమును వెనుకకు వంచాలి. ఈ ఆసనంలో మడమల నుంచి చేతివేళ్ల వరకు మొత్తం శరీరాన్ని సాగదీయాలి.

3. పాదహస్తాసనం (ఓం సూర్యాయనమః)

శ్వాస వదలి, వెన్నుపూసను నిటారుగా ఉంచి నడుము నుంచి ముందుకు వంగాలి. శ్వాసను పూర్తిగా వదిలేసి చేతులను పాదాల పక్కకు భూమిమీదకి తీసుకురావాలి. తలను మోకాలుకు ఆనించాలి. కాళ్లు వంచకూడదు.

4. అశ్వసంచలనాసనం (ఓం భానవే నమః)

ఎడమ మోకాలును వంచి పాదాన్ని నేలపై ఉంచి, కుడి పాదాన్ని వెనుకగా వేళ్లపై ఆనించి, రెండు చేతులను పైకి చాపి, నడుము పై భాగాన్నంతా వెనుకకు వంచాలి. ఈ స్థితిలో శ్వాసను పీల్చి లోపలే ఆపాలి.

5. దండాసనం (ఓం ఖగాయనమః)

శ్వాస తీసుకుంటూ ఎడమకాలును కూడా వెనుకకు చాచి మొత్తం శరీరాన్ని భూమికి సమాంతరంగా ఒకే లైన్‌లో ఉంచాలి

6. సాష్టాంగ నమస్కారం (ఓం పుష్ణేనమః)

ఎనిమిది అంగాలు నేలకు ఆనటం వలన దీనికి అష్టాంగ నమస్కారం అని కూడా అంటారు. రెండు కాళ్లు రెండు మోకాళ్లు, రెండు చేతులు, రొమ్ము, గడ్డం ఈ ఎనిమిది అంగాలు నేలమీద ఉంచి నడుమును కొద్దిగా పైకి లేపాలి. శ్వాసను పూర్తిగా బయటకు వదలి ఆపాలి.

7. భుజంగాసనం (ఓం హిరణ్యగర్భాయనమః)

ముందుకు సాగి ఛాతీని పైకిలేపి త్రాచుపాము ఆకారంలోకి తీసుకురావాలి. ఈ ఆకారంలో మోచేతులను వంచవచ్చు. భుజాలు మాత్రం చెవులకు దూరంగా ఉంచాలి. శ్వాసను పీల్చి తల వెనుకకు వంచాలి.

8. పర్వతాసనం (ఓం మరీచయేనమః)

ఐదవ స్థితివలెనే కాళ్లు చేతులను నేలమీద ఆనించి నడుమును పైకి ఎత్తి శ్వాస వదలి తిరిగి పీల్చాలి.

9. అశ్వసంచలనాసనం (ఓం ఆదిత్యాయనమః)

శ్వాస తీసుకుంటూ కుడి పాదాన్ని రెండు చేతుల మధ్యలోకి తీసుకురావాలి. ఎడమ మోకాలు నేలమీద ఉంచి తుంటి భాగాన్ని కిందికి నొక్కుతూ పైకి చూడాలి.

10. పాదహస్తాసనం (ఓం సవిత్రేనమః)

శ్వాస వదులుతూ ఎడమపాదాన్ని ముందుకు తేవాలి. అరచేతులు భూమిమీద ఉంచాలి. అవసరమైతే మోకాలు వంచవచ్చు.

11.హస్త ఉత్తానాసనం (ఓం అర్కాయనమః)

శ్వాస తీసుకుంటూ ఉన్నప్పుడు వెన్నుపూసను నిటారుగా చేసి, చేతులు పైకిలేపి కొంచెం వెనుకకు వంగి తుంటి భాగాన్ని కొద్దిగా బయటకు తోయాలి.

ఏ ఆసనంతో ఎలాంటి లబ్ధి

1,12 ఆసనాలతో శరీర సమతుల్యత సాధించవచ్చు. శ్వాసకోశ వ్యవస్థ మెరుగుపడుతుంది. వెన్నెముక, మెడ, భుజాల దగ్గర ఉన్న కండరాలు బలోపేతం అవుతాయి.

2,11 ఆసనాలతో... జీర్ణవ్యవస్థను మెరుగు పడుతుంది. వెన్నుముక, పిరుదులు బలోపేతమవుతాయి.

3,10 ఆసనాలు.. రక్తప్రసరణ పెంచుతాయి, కాలి కండరాలను బలోపేతం చేస్తాయి, గ్రంథులపై కూడా ప్రభావం చూపుతాయి.

4,9 ఆసనాలు... వెన్నెముక, చేతి మణికట్టు కండరాలను బలోపేతం చేస్తాయి.

5,8 ఆసనాలు.. గుండెను బలోపేతం చేస్తాయి. మెడ, భుజాల దగ్గర ఉండే ఒత్తిడిని తగ్గిస్తాయి.

6వ ఆసనం. మెడ, భుజాలలో ఒత్తిడిని తగ్గిస్తుంది.

7వ ఆసనం... జీర్ణవ్యవస్థను బలోపేతం చేస్తుంది. వెన్నుముక బలంగా మారడానికి ఉపకరిస్తుంది.

యువతను చైతన్య పరుస్తున్నాం..

సూర్యనమస్కారాలు, యోగ ఆసనాలపై యువతకు ఉచితంగా అవగాహన కల్పిస్తున్నాం. యోగ, సూర్యనమస్కారాల విశిష్టత అందరికీ తెలియాలనే ఉద్దేశ్యంతో యోగాపై ప్రత్యేకంగా పుస్తకం రాశాను. ప్రత్యక్షంగా ఆసనాలు నేర్చుకోలేని వారి కోసం పరోక్షంగా అవగాహన కల్పించడం కోసం హై క్వాలిటీ రికార్డింగ్‌తో పర్ఫెక్ట్ టైమింగ్‌తో ఆడియో కూడా రూపొందించాను. పాఠశాలలు, కళాశాలల్లో యువత, విద్యార్థుల కోసం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఈ ఆడియో సాయంతో విజయవాడ, హైదరాబాద్‌తో పాటు అమెరికా, లండన్‌లో కూడా సెంటర్లు నడుస్తున్నాయి. వయస్సుతో నిమిత్తం లేకుండా అందరూ ఆసనాలపై ఆశక్తి పెంపొందించుకుని ఆరోగ్యంగా ఉండటమే మా లక్ష్యం.



– యోగ గురువు కెవీఎస్‌కె మూర్తి, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గ్రహీత



12. నమస్కారాసనం (ఓం భాస్కరాయ నమః)

నిటారుగా నిలబడి ఊపిరి పీల్చుకునేటప్పుడు అరచేతులను ఒకచోటచేర్చి నమస్కారం చేయాలి.

ఐటీ కంపెనీలకు రూ.195 కోట్లు విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఐటీ–జీసీపీ పాలసీ, ఏపీ డేటా సెంటర్ పాలసీ, ఏపీ మాన్యుఫాక్చరింగ్ పాలసీ, ఏపీ సెమీకండక్టర్ పాలసీల కింద ఏర్పాటయ్యే కంపెనీలకు ప్రోత్సాహకాలను ఇవ్వడానికి ముందస్తుగా నిధులు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఈ ఆర్థిక సంవత్సరం మూడు, నాలుగు త్రైమాసికాల్లో ఏర్పాటయ్యే కంపెనీలకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాల కోసం రూ.195.80 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ సోమవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఈ నిధులను ఏపీటీఎస్ పీడీ ఖాతాలోకి వేసి ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకాల ఆధారంగా నిధులను వ్యయం చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

టీటీడీలో సీఈ పోస్టు కోసం డీపీసీ ఏర్పాటు

సాక్షి, అమరావతి: టీటీడీలో చీఫ్ ఇంజనీర్ నియామకానికి డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ)ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. దేవదాయశాఖ ముఖ్య కార్యదర్శి కమిటీ చైర్మన్‌గా, టీటీడీ ఈవో కన్వీనర్‌గా, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శితోపాటు జీఏడీ కార్యదర్శులు సభ్యులుగా ఉంటారని ఆ ఆదేశాల్లో పేర్కొంది.

438 మంది సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది తగ్గింపు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా 438 మంది సీఐఎస్‌ఎఫ్ సిబ్బందిని తగ్గించారు. వారిని దేశంలోని వివిధ సంస్థలకు బదిలీ చేస్తూ కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు చెందిన సీఐఎస్‌ఎఫ్ ఐజీ ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల స్టీల్‌ప్లాంట్ చేపడుతున్న అనేక నియంత్రణ చర్యల్లో భాగంగా సిబ్బంది తొలగింపు గురించి సీఐఎస్‌ఎఫ్ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దీనిపై జరిగిన అనేక సమావేశాల అనంతరం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఇంత వరకు సీఐఎస్‌ఎఫ్‌లో 833 మంది సెక్యూరిటీ విధులు, ఫైర్ వింగ్‌లో 200 మందితో కలిపి మొత్తం 1033 మంది విధులు నిర్వహించేవారు.

అశ్లీల వీడియోలతో బెదిరింపులు

- నెట్‌లో పెడతానంటూ బ్లాక్ మెయిల్
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని నుంచి రూ.2.53 కోట్లు కొట్టేసిన కేటుగాడు
- హైదరాబాద్ కేంద్రంగా ఘటన
- నిడదవోలులో నిందితుడి అరెస్టు

నిడదవోలు: అశ్లీల వీడియోలున్నాయంటూ ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిని తరచూ ఫోనులో బెదిరిస్తూ, డబ్బులు గుంజుతున్న ఓ దుర్మార్గుడిని తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు పోలీసులు అరెస్టు చేశారు. సీఐ పీవీజీ తిలక్ కథనం ప్రకారం.. నిడదవోలు పట్టణం శాంతినగర్ చెందిన ఓ యువతి బీఎస్సీ కంప్యూటర్స్ చదువుకొని హైదరాబాద్‌లోని విప్రో సంస్థలో ఉద్యోగం చేస్తోంది. కూకట్‌పల్లిలోని ఓ హాస్టల్‌లో ఉంటున్న ఆమెకు అదే హాస్టల్‌లో చిన్ననాటి స్నేహితురాలు కాజా అనూషాదేవి పరిచయమైంది. ఈ క్రమంలో అనూషదేవి తన భర్త నినావత్ దేవానాయక్ అలియాస్ మధు సాయికుమార్‌ను పరిచయం చేసింది. సరైన ఉద్యోగం లేని దేవానాయక్ జల్సాలకు అలవాటు పడ్డాడు. దీనికి అవసరమైన డబ్బు కోసం భార్య స్నేహితురాలైన బాధితురాలిని టార్గెట్ చేశాడు. ఈ క్రమంలో దేవానాయక్ తన ఫోనులోని సిమ్‌ను తీసేసి మరో సిమ్ వేసి, బాధితురాలికి ఫోన్ చేయడం ప్రారంభించాడు. ఆమె న్యూడ్ వీడియోస్ తన వద్ద ఉన్నాయని, అవి ఇంటర్నెట్‌లో పెట్టకుండా ఉండాలంటే కొంత డబ్బులు కావాలని డిమాండ్ చేయడం మొదలు పెట్టాడు. దీంతో భయపడిన బాధితురాలు తన స్నేహితురాలు అనూషాదేవికి విషయం చెప్పింది. తన భర్తే ఇదంతా చేస్తున్నాడని తెలియకపోవడంతో అనూషాదేవి ఈ విషయాన్ని అతడికి చెప్పింది. దీంతో ఆ విషయాన్ని తాను సెటిల్ చేస్తానని దేవానాయక్ నమ్మబలికాడు. అనంతరం, తనకు దెబ్బలు తగిలి చికిత్స పొందుతున్నానని, ఆసుపత్రి బిల్లు కట్టడానికి డబ్బులు కావాలని బాధితురాలికి మళ్లీ ఫోన్ చేశాడు. ఆమె నుంచి కొంత డబ్బు తీసుకున్నాడు. బ్లాక్‌మెయిల్ చేస్తున్న వ్యక్తి గుంటూరులోని బాయ్స్ హాస్టల్‌లో ఉన్నాడని, న్యూడ్ వీడియోలకు సంబంధించిన వ్యవహారంలో డబ్బులు అడుగుతున్నాడని మరోసారి ఫోన్ చేసి భయపెట్టాడు. అశ్లీల వీడియోలు ఇంటర్నెట్‌లో రాకుండా ఉండాలంటే డబ్బులు తప్పకుండా ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో భయపడిన బాధితురాలు దేవానాయక్ బ్యాంక్ అకౌంట్‌కు డబ్బులు పంపించింది. అంతేకాకుండా తెలిసిన వారి ద్వారా కెనడాలో ఉద్యోగానికి పంపిస్తానంటూ ఆమె నుంచి దేవానాయక్ మళ్లీ కొంత నగదు తీసుకున్నాడు. ఈవిధంగా నిందితుడు దేవానాయక్‌కు దపదఫాలుగా రూ.2,53,76,000 బంధువుల అకౌంట్ల నుంచి ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా పంపించారు. అంతేకాకుండా మళ్లీ నిడదవోలు, విజయవాడ, హైదరాబాద్‌లలో నిందితుడికి బాధితురాలు మరికొంత నగదు కూడా ఇచ్చింది. చివరకు మోసపోయానని గ్రహించిన ఆమె నిడదవోలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసిన సీఐ తిలక్ సోమవారం దేవానాయక్‌ను అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ.1,81,45,000 నగదు, స్థిర, చరాస్తులను సీజ్ చేశారు.

పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం

బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్



జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో చిన్నారులతో మాట్లాడుతున్న బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ జె.రాజేంద్రప్రసాద్

జంగారెడ్డిగూడెం: బాలలపై జరిగే దాడులు, హింసలను బాలల హక్కుల కమిషన్ ఉపేక్షించదని, అటువంటి ఘటనల్లో బాధ్యులపై జువైనల్ జస్టిస్ యాక్ట్ కింద కఠిన చర్యలు తీసుకుంటామని బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్ చెప్పారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో చిన్నారులపై పాశవిక దాడికి సంబంధించి సోమవారం ఏరియా ఆసుపత్రిలో బాధితులైన చిన్నారులు ఉదయ్‌రాహుల్, రేణుకలను ఆయన పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జంగారెడ్డిగూడెంలో చిన్నారులపై పాశవిక దాడి ఘటన తనను బాధించిందన్నారు. స్థానిక సీఎస్ఆర్ మాల్ సమీపంలో గానాల శారద అనే మహిళ తన ఇద్దరి పిల్లలతో ఉంటోందని, నల్లవెలుగుల పవన్‌కుమార్‌తో సహజీవనం సాగిస్తోందని చెప్పారు. వీరిద్దరికీ అడ్డు తగులుతున్నారనే నెపంతో చిన్నారులను శారీరకంగా, మానసికంగా హింసించారని, ఛార్జింగ్ వైరుతో వీపంతా వాతలు తేలేలా కొట్టి పైశాచికంగా వ్యవహరించారని తెలిపారు. తల్లి కూడా సహకరించడం బాధ కలిగించిందన్నారు. ఘటనపై వెంటనే చర్యలకు అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. వారు చిన్నారులను ఏరియా ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారని తెలిపారు. చిన్నారులపై ఎటువంటి అఘాయిత్యాలకు పాల్పడినా జువైనల్ జస్టిస్ యాక్ట్‌లో సుమారు రూ.లక్ష జరిమానా, కనీసం మూడేళ్ల జైలుశిక్ష పడే అవకాశం ఉందని చెప్పారు.

గిరిజనుల సంక్షేమం గాలికి..!

- వారిపై బాబు సర్కార్ చిన్నచూపు
- 8 నెలలైనా సలహా మండలిని ఏర్పాటు చేయని ప్రభుత్వం
- చంద్రబాబు గత పాలనలోనూ మొదటి మూడేళ్లు ఇదే పరిస్థితి



సాక్షి, అమరావతి: గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం అంటే ముఖ్యమంత్రి చంద్రబాబుకు గిట్టదు. గత పాలనలో (2014–19) గిరిజనుల పట్ల చిన్నచూపుతో వ్యవహరించినట్లే ఇప్పటి పాలనలో కూడా సీఎం చంద్రబాబు వ్యవహరిస్తున్నారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి రాజ్యాంగపరంగా ఏర్పాటు చేయాల్సిన గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయలేదు.

ఆర్టికల్ 244 (1)కు విరుద్ధం..

షెడ్యూల్డ్ ప్రాంతాలను కలిగి ఉన్న ప్రతి రాష్ట్రంలోనూ రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్‌లో అధికరణం 244 (1)లోని పేరా 4వలోని నిబంధనల ప్రకారం గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయాలి. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అధ్యక్షతన గిరిజన ఎమ్మెల్యేలు, అధికారులతో గిరిజన సలహా మండలి ఏర్పాటు చేస్తే ఆరు నెలలకోసారి సమావేశమై గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం విషయంలో తగిన నిర్ణయాలు తీసుకుని అమలుకు చర్యలు తీసుకుంటుంది. అందుకు సంబంధించిన నివేదికలను గవర్నర్‌కు సమర్పిస్తే గవర్నర్ రాష్ట్రపతికి సమర్పిస్తారు. ఇంతటి కీలక గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయకుండా సీఎం చంద్రబాబు తాత్సారం చేస్తున్నారు. దీంతో గిరిజనుల సంక్షేమ కార్యక్రమాలు, షెడ్యూల్ ప్రాంతాల సమగ్రాభివృద్ధిని పట్టించుకునే వారే లేకుండా పోయారు.

వైఎస్ జగన్ పోరాటంతో 2017లో సలహా మండలి ఏర్పాటు

గత పాలనలో (2014–19) కూడా చంద్రబాబు గిరిజన సలహా మండలిని తొలి మూడేళ్ల పాటు ఏర్పాటు చేయలేదు. దీంతో గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయాలంటూ అప్పటి ప్రతిపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డి మూడేళ్ల పాటు పోరాటం చేశారు. గిరిజనుల పురోగతికి సంబంధించిన ఈ అంశంపై అప్పటి గవర్నర్ నర్సింహన్‌ను కలిసి వినతి పత్రం కూడా సమర్పించారు. దీనితో గవర్నర్ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తూ, గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేశారా, ఏర్పాటు చేస్తే ఆ వివరాలను పంపించాలంటూ కోరారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో చంద్రబాబు ప్రభుత్వం 2017 సెప్టెంబర్ 25న గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

భక్తిశ్రద్ధలతో మహా సరస్వతియాగం

కాణిపాకం: చిత్తూరు జిల్లా కాణిపాకంలో వసంత పంచమిని పురస్కరించుకుని కాణిపాకంలోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయ ఆస్థాన మండపంలో సోమవారం మహా సరస్వతి యాగం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఐదు మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు 2,500 మంది ఈ యాగంలో పాల్గొన్నారు. వేద పండితులు సరస్వతీదేవికి విశేషాలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం మహా సరస్వతి యాగం ప్రారంభించారు.



సరస్వతీదేవికి పూజలు చేస్తున్న అర్చకులు

క్యాన్సర్ ఉందని కనుగొనడమే క్యాన్సర్‌ను నయం చేసుకోవడం. ఒకప్పుడు దాదాపు 10 శాతం క్యాన్సర్లకే చికిత్స అందుబాటులో ఉండేది. కానీ ఇప్పుడు దాదాపు 10 శాతం క్యాన్సర్లు మాత్రమే చికిత్సకు లొంగనివి అని చెప్పవచ్చు. మిగతా అన్ని క్యాన్సర్లనూ దాదాపు నయం చేయవచ్చు. కాకపోతే క్యాన్సర్‌ను వీలైనంత త్వరగా అంటే... దాని నాలుగు దశల్లో... మొదటి లేదా కనీసం రెండోదశలోనైనా కనుక్కోవాలి. అప్పుడే 'క్యాన్సర్ ఉందని కనుగొనడమే... క్యాన్సర్‌ను నయం చేసుకోవడం' అనే మాట వర్తిస్తుంది. అయితే క్యాన్సర్ అంటూ గుర్తించడానికి ప్రత్యేకంగా లక్షణాలుండకపోయినప్పటికీ... ఏయే లక్షణాలను బట్టి క్యాన్సర్‌ను అనుమానించవచ్చు? అలా ఆ క్యాన్సర్స్‌ను ముందుగానే గుర్తించడమెలా? మహిళలకూ, పురుషులకూ లేదా ఈ ఇద్దరిలోనూ వచ్చే సాధారణ క్యాన్సర్లేమిటి? ఇలాంటి విషయాలన్నీ తెలుసుకోడానికి ఉపయోగపడే ప్రత్యేక కథనమిది.

క్యాన్సర్ A టు Z స్క్రీనింగ్స్ ఇలా!



నేడు వరల్డ్ క్యాన్సర్ డే

కొన్ని క్యాన్సర్ లక్షణాలే... మామూలు ఇతర జబ్బుల్లోనూ కనిపిస్తాయి. ఉదాహరణకు బరువు తగ్గడం, దగ్గు లాంటి మామూలు లక్షణాలే కనిపించడం. మరి ముందే... అంటే ప్రారంభ దశల్లోనే క్యాన్సర్‌ను పసిగట్టడానికి స్క్రీనింగ్ పరీక్షలేమిటి,అవి ఎవరెవరికి ఎప్పుడు చేయించాలో చూద్దాం.

మహిళలకే అవసరమైన స్క్రీనింగ్స్ పరీక్షలివి...

సర్వికల్ క్యాన్సర్:... సర్వికల్ క్యాన్సర్‌కే ఉన్న ఓ ప్రత్యేకత ఏమిటంటే... ఇది వచ్చేందుకు కనీసం పదేళ్ల ముందుగానే రాబోతోందని గుర్తించవచ్చు. అంటే సుదీర్ఘమైన ప్రీ-క్యాన్సరస్ దశ దీనికి ఉంటుంది. అందుకే దీన్ని రాకముందే పసిగట్టవచ్చు. అందుకు చేయించుకోవాల్సిందల్లా పాప్ స్మియర్ అనే ఓ మామూలు పరీక్ష. ప్రతి మహిళా 25 ఏళ్లు దాటిన నాటి నుంచి ప్రతి మూడేళ్లకోసారి ఈ పరీక్ష చేయించుకుంటూ ఉండటమే సర్వైకల్ క్యాన్సర్‌కు స్క్రీనింగ్.

రొమ్ము క్యాన్సర్:

(నిజానికి రొమ్ము క్యాన్సర్ మహిళలతోపాటు పురుషులలోనూ కనిపించినప్పటికీ వారిలో కాస్త అరుదు) రొమ్ము క్యాన్సర్ విషయంలో వయస్సుకూ వ్యాధికీ సంబంధం ఉంది. వయస్సు పెరుగుతున్న కొద్దీ వ్యాధి వచ్చే అవకాశాలు (రిస్క్) పెరుగుతుంటాయి.

రొమ్ము క్యాన్సర్ రిస్క్ ఎవరెవరిలోనంటే...

- పిల్లలు లేనివాళ్లు
- ముప్పయి ఏళ్లు దాటాక మొదటి బిడ్డను కన్న మహిళలు
- తమ కుటుంబం ఈ వ్యాధి వచ్చిన వారున్నప్పుడు...

పైన పేర్కొన్న వాళ్లంతా రొమ్ము క్యాన్సర్‌కు రిస్క్ గ్రూప్. ఈ రిస్క్ గ్రూపులు ప్రతి నిత్యం మూడు పరీక్షలు చేసుకుంటూ ఉండాలి. అవి...

- **మొదటిది...** ఎవరికి వారే చేసుకునే రొమ్ము పరీక్ష. ప్రతి మహిళా తమ రుతుక్రమం ముగిసిన వారం తర్వాత ఎడమరొమ్మును కుడిచేత్తో, కుడిరొమ్మును ఎడమచేత్తో తాకుతూ పరీక్ష చేసుకోవాలి. దాంతో రొమ్ములో ఏ చిన్నమార్పు వచ్చినా డాక్టర్ కంటే ముందే... తమకే తెలిసిపోతుంది. ఫలితంగా ముందస్తు లక్షణాలేమైనా కనిపిస్తుంటే త్వరగా కనిపెట్టగలరు. ఇతరత్రా కాస్తంత తేడా ఏమైనా ఉంటే దాన్ని డాక్టర్/గైనకాలజిస్ట్ దృష్టికి తీసుకెళ్తే అదేమైనా ప్రమాదకారా లేక మామూలు గడ్డా అన్నది చెబుతారు.
- **రెండోది...** మామోగ్రఫీ అనే మరో పరీక్షతోనూ రొమ్ము క్యాన్సర్‌ను తేలిగ్గా గుర్తించవచ్చు. ఇది ఎవరికి అవసరం అంటే...
- ముప్పయి ఏళ్లప్పుడు ఓసారి మామోగ్రామ్ చేయించాలి
- ఆ తర్వాత 35 ఏళ్లప్పుడు ఒకసారి, 40 ఏళ్ల వయసప్పుడు మరోసారి చేయించాలి. ఆ తర్వాత 40 ఏళ్ల నుండి 50వ ఏటి వరకూ ప్రతి రెండేళ్లకోసారి చొప్పున చేయిస్తుండటం మంచిది.
- ఇక 50 ఏళ్లు వచ్చాక ఏడాదికోమారు చేయించడం మంచిది
- మరీ ఎక్కువ రిస్క్ ఉన్నవారు తమ డాక్టర్ సలహా మేరకు ఇంకా త్వర త్వరగానే పరీక్ష చేయించుకోవాల్సిన అవసరం ఉండవచ్చు.
- ఇక మూడో రకానికి చెందిన ఈ పరీక్షలు... చాలా చాలా హై రిస్క్ గ్రూపువాళ్లకు...

ఈ వ్యాధి వచ్చే అవకాశం చాలా చాలా ఎక్కువ అని భావించిన మహిళలకు వాళ్ల డాక్టర్లు... బీఆర్‌సీఏ1, బీఆర్‌సీఏ2 అనే జీన్ మ్యూటేషన్స్ తాలూకు జన్యుపరీక్షలు చేయిస్తుంటారు.

పురుషులకే అవసరమైన స్క్రీనింగ్ పరీక్షలివి...

ప్రోస్టేట్ క్యాన్సర్

- దాదాపు 50 ఏళ్ల వయసుకు చేరాక పురుషుల్లో కనిపించేదే 'ప్రోస్టేట్ క్యాన్సర్'. హెడ్ అండ్ నెక్ క్యాన్సర్లలాగే ఇదీ కాస్త ఎక్కువగానే కనిపిస్తుంటుంది. అయితే చాలా చిన్న పరీక్షతోనే దీన్ని కనిపెట్టవచ్చు. ప్రోస్టేట్ స్పెసిఫిక్ యాంటీజెన్ (పీఎస్ఏ) అనే చాలా చవకైన, తేలికైన పరీక్ష సహాయంతో ఈ క్యాన్సర్‌ను కనుక్కోవచ్చు. 50 ఏళ్లు పైబడ్డ పురుషులు ప్రతి ఏడాదీ చేయించుకోవాల్సిన పరీక్ష ఇది.
- ఇదేగాక మలద్వారం ద్వారా వేలితో చేసే మరో పరీక్ష డిజిటల్ రెక్టల్ ఎగ్జామినేషన్ (డీఆర్‌ఈ) అనే పరీక్షతోనూ ప్రోస్టేట్ క్యాన్సర్‌ను డాక్టర్లు తెలుసుకుంటారు.



డాక్టర్ విజయ కరణ్ రెడ్డి పాల్కొండ
సీనియర్ కన్సల్టెంట్
రేడియేషన్ ఆంకాలజిస్ట్

అందరిలోనూ కనిపించే కొన్ని సాధారణ క్యాన్సర్లు... వాటి స్క్రీనింగులు

మహిళలూ, పురుషులు... ఈ ఇద్దరిలో వచ్చే క్యాన్సర్లు దాదాపు 200 రకాలకు పైగానే ఉంటాయి. కానీ స్త్రీపురుషుల్లో కనిపించే కొన్ని సాధారణ క్యాన్సర్లూ, వాటి రిస్క్ గ్రూపుల వివరాలూ ఈ కింద ఉన్నాయి. ఈ రిస్క్ ఫ్యాక్టర్‌లు గనక తమలో ఉన్నట్లు గుర్తించిన వారు వెంటనే డాక్టర్‌ను సంప్రదించి, తమకు అవసరమైన స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి.


- మలద్వారం, పెద్ద పేగు క్యాన్సర్ (కోలో రెక్టల్ క్యాన్సర్) స్క్రీనింగ్ ఇలా...

ఈ క్యాన్సర్‌కు సంబంధించిన రిస్క్ గ్రూపులను లెవెల్-1, లెవెల్-2, లెవెల్-3, లెవెల్-4 అని నాలుగుగా విభజించవచ్చు. ఇందులో

- **లెవెల్-1 అంటే...** తమ కుటుంబ చరిత్రలో ఈ క్యాన్సర్ బాధితులు ఉన్నవారు.
- **లెవెల్-2 అంటే...** తమ కుటుంబ చరిత్రలో ఈ వ్యాధి ఉండి, 50 ఏళ్లు పైబడ్డవారు.
- **లెవెల్-3 అంటే...** 50 ఏళ్లకు ముందుగానే ఈ వ్యాధి వచ్చినవారి దగ్గరి బంధువులు. అంటే... వారితోపాటు మరో ఇద్దరు ముగ్గురికి ఈ వ్యాధి ఉన్నవారు.
- **లెవెల్-4 అంటే...** చాలా స్ట్రాంగ్ ఫ్యామిలీ హిస్టరీ ఉండి, 50 పైబడి ఉండటంతో పాటు... చాలా దగ్గరి బంధువులు అంటే తల్లిదండ్రుల్లో ఒకరికి వ్యాధి రావడం...
- **లెవెల్-1 వాళ్లైతే...** మలంలో ఏవైనా రక్తకణాలున్నాయేమో తెలుసుకునేందుకు 'ఫీకల్ అక్కల్ట్ బ్లడ్ టెస్ట్' అనే మామూలు మలపరీక్షను 50 ఏళ్లు పైబడ్డవారిలో ఏడాదికోసారి చేయించాలి. వీళ్లకే సిగ్మాయిడోస్కోపీ విత్ రెక్టల్ ఎగ్జామినేషన్ అనే పరీక్షను ప్రతి ఐదేళ్లకు ఓసారి చేయించాలి.
- **లెవెల్-2 వాళ్లకు...** పై పరీక్షలే. కాకపోతే ప్రతి మూడేళ్లకోమారు చేయిస్తుండాలి.
- **లెవెల్-3 వాళ్లకు...** కొలనోస్కోపీతో పాటు డాక్టర్లు వేలితో చేసే డిజిటల్ రెక్టమ్ ఎగ్జామినేషన్ పరీక్షల్ని 35 ఏళ్లు దాటిన దగ్గర్నుంచి ప్రతి 3-5 ఏళ్లకు చేయిస్తుండాలి. దాంతోపాటు 'ఫీకల్ అక్కల్ట్ బ్లడ్ టెస్ట్'ను 35 ఏళ్ల వయస్సు నుంచి ప్రతి ఏడాదీ చేయించాలి.
- **లెవెల్-4 వాళ్లకు...** కొలనోస్కోపీ పరీక్షతో పాటు డిజిటల్ రెక్టమ్ పరీక్షను 25 ఏళ్ల వయసప్పటి నుంచే ప్రతి 1-3 ఏళ్లకోసారి చేయిస్తుండాలి.

తల నుంచి కాలివరకు తొలి దశలోనే గుర్తించేందుకు కొన్ని ప్రాథమిక లక్షణాలివి...

- **తల భాగంలో...** ఈ క్యాన్సర్స్ నోట్లో, దవడ, నాలుక మీద లేదా చిగుళ్లు (జింజివా) మీద ఎక్కడైనా రావచ్చు. ఎరుపు, తెలుపు రంగుల ప్యాచెస్ ఉన్నా, దీర్ఘకాలంగా మానని పుండు (సాధారణంగా నొప్పి లేని పుండు, కొన్ని సందర్భాల్లో నొప్పి ఉండవచ్చు కూడా) ఉంటే క్యాన్సర్ అయ్యేందుకు అవకాశం ఎక్కువ. కొన్నిసార్లు పుండ్లు కూడా ఉండవచ్చు. అదే నాలుక మీద అయితే నాలుక కదలికలు తగ్గవచ్చు. నాలుక వెనక భాగంలో అయితే స్వరంలో మార్పు. మరింత వెనకనయితే మింగడంలో ఇబ్బంది. ఇక స్వరపేటిక ప్రాంతంలో అయితే స్వరంలో మార్పు. మెడ దగ్గరి లింఫ్ గ్రంథుల వాపు.
- **బ్రెయిన్ క్యాన్సర్‌లో...** శరీరంలోని అన్ని భాగాలకు లాగే మెదడుకూ క్యాన్సర్ వచ్చే అవకాశాలుంటాయి. తలనొప్పి, అకస్మాత్తుగా మతిమరపు రావడం, విషయాలు గుర్తుంచుకోకపోవడం, కొన్నిసార్లు సాంఘిక, సామాజిక సభ్యత మరచి ప్రవర్తించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మనిషి మెదడులో మాటకూ, చేతలకు, దృష్టికీ, వినికిడికీ, కాళ్లూ, చేతుల కదలికల నియంత్రణకు... ఇలా వేర్వేరు ప్రతిచర్యలకు వేర్వేరు కేంద్రాలు (సెంటర్స్) ఉంటాయన్న విషయం తెలిసిందే. మెదడులో... క్యాన్సర్ అభివృద్ధి చెందిన సెంటర్ ఏ అవయవానికి సంబంధించినదైతే ఆ అవయవం చచ్చుబడటం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి.
- **గొంతు భాగంలో...** దీన్ని ఓరోఫ్యారింజియల్ భాగంగా చెప్పుకోవచ్చు. ఇక్కడ గొంతులో ఏదో ఉన్న అనుభూతి ఉంటుంది. అన్నవాహిక మొదటి భాగంలో అయితే మింగడంలో ఇబ్బంది.
- **కడుపు (స్టమక్) లో...** అదే కడుపు (స్టమక్)లో అయితే మంట పుడుతున్నట్లుగా ఉండే నొప్పి. పొట్టలో మంట. పొట్టలో రక్తస్రావం అవుతుంది కాబట్టి ఆ రక్తం వల్ల విసర్జన సమయంలో మలం నల్లగా కనిపిస్తుంది. రక్తస్రావం వల్ల రక్తహీనత (ఎనీమియా) కూడా కనిపించవచ్చు. దాంతోపాటు కొన్నిసార్లు కొంచెం తినగానే కడుపు నిండిపోయిన ఫీలింగ్.
- **పేగుల్లో...** మల మూత్ర విసర్జన అలవాట్లలో మార్పులు రావడం జరుగుతుంది.
- **రెక్టమ్ క్యాన్సర్‌లో...** మలద్వారం (రెక్టమ్) క్యాన్సర్ విషయంలోనూ మల విసర్జన తర్వాత కూడా ఇంకా లోపల మలం మిగిలే ఉందన్న ఫీలింగ్ ఉంటుంది. దీనికో కారణం ఉంది. విసర్జించాల్సిన పదార్థం మామూలుగా మలద్వారం వద్దకు చేరగానే అక్కడి నాడులు స్పందించి అక్కడ మలం ఉన్నట్లుగా మెదడుకు సమాచారం చేరవేస్తాయి. దాంతో విసర్జించాల్సిందిగా మెదడు ఆదేశాలిస్తుంది. అయితే విసర్జన తర్వాత కూడా అక్కడ క్యాన్సర్ ఓ గడ్డలా ఉండటంతో ఏదో గడ్డ మిగిలే ఉందన్న సమాచారాన్ని నాడులు మెదడుకు చేరవేస్తాయి. దాంతో ఇంకా ఏదో అక్కడ మిగిలి ఉందన్న ఫీలింగ్ కలుగుతూ ఉంటుంది. దాంతోపాటు బంక విరేచనాలు, రక్తంతోపాటు బంక పడటం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి.
- **ఊపిరితిత్తుల్లో...** ఊపిరితిత్తుల క్యాన్సర్ విషయంలో పొగతాగేవారికి అది వచ్చేందుకు అవకాశం ఎక్కువ. ఈ క్యాన్సర్ ఉన్నవాళ్లలో దగ్గు, కళ్లెలో రక్తం పడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఎక్స్-రే, సీటీస్కాన్ పరీక్ష ద్వారా దీన్ని తెలుసుకోవచ్చు.
- **ఒవేరియన్ క్యాన్సర్‌లో...** దాదాపు 50, 60 ఏళ్ల మహిళల్లో పొట్ట కిందిభాగంలో నొప్పి రావడం వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. సాధారణంగా ఈ భాగానికి క్యాన్సర్ వస్తే ఏ లక్షణాలూ చూపించకుండానే ప్రమాదకరమైన పరిస్థితులకు తీసుకెళ్తుంది కాబట్టి దీన్ని 'సైలెంట్ కిల్లర్'గానూ అభివర్ణిస్తుంటారు.
- **టెస్టిస్ క్యాన్సర్‌లో...** పురుషుల్లో వచ్చే ఈ క్యాన్సర్‌లో వృషణాల సైజ్ పెరగడం, దాన్ని హైడ్రోసిల్‌గా పొరబాటు పడి పెద్దగా సీరియస్‌గా తీసుకోకపోవడంతో అది సైజ్‌లో పెరిగి ప్రమాదకరంగా పరిణమించే అవకాశాలు ఎక్కువ.
- **కిడ్నీ అండ్ బ్లాడర్ క్యాన్సర్స్‌లో...** మూత్ర విసర్జన సమయంలో రక్తం కనిపించడం, మాటిమాటికీ మూత్రం రావడం మూత్రపిండాలు, మూత్రాశయ క్యాన్సర్లలో కనిపించే సాధారణ లక్షణం.
- **బ్లడ్ క్యాన్సర్‌లో...** రక్తం కూడా ద్రవరూపంలో ఉండే కణజాలమే కాబట్టి... బ్లడ్ క్యాన్సర్ కూడా రావచ్చు. రక్తహీనత, చర్మం మీద పొడ, చిగుళ్లలోంచి రక్తం రావడం, బరువు తగ్గడం, జ్వరం రావడం వంటివి బ్లడ్‌క్యాన్సర్ లక్షణాలు. లింఫ్ గ్లాండ్స్ అన్నవి బాహుమూలాల్లో, దవడల కింది భాగంలో మెడకు ఇరువైపులా, గజ్జల్లో ఉండే ఈ గ్రంథులకూ క్యాన్సర్ రావచ్చు. దాన్ని లింఫోమా అంటారు.
- **చర్మం క్యాన్సర్‌లో...** చర్మం క్యాన్సర్‌ను ఏ, బీ, సీ, డీ అనే నాలుగు లక్షణాలతో తేలిగ్గా గుర్తించవచ్చు. శరీరంపై ఏదైనా మచ్చ తాలూకు ఏ- అంటే... ఎసిమెట్రీ (అంటే మచ్చ సౌష్టవం మొదటికంటే మార్పు వచ్చినా, బీ- అంటే... బార్డర్ అంటే అంచులు మారడం, మందంగా మారడం జరిగినా, సీ- అంటే కలర్ రంగు మారినా, దాన్ని చర్మం క్యాన్సర్ లక్షణాలుగా భావించవచ్చు.



హెడ్ అండ్ నెక్ క్యాన్సర్స్ స్క్రీనింగ్ కోసం...

మన దక్షిణ భారతదేశంలోని పురుషుల్లో కోలోరెక్టల్ క్యాన్సర్ తర్వాత చాలా ఎక్కువగా కనిపించేవి హెడ్, నెక్ క్యాన్సర్లే. పురుషుల్లో పొగాకు, ఆల్కహాల్ అలవాట్లు చాలామందిలో ఉంటాయి కాబట్టి ఈ క్యాన్సర్లు మగవారిలోనే ఎక్కువగా కనిపిస్తుంటాయి.

ఒకసారి హెడ్ అండ్ నెక్ క్యాన్సర్ వచ్చిన వారు ఏడాదికోసారి డాక్టర్‌ను కలిసి స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి. ఒకసారి వచ్చి తగ్గినవాళ్లు ఆ మొదటి ఏడాదిలో ప్రతి మూడు నెలలకొకసారి, ఆ తర్వాత నాలుగేళ్ల వరకు ప్రతి ఆర్నెల్లకు ఒకసారి పరీక్షలు చేయించుకోవాలి.

హెడ్ అండ్ నెక్ స్క్రీనింగ్ కోసం పరీక్షల్లో కొన్ని: సాధారణంగా తలకు చేసే ఎమ్మారై, సీటీలతో పాటు కొన్ని రక్తపరీక్షలు, పనోరమిక్ డెంటల్ ఎక్స్-రే, డెంటల్ కోన్ బీమ్ సీటీ, అవసరాన్ని బట్టి పెట్/సీటీ పరీక్షలతోపాటు ఎండోస్కోపీ, బయాప్సీ (తలలో అనుమానం ఉన్నచోటి నుంచి చిన్న ముక్క తీసి పరీక్షించడం).

ఊపిరితిత్తుల క్యాన్సర్...

ఇది ముఖ్యంగా మనదేశంలోని పురుషుల్లో చాలా ఎక్కువ. ఇక సిగరెట్ / బీడీ/ చుట్ట / ఇతరత్రా పొగ తాగే అలవాటు ఉన్నవాళ్లలో మరీ ఎక్కువ. తమ పొగతాగే అలవాటునే ఈ క్యాన్సర్‌కు హైరిస్క్‌గా పరిగణించాలి. ఈ అలవాటున్న వాళ్లు తమలో ఎలాంటి అసౌకర్యంగాని, దగ్గు వంటి లక్షణాలుగాని కనిపిస్తే తక్షణం పరీక్షలు చేయించుకోవాలి.

- సాధారణ చెస్ట్ ఎక్స్-రే, స్పూటమ్ సైటాలజీ పరీక్షతోపాటు హై రెజల్యూషన్ సీటీ స్కాన్ ద్వారా దీన్ని కనుగొంటారు.

స్టమక్ క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం...

ఈ కింద పేర్కొన్న గ్రూపులు స్టమక్ క్యాన్సర్ రావడానికి మరింత ఎక్కువ ముప్పు కలిగి ఉంటారు. ఈ హైరిస్క్ వర్గాలవారు ఎవరంటే...

- 'పర్నీసియస్ ఎనిమియా' అనే ఒక తరహా రక్తహీనతతో బాధపడుతూ, కాస్తంత వయసు పైబడ్డవారు.
- గతంలో అల్సర్‌కు ఆపరేషన్ (గ్యాస్ట్రెక్టమీ) చేయించుకున్న వారు
- 'ఫెమీలియల్ అడెనోమేటస్ పాలిపోసిస్' తరహా పాలిప్స్ (కండ పెరిగిన) వాళ్లు
- హెలికోబాక్టర్ పైలోరీ (హెచ్ పైలోరీ) అనే సూక్ష్మజీవి వల్ల ఇన్ఫెక్షన్ వచ్చినవాళ్లు...

అవసరమైన స్క్రీనింగ్ పరీక్ష : పైన పేర్కొన్నవాళ్లంతా కడుపులో క్యాన్సర్ కనుక్కోవడానికి తరచూ 'డబుల్ కాంట్రాస్ట్ బేరియం' పరీక్ష, ఎండోస్కోపీ చేయించుకుంటూ ఉండాలి.

- పై రిస్క్ గ్రూపులతో పాటు ఆహారంలో ఉప్పు ఎక్కువగా తీసుకునేవాళ్లు, పొగతాగే అలవాటున్న వాళ్లూ, ఆహారంలో విటమిన్ ఏ, విటమిన్ సీ తక్కువగా తీసుకునేవారితో పాటు రబ్బరు పరిశ్రమల్లో, బొగ్గుపని చేసేవాళ్లు ఎక్కువగా తరచూ ఈ పరీక్షలు చేయించుకోవడం మంచిది.

క్యాన్సర్లను గుర్తించేందుకు కొన్ని సాధారణ లక్షణాలు ...

- కారణం తెలియకుండానే అకస్మాత్తుగా బాగా బరువు తగ్గడం
- ఆకలి తగ్గడం
- ఎడతెరిపి లేకుండా దగ్గు
- లింఫ్ గ్లాండ్స్ (బాహుమూలాల్లో, గజ్జల్లో, గొంతు దగ్గర) వాపు
- ఆయా అవయవాల్లోంచి రక్తస్రావం... ఇవి సాధారణంగా కనిపించే లక్షణాలు. అయితే ఈ లక్షణాలన్నీ చాలామందిలో సాధారణ సమస్యలకూ కనిపిస్తాయి కాబట్టి ఇవి కనిపించగానే అది క్యాన్సరేనేమో అంటూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కాకపోతే స్క్రీనింగ్ పరీక్షలను చేయించుకుని, అది క్యాన్సర్ కాదని నిర్ధారణ చేసుకున్న తర్వాత నిశ్చింతగా ఉండవచ్చు.

బిజినెస్ రీల్

ఐపీవోకు వీడా క్లినికల్ రీసెర్చ్

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు

న్యూఢిల్లీ: క్లినికల్ రీసెర్చ్ కంపెనీ వీడా క్లినికల్ రీసెర్చ్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా కంపెనీ రూ. 185 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 1.3 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. కాగా.. ఇంతక్రితం కంపెనీ 2021 సెప్టెంబర్‌లోనూ ఐపీవో చేపట్టేందుకు వీలుగా సెబీకి ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. సెబీ నుంచి అనుమతి లభించినప్పటికీ పరిస్థితులు అనుకూలించక ఐపీవోను పక్కనపెట్టింది. కంపెనీ ప్రధానంగా వివిధ దశల ఔషధ అభివృద్ధిలో సర్వీసులు అందిస్తోంది. తొలి దశసహా చివరి దశ క్లినికల్ ట్రయల్స్ తదితర సేవలు సమకూర్చుతోంది.

జీఎస్ఎంఏ చైర్మన్‌గా గోపాల్ విఠల్



న్యూఢిల్లీ: ప్రపంచ వ్యాప్తంగా మొబైల్ నెట్‌వర్క్ ఆపరేటర్స్‌కు నేతృత్వం వహిస్తున్న జీఎస్ఎంఏ బోర్డ్ చైర్మన్‌గా ఎయిర్‌టెల్ వైస్ చైర్మన్, ఎండీ గోపాల్ విఠల్ ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు ఆయన డిప్యూటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. టెలిఫోనికా చైర్మన్, సీఈవో పదవికి హోసే మరియా అల్వరేస్ ప్యాలే రాజీనామా చేయడంతో జీఎస్ఎంఏ చైర్మన్ పదవి కోల్పోయారు. జీఎస్ఎంఏ డిప్యూటీ చైర్మన్‌గా ఇటీవలే గోపాల్ విఠల్ తిరిగి నియమితులయ్యారు. అసోసియేషన్ బోర్డు సభ్యుడిగా 2019-20లో పనిచేశారు. 1,100లకుపైగా టెలికం, హ్యాండ్‌సెట్, డివైస్, సాఫ్ట్‌వేర్, ఎక్విప్‌మెంట్, ఇంటర్నెట్ రంగ కంపెనీలు జీఎస్ఎంఏలో సభ్యులుగా ఉన్నాయి.

టీవీఎస్ టూవీలర్స్ ప్రెసిడెంట్‌గా గౌరవ్ గుప్తా



న్యూఢిల్లీ: వాహన తయారీ సంస్థ టీవీఎస్ మోటార్ కంపెనీ టూవీలర్స్ బిజినెస్ ప్రెసిడెంట్‌గా గౌరవ్ గుప్తా నియమితులయ్యారు. ఇంటర్నల్ కంబషన్ ఇంజన్, ఈవీ విభాగాలకు ఆయన నేతృత్వం వహిస్తారని కంపెనీ సోమవారం తెలిపింది. గతంలో ఆయన ఎంజీ మోటార్ ఇండియా ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్, డిప్యూటీ ఎండీ, చీఫ్ గ్రోత్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

4-2-2025

విశాఖ	490-00
చిత్తూరు	533-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	465-00
విజయవాడ	500-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	460-00
వరంగల్	462-00
రిటైల్ ధర	5.20

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJFINANCE	8,410.00	5.12
SHRIRAMFIN	548.05	3.06
M&M	3,169.00	3
WIPRO	313.1	2.72
BAJAJFINSV	1,794.75	2.32

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
LT	3,285.95	-4.69
TATACONSUM	1,037.00	-3.07
HEROMOTOCO	4,270.80	-2.98
COALINDIA	374.2	-2.88
BEL	273.8	-2.84

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,183
ఎన్ఎస్ఈ	1,04,886
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,76,888
ఎఫ్ఐఐ	- 3,958
డీఐఐ	+ 2,708

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	72.73 (రాత్రి 11.30కు)	$ 72.53 (క్రితం ముగింపు)
బ్రెంట్	75.74 (రాత్రి 11.30కు)	$ 75.67 (క్రితం ముగింపు)

షార్ట్ వీడియో ప్లాట్‌ఫామ్‌ల జోరు

వినూత్న ఆదాయ మార్గాలతో గాడిలోకి ● చిన్న పట్టణాల కస్టమర్ల కోసం కంటెంట్

న్యూఢిల్లీ: దేశీయ షార్ట్ వీడియో ప్లాట్‌ఫామ్‌లు కరోనా మహమ్మారి తర్వాత మళ్లీ పుంజుకుంటున్నాయి. వినూత్న ఆదాయ మార్గాల వ్యూహాలు, హైపర్-లోకల్ కంటెంట్ ఇందుకు దోహదం చేస్తోంది. 2020లో టిక్‌టాక్ నిషేధం తర్వాత పుట్టుకొచ్చిన మోజ్, జోష్, చింగారీ, ఎంఎక్స్ టకాటక్ వంటి ప్లాట్‌ఫామ్‌లు తిరిగి వృద్ధి సంకేతాలను చూపుతున్నాయి. ఈ రంగం 200 మిలియన్ డాలర్ల వ్యాపారాన్ని అధిగమించింది. విస్తరణకు భారీ అవకాశాలు ఉన్నాయని రెడ్‌సీర్ నివేదిక వెల్లడించింది. ప్రకటనల ఆదాయాలను పెంచుకోవడానికి, యూట్యూబ్ షార్ట్స్, ఇన్‌స్టాగామ్ వంటి అంతర్జాతీయ దిగ్గజాలతో పోటీపడటానికి సవాళ్లను ఎదుర్కొన్నందున ఈ ప్లాట్‌ఫామ్‌లు మందగించాయి. అయితే తృతీయ, నాల్గవ తరగతి నగరాలు, భారతీయులను చేరుకునే లక్ష్య వ్యూహాలతో ప్రత్యేకతను చాటుకుంటున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.

కొత్త ఆదాయ మార్గాలు..

ఇన్‌స్టాగామ్, యూట్యూబ్ షార్ట్స్ వంటి ప్లాట్‌ఫామ్‌లు పట్టణ, ప్రపంచ వ్యాప్తంగా వివిధ సంస్కృతులు, దేశాల నుండి చలనచిత్రాలు, మీడియాను వినియోగించే విభిన్న ప్రేక్షకుల సమూహాలకు సేవలను అందిస్తున్నాయి. దీంతో దేశీయ ప్లాట్‌ఫామ్‌లకు చిన్న నగరాల్లో అవకాశాలు భారీగా ఉంటున్నాయి. దేశీయ ప్లాట్‌ఫామ్‌లు కూడా ప్రత్యేక ఆదాయ



మార్గాల మోడళ్లను అనుసరిస్తున్నాయని అర్థ వెంచర్ ఫండ్ మేనేజింగ్ పార్ట్‌నర్ అనిరుధ్ ఏ దమాని తెలిపారు. ఈ వేదికల పునరుద్ధరణకు కొత్త ఆదాయ మార్గాలు ప్రధానమైనవి. బ్రాండ్ భాగస్వామ్యాలు, పాయింట్స్, రివార్డ్స్, ఈ-కామర్స్ అనుసంధానం వంటి భారత్ ఆధారిత విధానాలు దేశీయ షార్ట్ వీడియో ప్లాట్‌ఫామ్స్‌ను పునర్నిర్మిస్తున్నాయి.

నేరుగా ఆదాయం..

ప్రకటనలతో సంబంధం లేకుండా కంటెంట్ క్రియేటర్స్ నేరుగా ఆదాయం ఆర్జించేందుకు చింగారికి చెందిన గారి నెట్‌వర్క్ క్రిప్టోకరెన్సీ, సోషల్ టోకెన్లను ఉపయోగిస్తోంది. రొపోసో ఒక అడుగు ముందుకేసి కంటెంట్‌లో ఈ-కామర్స్‌ను జోడించింది. తద్వారా వినియోగదారులు నేరుగా యాప్‌లో షాపింగ్ చేయడానికి వీలు కల్పిస్తోంది. 18 కోట్లకుపైగా క్రియాశీల వినియోగదారులతో స్మార్ట్‌ఫోన్ బ్రాండ్స్‌తో జోష్ భాగస్వామ్యాన్ని పెంచుకుంది. కార్యకలాపాలను బలోపేతం చేయడానికి ప్రాంతీయ భాషలపై దృష్టి సారించింది. మొహల్లా టెక్ ప్రమోట్ చేస్తున్న మోజ్ యాప్ 2022-23లో 33 శాతం వృద్ధితో రూ.540 కోట్ల టర్నోవర్ నమోదు చేసింది.

3.3 బిలియన్ డాలర్లకు..

దేశీయ కంటెంట్, హైపర్-లోకల్ అనుసంధానంపై దృష్టి సారించడం దేశీయ వీడియో ప్లాట్‌ఫామ్‌ల వృద్ధిలో కీలకమైనంది. ద్వితీయ, తృతీయ శ్రేణి మార్కెట్ల వినియోగదారులు ప్రాధాన్యతగా జోష్ కంటెంట్ 80 శాతం కంటే ఎక్కువ ప్రాంతీయ భాషల్లో ఉంది. సాంస్కృతిక, స్థానికులకు అవసరమైన కంటెంట్‌ను ఈ ప్లాట్‌ఫామ్‌లు అందిస్తున్నాయి. ఈ విషయంలో సంప్రదాయ ప్లాట్‌ఫామ్‌లు చాలా కష్టపడుతున్నాయని దమానీ అన్నారు. అలైడ్ మార్కెట్ రీసెర్చ్ ప్రకారం అంతర్జాతీయంగా షార్ట్ వీడియో మార్కెట్ 2023లో 1.6 బిలియన్ డాలర్ల నుండి 2032 నాటికి 8.1 శాతం సగటు వార్షిక వృద్ధితో 3.3 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని అంచనా వేసింది. 2023-24లో 90-100 మిలియన్ డాలర్ల ప్రకటనల ఆదాయాన్ని ఆర్జించినప్పటికీ.. దేశీయ షార్ట్ వీడియో ప్లాట్‌ఫామ్‌ల వాటా భారత మొత్తం డిజిటల్ ప్రకటన వ్యయంలో కేవలం 1-1.5 శాతమే.

లాభదాయక ప్రత్యామ్నాయం..

వర్చువల్ టిప్పింగ్, ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్ లాభదాయక ప్రత్యామ్నాయాలుగా అభివృద్ధి చెందుతున్నాయి. వర్చువల్ టిప్పింగ్ మార్కెట్ మాత్రమే 70-220 మిలియన్ డాలర్ల నుండి 2030 నాటికి 700-800 మిలియన్ డాలర్లకు పెరుగుతుందని రెడ్‌సీర్ అంచనా వేసింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత వ్యక్తిగతీకరణ, డేటా అనలిటిక్స్, వ్యక్తిగతీకరించిన కంటెంట్ రూపకల్పనలో పెట్టుబడులు వినియోగదార్లతో అనుసంధానాన్ని మెరుగుపరిచాయి. వీక్షకుల సంఖ్యను పెంచుకోవడానికి మధ్యప్రాచ్యం, ఆగ్నేయాసియా, ఉత్తర అమెరికా వంటి ప్రాంతాల్లోని ప్రవాసులపై దేశీయ వీడియో ప్లాట్‌ఫామ్‌లు దృష్టి సారిస్తున్నాయి. ఈ ప్లాట్‌ఫామ్‌లు కేవలం క్రియేటర్లు, మార్కెటర్ల అవసరాలను తీర్చడానికి మాత్రమే అభివృద్ధి చెందడం లేదు.. కానీ స్థిర, దీర్ఘకాలిక వృద్ధికి తమను తాము నిలబెట్టుకుంటాయని ఐవీపీ సహ వ్యవస్థాపకుడు, ఫిసిస్ క్యాపిటల్ భాగస్వామి మితేష్ షా తెలిపారు.

వడ్డీ రేట్లు పావు శాతం తగ్గొచ్చు

- రేపటి నుంచే ఎంపీసీ సమీక్ష
- 7న వెలువడనున్న నిర్ణయాలు

ముంబై: కీలక వడ్డీ రేట్ల కోతను ఆర్‌బీఐ ఈ వారంలో జరిగే సమీక్షతో షురూ చేయొచ్చని ప్రముఖ ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. కొత్త ఆర్‌బీఐ గవర్నర్‌గా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన సంజయ్ మల్హోత్రా ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యుల మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) తొలిసారిగా ఈ నెల 5 నుంచి 7వ తేదీ మధ్య భేటీ కానుంది. ఈ సందర్భంగా రెపో రేటును (వాణిజ్య బ్యాంకులకు ఇచ్చే స్వల్పకాలిక రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే రేటు) 25 బేసిస్ పాయింట్లు (0.25 శాతం) తగ్గించొచ్చని భావిస్తున్నారు. రెండేళ్లుగా కీలక రెపో, రివర్స్ రెపో (ఆర్‌బీఐ వద్ద బ్యాంకులు ఉంచే నిధులపై చెల్లించే రేటు)ను ఆర్‌బీఐ ఎలాంటి మార్పులు చేయకుండా కొనసాగిస్తోంది. కేంద్ర బడ్జెట్‌లో వినియోగానికి మద్దతుగా ఆదాయపన్ను విషయంలో పెద్ద ఎత్తున



ఊరట కల్పించినందున, దీనికి కొనసాగింపుగా వ్యవస్థలో లిక్విడిటీ పెంపు, వృద్ధికి మద్దతుగా ఆర్‌బీఐ నిర్ణయాలు తీసుకోవచ్చన్న అభిప్రాయాలు వినపడుతున్నాయి. ముఖ్యంగా ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ గరిష్ట నియంత్రణ పరిధి 6 శాతం లోపే ఉన్నందున రేట్ల తగ్గింపునకు వెసులుబాటు ఉందని నిపుణులు అంటున్నారు. సెప్టెంబర్ త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు ఏడు కనిష్టాల త్రైమాసిక స్థాయిలో 5.4 శాతానికి పడిపోవడం గమనార్హం.

ఇవీ సానుకూలతలు..

''రేట్ల తగ్గింపునకు రెండు బలమైన కారణాలున్నాయి. ఆర్‌బీఐ ఇప్పటికే లిక్విడిటీ పెంచే చర్యలకు శ్రీకారం చుట్టింది. దీంతో మార్కెట్ పరిస్థితులు మెరుగుపడ్డాయి. ఇది రేట్ల కోత ముందస్తు సూచికగా ఉంది''అని బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ ఎకనమిస్ట్ మదన్ సబ్నవిస్ తన అభిప్రాయాలు వెల్లడించారు. కేంద్ర బడ్జెట్‌లో చర్యలకు మద్దతుగా రెపో రేటును తగ్గించొచ్చన్నారు. ''కేంద్ర బడ్జెట్‌లో ద్రవ్యపరమైన ఉద్దీపనలు ద్రవ్యోల్బణంపై గణనీయమైన ప్రభావం చూపిస్తాయని భావించడం లేదు. కనుక 2025 ఫిబ్రవరి సమీక్షలో రేట్ల కోతకు సానుకూలతలు ఉన్నాయి''అని ఇక్రా రేటింగ్స్ రీసెర్చ్ హెడ్, చీఫ్ ఎకనమిస్ట్ అదితి నాయర్ అభిప్రాయపడ్డారు. ఒకవేళ ఈ వారంలో రూపాయి విలువ మరింత బలహీనపడే అంతర్జాతీయ పరిణామాలు చోటుచేసుకుంటే రేట్ల కోత వాయిదా పడొచ్చన్నారు.

రూ. 85 కోట్ల సమీకరణలో నెట్‌లింక్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంటర్నెట్ మౌలిక సదుపాయాలు, సేవల రంగ సంస్థ నెట్‌లింక్స్ లిమిటెడ్ తాజాగా రూ. 85 కోట్లు సమీకరించనుంది. వారంట్ల ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా ఈ నిధులను సమీకరించేందుకు డైరెక్టర్ల బోర్డు ఆమోదముద్ర వేసినట్లు కంపెనీ తెలిపింది. దీని ప్రకారం ఒక్కొక్కటి రూ. 85 రేటుకు కంపెనీ 1 కోటి వారంట్లను జారీ చేయనుంది. వారంట్ల ఇష్యూకి సంబంధించి షేర్‌హోల్డర్ల అనుమతి తీసుకునేందుకు మార్చి 5న అసాధారణ సమావేశం (ఈజీఎం) నిర్వహించనున్నట్లు సంస్థ తెలిపింది. సమీకరించిన నిధులను వ్యాపార వృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనను వేగవంతం



చేసేందుకు ఉపయోగించుకోనున్నట్లు సంస్థ ఎండీ మనోహర్ లోకా రెడ్డి తెలిపారు. తమ ఆర్థిక స్థితిని మరింత పటిష్టం చేసుకునేందుకు ఇది ఉపయోగపడగలదని వివరించారు.

సెవెన్ టెక్‌లో పేటీఎమ్ పెట్టుబడి

25 శాతం వాటా కొనుగోలు

న్యూఢిల్లీ: పేటీఎమ్ క్లౌడ్ టెక్నాలజీస్ తాజాగా బ్రెజిలియన్ టెక్నాలజీ సంస్థ సెవెన్ టెక్నాలజీ ఎల్ఎల్‌సీలో 25 శాతం వాటా కొనుగోలు చేసింది. తద్వారా ఫిన్‌టెక్ దిగ్గజం పేటీఎమ్ సొంత అనుబంధ సంస్థ లాటిన్ అమెరికాలో బిజినెస్ అవకాశాలను అందిపుచ్చుకునే యోచనలో ఉంది. ఈ బాటలో విదేశాలలో వ్యాపార అవకాశాలను అన్వేషించేందుకు వీలుగా గత నెలలో పేటీఎమ్ క్లౌడ్ టెక్నాలజీస్ ఏర్పాటుకు పేటీఎమ్ బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కాగా.. సెవెన్ టెక్నాలజీస్ ఎల్ఎల్‌సీలో



మిలియన్ డాలర్లు(రూ. 8.7 కోట్లు) ఇన్వెస్ట్ చేసేందుకు బోర్డు అనుమతించినట్లు తాజాగా పేటీఎమ్ వెల్లడించింది. తద్వారా 25 శాతం వాటాను కొనుగోలు చేయనున్నట్లు తెలియజేసింది.

జోరందుకున్న తయారీ రంగం

- ఆరు నెలల గరిష్టానికి వృద్ధి
- జనవరిలో 57.7కు పీఎంఐ సూచీ



న్యూఢిల్లీ: భారత తయారీ రంగం జనవరి నెలకు పటిష్టమైన వృద్ధిని నమోదు చేసింది. హెచ్ఎస్‌బీసీ ఇండియా తయారీ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) గత డిసెంబర్‌లో 56.4 శాతంగా ఉంటే, 2025 జనవరి నెలలో 57.7కు దూసుకువెళ్లింది. ఎగుమతులు 14 ఏళ్లలోనే (2011 తర్వాత) బలమైన వృద్ధిని చూపించడం ఇందుకు మద్దతుగా నిలిచినట్టు ఈ సర్వే అభిప్రాయపడింది. 50 పాయింట్లకు పైన తయారీ పీఎంఐ నమోదు అయితే దాన్ని విస్తరణగా, అంతకు దిగువకు పడిపోతే క్షీణతగా పరిగణిస్తుంటారు. ''భారత తయారీ పీఎంఐ ఆరు నెలల గరిష్ట స్థాయికి జనవరిలో చేరుకుంది. దేశీ, ఎగుమతుల డిమాండ్ బలంగా ఉంది. ఇది వృద్ధికి మద్దతునిచ్చింది''అని హెచ్ఎస్‌బీసీ ముఖ్య భారత ఆర్థిక వేత్త ప్రంజుల్ భండారీ తెలిపారు. తయారీదారులకు కొత్త ఆర్డర్లలో వృద్ధి ఉన్నట్టు, దీనికి అనుగుణంగా తమ ఉత్పత్తిని పెంచుకుంటున్నట్టు పీఎంఐ సర్వే తెలిపింది. రానున్న కాలంలో 32 శాతం సంస్థలు వృద్ధి పట్ల సానుకూల అంచనాలతో ఉంటే, కేవలం ఒక శాతం సంస్థలు క్షీణతను అంచనా వేస్తున్నట్టు వెల్లడించింది.

క్యూ3 ఫలితాలు

తాజ్ జీవీకే లాభం రూ. 34 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో తాజ్‌జీవీకే హోటల్స్ అండ్ రిసార్ట్స్ నికర లాభం రూ. 34 కోట్లుగా నమోదైంది. గత క్యూ3లో ఇది రూ. 24 కోట్లు. మరోవైపు, ఆదాయం రూ. 114 కోట్ల నుంచి రూ. 129 కోట్లకు పెరిగింది. ఇక తొమ్మిది నెలలకు గాను లాభం రూ. 49 కోట్ల నుంచి రూ. 66 కోట్లకు చేరగా ఆదాయం రూ. 294 కోట్ల నుంచి రూ. 331 కోట్లకు పెరిగింది. క్యూ3లో ఆదాయం పరంగా రెండంకెల స్థాయిలో 15 శాతం వృద్ధి సాధించినట్లు కంపెనీ చైర్మన్ జీవీకే రెడ్డి తెలిపారు. ప్రాపర్టీలను మెరుగుపర్చిన తర్వాత మార్జిన్లు 300 బేసిస్ పాయింట్ల (3 శాతం) మేర మెరుగుపడినట్లు వివరించారు. బెంగళూరులోని యెలహం



కలో నిర్మిస్తున్న 256 గదుల తాజ్ హోటల్ 2026 ఆర్థిక సంవత్సరం ఆఖరు త్రైమాసికంలో ప్రారంభం కాగలదని కంపెనీ తెలిపింది.

సోమవారం బీఎస్ఈలో తాజ్ జీవీకే హోటల్స్ అండ్ రిసార్ట్స్ షేరు ధర సుమారు 8% పెరిగి రూ. 408 వద్ద క్లోజయ్యింది.

గ్లాండ్ ఫార్మా లాభం రూ.204 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీలో ఉన్న గ్లాండ్ ఫార్మా డిసెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 7 శాతం వృద్ధి చెంది రూ.204 కోట్లు నమోదు చేసింది. ఎబిటా 1 శాతం పెరిగి రూ.360 కోట్లుగా ఉంది. ఎబిటా మార్జిన్ 23 నుంచి 26 శాతానికి ఎగసింది. టర్నోవర్ 10 శాతం క్షీణించి రూ.1,384 కోట్లకు వచ్చి చేరింది. యూఎస్ఏ, యూరప్, భారత మార్కెట్లలో ఆదాయం తగ్గింది. కెనడా, ఆస్ట్రేలియా, న్యూజీలాండ్ మార్కెట్లలో వ్యాపారం 20 శాతం పెరిగింది. గ్లాండ్ ఫార్మా షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్ఈలో సోమవారం 0.56 శాతం క్షీణించి రూ.1,520.20 వద్ద స్థిరపడింది.

65 శాతం పెరిగిన దివీస్ లాభం




హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీ సంస్థ దివీస్ ల్యాబొరేటరీస్ డిసెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికర లాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 65 శాతం ఎగసి రూ.589 కోట్లు సాధించింది. ఎబిటా 52 శాతం అధికమై రూ.698.7 కోట్లు నమోదైంది. ఎబిటా మార్జిన్ 26.4 నుంచి 32 శాతంగా ఉంది. టర్నోవర్ రూ.1,855 కోట్ల నుంచి రూ.2,319 కోట్లకు చేరింది. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ వద్ద నిర్మిస్తున్న యూనిట్-3లో తొలి దశ పూర్తి అయి జనవరి 1 నుంచి ఉత్పత్తి కార్యకలాపాలు ప్రారంభం అయ్యాయని కంపెనీ ప్రకటించింది. ఆరు నెలల్లో తరువాతి దశ పనులు పూర్తి అవుతాయని వెల్లడించింది. దివీస్ ల్యాబొరేటరీస్ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్ఈలో సోమవారం 4.75 శాతం వృద్ధి చెంది రూ.5,889.30 వద్ద స్థిరపడింది.

సావరీన్ రేటింగ్‌కు ‘క్షీణత రిస్క్’

- పెద్ద ఆర్థిక షాక్‌లతో రేటింగ్ తగ్గొచ్చు
- 2025-26 బడ్జెట్ వృద్ధికి తటస్థమే
- ఫిచ్ రేటింగ్స్ అభిప్రాయం

న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ రుణ భారం తగ్గించుకోవడం క్రమ విధానంలో ఉందని.. ఒకవేళ ఏవైనా పెద్ద ఆర్థిక షాక్‌లు ఎదురైతే ఇది మరింత పెరగొచ్చని (దిగువ వైపు రిస్క్) ఫిచ్ రేటింగ్స్ తెలిపింది. దీంతో సార్వభౌమ రేటింగ్ తగ్గుదల రిస్క్ పొంచి ఉన్నట్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. ''అదే సమయంలో మధ్య కాలానికి సంబంధించి ద్రవ్య కార్యాచరణను కట్టుబడే విషయంలో, రుణ భారాన్ని తగ్గించుకునే విషయంలో విశ్వాసం పెరిగింది. ఇది నిర్ణీత కాలానికి సార్వభౌమ రేటింగ్ పరంగా సానుకూలం''అని ఫిచ్ రేటింగ్స్ తెలిపింది. చివరిసారిగా 2024 ఆగస్ట్‌లో భారత్‌కు బీబీబీ మైనస్, స్టెబుల్ (స్థిరత్వం) రేటింగ్‌ను కొనసాగిస్తున్నట్టు ఫిచ్ రేటింగ్స్ ప్రకటించింది. పెట్టుబడుల పరంగా ఇది కనిష్ట రేటింగ్. 2006 ఆగస్ట్ నుంచి భారత్‌కు ఇదే రేటింగ్‌ను ఫిచ్ కొనసాగిస్తూ వస్తోంది. 2024-25 సంవత్సరానికి జీడీపీలో ద్రవ్యోలోటును 4.8 శాతానికి కట్టడి



చేయనున్నట్టు, 2025-26లో దీన్ని 4.4 శాతానికి తగ్గించుకోనున్నట్టు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో ప్రకటించడం తెలిసిందే. ఆర్థిక వృద్ధి బలహీన పడిన తరుణంలోనూ రుణ భారం తగ్గింపునకు ప్రభుత్వం కట్టుబడి ఉండడాన్ని ఫిచ్ రేటింగ్స్ భారత ప్రైమరీ సావరీన్ అనలిస్ట్ జెరేమీ జూక్ ఈ సందర్భంగా ప్రశంసించారు. అంచనాలు వాస్తవికంగా ఉన్నాయంటూ, వాటిని భారత్ సాధించొచ్చని అభిప్రాయపడ్డారు. అయితే బలహీన ఆర్థిక వృద్ధి నేపథ్యంలో ఆదాయం వసూళ్లు చెప్పుకోతగ్గ స్థాయిలో తగ్గిపోవచ్చని హెచ్చరించారు. దీనికి అదనంగా ఖర్చు నియంత్రణ చర్యలు అవసరం కావొచ్చన్నారు.

వృద్ధికి తటస్థం

2025-26 బడ్జెట్ వృద్ధికి తటస్థంగా ఉన్నట్టు ఫిచ్ రేటింగ్స్ తెలిపింది. పన్నుల తగ్గింపుతో వినియోగానికి ఊతమివ్వడం, స్థిరమైన మూలధన వ్యయాలు అనేవి ద్రవ్యలోటు తగ్గింపు ప్రతికూలతలను భర్తీ చేయొచ్చని ఫిచ్ రేటింగ్స్ తెలిపింది. నియంత్రణల తొలగింపు ద్వారా పెట్టుబడులను ఇతోధికం చేసే విధానం మధ్య కాలానికి వృద్ధిని సానుకూలమని, విధానాల కచ్చితమైన అమలుపైనే విజయం ఆధారపడి ఉంటుందని పేర్కొంది. వృద్ధి, ద్రవ్యలోటు తగ్గింపు మధ్య సమతుల్యత అన్నది మరింత సవాలుతో కూడినదిగా తెలిపింది. రానున్న సంవత్సరాల్లో అంచనాల కంటే ఆదాయం తక్కువగా ఉండొచ్చని.. కఠినమైన వ్యయ నియంత్రణలు, మూలధన వ్యయ నియంత్రణల ప్రాముఖ్యాన్ని ఇది తెలియజేస్తున్నట్టు పేర్కొంది. మధ్య కాలానికి ద్రవ్యలోటు పట్ల ప్రభుత్వం గొప్ప స్పష్టత ఇచ్చిందని తెలిపింది. 2031 మార్చి నాటికి జీడీపీలో రుణభారాన్ని 50 శాతానికి తగ్గించుకోనున్నట్టు బడ్జెట్‌లో ప్రకటించడాన్ని గుర్తు చేసింది. 2025 మార్చి నాటికి అంచనాలతో పోల్చితే 7 శాతం తగ్గనుంది.

సావరీన్ రేటింగ్ యథాతథం

ప్రస్తుతం అప్‌గ్రేడ్ చేయబోం: మూడీస్

వచ్చే ఏడాదికి ద్రవ్య లోటును జీడీపీలో 4.4 శాతానికి కట్టడి చేసేందుకు ఆర్థిక శాఖ ప్రతిపాదించిన నేపథ్యంలో ఇండియా సావరీన్ రేటింగ్‌ను వెంటనే అప్‌గ్రేడ్ చేయబోమని రేటింగ్స్ దిగ్గజం మూడీస్ స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దే బాటలో సమర్థవంత చర్యలకు తెరతీస్తుండటాన్ని సానుకూలంగా పరిగణిస్తున్నట్లు మూడీస్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ క్రిస్టియన్ డి గజ్‌మన్ పేర్కొన్నారు. అయితే ద్రవ్య లోటు కట్టడి, ఆర్థిక క్రమశిక్షణ తదితరాల కారణంగా మెరుగుపడనున్న రుణ సామర్థ్యం, రుణభారం తదితరాలతో సావరీన్ రేటింగ్ పెంపునకు త్వరపడబోమని తెలియజేశారు. ప్రస్తుతం మూడీస్ దేశీ సావరీన్ రేటింగ్‌ను సుస్థిర ఔట్‌లుక్‌తో బీఏఏ3గా కొనసాగిస్తోంది. ఇది కనీస ఇన్వెస్ట్‌మెంట్ గ్రేడ్ రేటింగ్‌కాగా.. తాజా బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి సీతారామన్ ఈ ఏడాది(2024-25) ద్రవ్య లోటు 4.8 శాతానికి పరిమితంకానున్నట్లు అభిప్రాయపడ్డారు. 2025-26లో 4.4 శాతానికి కట్టడి చేసే ప్రణాళికలు ప్రకటించారు.

5న భారత్‌కు చాట్ జీపీటీ ఆల్ట్‌మన్

న్యూఢిల్లీ: చాట్‌జీపీటీని అభివృద్ధి చేసిన ఓపెన్ఏఐ సీఈవో సామ్ ఆల్ట్‌మాన్ ఫిబ్రవరి 5న భారత్‌కు వస్తున్నట్టు సమాచారం. ఈ పర్యటనలో ఉన్నత స్థాయి ప్రభుత్వ అధికారులను కలవడంతోపాటు పరిశ్రమ పెద్దలతో చర్చాగోష్టిలో ఆయన పాల్గొనాలని భావిస్తున్నారని అధికార వర్గాలు సోమవారం తెలిపాయి. రెండేళ్లలో ఆయన భారత్‌కు రావడం ఇది రెండవసారి. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లో ఓపెన్ఏఐ ఆధిపత్యాన్ని చైనాకు చెందిన డీప్‌సీక్ అకస్మాత్తుగా సవాలు చేసిన ఈ తరుణంలో ఆల్ట్‌మాన్ భారత్ సందర్శన ఆసక్తిగా మారింది. యునైటెడ్ స్టేట్స్ వెలుపల ఉద్భవిస్తున్న శక్తివంతమైన ఏఐ మోడళ్ల గురించి సందేహాలను ఆయన 2023లో వ్యక్తం చేసిన వీడియో ఒకటి మళ్లీ తెరపైకి వచ్చింది. కాపీరైట్ ఉల్లంఘనల దావాలతో కూడిన కేసులతో సహా భారత్‌లో చట్టపర అడ్డంకులను ఓపెన్ఏఐ ఎదుర్కొంటున్న సమయంలో ఆల్ట్‌మన్ భారత్‌ను సందర్శించడం హాట్ టాపిక్ అయింది. బహిరంగంగా అందుబాటులో ఉన్న డేటాను మాత్రమే ఉపయోగిస్తున్నామని, విచారించడానికి భారతీయ న్యాయస్థానాలకు అధికార పరిధి లేదని ఓపెన్ఏఐ వాదించింది.

అదరగొడుతున్న ‘అభి’



విధ్వంసానికి చిరునామాగా అభిషేక్ శర్మ • సిక్సర్లతో చెలరేగుతున్న బ్యాటర్

142.3 కిలోమీటర్ల వేగంతో దూసుకొచ్చిన ఒక బంతి... ఆ తర్వాత అదే ఓవర్లో 146.1 కిలోమీటర్ల వేగంతో మరో బంతి... 147.2 కిలోమీటర్ల వేగంతో తర్వాతి బంతి... మొదటిది ఎక్స్‌ట్రా కవర్ మీదుగా బౌండరీ దాటింది. తర్వాతి షార్ట్ బంతి బ్యాక్‌వర్డ్ పాయింట్ మీదుగా, మూడోది కవర్స్ మీదుగా సిక్సర్లుగా మారాయి! ప్రపంచంలో ఫాస్టెస్ట్ బౌలర్లలో ఒకడైన జోఫ్రా ఆర్చర్‌ను ఒకే ఓవర్లో అభిషేక్ శర్మ ఇలా చితకబాదిన తీరు అతని అసలైన బ్యాటింగ్ శైలిని చూపించాయి. ఒకదానితో మరొకటి పోటీ పడినట్లుగా అభిషేక్ బాదిన భారీ సిక్సర్లలో ఈ రెండు మరింత హైలైట్‌గా నిలిచాయి. అండర్-16 స్థాయి నుంచే దూకుడైన ఆటకు మారుపేరుగా నిలిచిన అభిషేక్ ఇప్పుడు 24 ఏళ్ల వయసులో భారత్ తరఫున టి20ల్లో భీకరమైన హిట్టర్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. –సాక్షి క్రీడా విభాగం



ఐదో టి20లో తాను గెల్చుకున్న అవార్డులతో అభిషేక్ శర్మ

ఇంగ్లండ్‌తో ఆదివారం మ్యాచ్‌లో అభిషేక్ శర్మ అద్భుతమైన షాట్లతో వీరవిధ్వంసం సృష్టించిన ఇన్నింగ్స్ భారత టి20లో అత్యుత్తమ ప్రదర్శనల్లో ఒకటిగా నిలిచిపోయింది. అతను కొట్టిన 7 ఫోర్లు, 13 సిక్స్‌లు కూడా పూర్తి ఆత్మవిశ్వాసంతో కొట్టిన అసలైన క్రికెటింగ్ షాట్లే. ఒక్కటి కూడా అనుకోకుండా తగిలి లేదా ఎడ్జ్ తీసుకొని వెళ్లింది లేదు. డ్రైవ్, లాఫ్టెడ్ డ్రైవ్, ఫ్లిక్, కట్... ఇలా ఏదైనా శ్రమ లేకుండా అలవోకగా, చూడముచ్చటగా ఆడటం అభిషేక్‌కే చెల్లింది. ఇక ప్రభావాన్ని చూస్తే మాత్రం అన్ని షాట్లూ ఫలితం రాబట్టినవే. ఐపీఎల్ ద్వారానే అభిమానులకు చేరువైన అతను ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో కూడా తన బ్యాటింగ్ పదును చూపించాడు.

అక్కడే మొదలు...

భారీ షాట్లు బాదడం, సిక్సర్లతో పండగ చేసుకోవడం అభిషేక్‌కు కొత్త కాదు. తన స్వస్థలం అమృత్‌సర్‌లోని గాంధీ స్టేడియంలో చిన్నప్పటి నుంచి ప్రాక్టీస్ చేస్తున్నప్పుడే అతను ఇలా ఆడేవాడు. అతని దెబ్బకు ఎంతో విలువైన కొత్త ఎస్‌జీ, కూకూబుర్రా, డ్యూక్ బంతులు గ్రౌండ్ బయట పడేవి. చివరకు కోచ్‌లు, సిబ్బంది ఈ జోరును తగ్గించమని, లేదంటే చాలా ఖర్చు అవుతుందని అభిషేక్ తండ్రి రాజ్‌కుమార్ శర్మకు మొర పెట్టుకోవాల్సి వచ్చేది. అయితే మీకు కావాలంటే చండీగఢ్ నుంచి నేను కొత్త బంతులు కొని ఇస్తానే తప్ప శైలి మార్చుకోమని నా కొడుకుకు చెప్పను అతని ఆయన ఖరాఖండీగా తేల్చేశారు. దాంతో టీనేజ్‌లో వచ్చిన ఆ ధాటి అన్ని చోట్లా అలాగే కొనసాగింది. బీసీసీఐ అండర్-16 టోర్నీ విజయ్ మర్చంట్ ట్రోఫీలో ఒకే సీజన్ (2015-16)లో అతను ఇలాంటి బ్యాటింగ్‌తోనే ఏకంగా 1200కు పైగా పరుగులు సాధించి తానేంటో చూపించాడు.

యువరాజ్ అండతో...

దూకుడైన బ్యాటింగ్‌తో పాటు లెఫ్టార్మ్ స్పిన్‌తో కీలక ఓవర్లు వేయగల అభిషేక్ పంజాబ్ జట్టులో మిడిలార్డర్ నుంచి టాపార్డర్‌కు మారడంతో అతని బ్యాటింగ్ సత్తా అందరికీ తెలిసింది. కెప్టెన్‌గా అండర్-19 ఆసియాకప్‌ను గెలిపించిన అభిషేక్ 2018 అండర్-19 వరల్డ్ కప్ గెలిచిన జట్టులో సభ్యుడు కూడా. పంజాబ్ తొలిసారి 2023లో దేశవాళీ టి20 టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీని గెలుచుకోవడంలో అతనిదే కీలక పాత్ర. ఈ టోర్నీలో ఏకంగా 192.46 స్ట్రయిక్‌రేట్‌తో అతను 485 పరుగులు చేశాడు. ఇందులో 2 సెంచరీలు, 3 హాఫ్ సెంచరీలు ఉండగా... ఆంధ్రపై 51 బంతుల్లోనే 9 ఫోర్లు, 9 సిక్స్‌లతో చేసిన 112 పరుగులు టోర్నీలో హైలైట్‌గా నిలిచాయి. అతని ఎదుగుదలలో భారత మాజీ ఆటగాడు యువరాజ్ సింగ్ పాత్ర ఎంతో ఉంది. అభిషేక్‌కు మెంటార్‌గా యువీ ఎన్నో రకాలుగా మార్గనిర్దేశనం చేశాడు. ‘అభి’లోని హిట్టింగ్ సామర్థ్యాన్ని గుర్తించిన యువీ సరైన దిశలో ప్రోత్సహించిన ఫలితమే ఇప్పుడు ఈ సిక్సర్ల పండగ. అందుకే యువరాజ్ ఎప్పుడు, ఎక్కడ ప్రాక్టీస్‌కు పిలిచినా అభిషేక్ వెంటనే హాజరైపోతాడు.

ఐపీఎల్‌లో జోరు...

భారత క్రికెట్ అభిమానులకు అభిషేక్ విధ్వంసం విలువ 2024లోనే కనిపించింది. 2022 సీజన్‌లో కూడా సన్‌రైజర్స్ తరఫున 426 పరుగులు చేసినా గత సీజన్ మాత్రమే అతని స్థాయిని అమాంతం పెంచేసింది. ట్రవిస్ హెడ్‌తో కలిసి అతను నెలకొల్పిన భాగస్వామ్యాలు ఐపీఎల్‌లో అద్భుతాన్ని చూపించాయి. ఈ టోర్నీలో ఏకంగా 204.21 స్ట్రయిక్‌రేట్‌తో అభిషేక్ 484 పరుగులు చేసి టీమ్‌ను ఫైనల్ వరకు చేర్చాడు. ఇందులో 36 ఫోర్లు ఉంటే, సిక్స్‌లు 42 ఉన్నాయి! రెండు సార్లు సన్‌రైజర్స్ ఐపీఎల్‌లో అత్యధిక స్కోరు రికార్డులు బద్దలు కొట్టడంతో అతని పాత్రను అంతా ప్రత్యక్షంగా చూశారు. ఇదే సీజన్‌లో 16 బంతుల్లోనే హాఫ్ సెంచరీతో అతను అదరగొట్టాడు. నిజానికి పంజాబ్ గెలిచిన ముస్తాక్ అలీ ట్రోఫీ నుంచే అతని స్థాయి ఎక్కడికో వెళ్లిపోయింది. నాటి నుంచి ఆదివారం మ్యాచ్ వరకు అతను టి20ల్లో 199.47 స్ట్రయిక్‌రేట్‌తో 1893 పరుగులు చేశాడంటే అభి ఆట ఎలా సాగుతోందో అర్థమవుతుంది.

డకౌట్‌తో మొదలై...

ఐపీఎల్ మెరుపుల తర్వాత భారత్ తరఫున ఆడిన తొలి మ్యాచ్‌లో ‘డకౌట్’తో అభిషేక్ కెరీర్ మొదలైంది. అయితే దానిని మరచిపోయేలా తర్వాతి మ్యాచ్‌లో 46 బంతుల్లో సెంచరీతో అతను చెలరేగాడు. కానీ ఆ తర్వాత వరుస వైఫల్యాలతో మళ్లీ తడబాటు. దక్షిణాఫ్రికాపై రెండు మ్యాచ్‌లలో రాణించినా తాజా సిరీస్‌కు ముందు కాస్త ఒత్తిడి. కానీ కోల్‌కతాలో తొలి మ్యాచ్‌లో 34 బంతుల్లో 79 పరుగులతో చెలరేగి దానిని కాస్త తగ్గించుకోగలిగాడు. ఇప్పుడు చివరి మ్యాచ్‌కు వచ్చేసరికి అభిషేక్ విశ్వరూపం చూపించాడు. 17 మ్యాచ్‌ల టి20 కెరీర్‌లో అతను 276 బంతులు ఆడితే 46 ఫోర్లు, 41 సిక్సర్లతో 535 పరుగులు చేసి పరాక్రమించాడు. మున్ముందూ ఇదే ధాటి కొనసాగితే 2026 టి20 వరల్డ్ కప్ వరకు కూడా మనకు ఎదురుండదు.

భారత జట్టుకు ఐదు రోజుల శిబిరం

11 నుంచి చైనాలో ఆసియా మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ టోర్నీ



సింధు ప్రణయ్

న్యూఢిల్లీ: భారత స్టార్ షట్లర్, రెండు ఒలింపిక్ పతకాల విజేత పీవీ సింధు ఆసియా మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్ కోసం సన్నద్ధమయ్యేందుకు గువాహటి శిబిరంలో పాల్గొంటుంది. మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు జరిగే ఈ తుది సన్నాహక శిబిరంలో ఆమెతో పాటు లక్ష్యసేన్, హెచ్.ఎస్.ప్రణయ్, డబుల్స్ స్పెషలిస్ట్‌లు సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ షెట్టి తదితరులు పాల్గొంటారని భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) వర్గాలు తెలిపాయి. గువాహటిలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (ఎన్‌సీఈ)లో నిర్వహించే ఈ శిబిరంలో సీనియర్, స్టార్ షట్లర్లతో కలిసి జూనియర్లు పాల్గొనడం ద్వారా వారికి అనుభవ పాఠాలు, సాంకేతిక అంశాలు నేర్చుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందని ‘బాయ్’ కార్యదర్శి సంజయ్ మిశ్రా తెలిపారు. ఓ బృందంగా చెమటోడ్చడం ద్వారా వ్యక్తిగతంగా మెరుగయ్యేందుకు దోహదపడుతుందన్నారు. మహిళలు, పురుషులు కలిపి మొత్తం 14 మంది సభ్యులతో కూడిన భారత బ్యాడ్మింటన్ జట్టు ఈ శిబిరం ముగిసిన రోజే ఈనెల 8న చైనాకు బయలుదేరనుంది. క్వింగ్దావో నగరంలో ఈ నెల 11 నుంచి 16 వరకు ఆసియా మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు జరుగనున్నాయి.



తొలి రౌండ్‌లోనే శ్రీజ ఓటమి

న్యూఢిల్లీ: సింగపూర్ స్మాష్ వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) టోర్నమెంట్‌లో భారత క్రీడాకారులకు నిరాశాజనక ఫలితాలు లభించాయి. సింగిల్స్ విభాగంలో బరిలోకి దిగిన భారత క్రీడాకారులందరూ తొలి రౌండ్‌ను దాటలేకపోయారు. సోమవారం జరిగిన మహిళల సింగిల్స్‌లో పారిస్ ఒలిపింక్స్‌లో పోటీపడ్డ భారత నంబర్‌వన్ ఆకుల శ్రీజ, రెండో ర్యాంకర్ మనిక బత్రాలతోపాటు యశస్విని తొలి రౌండ్‌లో ఓటమి చవిచూశారు. శ్రీజ 5-11, 12-10, 11-9, 8-11, 11-13తో హి జుజియా (చైనా) చేతిలో, మనిక 10-12, 11-7, 10-12, 7-11తో ఎలిజబెతా సమారా (రొమేనియా) చేతిలో, యశస్విని 3-11, 2-11, 4-11తో మివా హరిమోతో (జపాన్) చేతిలో ఓడిపోయారు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ఆచంట శరత్ కమల్ (భారత్) 2-11, 11-5, 11-8, 7-11, 4-11తో కావో చెంగ్ జుయ్ (చైనీస్ తైపీ) చేతిలో, మానవ్ ఠక్కర్ (భారత్) 11-9, 9-11, 8-11, 11-7, 8-11తో పాంగ్ కొయెన్ (సింగపూర్) చేతిలో పరాజయం పాలయ్యారు. తొలి రౌండ్‌లో ఓడిన భారత ప్లేయర్లకు 5 వేల డాలర్ల (రూ. 4 లక్షల 34 వేలు) చొప్పున ప్రైజ్‌మనీతోపాటు 20 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.


నందినికి నజరానా



సాక్షి, హైదరాబాద్: ఆసియా క్రీడల కాంస్య పతక విజేత, హైదరాబాద్ యువ అథ్లెట్ అగసార నందినికి హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు, అక్షర విద్యాసంస్థల చైర్మన్ అరిశనపల్లి జగన్ మోహన్ రావు అండగా నిలిచారు. అక్షర ఇంటర్నేషనల్ స్కూల్ (ఉప్పల్ బ్రాంచ్)లో జరిగిన వార్షికోత్సవ వేడుకలో నందినిని జగన్‌మోహన్ రావు ఘనంగా సత్కరించారు. ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న జాతీయ క్రీడల్లో ఈనెల 8వ తేదీన తెలంగాణకు తరఫున బరిలోకి దిగుతున్న నందినికి రూ.1 లక్ష చెక్‌ను నగదు ప్రోత్సాహకంగా ఆయన అందించారు. భవిష్యత్‌లో కూడా నందినికి అన్ని విధాలా అండగా ఉంటానని ఈ సందర్భంగా జగన్‌మోహన్ రావు హామీ ఇచ్చారు. సాధారణ మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చి, అనేక కష్టాలను అధిగమించి ఈ స్థాయికి చేరుకున్న నందిని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని జగన్‌మోహన్ రావు సూచించారు. నందిని 2028 లాస్‌ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో పతకం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం నందిని మాట్లాడుతూ... ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేస్తే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని, అందుకు తానే ఒక ఉదాహరణ అని చెప్పింది. తల్లిదండ్రులు పిల్లల ఇష్టాలను తెలుసుకొని వారికి నచ్చిన రంగంలో ప్రోత్సహించాలని కోరింది. అనంతరం పాఠశాలలో వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నందిని పతకాలను ప్రదానం చేసింది. ఈ కార్యక్రమంలో అక్షర విద్యాసంస్థల సీఈఓ ఎ.మదన్‌మోహన్ రావు, ఫైనాన్స్ డైరెక్టర్ రామారావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సరితా రావు, ప్రిన్సిపాల్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌కు ‘బోర్డర్ మెడల్’

ఉత్తమ మహిళా క్రికెటర్‌గా అనాబెల్ • ఆస్ట్రేలియా వార్షిక అవార్డులు



హెడ్



అనాబెల్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు (సీఏ) తమ ఆటగాళ్ల అత్యుత్తమ ప్రదర్శనకు ఇచ్చే వార్షిక అవార్డులను ప్రకటించింది. పురుషుల విభాగంలో ఉత్తమ ఆటగాడిగా ట్రవిస్ హెడ్ ఎంపికయ్యాడు. గత ఏడాది కాలంలో ఆసీస్‌కు కీలక విజయాలు అందించిన హెడ్ ‘అలెన్ బోర్డర్ మెడల్’ను గెలుచుకున్నాడు. మూడు ఫార్మాట్‌లలో కలిపి 1427 పరుగులు సాధించిన హెడ్... అవార్డు కోసం జరిగిన ఓటింగ్‌లో 208 ఓట్లతో అగ్ర స్థానంలో నిలవగా, హాజల్‌వుడ్‌కు రెండో స్థానం (158) దక్కింది. బోర్డర్–గావస్కర్ ట్రోఫీలో భాగంగా అడిలైడ్‌లో భారత్‌తో జరిగిన రెండో టెస్టులో 141 బంతుల్లో 140 పరుగులు చేసిన హెడ్ ప్రదర్శన హైలైట్‌గా నిలిచింది. వన్డేల్లో అత్యుత్తమ ఆటగాడి అవార్డు కూడా హెడ్‌కే దక్కడం విశేషం. ఉత్తమ టెస్టు క్రికెటర్‌గా హాజల్‌వుడ్, ఉత్తమ టి20 క్రికెటర్‌గా ఆడమ్ జంపా నిలిచారు. ‘బ్రాడ్‌మన్ యంగ్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్’గా స్యామ్ కొన్‌స్టాస్ ఎంపికయ్యాడు. ప్రస్తుతం శ్రీలంక పర్యటనలో ఉన్న కారణంగా ఆస్ట్రేలియా జట్టు పురుషుల క్రికెటర్లు ఎవరూ ఈ అవార్డులను అందుకోలేకపోయారు.

మహిళల విభాగంలో అత్యుత్తమ క్రికెటర్‌గా అనాబెల్ సదర్లాండ్ నిలిచింది. ఓటింగ్‌లో యాష్లీ గార్డ్‌నర్ (143 పాయింట్లు)ను వెనక్కి నెట్టిన సదర్లాండ్ (168) ప్రతిష్టాత్మక ‘బెలిండా క్లార్క్ అవార్డు’కు ఎంపికైంది. గత ఏడాదిలో దక్షిణాఫ్రికాతో టెస్టులో డబుల్ సెంచరీ చేసిన అనాబెల్... ఎంసీజీలో టెస్టు సెంచరీ బాదిన (ఇంగ్లండ్‌పై) తొలి మహిళా క్రికెటర్‌గా నిలిచింది. మహిళల వన్డేల్లో ఉత్తమ క్రికెటర్ అవార్డు యాష్లీ గార్డ్‌నర్ గెలుచుకోగా, ఉత్తమ టి20 ప్లేయర్ పురస్కారం బెత్ మూనీకి దక్కింది. ఆస్ట్రేలియా క్రికెట్ ‘హాల్ ఆఫ్ ఫేమ్’లో మైకేల్ క్లార్క్, మైకేల్ బెవాన్, క్రిస్టీనా మాథ్యూస్ చోటు దక్కించుకున్నారు.

భారత్‌లో ముగిసిన ‘చాంపియన్స్ ట్రోఫీ’ టూర్



న్యూఢిల్లీ: ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ టూర్‌లో భాగంగా భారత్‌లో గత కొద్ది రోజులుగా ట్రోఫీని ప్రదర్శించారు. దీంతో టోర్నీలో పాల్గొనే ఎనిమిది దేశాల్లో ట్రోఫీ టూర్ ముగిసింది. భారత్‌లో ముంబై, బెంగళూరు నగరాల్లో మాత్రమే ఎంపిక చేసిన కొన్ని ప్రదేశాల్లో చాంపియన్స్ ట్రోఫీని అభిమానుల కోసం ప్రదర్శనకు ఉంచారు. వాంఖెడే స్టేడియం 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో కూడా ట్రోఫీని ప్రదర్శించారు. ఇప్పుడు ఈ ట్రోఫీ ఆతిథ్య దేశం పాకిస్తాన్‌కు చేరుకుంటుందని ఐసీసీ ప్రకటించింది. ఈ నెల 19 నుంచి మార్చి 9 వరకు టోర్నీ జరుగుతుంది. పాకిస్తాన్‌లోని లాహోర్, కరాచీ, రావల్పిండిలతో పాటు భారత్ ఆడే మ్యాచ్‌లు యూఏఈలోని దుబాయ్‌లో జరుగుతాయి.

శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ జట్టుకు నాలుగో విజయం



లాల్‌రొమావియా

సాక్షి, హైదరాబాద్: ఐ–లీగ్ జాతీయ ఫుట్‌బాల్ లీగ్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు ఖాతాలో నాలుగో విజయం చేరింది. హైదరాబాద్‌లో సోమవారం జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ జట్టు 3–0 గోల్స్ తేడాతో ఐజ్వాల్ ఎఫ్‌సీ జట్టుపై గెలిచింది. శ్రీనిధి డెక్కన్ జట్టు తరఫున గుర్ముఖ్ సింగ్ (5వ నిమిషంలో), లాల్‌రొమావియా (24వ నిమిషంలో), డేవిడ్ కాస్టనెడా మునోజ్ (33వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. 12 జట్లు పోటీపడుతున్న ఈ లీగ్‌లో శ్రీనిధి జట్టు 12 మ్యాచ్‌లు పూర్తి చేసుకుంది. నాలుగింటిలో గెలిచి, మూడింటిని ‘డ్రా’ చేసుకొని, ఐదింటిలో ఓడి 15 పాయింట్లతో ఎనిమిదో స్థానంలో ఉంది. ఈనెల 6న హైదరాబాద్‌లో జరిగే తదుపరి మ్యాచ్‌లో రియల్ కశ్మీర్ ఎఫ్‌సీ జట్టుతో శ్రీనిధి జట్టు తలపడుతుంది.



కాలిఫోర్నియాలో జరిగిన ర్యాలీలో మెక్సికో జెండాతో మహిళ నిరసన

ట్రంప్ చర్యలపై నిరసనలు

వలసదార్ల బహిష్కరణలపై గొంతెత్తిన ప్రజలు

- లాస్ ఏంజెలెస్‌లో జాతీయ రహదారి దిగ్బంధం

వాషింగ్టన్: అక్రమ వలసదారులను తిప్పి పంపేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేపడుతున్న చర్యలను వేలాది మంది వ్యతిరేకించారు. అక్రమ వలసదారులను నిర్బంధించి మూకుమ్మడిగా సామూహిక బహిష్కరణలు చేపడతానన్న ట్రంప్ నిర్ణయాన్ని నిరసిస్తూ వేలాది మంది ప్రజలు ఆదివారం దక్షిణ కాలిఫోర్నియాలో ర్యాలీ చేపట్టారు. లాస్ ఏంజెలెస్‌లోని డౌన్‌టౌన్‌తో సహా నిరసనకారులు ప్రధాన జాతీయ రహదారిని కొన్ని గంటల పాటు దిగ్బంధించారు. ఇమ్మిగ్రేషన్ సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు. 'ఎవ్వరూ చట్టవిరుద్ధం కాదు', 'ఇమ్మిగ్రెంట్స్ అమెరికాను గొప్పగా మార్చారు'వంటి నినాదాలతో కూడిన బ్యానర్లను ప్రదర్శించారు. మధ్యాహ్నానికల్లా యూఎస్ 101లోని అన్ని మార్గాలను దిగ్బంధించడంతో ట్రాఫిక్ స్తంభించింది. కాలిఫోర్నియా హైవే పెట్రోలింగ్ అధికారుల బందోబస్తు నిలవగా నిరసనకారులు వీధుల్లో బైఠాయించారు. ఫ్రీవే పూర్తిగా తెరవడానికి ఐదు గంటలకు పైగా సమయం పట్టింది. తూర్పున రివర్‌సైడ్ నగరంలో వందలాది మంది నిరసన తెలిపారు. ఓ కూడలి వద్ద జెండాలు ఎగురవేస్తున్న నిరసనకారులకు మద్దతుగా వాహనదారులు ఆపకుండా అంతా ఒకేసారి హారన్ మోగించి తమ మద్దతు తెలిపారు. శాన్‌డియాగో నగరంలోని కన్వెన్షన్ సెంటర్ వద్ద వందలాది మంది ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అరెస్టులకు నిరసనగా డల్లాస్‌లో నిరసనకారులు ఆదివారం ఆందోళనకు దిగారు. ఐసీఈ దాడులను నిరసిస్తూ ఆర్లింగ్టన్ నగరంలో వందలాది మంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిటీ హాల్ వెలుపల జెండాలతో నిరసన తెలిపారు. ట్రంప్ ఇమ్మిగ్రేషన్ విధానాలకు వ్యతిరేకంగా టారెంట్ కౌంటీలో నిరసనకారులు ఆందోళనకు దిగారు.



లాస్‌ఏంజెలెస్‌లో ప్రదర్శనకారులను అడ్డగించేందుకు సిద్ధమైన పోలీసులు

వలసదార్లకు దినదిన గండం

అమెరికా.. ప్రపంచంలోని చాలా దేశాల ప్రజల్లాగే భారతీయులకూ ఓ కలల ప్రపంచం. ఆ డాలర్ డ్రీమ్స్‌ను సాకారం చేసుకోవడానికి, కుటుంబం, పిల్లలకు అందమైన భవిష్యత్ ఇవ్వడానికి ఎంతటి రిస్క్ అయినా తీసుకుంటున్నారు. ఒక్కోసారి ప్రాణాలు పోయే పరిస్థితి ఉన్నా అమెరికాకు వెళ్లే విషయంలో మాత్రం వెనుకడుగువేయట్లేరు. ఇలా ఎలాగోలా చట్టవిరుద్ధంగా వెళ్లి అక్కడ ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు? ఎలాంటి అవమానాలు పడుతున్నారు?

డాలర్‌డ్రీమ్స్ వేటలో అక్రమ వలసదారులకు అవమానాలు

- తక్కువ వేతనంతో అనధికారిక పనులు
- పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు అష్టకష్టాలు

డాక్యుమెంట్లు లేకుండా అక్రమంగా అమెరికా గడ్డపై అడుగుపెట్టిన వలసదారులు అమెరికాలో అనధికారిక పనులు చేసేందుకు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ ఉద్యోగాలేవీ రికార్డుల్లో ఉండవు. రికార్డులో ఉండాలంటే.. వీసాలు, వర్క్ పర్మిట్లు కావాలి. ఉదాహరణకు అమెరికన్లు చేయడానికి ఇష్టపడని ఉద్యోగాలన్నమాట. దక్షిణ కాలిఫోర్నియాలోని పొలాల్లో పని ఇందులో ఒకటి. ఎక్కువ సమయం, శ్రమతో కూడుకున్న పని అయినప్పటికీ వేరే పని దొరక్క దక్షిణ అమెరికా దేశాల నుంచి వచ్చిన అక్రమ వలసదారులు ఇలాంటి పనులు చేస్తున్నారు. చట్టవిరుద్ధంగా వెళ్లిన మన భారతీయులు ఎక్కువగా గ్యాస్ స్టేషన్లు, రెస్టారెంట్లు, కిరాణా దుకాణాల్లో పనిచేస్తున్నారు. నిర్మాణ రంగంలో కార్మికులుగా, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులుగా ఉద్యోగాలు చేస్తున్నారు.

అనుక్షణం భయం.. భయం

ఒహాయోలోని క్లీవ్‌ల్యాండ్‌కు అక్రమంగా వలసవచ్చిన ఒక భారతీయుడు ఉదయం 6 గంటలకే గ్యాస్‌స్టేషన్‌లో పనిలో నిమగ్నమవుతాడు. రాత్రి దాకా ఒళ్లు హూనమయ్యేలా పనిచేసి బయటి తిండి తిని తన బంధువుల ఇంట్లో బేస్‌మెంట్‌లో నిద్రపోతాడు. ఇందులో కష్టమేముందని దూరం నుంచి చూసిన వాళ్లకు అనిపించొచ్చు. కానీ పని చేసినంత సేపు ఇలాంటి వారి జీవితాల్లో అంతకుమించిన నరకయాతన ఉంటుంది. రిజిస్టర్డ్ వర్క్‌ప్లేస్‌లో పనిచేయలేరు. ఎలాంటి అధికారిక శిక్షణ పొందే అర్హత ఉండదు. డ్రైవింగ్ లైసెన్స్ ఎప్పటికీ రాదు. డ్రైవింగ్ చేయలేరు. సైకిల్ తొక్కుతూ వెళ్లాల్సిందే. అది కూడా అక్కడి అధికారులకు అనుమానం వస్తే పట్టుబడతానేమోనని భయం వెంటాడుతుంది. నిరంతరం మనసులో ఏదో భయం. ఏ క్షణంలోనైనా ఏం జరుగుతుందోనన్న ఆందోళన. వస్తువులు పోయినా, ఎవరితోనైనా గొడవ జరిగినా, తననెవరైనా కొట్టినా పోలీసులకు ఫిర్యాదు చేసేందుకూ వెళ్లలేరు. పట్టుబడితే వారికే రిస్క్. అందుకే ఏం జరిగినా భరించాల్సిందే. ఇంత శ్రమ ఎందుకూ అంటే.. స్వదేశంలో మధ్య తరగతి జీవితం గడుపుతున్న తన కుటుంబానికి మంచి జీవితం ఇవ్వాలనే తపన. కుటుంబాన్ని అమెరికాకు తీసుకురావాలి. అందుకు సరిపడా సంపాదించాలి. లీగల్ రెసిడెంట్‌గా అనుమతి పొందేందుకు లాయర్‌కు పెట్టుకునేంత సంపాదించాలి. ఇలా ఎన్నో ఆశలు. అమెరికన్ అధికారుల నుంచి తప్పించుకోవడం కత్తిమీద సాము. అలాంటిది ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నుంచి రోజూ ఏదో ఒక విధంగా తప్పించుకోవడం వారికి సర్వసాధారణమైపోతుంది.

తోటి భారతీయుల సాయంతో..

అక్రమ వలసదారుల జీవితాల్లో అక్కడి తమలాంటి వాళ్ల సమూహం పాత్ర చాలా కీలకంగా ఉంటుంది. అక్రమ వలసదారులు కనీసం సిమ్ కార్డు పొందలేరు. బంధువులు ఇచ్చిన సిమ్ కార్డులను ఉపయోగించి స్వదేశంలోని కుటుంబంతో మాట్లాడతారు. బ్యాంకు ఖాతా పొందే అవకాశమే లేదు. సెప్టెంబర్ 11న 9/11 వైమానిక దాడుల తర్వాత అమెరికాలో అన్ని నిబంధనలు కఠినం చేశారు. అందులోభాగంగా బ్యాంకింగ్ నియమాలూ మారాయి. అందుకే స్థానిక యజమానులు అక్రమ వలసదారులకు పనికి వేతనాన్ని కేవలం నగదు రూపంలోనే చెల్లిస్తారు. అదనపు ఆదాయం కోసం, తెలిసినవారి తోటల్లో పనిచేయడం, ఇళ్ల గోడలకు పెయింటింగ్ వేయడం, ఇతర పనులలో సహాయం చేస్తూ ఇంకాస్త డబ్బు సంపాదిస్తారు. అక్రమవలసదారులు అనారోగ్య సమయాల్లో ఒకరికొకరు సహాయం చేసుకుంటారు. సాధారణంగా అమెరికా ఆసుపత్రులు చట్టవిరుద్ధమైన నివాసితులకు చికిత్సను నిరాకరించవు. కానీ డాక్యుమెంట్లు లేకపోవడం వల్ల ఆస్పత్రుల వద్ద వైద్యం కాస్త కష్టంగా ఉంటుంది. ఇందుకు ప్రత్యామ్నాయంగా అక్కడి చట్టబద్ధ భారతీయ వైద్యులను వీళ్లంతా ఆశ్రయిస్తారు. చవకగా వైద్య చికిత్సలు పొందుతారు. హెచ్‌-1బీ వీసాలు, గ్రీన్‌కార్డు సంపాదించిన భారతీయుల సహాయంతో ఆన్‌లైన్ ద్వారా స్వదేశానికి డబ్బులు పంపుతున్నారు.

జీవితాలనే పణంగా పెట్టి...

చాలా మంది డాక్టర్లు, నర్సులు, లాయర్లు ఇక్కడికి వచ్చి కూలీలుగా పనిచేసి డాక్యుమెంట్లు తయారు చేయించుకున్నారు. ఇలా రకరకాల పనులు చేసి.. డబ్బు సంపాదించి అనుమతి పొందిన వారు చాలా మంది తమ కుటుంబాలను కూడా అమెరికాకు తీసుకొచ్చారు. అమెరికాలోని ప్రభుత్వ పాఠశాలలు డాక్యుమెంటేషన్ అడగవు. దీంతో ఇప్పటివరకు వారి పిల్లలను తీసుకురావడం సులభమైంది. కొందరు అమెరికా వచ్చాక పిల్లలకు జన్మనివ్వడంతో వారు అమెరికా పౌరులుగా మారిపోయారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. ట్రంప్ రెండోసారి అధికార పగ్గాలు చేపట్టిన తొలిరోజే జన్మతః పౌరసత్వాన్ని రద్దుచేస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకంచేయడం తెల్సిందే. ఈ ఉత్తర్వులపై సియాటెల్ ఫెడరల్ కోర్టు స్టే విధించింది. ట్రంప్ ప్రభుత్వ బెదిరింపులు డాక్యుమెంట్లు లేని వలసదారులను అమెరికా చేరుకోకుండా ఆపలేకపోతున్నాయి. ఎన్ని భయాలున్నప్పటికీ అమెరికన్ డ్రీమ్ ప్రయత్నాలను ఆపడం లేదు. కలను నిజం చేసుకోవడానికి జీవితాలనే పణంగా పెడుతున్నారు.

డాక్యుమెంట్లు లేకుండా ఎట్లా వెళ్తున్నారు?

కొందరు భారతీయులు చట్టవిరుద్ధంగా అమెరికాకు వలస వెళ్లడానికి కొన్ని అక్రమ విధానాలను అవలంబిస్తున్నారు. పర్యాటక లేదా తాత్కాలిక వీసాలపై అమెరికాకు వస్తారు. ఆ వీసా గడువు ముగిసినా భారత్‌కు తిరిగిరారు. తప్పించుకు తిరుగుతారు. ఇక భూమార్గంలో వేర్వేరు దేశాలు దాటి వస్తూ చిట్టచివరకు అమెరికా గడ్డపై కాలుమోపుతారు. 'డంకీ'రూట్‌గా దీనికి పేరు. సరిహద్దులు దాటించేసే ఏజెన్సీలకు దాదాపు 1 లక్ష డాలర్లకు పైగా చెల్లించాల్సి ఉంటుంది. సరైన విద్యార్హతలు, ఇంగ్లిష్ ప్రావీణ్యం లేని కారణంగా అమెరికా వీసా పొందలేని భారతీయులు ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారు. ఇంకొందరు తొలుత అమెరికా పొరుగున్న ఉన్న కెనడాకు వచ్చి అక్కడ 76 రోజుల విజిటర్ వీసా సంపాదించి అలా అమెరికాకు వచ్చి ఇక అక్కడే తిష్టవేస్తారు. వలసదారులు సాల్వడార్, నికరాగ్వాల గుండా కూడా అమెరికాలోకి ప్రవేశిస్తున్నారు. ఇలా వేర్వేరు అక్రమ విధానాలను అవలంబించి ఇప్పటిదాకా 7,25,000 మంది అమెరికాకు చేరుకున్నట్లు తెలుస్తోంది. 2024 ప్యూ రీసెర్చ్ నివేదిక ప్రకారం అమెరికాలో డాక్యుమెంట్లు లేకుండా వచ్చిన అక్రమ వలసదారుల్లో భారతీయులు మూడో స్థానంలో ఉన్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

యూఎస్ఎయిడ్ మూసివేత

వందలాది మంది ఉద్యోగులకు మెయిళ్లు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సర్కార్ చర్యలు ప్రభుత్వాలతోపాటు సొంత దేశస్తులను సైతం కలవర పెట్టిస్తున్నాయి. యూఎస్ ఎయిడ్(యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్) ఇక మూతబడక తప్పదని బిలియనీర్ ఎలన్ మస్క్ వ్యాఖ్యానించారు. రహస్య పత్రాలను పరిశీలించేందుకు నిరాకరించారన్న ఆగ్రహంతో యూఎస్‌ఎయిడ్‌కు చెందిన ఇద్దరు ఉన్నత భద్రతాధికారులను సెలవుపై పంపారన్న వార్తల నేపథ్యంలో ఈ ప్రకటన చేయడం గమనార్హం. డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ(డోజ్)కు సారథిగా మస్క్‌ను ట్రంప్ నియమించడం తెలిసిందే. ప్రభుత్వ వ్యయంపై కోతలు విధించే విధుల్లో భాగంగా వాషింగ్టన్‌లోని యూఎస్‌ఎయిడ్ ప్రధాన కార్యాలయంలోని రహస్య సమాచారం చూపేందుకు సోమవారం డోజ్ బృందానికి అధికారులు అనుమతించకపోవడంపై మస్క్ తీవ్రంగా స్పందించారు. యూఎస్‌ఎయిడ్‌ను నేరగాళ్ల సంస్థగా అభివర్ణిస్తూ..దాని మూసివేసే సమయం వచ్చిందంటూ 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు. డోజ్‌కు అనుమతివ్వని యూఎస్‌ఎయిడ్ సెక్యూరిటీ డైరెక్టర్ జాన్ వూర్హీస్, ఆయన సహాయక డైరెక్టర్ బ్రియాన్ మెక్‌గిల్‌లను ట్రంప్ ప్రభుత్వం సెలవుపై పంపించిందని మీడియా అంటోంది. సుమారు 600 మందికి తమ హెడాఫీసులోని కంప్యూటర్లకు యాక్సెస్ లేకుండా చేశారని ఉద్యోగులు అంటున్నారు. కంప్యూటర్లతో యాక్సెస్ ఉన్న వారికి కూడా 'సంస్థ నాయకత్వం సలహా మేరకు ప్రధాన కార్యాలయాన్ని 3న మూసివేస్తున్నాం'అంటూ సమాచారం వచ్చిందన్నారు. అయితే, ఇవన్నీ అసత్యాలని వైట్ హౌస్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ స్టీవెన్ చ్యుంగ్ కొట్టిపారేశారు. మీడియాను సైతం ఆయన తిట్టిపోశారు.

దక్షిణాఫ్రికాకు సాయం నిలిపేస్తాం: ట్రంప్

ఇలా ఉండగా, దక్షిణాఫ్రికాకు ఇకపై అన్ని రకాల సాయం నిలిపివేస్తామని ట్రంప్ చెప్పారు. ఒక వర్గానికి చెందిన ప్రజల భూములను దక్షిణాఫ్రికా ప్రభుత్వం బలవంతంగా ఆక్రమించుకుంటోందని ఆరోపించారు. శ్వేత జాతికి చెందిన కొందరు రైతుల భూములను ఎలాంటి పరిహారం లేకుండా ఆక్రమించుకునేందుకు ఉద్దేశించిన వివాదాస్పద బిల్లుపై గతం వారం దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రమఫోసా సంతకం చేశారు. 2023లో దక్షిణాఫ్రికాకు అమెరికా సుమారు 440 మిలియన్ డాలర్ల సాయాన్ని అందజేసింది. 2023లో 180 దేశాలకు 72 బిలియన్ డాలర్ల మేర అమెరికా సాయం అందించింది. ఇందులో సగం వరకు యూఎస్‌ఎయిడ్ ద్వారానే పంపింది.

సిరియాలో పేలిన కారు బాంబు.. 20 మంది మృతి

డెమాస్కస్: సిరియా ఉత్తర ప్రాంత మన్‌బిజ్ పట్టణంలో కారు బాంబు పేలిన ఘటనలో 18 మంది మహిళలు సహా 20 మంది చనిపోయారు. మరో 15 మంది మహిళలు క్షతగాత్రులయ్యారు. మహిళా వ్యవసాయ కూలీలు గుమికూడిన ప్రాంతంలో ఈ పేలుడు చోటుచేసుకుంది. ఘటనకు తమదే బాధ్యతంటూ ఎవరూ ప్రకటించుకోలేదు. నెల రోజుల వ్యవధిలో మన్‌బిజ్‌లో ఏడో కారు బాంబు పేలుడు ఘటన ఇది. అస్సద్ ప్రభుత్వం డిసెంబర్‌లో కూలాక అలెప్పో ప్రావిన్స్‌లోని మన్‌బిజ్‌లో హింసాత్మక ఘటనలు పెరిగాయి. అమెరికా దన్ను కలిగిన కుర్దిష్‌- సిరియన్ డెమొక్రాటిక్ ఫోర్సెస్ డిసెంబర్‌లో సిరియన్ నేషనల్ ఆర్మీ నుంచి మన్‌బిజన్‌ను స్వాధీనం చేసుకుంది. సిరియన్ నేషనల్ ఆర్మీకి తుర్కియే మద్దతిస్తోంది.

ఎన్‌వీఎస్-02 కూలనుందా? ఆందోళనలో ఇస్రో

న్యూఢిల్లీ: ఎన్‌వీఎస్‌-02 ఉపగ్రహ కక్ష్యను పెంచేందుకు చేస్తున్న ప్రయత్నాలు సఫలం కాకపోవడంపై ఇస్రో వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. జనవరి 31వ తేదీన ప్రయోగించిన ఈ ఉపగ్రహంలోని థ్రస్టర్లను మండించేందుకు శాస్త్రవేత్తలు ఎంతగానో ప్రయత్నిస్తున్నారు. అయితే, ఆక్సిడైజర్‌ను అందించే వాల్వులు తెరుచుకోవడం లేదు. లిక్విడ్ అపోజీ మోటార్(ఎల్‌ఏఎం) వ్యవస్థ విఫలమైందని అంటున్నారు. దీంతో, ప్రత్యామ్నాయాలను వెతికే పనిలో ఉన్నారు. ప్రస్తుతం జియో సింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్(జీటీవీ)లో ఉన్న ఈ శాటిలైట్ థ్రస్టర్లను యాక్టివేట్ చేయకుంటే అది దీర్ఘవృత్తాకార కక్ష్యలోనే ఉండిపోయే ప్రమాదముంది. 'నిర్దేశిత దూరం దాన్ని తీసుకెళ్లాలంటే ఎల్‌ఏఎంను మండించాలి. ఎల్‌ఏఎంలో ఇంజిన్, ఆక్సిడైజర్, ఇంధనం ఉంటాయి. ఇంజిన్ యాక్టివేట్ కావాలంటే ఆక్సిడైజర్ ప్రవహించాలి. అయితే, ఆక్సిడైజర్ వాల్వులు తెరిచేందుకు చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో ఈ ప్రక్రియ అసాధ్యంగా మారింది'అని ఓ నిపుణుడు వివరించారు.

నిపుణుల బృందం

ప్రస్తుతం జియో స్టేషనరీ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోనే ఉండిపోయిన ఉపగ్రహాన్ని జియో స్టేషనరీ ఆర్బిట్‌లోకి తీసుకెళ్లాల్సి ఉంది. దేశ వ్యాప్తంగా నావిగేషన్ సేవలను అందించేందుకు ఇది అత్యంత కీలకం. ఎన్‌వీఎస్‌-02లోని ఇతర వ్యవస్థలన్నీ సక్రమంగానే పనిచేస్తున్నాయి. భూ కేంద్రంతో సంబంధాలు కూడా సజావుగా సాగుతున్నాయి. అయితే, ఎల్‌ఏఎంను మండించలేకపోవడంతో నిర్దేశిత కక్ష్యలోకి దీనిని పంపించలేని పరిస్థితి ఏర్పడింది. ఇందుకు ప్రత్యామ్నాయాలను కనిపెట్టేందుకు ఇస్రో ప్రత్యేకంగా నిపుణులు బృందాన్ని ఏర్పాటు చేసింది. ఇవన్నీ సజావుగా సాగితే సరి, లేకుంటే ఉపగ్రహం తిరిగి భూమిపై పడిపోయే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ముక్కలై మండిపోతుందా..!

ఎల్‌ఏఎంను ఫైర్ చేయకుంటే, శాటిలైట్‌ను నిర్దేశిత కక్ష్యలోకి పంపే వీల్లేదు. అందుకే, అది ఆ కక్ష్యలోనే ఉండిపోనుంది. ఈ నేపథ్యంలో దీర్ఘవృత్తాకార కక్ష్యలో ఉండే ఎన్‌వీఎస్‌-02 నుంచి సాధ్యమైనంత మేర సమాచారం రాబట్టుకోవడం మాత్రమే ఇస్రో చేయగలిగిందని నిపుణులు అంటున్నారు. థ్రస్టర్లను యాక్టివేట్ చేయలేని పరిస్థితుల్లో దీర్ఘవృత్తాకార కక్ష్యలో ఉండే ఎన్‌వీఎస్‌-02 కక్ష్యలో మార్పుల కారణంగా అంతరిక్ష వాతావరణం లాక్కెళుతుంది. దీంతో, కక్ష్య నుంచి దూరంగా వెళ్లిపోయి వాతావరణంలోకి తిరిగి ప్రవేశిస్తుంది. తీవ్ర ఘర్షణ కారణంగా ముక్కలై మండిపోతుంది. తర్వాతి తరం నావిక్ వ్యవస్థలో భాగంగా ఇస్రో పంపే శాటిలైట్లలో ఎన్‌వీఎస్‌-02 రెండోది. భవిష్యత్తులో ఇటువంటి వాటిని మరికొన్నిటిని ప్రయోగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. వీటి వల్ల భారత్‌తోపాటు చుట్టుపక్కల 1,500 కిలోమీటర్ల పరిధిలోని వినియోగదారులకు జీపీఎస్, టైమింగ్ డేటా వంటి సమాచారం అందుతుంది.

కాలువపై చైనా ఆధిపత్యాన్ని తగ్గించండి

పనామాకు అమెరికా వార్నింగ్

వాషింగ్టన్: పనామా కాలువపై చైనా ఆధిపత్యం, నియంత్రణను తగ్గించడానికి అత్యవసర మార్పులు చేయాలని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పనామా దేశాన్ని హెచ్చరించారు. ఆదివారం పనామాలో పర్యటించిన రూబియో.. పనామా దేశాధ్యక్షుడు జోస్ రౌల్ ములినోతో భేటీ అయ్యారు. కాలువపై యథాతథ స్థితి ఆమోదయోగ్యం కాదని, తక్షణ మార్పులు లేకపోతే, ఒప్పందం ప్రకారం తన హక్కులను రక్షించడానికి అమెరికా అవసరమైన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. అయితే అమెరికా బెదిరింపులకు తాము భయపడబోమని ములినో స్పష్టం చేశారు. చైనా ఆధిపత్యం గురించి అమెరికా ఆందోళనలను పోగొట్టేందుకు చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రూబియో పర్యటన వలసలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను ఎదుర్కోవడం వంటి ఉమ్మడి ఆసక్తులపై దృష్టి పెడుతుందని ములినో ఆశాభావం వ్యక్తం చేశారు. చైనా బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టు నుంచి తాము వైదొలుగుతున్నట్లు పనామా అధ్యక్షుడు జోస్ రౌల్ ములినో ప్రకటించారు. ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో ములినో ఈ మేరకు నిర్ణయం తీసుకోవడం గమనార్హం. బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌లో చేరేందుకు 2017లో చైనాతో చేసుకున్న ఒప్పందాన్ని తాము పునరుద్ధరించబోమని ఆయన తెలిపారు. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడయ్యాక అక్రమ వలసదారుల ఏరివేతకు సహకారాన్ని పెంచుతామని ములినో హామీ ఇచ్చారు. రూబియో పర్యటనకు ముందు పనామాలో తీవ్ర నిరసనలు చెలరేగాయి. నిరసనకారులు ట్రంప్, రూబియో దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. దీంతో పోలీసులు బాష్పవాయువును ప్రయోగించారు.

మహారాష్ట్రలో 70 లక్షల ఓటర్లను కలిపారు

ఈసీ స్పష్టతనివ్వాలన్న రాహుల్

న్యూఢిల్లీ: గత ఏడాది జూన్‌లో లోక్‌సభ ఎన్నికలు జరిగినప్పుడు మహారాష్ట్రలో ఉన్న ఓటర్ల సంఖ్య హఠాత్తుగా నవంబర్ నెల వచ్చేసరికి 70 లక్షలు పెరిగిందని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చలో భాగంగా సోమవారం లోక్‌సభలో ఆయన మాట్లాడారు. ''మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమగ్రతపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. అదే రాష్ట్రంలో జూన్‌లో లోక్‌సభ ఎన్నికల వేళ ఉన్న ఓటర్ల సంఖ్యకు నవంబర్‌లో ఎలా 70 లక్షల ఓటర్లు పెరుగుతారు?. గత ఐదేళ్లలో పెరిగిన ఓట్ల కంటే కూడా ఈ సంఖ్య ఎక్కువ. మొత్తం హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర ఓటర్ల సంఖ్యకు సమాన స్థాయిలో ఓటర్లను కలిపారు. ఇందులో మతలబు ఏంటో కేంద్ర ఎన్నికల సంఘం తేల్చాలి. ఈసీ దీనిపై స్పష్టతనివ్వాలి''అని రాహుల్ డిమాండ్‌చేశారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత షిర్డీలోని ఒక భవంతి అడ్రస్‌తో దాదాపు 7,000 ఓట్లను కలిపారని రాహుల్ చెప్పారు.

కయ్యాలతో కాలం గడిపిన ఆప్

ఢిల్లీ వెనుకబాటు కారణం అదే: అమిత్‌షా

న్యూఢిల్లీ: దేశంలో గత పదేళ్లలో డబుల్ ఇంజిన్ బీజేపీ ప్రభుత్వమున్న కొన్ని రాష్ట్రాలు అభివృద్ధి బాటలో ముందుకు సాగుతుండగా, కేంద్ర ప్రభుత్వంతో ఆప్ కయ్యాలు పెట్టుకుంటూ ఢిల్లీని వెనుకబాటుకు గురి చేసిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆరోపించారు. జంగ్‌పురలో సోమవారం జరిగిన బీజేపీ ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడారు. ఆప్ చీఫ్ కేజ్రీవాల్, ఆ పార్టీ నేత మనీశ్ సిసోడియా బడే మియా–చోటే మియా మాదిరిగా ఢిల్లీని దోచుకున్నారంటూ ఎద్దేవా చేశారు. మద్యం కుంభకోణం కేసులో జైలు శిక్ష అనుభవించిన ఏకైక విద్యావంతుడు ఈయన మాత్రమేనంటూ సిసోడియాను ఉద్దేశిస్తూ వ్యాఖ్యానించారు. తరగతిగదుల పేరుతో కుంభకోణానికి పాల్పడిన సిసోడియా ఢిల్లీ చిన్నారుల భవిష్యత్తును నాశనం చేశారన్నారు. అబద్ధాలతో మభ్యపెడుతున్న కేజ్రీవాల్.. చెత్తాచెదారం, విష జలం, అవినీతిని మాత్రమే ఢిల్లీ ప్రజలకిచ్చారన్నారు. ఆప్ తరఫున ఎన్నికైన వారిలో ప్రస్తుతం సగం మంది మాత్రమే మిగిలి ఉన్నారని, ఆ పార్టీ మునిగిపోయే ఓడ అని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ రాజధానిగా ఢిల్లీ మార్చే సత్తా ఉన్న ఏకైక పార్టీ బీజేపీయేనని చెప్పారు.

బీజేపీపై నిఘాకు కెమెరాలు

మురికివాడల ప్రజలకు ఇచ్చాం: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీకి ఈ నెల 5న జరిగే ఎన్నికల సమయంలో బీజేపీ అక్రమాలకు పాల్పడితే రికార్డు చేసేందుకు వీలుగా స్పై, బాడీ కెమెరాలను మురికివాడల్లోని ప్రజలకు అందజేసినట్లు ఆప్ చీఫ్ కేజ్రీవాల్ చెప్పారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక వీడియో సందేశం విడుదల చేశారు. ఈ ఎన్నికల్లో ఆప్ చారిత్రక విజయం సాధించబోతోందన్నారు. బీజేపీ ఘోర పరాజయం తప్పదన్నారు. ఇది తెలిసే ఆ పార్టీ అనుచిత చర్యలకు దిగుతోందని విమర్శించారు. బీజేపీ గూండాల అక్రమాలను రికార్డు చేసేందుకు మురికివాడల్లోని ప్రజలకు నిఘా కెమెరాలను అందించినట్లు చెప్పారు. రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడిన వారిని పోలీసులకు పట్టించేందుకు వీలుగా సమాచారం అందిన 15 నిమిషాల్లోనే ఘటనాస్థలికి చేరుకునేలా క్విక్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేశామన్నారు. స్లమ్ ఏరియాల్లోని ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోకుండా చేసే ఉద్దేశంతో వారి వేలికి నల్ల సిరా పూసి రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు పంపిణీ చేసేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందని తెలిపారు. బీజేపీ వాళ్ల నుంచి డబ్బులైతే తీసుకోండి, కానీ, వేలికి సిరా పూయనివ్వకండని ఓటర్లను కేజ్రీవాల్ కోరారు.









ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ మేళాలో సోమవారం వసంత పంచమి సందర్భంగా కిన్నెర అఖాడాకు చెందిన నాగా సాధువుల పుణ్య స్నానాల సమయంలో త్రిశూలాలతో చేసిన ఈ విన్యాసాలు అందరినీ ఆకర్షించాయి

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్‌కు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, గైడెన్స్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్ మొదలైన వాటి కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి.


అతి తక్కువ కాలం ప్రధానిగా పని చేసింది ఎవరు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

1. భారతదేశంలో సమాఖ్య ప్రభుత్వ ఏర్పాటుకు కిందివాటిలో ఏ చట్టం ఆధారం?
   a) 1909 మార్లే - మింటో సంస్కరణల చట్టం
   b) 1919 మాంటెగ్ - చెమ్స్‌ఫర్డ్ సంస్కరణల చట్టం
   c) 1935 భారత ప్రభుత్వ చట్టం
   d) 1947 భారత స్వతంత్ర చట్టం
2. రాజ్యాంగ పరిషత్ ఉప సంఘమైన సలహా సంఘం అధ్యక్షుడిగా ఎవరు పని చేశారు?
   a) బి. నర్సింగరావు b) జె.బి. కృపలాని
   c) సర్దార్ వల్లభాయ్ పటేల్
   d) రాజేంద్రప్రసాద్
3. రాజ్యాంగ ప్రవేశిక ప్రకారం రాజ్యాంగం ఎప్పటి నుంచి అమల్లోకి వచ్చింది?
   a) 26-1-1950 b) 15-8-1947
   c) 24-1-1950 d) 26-11-1949
4. 1976లో రాజ్యాంగ ప్రవేశికలో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చిన పదాలేవి?
   a) సర్వసత్తాక, ప్రజాస్వామ్య, గణతంత్ర
   b) సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక
   c) సామ్యవాద, లౌకిక, సమగ్రత
   d) సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర
5. భారత రాజ్యాంగంలోని ఒకటో అధికరణ భారత ప్రభుత్వాన్ని ఏవిధంగా ప్రకటించింది?
   a) సమాఖ్య ప్రభుత్వం
   b) అర్ధ సమాఖ్య ప్రభుత్వం
   c) కేంద్రీకృత సమాఖ్య ప్రభుత్వం
   d) పైవేవీ కాదు
6. భారతదేశంలో ప్రభుత్వం ఎంతవరకు అధికారంలో కొనసాగుతుంది?
   a) ప్రజల విశ్వాసం మేరకు
   b) రాష్ట్రపతి విశ్వాసం మేరకు
   c) పార్లమెంట్ విశ్వాసం మేరకు
   d) లోక్‌సభ విశ్వాసం మేరకు
7. అల్ప సంఖ్యాకుల సంరక్షణ కోసం చేర్చిన ప్రత్యేక హక్కు ఏది?
   a) సమానత్వ హక్కు
   b) విద్య, సాంస్కృతిక హక్కు
   c) మత స్వాతంత్ర్య హక్కు
   d) పీడనాన్ని నిరోధించే హక్కు
8. ప్రభుత్వాలు తమ కర్తవ్యాలను, విద్యుక్త ధర్మాలను సమర్థంగా నిర్వహించడానికి తోడ్పడేవి?
   a) ఆదేశిక సూత్రాలు
   b) ప్రాథమిక హక్కులు
   c) ప్రాథమిక విధులు d) ప్రణాళికలు
9. ఏ కమిటీ సిఫార్సు మేరకు 2002 నుంచి జాతీయ జెండా నియమావళిని అమల్లోకి తీసుకువచ్చారు?
   a) ఎల్.ఎం. సింఘ్వీ కమిటీ
   b) స్వరణ్‌సింగ్ కమిటీ
   c) జస్టిస్ వర్మ కమిషన్
   d) జస్టిస్ శ్రీ కృష్ణ కమిటీ
10. కిందివాటిలో సరికానిది ఏది?
    a) అంటరానితనం నిషేధం: అధికరణ - 17
    b) వెట్టిచాకిరి నిషేధం: అధికరణ - 23
    c) బలవంతంగా మతమార్పిడి నిషేధం: అధికరణ -29
    d) బాలకార్మికుల వ్యవస్థ నిషేధం: అధికరణ - 24
11. ప్రవాస భారతీయుల దినోత్సవాన్ని 2015లో ఏ రాష్ట్రంలో నిర్వహించారు?
    a) గుజరాత్ b) మహారాష్ట్ర
    c) తెలంగాణ d) హర్యానా
12. రాజ్యసభలో సీట్ల కేటాయింపు గురించి ఏ షెడ్యూల్‌లో పేర్కొన్నారు?
    a) షెడ్యూల్-1 b) షెడ్యూల్-4
    c) షెడ్యూల్-10 d) షెడ్యూల్-8
13. రాష్ట్రపతిని ఎన్నుకునే 'ఎలక్టోరల్ కాలేజీ'లో ఎవరు సభ్యులుగా ఉంటారు?
    a) పార్లమెంట్ సభ్యులు, అసెంబ్లీ సభ్యులు
    b) ఎన్నికైన పార్లమెంట్ సభ్యులు, ఎన్నికైన విధానసభ సభ్యులు
    c) పార్లమెంట్ సభ్యులు మాత్రమే
    d) ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘం నిర్ణయిస్తుంది
14. కింద పేర్కొన్నవారిలో అతి తక్కువ కాలం రాష్ట్రపతిగా పనిచేసింది ఎవరు?



    a) జాకీర్‌హుస్సేన్ b) ఫక్రుద్దీన్ అలీ అహ్మద్
    c) వి.వి.గిరి d) నీలం సంజీవరెడ్డి
15. విదేశీ రాయబారిగా పనిచేసి రాష్ట్రపతి అయిన వ్యక్తి ఎవరు?
    a) జాకీర్ హుస్సేన్ b) కె.ఆర్.నారాయణన్
    c) ఫక్రుద్దీన్ అలీ అహ్మద్
    d) నీలం సంజీవరెడ్డి
16. కిందివాటిలో సరైన వాక్యం ఏది?
    a) అధికరణ - 108 ప్రకారం రాష్ట్రపతి పార్లమెంట్ ఉమ్మడి సమావేశాన్ని ఏర్పాటు చేస్తారు
    b) అధికరణ - 72 ప్రకారం నేరస్థులకు క్షమాభిక్ష పెట్టవచ్చు. శిక్ష తగ్గించవచ్చు
    c) అధికరణ -143 ప్రకారం - రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహాను కోరవచ్చు
    d) పైవన్నీ
17. కిందివారిలో ఎవరికి సభలో సభ్యత్వం లేకపోయినా నిర్ణాయక ఓటు హక్కు ఉంటుంది?
    a) లోక్‌సభ స్పీకర్ b) రాజ్యసభ చైర్మన్
    c) విధాన పరిషత్ అధ్యక్షులు
    d) రాజ్యసభ డిప్యూటీ చైర్మన్
18. ఉప రాష్ట్రపతి పదవికి ఖాళీ ఏర్పడినప్పుడు తాత్కాలిక ఉప రాష్ట్రపతిగా ఎవరు కొనసాగుతారు?
    a) రాజ్యసభ ఉపాధ్యక్షుడు
    b) లోక్‌సభ స్పీకర్ c) ప్యానెల్ స్పీకర్
    d) ఎవరూ కాదు
19. కిందివారిలో అతి తక్కువ కాలం ప్రధానిగా పని చేసింది ఎవరు?
    a) అటల్ బిహారీ వాజ్‌పాయ్
    b) చంద్రశేఖర్
    c) వి.పి.సింగ్ d) దేవెగౌడ
20. కిందివాటిలో సరికానిది ఏది?
    a) జాతీయ ప్రభుత్వాన్ని నడిపిన ప్రధాని - జవహర్ లాల్ నెహ్రూ
    b) మైనార్టీ ప్రభుత్వాన్ని నడిపిన ప్రధాని - పి.వి. నరసింహారావు
    c) సంకీర్ణ ప్రభుత్వాన్ని ఎక్కువ కాలం నడిపిన ప్రధాని - వాజ్‌పాయ్
    d) సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన మొదటి ప్రధాని - మొరార్జీ దేశాయ్
21. ఎవరి జన్మదినాన్ని సుపరిపాలన దినోత్సవంగా ప్రకటించారు?
    a) జవహర్ లాల్ నెహ్రూ
    b) గుర్జారీ లాల్ నందా
    c) లాల్ బహదూర్ శాస్త్రి
    d) అటల్ బిహారీ వాజ్‌పాయ్
22. 1947లో నెహ్రూ ఏర్పాటు చేసిన మంత్రివర్గంలో విదేశాంగ శాఖను నిర్వహించిన మంత్రి ఎవరు?
    a) సర్దార్ వల్లభాయ్ పటేల్
    b) జగ్జీవన్‌రామ్
    c) ఎస్.పి. ముఖర్జీ d) నెహ్రూ
23. మంత్రి మండలి సభ్యుల సంఖ్య లోక్‌సభ సభ్యుల సంఖ్యలో 15 శాతానికి మించకూడదని ఎన్నో రాజ్యాంగ సవరణ ద్వారా నిర్ణయించారు?
    a) 89 b) 91 c) 92 d) 100
24. మంత్రి మండలి సభ్యులు వ్యక్తిగతంగా ఎవరికి బాధ్యత వహిస్తారు?
    a) రాష్ట్రపతి b) ప్రధానమంత్రి
    c) పార్లమెంట్ d) లోక్‌సభ
25. ఏ ప్రధానమంత్రి కాలంలో ఇద్దరు ఉప ప్రధాన మంత్రులు పనిచేశారు?
    a) చరణ్‌సింగ్ b) వి.పి.సింగ్
    c) మొరార్జీ దేశాయ్ d) ఇందిరాగాంధీ
26. పార్లమెంట్ మొదటి సమావేశం ఎప్పుడు జరిగింది?
    a) 13-5-1952 b) 13-5-1950
    c) 1-4-1952 d) 14-5-1952
27. లోక్‌సభ మొత్తం స్థానాల్లో ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేకంగా కేటాయించిన సీట్ల సంఖ్య?
    a) 79, 41 b) 84, 47
    c) 84, 44 d) 79, 47
28. లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల సంఖ్యను 2026 వరకు పొడిగించకూడదని ఎన్నో రాజ్యాంగ సవరణ ద్వారా నిర్ణయించారు?
    a) 81 b) 84 c) 85 d) 91
29. లోక్‌సభకు మొదటి మధ్యంతర ఎన్నికలు జరిగిన సంవత్సరం?
    a) 1967 b) 1971 c) 1980 d) 1991
30. పార్లమెంట్ ఉమ్మడి సభ సమావేశానికి అధ్యక్షత వహించేది ఎవరు?
    a) భారత రాష్ట్రపతి b) ప్రధానమంత్రి
    c) లోక్‌సభ స్పీకర్ d) రాజ్యసభ చైర్మన్
31. ప్రస్తుతం కొనసాగుతున్న రాజ్యసభ ఎన్నోది?
    a) 13 b) 14 c) 16 d) ఏదీకాదు
    (* రాజ్యసభ శాశ్వతమైంది)
32. ప్రస్తుత రాజ్యసభ ఉపాధ్యక్షులు ఎవరు?
    a) హమీద్ అన్సారీ b) హరివంశ్
    c) తంబిదొరై d) గులాంనబీ ఆజాద్
33. ఆర్థిక బిల్లుకు సంబంధించి సరికానిది?
    a) రాష్ట్రపతి ఆమోదంతో మొదట లోక్‌సభలో ప్రవేశపెట్టాలి
    b) లోక్‌సభలో ఆమోదం పొందకపోతే ప్రభుత్వం కూలిపోతుంది
    c) రాజ్యసభకు పంపినప్పుడు ఆమోదించి లేదా వ్యతిరేకించి 14 రోజుల్లో తిప్పి పంపాలి
    d) రెండు సభల మధ్య విభేదాలు ఏర్పడితే రాష్ట్రపతి ఉమ్మడి పార్లమెంట్ సభ సమావేశాన్ని ఏర్పాటు చేస్తారు
34. లోక్‌సభలో అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టడానికి ఎంత మంది సభ్యుల మద్దతు కావాలి?
    a) 20 b) 50 c) 100 d) 273
35. పార్లమెంటరీ ప్రక్రియలో పేర్కొనని పదం ఏది?
    a) ప్రశ్నల గంట b) శూన్య కాలం
    c) వాయిదా తీర్మానం
    d) సావధాన తీర్మానం
36. పార్లమెంటరీ కమిటీల్లో అతి ప్రాచీనమైంది?
    a) ప్రభుత్వ ఖాతాల సంఘం
    b) ప్రభుత్వ అంచనాల సంఘం
    c) ప్రభుత్వ ఉపక్రమాల సంఘం
    d) సభా వ్యవహారాల సంఘం
37. పార్లమెంట్, రాష్ట్రపతి, మంత్రిమండలి మధ్య సంధానకర్తగా ఎవరు పనిచేస్తారు?
    a) రాష్ట్రపతి b) ప్రధానమంత్రి
    c) లోక్‌సభ స్పీకర్ d) కేబినెట్ కార్యదర్శి
38. కేంద్ర కేబినెట్ సభ్యుడు కాకపోయినా కేబినెట్ సమావేశాల్లో పాల్గొనే అర్హత ఉన్నవారెవరు?
    a) అటార్నీ జనరల్ b) లోక్‌సభ స్పీకర్
    c) హోంశాఖ కార్యదర్శి d) భారత రాష్ట్రపతి
39. కేంద్రం - రాష్ట్రాల మధ్య వివాదాల పరిష్కారం సుప్రీంకోర్టు ఏ అధికార పరిధిలోకి వస్తుంది?
    a) ప్రారంభ అధికార పరిధి
    b) అప్పీళ్ల విచారణ పరిధి
    c) సలహా అధికార పరిధి
    d) పైవేవీకాదు
40. జాతీయ ప్రజాస్వామ్య కూటమి 99వ రాజ్యాంగ సవరణ ద్వారా ఏర్పాటు చేసిన జాతీయ న్యాయమూర్తుల నియామక కమిషన్ అధ్యక్షునిగా ఎవరు కొనసాగుతారు?
    a) ప్రభుత్వం నియమించిన న్యాయమూర్తి
    b) భారత రాష్ట్రపతి
    c) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
    d) సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి

సమాధానాలు

1) c; 2) c; 3) d; 4) c; 5) d;
6) d; 7) b; 8) a; 9) c; 10) c;
11) a; 12) b; 13) b; 14) a; 15) b;
16) d; 17) b; 18) d; 19) b; 20) c;
21) d; 22) d; 23) b; 24) a; 25) c;
26) a; 27) b; 28) b; 29) b; 30) c;
31) d; 32) b; 33) d; 34) b; 35) b;
36) a; 37) c; 38) a; 39) a; 40) c.

బుల్లెట్ ప్రూఫ్ గ్లాస్‌ను దేనితో తయారు చేస్తారు?

సిమెంట్

భవనాలు, వంతెనలు, ఆనకట్టలు తదితర నిర్మాణాల్లో ఉపయోగించే అతి ముఖ్యమైన పదార్థం సిమెంట్. దీన్ని 1824లో జె.ఆస్పిడిన్ అనే తాపీమేస్త్రి కనుగొన్నాడు. సున్నపురాయి, బంకమట్టి మిశ్రమాన్ని అధిక ఉష్ణోగ్రతకు వేడిచేస్తే అది ఒక పొడిని ఏర్పరుస్తుందని, దీనికి తగినంత నీటిని కలిపితే కొన్ని గంటల్లో అది రాయిలా గట్టి పడుతుందని ఆస్పిడిన్ కనుగొన్నాడు. ఈ పదార్థం 'పోర్ట్‌లాండ్' అనే ప్రదేశంలో దొరికే రాయి లాంటి బలమైనది కావడం వల్ల దీన్ని 'పోర్ట్‌లాండ్ సిమెంట్'గా వ్యవహరించారు.

- సిమెంట్ అనేది ప్రధానంగా కాల్షియం సిలికేట్‌లు, కాల్షియం అల్యూమినేట్ల మిశ్రమం. ఇందులో కొద్ది మొత్తంలో ఐరన్, సోడియం, పొటాషియం,మెగ్నీషియం లోహాల ఆక్సైడ్‌లు, కరిగిన సల్ఫర్ ట్రై ఆక్సైడ్‌లు ఉంటాయి.
- సిమెంటుకు ప్రధాన ముడి పదార్థాలు సున్నపురాయి, బంకమన్ను.
- సిమెంట్‌ను తడి పద్ధతి, పొడి పద్ధతి అనే రెండు విధానాల్లో తయారుచేస్తారు.
- ముడి స్లరీ (చూర్ణం)ను 'ప్రగలన పదార్థం' అంటారు. దీన్ని తిరుగుడు కొలిమిలో 'గ్యాస్' లేదా 'బొగ్గు'ను మండించి వేడి చేస్తారు. ఈ విధానంలో ఏర్పడే పదార్థం 'బూడిద రంగు' ఉన్న గట్టి బంతుల రూపంలో ఉంటుంది. వీటిని 'సిమెంట్ క్లింకర్'లు అంటారు.
- సిమెంట్ క్లింకర్లను చూర్ణం చేసి 2 నుంచి 3 శాతం 'జిప్సం'ను కలిపితే వచ్చేదే వ్యాపారాత్మక సిమెంట్.

నిర్మాణ రంగంలో సిమెంట్ ఆవిష్కరణ ఒక అద్భుత ఘట్టం. ఆధునిక యుగంలో సిమెంట్ రహిత నిర్మాణాలను ఊహించలేం. ఇటీవల రోడ్లను సైతం సిమెంట్‌తోనే వేస్తున్నారు. హైదరాబాద్‌లో వివిధ సిమెంట్ కంపెనీల ఆధ్వర్యంలో ఒక కిలోమీటర్ మేర 'వైట్ ట్యాపింగ్' చేశారు. మారుతున్న కాలంతో పాటు సిమెంట్ ప్రాధాన్యం మరింత పెరుగుతోంది.

- జిప్సం అనేది ఆర్ద్ర కాల్షియం సల్ఫేట్. సిమెంట్ సెట్టింగ్‌ను కంట్రోల్ చేయడానికి జిప్సం కలుపుతారు. ఒకవేళ జిప్సంను కలుపకపోతే సిమెంట్‌కు నీరు కలిపిన వెంటనే గట్టి పడుతుంది.
- సిమెంట్ గట్టిపడే ప్రక్రియలో కాల్షియం అల్యూమినేట్లు వేగంగా ఆర్ద్రీకరణం చెంది 'కాల్షియం అల్యూమినియం హైడ్రేట్ (CAH)'లుగా మారతాయి. ఇది ఉష్ణం వెలువడే చర్య (ఉష్ణమోచక చర్య).
- సిమెంట్ పరిశ్రమల్లో ఇటీవల 'ఫ్లై యాష్'ను ఉపయోగిస్తున్నారు. థర్మల్ విద్యుత్ ప్లాంట్లలో 'నేలబొగ్గు' లేదా 'కోక్'ను మండించడం వల్ల చివరగా మిగిలే బూడిదనే ఫ్లై యాష్ అంటారు.



- ఫ్లై యాష్‌లో ప్రధానంగా సిలికాన్ డై ఆక్సైడ్ (SiO_2), అల్యూమినియం ఆక్సైడ్ (Al_2O_3), కాల్షియం ఆక్సైడ్‌లు ఉంటాయి. అత్యల్ప ప్రమాణాల్లో ఆర్సెనిక్, బెరీలియం, బోరాన్, కాడ్మియం, క్రోమియం, కోబాల్ట్, లెడ్, మాంగనీస్, పాదరసం (మెర్క్యూరీ), మాలిబ్డినం, సెలీనియం లాంటి మూలకాలు కూడా ఉంటాయి.
- ఫ్లై యాష్‌ను సిమెంట్‌లో ఉపయోగించడం వల్ల వాతావరణంలోకి విడుదలయ్యే 'హరిత గృహ' వాయువైన కార్బన్ డై ఆక్సైడ్ (CO_2) తగ్గుతుంది.

గాజు

గృహాలంకరణ వస్తువుల్లో గాజుకే ప్రాధాన్యం ఉంది. గ్లాస్ బ్లోయింగ్‌లో రోమన్‌లదే పైచేయి. ఘనరూపంలో ఉన్నప్పటికీ గాజు నిజమైన స్ఫటిక పదార్థం కాదు. ఇది అస్ఫటిక పదార్థం. గాజు ద్రవాన్ని త్వరగా చల్లబరచడం వల్ల దాని స్నిగ్ధత అధికమై ఘనరూపాన్ని సంతరించుకుంటుంది. అందువల్ల గాజును 'అతి శీతలీకరణం చెందిన ద్రవం' అంటారు.

- గాజు ప్రధానంగా సోడియం సిలికేట్, కాల్షియం సిలికేట్, సిలికాల మిశ్రమం.
- గాజుకు కావాల్సిన ముడి పదార్థాలు సోడా యాష్ (Na_2CO_3), సున్నపురాయి ($CaCO_3$), ఇసుక (SiO_2).
- ముడి పదార్థాల మిశ్రమ పొడిని 'బాచ్' అంటారు.
- బాచ్ ద్రవీభవన స్థానం (కరిగే ఉష్ణోగ్రత)ను తగ్గించడానికి కొన్ని పగిలిన గాజు ముక్కలను కలుపుతారు. వీటిని 'కల్లెట్' అంటారు.
- మొత్తం మిశ్రమాన్ని కొలిమిలో 1000°C వద్ద వేడి చేస్తే ద్రవగాజు ఏర్పడుతుంది.దీనిపై తేలియాడే మలినాలను 'గాజుగాల్' అంటారు.
- ద్రవ గాజును త్వరగా చల్లబరిస్తే పెళుసుగా మారే ప్రమాదం ఉంది. అందువల్ల ప్రత్యేక పద్ధతిలో నెమ్మదిగా చల్లబరుస్తారు. మంద శీతలీకరణం వల్ల గాజుకు అధిక బలం చేకూరుతుంది.
- గాజును వివిధ రంగుల్లో పొందడానికి ద్రవగాజుకు కొన్ని లోహ ఆక్సైడ్‌లను లేదా లోహ లవణాలను కలుపుతారు. క్రోమియం ఆక్సైడ్‌తో ఆకుపచ్చ, మాంగనీస్ ఆక్సైడ్‌తో ఊదా, కాపర్ సల్ఫేట్‌తో నీలం, బంగారం క్లోరైడ్‌తో కెంపు, క్యూప్రస్ ఆక్సైడ్‌తో ఎరుపు రంగులు లభిస్తాయి.
- గాజును 'ఆక్సిజన్-ఎసిటలీన్' మంటతో వేడి చేసి మెత్తబరుస్తారు. అందులోకి గాలిని పంపి కోరిన ఆకృతిలో గాజు వస్తువులను తయారు చేస్తారు. ఈ నైపుణ్యాన్నే 'గ్లాస్ బ్లోయింగ్' అంటారు.
- పైరెక్స్ గాజు, బోరోసిలికేట్ గాజు గ్లాస్ బ్లోయింగ్ ప్రక్రియలకు అనువైనవి.

మాదిరి ప్రశ్నలు

1. ప్రాచీన కట్టడాలకు వినియోగించిన 'దంగుసున్నం' తయారీకి అవసరం లేని ముడిపదార్థం ఏది?
   ఎ) సున్నం బి) ఇసుక
   సి) నీరు డి) బొగ్గు
2. సిమెంట్ అనేది వేటి మిశ్రమం?
   ఎ) కాల్షియం సల్ఫేట్, కాల్షియం క్లోరైడ్
   బి) కాల్షియం ఫాస్ఫేట్, కాల్షియం అల్యూమినేట్
   సి) కాల్షియం సిలికేట్లు, కాల్షియం అల్యూమినేట్
   డి) సోడియం క్లోరైడ్, కాల్షియం క్లోరైడ్
3. సిమెంట్ తయారీలో వినియోగించే ఉష్ణోగ్రత?
   ఎ) 100-200°C బి) 1700-1900°C
   సి) 2000-2500°C డి) 170-190°C
4. సిమెంట్ పరిశ్రమను ఎలాంటి ప్రాంతాల్లో నెలకొల్పుతారు?
   ఎ) ఇసుక దొరికే ప్రాంతం
   బి) సున్నపురాయి దొరికే ప్రాంతం
   సి) నదీ తీర ప్రాంతం
   డి) సముద్ర తీర ప్రాంతం
5. సిమెంట్ తయారీకి కావలసిన ముడి పదార్థాలు?
   ఎ) సున్నపురాయి బి) బంకమన్ను
   సి) బొగ్గు డి) పైవన్నీ
6. బూడిద వర్ణం ఉన్న సిమెంట్ బంతులను ఏమంటారు?
   ఎ) సిమెంట్ బాల్స్ బి) బక్కీ బాల్స్
   సి) సిమెంట్ క్లింకర్స్ డి) కల్లెట్స్
7. సిమెంట్‌కు జిప్సం కలపడానికి కారణం?
   ఎ) రంగు కోసం బి) గట్టిదనం కోసం
   సి) నునుపుదనం కోసం
   డి) సెట్టింగ్ నెమ్మదిగా జరగడం కోసం
8. కిందివాటిలో మోటారు వాహనాల నుంచి వెలువడని కాలుష్యకారిణి ఏది?
   ఎ) కార్బన్ డై ఆక్సైడ్ బి) ఫ్లై యాష్
   సి) నైట్రోజన్ ఆక్సైడ్‌లు డి) నీటి ఆవిరి
9. ఫ్లై యాష్‌ను ఎక్కువగా వేటికి ఉపయోగిస్తారు?
   ఎ) ఇటుకల తయారీ
   బి) సిమెంట్ తయారీ
   సి) ఎ, బి డి) ఏదీకాదు
10. ఫ్లై యాష్ గురించి సరికాని వాక్యం ఏది?
    ఎ) థర్మల్ విద్యుత్ ప్లాంట్ల ఉప ఉత్పన్నం ఫ్లై యాష్
    బి) ఫ్లై యాష్‌కు క్షార ధర్మం ఉంటుంది
    సి) నీటిని పీల్చుకునే ధర్మం ఉంటుంది
    డి) విషపూరిత మూలకాలు ఉండవు
11. ఫ్లై యాష్‌లో ఉండే హానికారక లోహాలు ఏవి?
    ఎ) ఆర్సెనిక్ బి) మెర్క్యూరీ
    సి) లెడ్ డి) పైవన్నీ
12. ఫ్లై యాష్‌లో ప్రధానంగా ఉండేవి?
    ఎ) సిలికాన్ డై ఆక్సైడ్
    బి) అల్యూమినియం ఆక్సైడ్
    సి) కాల్షియం ఆక్సైడ్ డి) పైవన్నీ
13. సిమెంట్‌లో సాధారణంగా కలిపే జిప్సం శాతం?
    ఎ) 10-20 శాతం బి) 5-10 శాతం
    సి) 50 శాతం డి) 2-3 శాతం
14. గాజు అనేది ఒక..?
    ఎ) స్ఫటిక ఘనపదార్థం
    బి) అస్ఫటిక ఘన పదార్థం
    సి) అతి శీతలీకరణం చెందిన ద్రవం
    డి) జెల్లీ
15. గాజు రసాయనికంగా వేటి మిశ్రమం?
    1. సోడియం సిలికేట్
    2. కాల్షియం సిలికేట్ 3. సిలికా
    ఎ) 1, 2 మాత్రమే బి) 2, 3 మాత్రమే
    సి) 1, 3 మాత్రమే డి) పైవన్నీ
16. ప్రయోగశాలలోని గాజు పరికరాల తయారీకి వాడే గాజు?
    ఎ) సోడా గాజు బి) క్వార్ట్జ్ గాజు
    సి) పైరెక్స్ గాజు డి) ఏదీకాదు
17. విద్యుత్ బల్బులు, దృశ్య పరికరాల తయారీకి వాడే గాజు?
    ఎ) సోడా గాజు బి) క్వార్ట్జ్ గాజు
    సి) ఫ్లింట్ గాజు
    డి) బోరోసిలికేట్ గాజు
18. గాజును కోయడానికి ఉపయోగించే పదార్థం?
    ఎ) గాజు బి) వజ్రం
    సి) స్టీల్ డి) టంగ్‌స్టన్
19. పోర్ట్‌లాండ్ సిమెంట్‌లోని ప్రధాన అనుఘటకాలు?
    ఎ) సున్నం, సిలికా, ఐరన్ సల్ఫైడ్
    బి) సున్నం, సిలికా, సోడా
    సి) సున్నం, సిలికా, అల్యూమినా
    డి) సిలికా, సున్నం, ఐరన్ ఆక్సైడ్
20. గాజు అనేది ఒక..?
    ఎ) విద్యుత్ వాహకం బి) ఉష్ణ వాహకం
    సి) ఉష్ణబంధకం (ఇన్సులేటర్)
    డి) అర్ధ వాహకం
21. బంకమట్టి నుంచి సిమెంట్‌లోకి ప్రధానంగా చేరేది?
    ఎ) కాల్షియం సిలికేట్
    బి) అల్యూమినియం సిలికేట్
    సి) సోడియం సిలికేట్
    డి) సోడియం కార్బొనేట్
22. కిటికీ అద్దాలు, గాజుసీసాల తయారీకి ఉపయోగించే గాజు?
    ఎ) ఫ్లింట్ గాజు
    బి) సోడా గాజు (మెత్తని గాజు)
    సి) గట్టిగాజు డి) పైరెక్స్ గాజు
23. గ్లాస్ బ్లోయింగ్ ప్రక్రియలో వాడే వాయువు?
    ఎ) ఆక్సిజన్ బి) ఎసిటలీన్
    సి) ఆక్సీ-ఎసిటలీన్ డి) హైడ్రోజన్
24. సాధారణ గాజుకు కలిపే వివిధ పదార్థాలు, అవి ఇచ్చే రంగులను జతపరచండి.
    ఎ) మాంగనీస్ డై ఆక్సైడ్ 1) ఊదా
    బి) కోబాల్ట్ ఆక్సైడ్ 2) నీలం
    సి) క్రోమియం ఆక్సైడ్ 3) ఆకుపచ్చ
    డి) క్యూప్రస్ ఆక్సైడ్ 4) ఎరుపు

	ఎ	బి	సి	డి
ఎ)	1	2	3	4
బి)	4	3	2	1
సి)	2	4	1	3
డి)	3	1	4	2

25. గాజుపై గాట్లు పెడుతూ ఎచ్చింగ్ చేయడానికి వాడే ఆమ్లం ఏది?
    ఎ) హైడ్రోక్లోరికామ్లం (HCl)
    బి) హైడ్రోఫ్లోరికామ్లం (HF)
    సి) నైట్రికామ్లం (HNO_3)
    డి) సల్ఫ్యూరికామ్లం (H_2SO_4)
26. వాటర్ గ్లాస్ అని దేనికి పేరు? (Gr-II, 2012)
    ఎ) సోడియం సిలికేట్
    బి) అల్యూమినియం సిలికేట్
    సి) జింక్ సిలికేట్ డి) కాల్షియం సిలికేట్
27. అతినీలలోహిత కిరణాలకు పారదర్శకంగా పని చేసే గాజు?
    ఎ) ఫ్లింట్ గాజు బి) క్వార్ట్జ్ గాజు
    సి) పైరెక్స్ గాజు డి) పైవన్నీ
28. బుల్లెట్ ప్రూఫ్ గ్లాస్‌ను దేనితో తయారు చేస్తారు?
    ఎ) క్వార్ట్జ్ గాజు బి) మెత్తని గాజు
    సి) గట్టిగాజు పొరల మధ్య థర్మోప్లాస్టిక్ పాలీ కార్బొనేట్ పొరలను బలంగా అతికిస్తారు
    డి) బోరోసిలికేట్ గాజు

సమాధానాలు

1) డి; 2) సి; 3) బి; 4) బి; 5) డి;
6) సి; 7) డి; 8) బి; 9) సి; 10) డి;
11) డి; 12) డి; 13) డి; 14) సి; 15) డి;
16) సి; 17) బి; 18) బి; 19) సి; 20) సి;
21) బి; 22) బి; 23) సి; 24) ఎ; 25) బి;
26) ఎ; 27) బి; 28) సి.

విద్య, ఉద్యోగ సమాచారం

బీఆర్ఐసీ-సీడీఎఫ్‌డీ, హైదరాబాద్‌లో కన్సల్టెంట్ పోస్టులు

హైదరాబాద్‌లోని బయోటెక్నాలజీ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (బీఆర్ఐసీ)-సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్‌ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్(సీడీఎఫ్‌డీ) కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **పోస్టుల వివరాలు:** రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (కన్సల్టెంట్)-01, సైన్స్ కమ్యూనికేషన్-కంటెంట్ క్రియేటర్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ, బీఎస్సీ/బీటెక్, ఎంఎస్సీ/ఎంటెక్(లైఫ్ సైన్స్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** కన్సల్టెంట్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ పోస్టుకు 50 ఏళ్లు, కన్సల్టెంట్(సైన్స్ కమ్యూనికేషన్-కంటెంట్ క్రియేటర్)కు 45 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు కన్సల్టెంట్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ పోస్టుకు రూ.50,000 నుంచి రూ.80,000, కన్సల్టెంట్(సైన్స్ కమ్యూనికేషన్-కంటెంట్ క్రియేటర్)కు రూ.50,000 నుంచి రూ.60,000.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఈమెయిల్:** cdfd.recruitment@gmail.com
» **దరఖాస్తులకు చివరితేది:** 17.02.2025.
» **వెబ్‌సైట్:** https://cdfd.org.in

ఇర్కాన్, న్యూఢిల్లీలో వివిధ ఉద్యోగాలు

న్యూఢిల్లీలోని ఇండియన్ రైల్వే కన్‌స్ట్రక్షన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్(ఇర్కాన్).. రెగ్యులర్ ప్రాతిపదికన జనరల్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
» **పోస్టుల వివరాలు:** జాయింట్ జనరల్ మేనేజర్(సివిల్)-02, డిప్యూటీ జనరల్ మేనేజర్(సివిల్)-02.
» **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో సివిల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ, ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. వయసు: 45 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు జాయింట్ జనరల్ మేనేజర్ రూ.80,000 నుంచి రూ.2,20,000. డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు రూ.70,000 నుంచి రూ.2,00,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జాయింట్ జనరల్ మేనేజర్/హెచ్ఆర్ఎం, ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, సీ-4, డిస్ట్రిక్ట్ సెంటర్, సాకేత్, న్యూఢిల్లీ-110017 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 07.02.2025.
» **వెబ్‌సైట్:** https://www.ircon.org

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

అటవీ హక్కు చట్టం ఎప్పుడు అమల్లోకి వచ్చింది?

పర్యావరణం

భూమిపై ఉన్న ఘన, ద్రవ, వాయు, జీవ సమ్మేళనాన్ని పర్యావరణం అంటారు. జీవుల మనుగడకు అవసరమైన గాలి, నీరు, ఆహారం పూర్తిగా కలుషితమవుతున్నాయి. సహజ వనరులు తరిగిపోతుండటంతో డిమాండ్ పెరుగుతోంది. ఫలితంగా వాటి దుర్వినియోగం కూడా అధికమై పర్యావరణానికి నష్టం వాటిల్లుతోంది. పేద, అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని గ్రామీణ ప్రాంతాల ఆర్థిక స్థితిగతులపై పర్యావరణ నష్ట ప్రభావం తీవ్రంగా ఉంది. వంట చెరకు లభ్యత, పశుగ్రాసం, భూగర్భ, ఉపరితల వనరులు తగ్గి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అవుతోంది. ఒక ప్రాంత సుస్థిరాభివృద్ధి పర్యావరణ పరిరక్షణపై ఆధారపడి ఉంటుంది.

పర్యావరణ విభాగాలు

పర్యావరణాన్ని నాలుగు భాగాలుగా విభజించవచ్చు. అవి..

1. వాతావరణం(అట్మాస్ఫియర్)
2. శిలావరణం(లిథోస్ఫియర్)
3. జలావరణం(హైడ్రోస్ఫియర్)
4. జీవావరణం(బయోస్ఫియర్)

వాతావరణం (అట్మాస్ఫియర్)

భూమి ఉపరితలంపై ఉన్న వాయు పొరల నిర్మాణమే వాతావరణం లేదా అట్మాస్ఫియర్. గురుత్వాకర్షణ శక్తి వల్ల ఇది భూమిపై ఉంటుంది. ఇందులో ట్రోపోస్ఫియర్, స్ట్రాటోస్ఫియర్, మీసోస్ఫియర్, థర్మోస్ఫియర్ అనే నాలుగు విభాగాలున్నాయి. రెండు పొరల మధ్య హద్దుగా ఉండే ప్రాంతాన్ని 'పాజ్' అంటారు. ఉదాహరణకు.. స్ట్రాటోస్ఫియర్, మీసోస్ఫియర్ మధ్యనున్న ప్రాంతాన్ని స్ట్రాటోపాజ్ అంటారు.

ట్రోపోస్ఫియర్

ఇది భూమి ఉపరితలానికి దగ్గరగా ఉన్న వాతావరణ పొర. ఈ పొర ధ్రువాల వద్ద 6–8 కి.మీ. ఎత్తు వరకు, భూమధ్యరేఖ వద్ద 18 కి.మీ. ఎత్తు వరకు విస్తరించి ఉంటుంది. పైకి వెళ్లేకొద్దీ ప్రతి కిలోమీటరుకు ఉష్ణోగ్రత ఆరు డిగ్రీల చొప్పున తగ్గుతుంది. సుమారు 12 కి.మీ. ఎత్తు వద్ద ట్రోపోపాస్ అనే పరివర్తన ప్రాంతం మొదలవుతుంది. ఈ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు భారీగా తగ్గుతాయి.

స్ట్రాటోస్ఫియర్

వాతావరణంలోని రెండో పొర అయిన స్ట్రాటోస్ఫియర్, ట్రోపోపాజ్ నుంచి మొదలై 50 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంటుంది. ఇక్కడ ఉష్ణోగ్రత మైనస్ 60 డిగ్రీలుగా ఉంటుంది. ఈ ప్రాంతంలో గంటకు 320 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయి. స్ట్రాటోస్ఫియర్‌లో ఓజోన్ అధిక మోతాదులో ఉండటం వల్ల దీన్ని ఓజోనోస్ఫియర్ అని కూడా అంటారు. హానికర అతినీలలోహిత కిరణాలు నేరుగా భూమిని చేరకుండా ఈ పొర అడ్డుకుంటుంది.

మీసోస్ఫియర్

స్ట్రాటోపాజ్ నుంచి దాదాపు 80 కి.మీ. ఎత్తు వరకు ఈ ప్రాంతం విస్తరించి ఉంటుంది. ఉష్ణోగ్రతలు తీవ్రంగా పడిపోతాయి. మీసోస్ఫియర్ పైనున్న ప్రాంతం వాతావరణంలోని అన్ని భాగాల కంటే అత్యంత శీతలంగా ఉంటుంది. ఉల్కాపాతం భూమిని చేరకపోవడానికి మీసోస్ఫియరే కారణం.

థర్మోస్ఫియర్

ఇది మీసోపాజ్ నుంచి మొదలవుతుంది. థర్మోస్ఫియర్‌ను ఐనోస్ఫియర్, ఎక్సోస్ఫియర్‌లుగా విభజిస్తారు. కింది భాగమైన ఐనోస్ఫియర్ భూవాతావరణంలో 100–120 కి.మీ. ఎత్తు నుంచి 550 కి.మీ. ఎత్తు వరకు విస్తరించి ఉంటుంది. ఐనోస్ఫియర్‌లో నత్రజని, ఆక్సిజన్ లాంటి మూలకాల పరమాణువులు సౌర వికిరణాన్ని గ్రహించి అయానీకరణం చెందుతాయి. భూ ఉపరితలం నుంచి వచ్చే రేడియో తరంగాలను పరావర్తనం చేసి సమాచార ప్రసారానికి ఐనోస్ఫియర్ తోడ్పడుతోంది. బలమైన సౌరగాలులు వీచినప్పుడు ఐనోస్ఫియర్ సంఘటనం మారే ప్రమాదం ఉంది. ఫలితంగా సమాచార వ్యవస్థలు దెబ్బతింటాయి.

శిలావరణం

భూమిపై ఉన్న ఖండాలన్నింటినీ కలిపి శిలావరణం అంటారు. భూమి ఉపరితలం మొత్తం కొన్ని ప్రత్యేక ఫలకాలపై అమరి ఉంటుంది. ఈ ఫలకాల నిర్మాణం, వాటి కదలికలను ప్లేట్ టెక్టానిక్స్ సిద్ధాంతం వివరిస్తుంది. 200 మిలియన్ సంవత్సరాల కిందట భూభాగం మొత్తం ఒకే చోట కలిసి ఉండేది. దీన్ని పాంజియా అని పిలుస్తారు. 50 మిలియన్ ఏళ్ల క్రితం ఇది రెండు భాగాలుగా చీలింది. ఉత్తరంగా ఉన్న భాగాన్ని లారెన్షియా అని, దక్షిణ దిశగా విడిపోయిన ప్రాంతాన్ని గోండ్వానా అని పిలుస్తారు. ఇవి మరింత దూరం కదిలి ప్రస్తుత ఖండాలు ఏర్పడ్డాయి. ఖండ చలన సిద్ధాంతం.. ఖండాల నిర్మాణం, వాటి కదలికలను వివరిస్తుంది. భూమి ఉపరితలం నుంచి లోపలి వైపు మూడు భాగాలుంటాయి. భూపటలం(క్రస్ట్), భూప్రావారం (మాంటెల్), భూకేంద్రం(కోర్). భూపటలం ఉపరితలం నుంచి సుమారు 100 కి.మీ. లోతు వరకు ఉంటుంది. భూపటల ఉపరితలంపై వదులుగా ఉండే పొరలను మృత్తిక లేదా నేల అంటారు. 100 కి.మీ. లోతు నుంచి 2900 కి.మీ. లోతు వరకు భూప్రావారం(మాంటెల్) అనే పొర ఉంటుంది. దీని తర్వాత మధ్యభాగం భూకేంద్రం(కోర్). దీనిలో బాహ్యకేంద్రం, అంతర కేంద్రం అనే రెండు భాగాలు ఉంటాయి. బాహ్యకేంద్రం 2900 కి.మీ. నుంచి 5100 కి.మీ. వరకు ఉంటుంది. అంతర కేంద్రం 5100 కి.మీ. నుంచి సుమారు 6378 కి.మీ. వరకు ఉంటుంది.

టీజీపీఎస్సీ ప్రవేశపెట్టిన జనరల్ స్టడీస్ పేపర్‌లో పర్యావరణ అంశాలను చేర్చా రు. పర్యావరణ విభాగాలు, జీవావరణ శాస్త్రం, పర్యావరణ కాలుష్య, జీవ వైవిధ్యం, వన్యప్రాణుల సంరక్షణ, ఘన వ్యర్థ పదార్థాలు – నిర్వహణ, శీతోష్ణస్థితి మార్పు, అంతర్జాతీయ, జాతీయ పర్యావరణ ఒప్పందాలు, చట్టాలు... పర్యావరణ అంశాల పరిధిలోకి వస్తాయి.

జలావరణం

భూమిపై వివిధ రూపాల్లో ఉన్న మొత్తం నీటిని జలావరణం లేదా హైడ్రోస్ఫియర్ అంటారు. పూర్వం సముద్ర జలమంతా పూర్తిగా సాదుజలంగా ఉండేది. కొన్ని మిలియన్ సంవత్సరాల నుంచి నేల క్రమక్షయం జరిగి ఖనిజాలు సముద్రంలోకి చేరడంతో లవణీయత పెరిగింది. భూమి ఉపరితలం 75 శాతం నీటితో నిండి ఉంది. భూమిపై ఉన్న మొత్తం నీటిలో 97.5 శాతం సముద్రాల్లోనే ఉంది. మిగతా 2.5 శాతం నీరు సాదుజలం లేదా మంచి నీరు. మంచి నీటిలో 0.3 శాతం నదులు, సరస్సుల్లో ఉంది. భూగర్భ జలంగా 30.8 శాతం, హిమనీనదాల రూపంలో 68.9 శాతం ఉంది.

భూమిపై నీటి విస్తరణను జల వలయం నిర్ధారిస్తుంది. నీరు ఆవిరై మేఘాల రూపంలోకి సాంద్రీకరణం చెంది ఆ తర్వాత మంచు, వర్షం రూపంలో భూమిని చేరుతుంది. ఇలా చేరిన నీటిలో కొద్ది మొత్తం భూగర్భంలోకి ఇంకుతుంది. మిగతాది నదులు, సముద్రాల్లోకి చేరుతుంది. ధ్రువ ప్రాంతాల్లో శీతాకాలంలో ఈ నీరు గడ్డకట్టి వేసవిలో కరుగుతుంది. ఈ రకమైన నిరంతర నీటి ఆవిరి కదలికలను జల వలయం అంటారు.

జీవావరణం

భూమిపై ఉన్న జీవులు, జీవం విస్తరించిన ప్రాంతాలన్నింటినీ కలిపి బయోస్ఫియర్ అంటారు. భూమిపై సుమారు 3.5 బిలియన్ సంవత్సరాల క్రితం జీవం ఆవిర్భవించింది. అనేక సిద్ధాంతాలు భూమిపై జీవం ఆవిర్భవించే విధానాన్ని వివరిస్తున్నాయి. వీటిలో ముఖ్యమైనవి...

గ్రూప్స్,
ఇతర పోటీ పరీక్షల
ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పర్యావరణం

1. ప్రత్యేక సృష్టి సిద్ధాంతం: దీని ప్రకారం భూమిపై జీవులను దేవుడు సృష్టించాడు. ఈ సిద్ధాంతానికి తగిన నిదర్శనాలు లేని కారణంగా దీన్ని నమ్మకంగానే భావిస్తారు.

2. పాన్‌స్పెర్మియ సిద్ధాంతం: దీని ప్రకారం భూమిపై జీవులు ఆవిర్భవించలేదు. భూమి అవల నుంచి గ్రహశకలాలు లేదా గ్రహాంతర వాసుల ద్వారా భూమిపైకి చేరి ఆ తర్వాత పరిణామ క్రమంలో మార్పు చెందాయి.

3. జీవ ఆవిర్భావ సిద్ధాంతం: అలెగ్జాండర్ ఇవనోవిచ్ ఒపారిన్, జె.బి.ఎస్. హాల్డెన్ అనే శాస్త్రవేత్తలు ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. దీని ప్రకారం భూమిపై జీవ ఆవిర్భావానికి ముందు జీవ రసాయనాలు ఆవిర్భవించాయి. ఈ జీవ రసాయనాల చర్యల ద్వారా భూమిపై పూర్వ జీవకణాలు ఏర్పడ్డాయి. తర్వాత వాటి నుంచి సంపూర్ణ జీవకణాలు ఆవిర్భవించాయి. భూమిపై ఆవిర్భవించిన తొలి తరం జీవులన్నీ అవాయు జీవులు. ఇలాంటి కొన్ని అవాయు జీవులు నీటి అణువులను విచ్ఛిన్నం చేయడంతో గాల్లోకి క్రమంగా ఆక్సిజన్ విడుదలైంది. తొలుత కేంద్రక పూర్వ జీవులు ఏర్పడి ఆ తర్వాత నిజ కేంద్రక జీవులు ఆవిర్భవించాయి.



గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఆవరణ వ్యవస్థలో గతిశీల భాగం? (గ్రూప్–2, 2008)
   ఎ) ఆహార గొలుసు బి) ఇకలాజికల్ నిచే
   సి) ఎకోటోన్ డి) ఏదీకాదు
2. పాన్‌స్పెర్మియ సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది? (2004 గ్రూప్–1)
   ఎ) అర్హీనియస్ బి) ఒపారిన్
   సి) స్వారెజ్ డి) ఎవరూ కాదు
3. తక్కువ ఉష్ణోగ్రతలను తట్టుకునే జీవులను ఏమంటారు? (గ్రూప్–1 2010 రీ ఎగ్జామ్)
   ఎ) స్టేనోథర్మల్ బి) సైక్రోఫైల్స్
   సి) యూరిథర్మల్ డి) పైకిలో థర్మల్
4. భారతదేశంలోని విశిష్టమైన స్త్రీ పర్యావరణవేత్త (ఎన్విరాన్‌మెంటలిస్ట్) ఎవరు? (గ్రూప్–1, 1999)
   ఎ) మేధాపాట్కర్ బి) మమతా బెనర్జీ
   సి) సరోజిని మహర్షి
   డి) మార్గరెట్ ఆల్వా
5. కింది వాటిలో ఫ్లోటింగ్ నేషనల్ పార్కు ఏది? (సివిల్స్ ప్రిలిమ్స్–2015)
   ఎ) కజిరంగ జాతీయ పార్కు
   బి) కైబుల్ లామ్జావు జాతీయ పార్కు
   సి) కార్బెట్ జాతీయ పార్కు
   డి) ఏదీకాదు

సమాధానాలు

1) ఎ; 2) ఎ; 3) ఎ; 4) ఎ; 5) బి.

మాదిరి ప్రశ్నలు

1. ఓజోన్ పొర సంరక్షణకు ఏర్పాటైన అంతర్జాతీయ ఒప్పందం?
   ఎ) క్యోటో ఒప్పందం
   బి) మాంట్రియాల్ ఒప్పందం
   సి) స్టాక్‌హోమ్ ఒప్పందం
   డి) రామ్సార్ ఒప్పందం
2. కింది వాటిలో ఓజోన్ పొరను దెబ్బతీసేది?
   ఎ) క్లోరోఫ్లోరో కార్బన్లు
   బి) హాలోన్లు సి) మిథైల్ బ్రోమైడ్
   డి) పైవన్నీ
3. చిప్కో ఉద్యమం ఏ ప్రాంతంలో ప్రారంభమైంది?
   ఎ) ఉత్తరాంచల్ బి) కర్ణాటక
   సి) బిహార్ డి) మధ్యప్రదేశ్
4. చిప్కో ఉద్యమంలో పాల్గొన్నవారు?
   ఎ) సుందర్‌లాల్ బహుగుణ
   బి) చండీ ప్రసాద్ భట్
   సి) సుదేశాదేవి డి) పైవారందరూ
5. సైలెంట్ స్ప్రింగ్ అనే గ్రంథాన్ని రచించి అమెరికాలో డి.డి.టి.కి వ్యతిరేకంగా ఉద్యమం నిర్వహించింది ఎవరు?
   ఎ) జాన్ ముయర్
   బి) బెంజిమిన్ ఫ్రాంక్లిన్
   సి) రాచెల్ కార్సన్ డి) ఎవరూ కాదు
6. 'ఎ శాండ్ కౌంటీ ఆల్మనాక్' గ్రంథ రచయిత ఎవరు?
   ఎ) డేవిడ్ హెన్రీ బి) ఆల్డో లియోపోల్డ్
   సి) జాన్ ముయర్
   డి) బెంజిమిన్ ఫ్రాంక్లిన్
7. అటవీ హక్కు చట్టం ఎప్పుడు అమల్లోకి వచ్చింది?
   ఎ) 2006 బి) 2007
   సి) 2008 డి) 2009
8. 1986లో అమల్లోకి వచ్చిన చట్టం?
   ఎ) జల కాలుష్య నివారణ, నియంత్రణ చట్టం
   బి) వాయు కాలుష్య నివారణ, నియంత్రణ చట్టం
   సి) పర్యావరణ పరిరక్షణ చట్టం
   డి) జల కాలుష్య సుంకం చట్టం
9. జీవవైవిధ్య చట్టాన్ని అమలు చేసే నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ ఎక్కడ ఉంది?
   ఎ) చెన్నై, తమిళనాడు
   బి) బెంగళూరు, కర్ణాటక
   సి) హైదరాబాద్, తెలంగాణ
   డి) తిరువనంతపురం, కేరళ
10. భూమిపై ఆవిర్భవించిన మొదటి పూర్వకణానికి ఒపారిన్ ఇచ్చిన పేరు?
    ఎ) ప్రోటినాయిడ్ బి) సింబయాంట్
    సి) కొయసెర్వేట్ డి) ప్రోక్యారియోట్

సమాధానాలు

1) బి; 2) డి; 3) ఎ; 4) డి; 5) సి; 6) బి; 7) ఎ; 8) సి; 9) ఎ; 10) సి.

The spillover from the Himalayas is due to..

Directions (Q.No. 1-5): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

Climate change poses potentially devastating effects on India's agriculture. While the overall parameters of climate change are increasingly accepted – a 1 °C average temperature increase over the next 30 years, sea level rise of less than 10 cm in the same period, and regional monsoon variations and corresponding droughts- the impacts in India are likely to be quite site and crop specific. Some crops may respond favourably to the changing conditions, others may not. This emphasizes the need to **promote** agricultural research and create maximum flexibility in the system to permit adaptations.

The key ingredient for "drought proofing" is the managed recharge of aquifers. To ensure continued yields of important staple crops, it may also be necessary to shift the locations where these crops are grown, in response to temperature changes as well as to water availability. The latter will be a key factor in making long term investment decisions.

For example, water runoff from the Himalayas is predicted to increase over the next 30 years as glaciers melt, but then decline substantially thereafter. It will be **critical** to provide incentives to plan for these large-scale shifts in agro-ecological conditions.

India needs to make long term investment in research and development in agriculture. India is likely to experience changed weather patterns in future.

1. Consider the following statements: Climate change may force the shifting of locations of the existing crops due to
a) Melting of glaciers
b) Water availability and temperature suitability at other locations
c) Poor productivity of crops
d) Wider adaptability of crop plants

Which of the statements given above are correct?
1) a, b, & c 2) b & c only
3) a & d only 4) a & c
5) a, b, c, & d

2. To promote agricultural research in India is important because:
1) To predict variations in monsoon patterns and to manage water resources.
2) To make long term investment decisions for economic growth.
3) To facilitate wider adaptability of crops.
4) To predict drought conditions and to recharge aquifers.
5) Changed weather patterns in future.

3. The spillover from the Himalayas is due to
1) large-scale shifts in agro-ecological conditions.
2) changed weather patterns in future
3) productivity of crops
4) melting of glaciers
5) adaptability of crop plants

4. The antonym of **Critical** is
1) waver 2) steady 3) unsure
4) insecure 5) fasten

5. The synonym of **promote** is
1) encompass 2) encourage
3) entangle 4) entrust
5) encode

Directions (Q.No. 06-10): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

6. There is a ____ gap between rich and poor.
1) vary 2) variety 3) similar
4) reported 5) yawning

7. She ____ to escape from her office job.
1) earned 2) yelled 3) yearned
4) yielded 5) learn

8. The seriousness of the situation is ____ to appreciate in its ____.
1) easy; complete
2) different; wholesome
3) difficult; totality
4) hard; completeness
5) tough; compliment

9. The new policy was adopted in the ____ of fierce ____.
1) wake; opponent
2) show; postponement
3) teeth; criticism
4) course; outcome
5) reality; injustice

10. The computer is now an ____ tool for the family doctor.
1) value 2) valid
3) price 4) worth
5) invaluable



BANK EXAMS
GENERAL ENGLISH

Directions (Q.No. 11-15): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

11. The magazine is issued <u>year two times.</u>
1) year twice 2) twice yearly
3) yearly two 4) two yearly
5) no correction required

12. She yelled at the child to <u>getting down</u> from the wall.
1) got down 2) get down
3) getting away 4) get upon
5) no correction required

13. All her yesterday's <u>has</u> vanished without a trace.
1) Have 2) had
3) has been 4) have being
5) no correction required

14. My son's 13 but he's <u>younger</u> for his age.
1) Youngest 2) youth
3) older 4) young
5) no correction required

15. When the needle enters the red zone the engine is <u>indicator</u> hot.
1) Too 2) much
3) becomes 4) left
5) no correction required

Directions (Q.No. 16-25): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

16. Exam results (1)/ are not the only (2)/ yard stick of a (3)/ school performance. (4)/ no error (5)

17. I have always (1)/ had a yen (2)/ to travel (3)/ around the world. (4)/ no error (5)

18. Because of the rapid progress (1)/ that science has made (2)/ the universe is slow yielding (3)/ up its secrets. (4)/ no error (5)

19. She brings to the job (1)/ a rare combination (2)/ of youth and (3)/ experiences. (4)/ no error (5)

20. The group was made up of (1)/ people with a range of age, (2)/ professions, incomes and (3)/ computer expertise. (4)/ no error (5)

21. Between 1957 and 2007 expenditures (1)/ in all 5 categories changed to some extent, (2)/ but the most marked change (3)/ was in the food category. (4)/ no error (5)

22. It seems that the man (1)/ who is dropping (2)/ off his own water bottle in the recycling bin (3)/ drove there in his car. (4)/ no error (5)

23. Reality TV shows involve real people perform (1)/ ridiculous and often dangerous acts (2)/ and generally behaving horribly (3)/ towards each other. (4)/ no error (5)

24. It is a legal requirement (1)/ for airline operators to provide (2)/ suitable refreshment (3)/ in the event of a long delay. (4)/ no error (5)

25. For some people, the huge increase in public surveillance (1)/ is a threat to the individual's social liberties (2)/ and was a sign that society (3)/ is becoming increasingly authoritarian. (4)/ no error (5)

Directions (Q.No. 26-30): Read each sentence which has four parts to find out whether there is any grammatical mistake or spelling mistake in it. Certain words are given in bold in each part to identify the error. Mark the number of that part with error as your answer.

26. Several **alarming** (1) incidents **occurred** in recent years (2) and **was widely** (3) **reported in** (4) the press.

27. A (1) general public should **rise to** (2) address the **social evil of** (3) corporal **punishment.** (4)

28. The teacher **was sought** (1) not only for imparting knowledge **and** (2) skills to students **but for also** (3) shaping their minds **and character.** (4)

29. Prolonged (1) television **viewvers** (2) have a higher **risk of** (3) fatal pulmonary **embolism.** (4)

30. I want to (1) travel to **sea** (2) the world **around** (3) and appreciate new **cultures.** (4)

Directions (Q.No. 31-35): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) Thomas Smart conferred upon Sastri the appellation "Silver Tongued Orator of the British Empire" and he was so called all over the United Kingdom.
B) Srinivasa Sastri was known for his mastery over the English language and his oratory. As a student, he once corrected a few passages in J. C. Nesfield's "English Grammar".
C) The Master of Balliol, Arthur Lionel Smith swore that he had never realized the beauty of the English language until he heard Sastri, while Lord Balfour remarked that listening to Srinivasa Sastri made him realize the heights to which the English language could rise.
D) Whenever he was on visit to the United Kingdom, Sastri was often consulted over spellings and pronunciations.
E) Srinivasa Sastri's inspirations were William Shakespeare, Sir Walter Scott, George Eliot, John Stuart Mill, Thomas Harvey, Victor Hugo and Valmiki - Indian sage and the author of the Hindu epic Ramayana.
F) His mastery over the English language was recognized by King George V, Winston Churchill, Lady Lytton and Lord Balfour who rated him amongst the five best English-language orators of the century.

31. What is the FIFTH sentence after rearrangement?
1) A 2) B 3) D 4) E 5) F

32. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B 3) D 4) F 5) E

33. What is the FOURTH sentence after rearrangement?
1) A 2) C 3) D 4) E 5) F

34. What is the FIRST sentence after rearrangement?
1) B 2) A 3) C 4) E 5) F

35. What is the SECOND sentence after rearrangement?
1) A 2) B 3) D 4) E 5) F

Directions (Q.No. 36-40): Choose the word which is wrongly spelt from the five options given.

36. 1) pedagogue 2) vilify
3) extraneous 4) bucollic
5) conundrum

37. 1) powwow 2) malignant
3) untenable 4) capricious
5) dissipete

38. 1) railery 2) splenetic
3) palaver 4) lachrymose
5) tenacity

39. 1) exiguity 2) pillary
3) concomitant 4) surfeit
5) adjudicate

40. 1) promulgate 2) cataclysm
3) deluge 4) simulacrom
5) mural

Answers

1) 1; 2) 4; 3) 4; 4) 2; 5) 2;
6) 5; 7) 3; 8) 3; 9) 3; 10) 5;
11) 2; 12) 2; 13) 2; 14) 4; 15) 1;
16) 3; 17) 5; 18) 3; 19) 4; 20) 2;
21) 1; 22) 4; 23) 1; 24) 3; 25) 3;
26) 3; 27) 1; 28) 3; 29) 2; 30) 2;
31) 1; 32) 4; 33) 2; 34) 1; 35) 3;
36) 4; 37) 5; 38) 1; 39) 2; 40) 4.